EENADU Epratibha Super COMBO
•SSC •RRB •BANK •TGPSC •APPSC
www.epratibha.net | 800 800 1640

ఈనాడు

విజయవాడ 23-2-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 194
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

విజయవాడలో సంగీతం వినిపించే స్వరం
ఈ FM... మీ FM...
ప్రకటనల కొరకు సంప్రదించండి: 8008003297
ఈ FM 91.9 Vijayawada PART OF THE ఈనాడు NETWORK



ట్రంప్ నివాసంలోకి సాయుధ దుండగుడి చొరబాటు

కాల్చిచంపిన భద్రతా సిబ్బంది

ఫ్లోరిడా పామ్ బీచ్‌లోని మార్-ఎ-లాగో రిసార్టులో ఘటన

ఆ సమయంలో శ్వేతసౌధంలో ఉన్న అమెరికా అధ్యక్షుడు 12లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb FRESH CHICKEN Vencobb No.1 Tastiest Chicken
సూచించిన నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు
12 గుడ్ల రిటైల్ ధర ₹ 75
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 115 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 142 కిలో
డ్రస్స్‌డ్ స్కిన్‌తో 206 కిలో
స్కిన్‌లెస్ 234 కిలో
Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

పదవీవిరమణ వరకూ పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్

సస్పెన్షన్ ఎత్తేస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారు.. అందుకే పొడిగింపు 13లో

PLASTO® 10 YEAR GUARANTEE 9130076937

ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

- అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్టు కింద రూ.2,432 కోట్ల ఖర్చు
- కేంద్ర ప్రభుత్వంతో ఎంఓసీపై సంతకాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- పాల్గొన్న కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్



చంద్రబాబు, జ్యోతిరాదిత్య సింధియాల సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్న రాష్ట్ర అధికారి కృష్ణబాబు, డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా. చిత్రంలో పెమ్మసాని చంద్రశేఖర్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ రాబోయే ఏడాదిన్నరలో హైస్పీడ్ ఇంటర్నెట్ అందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. టెలికాం, టెక్నాలజీ రంగంలో ఎలాంటి పైలట్ ప్రాజెక్టు చేపట్టినా.. ఏపీని టెస్ట్‌బెడ్ కింద పరిగణించాలని కేంద్రాన్ని కోరారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార ఒప్పందం (మెమొరాండమ్ ఆఫ్ కో-ఆపరేషన్) కుదిరింది. దీనిద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సుమారు 5 లక్షల ఇళ్లకు అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్టు (ఏబీఎన్‌పీ) కింద ఫైబర్‌నెట్ కనెక్షన్లు అందిస్తారు. రాష్ట్రంలో ఈ పథకం అమలుకు కేంద్రం రూ.2,432 కోట్లు ఖర్చు చేయనుంది. పథకం అమలుకు భారత్ నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఏపీబీఐఎల్) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌పీవీ ఏర్పాటుచేసింది. ఒప్పందంపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్ర, రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సంతకాలు చేశారు. సమావేశంలో కేంద్ర (మిగతా 3లో)



ప్రతిభ చూపిన డాక్ సేవక్ అరుణను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా. చిత్రంలో పెమ్మసాని

తపాలాశాఖ సేవలను మరువలేం

జీడీఎస్‌ల ద్వారా రాష్ట్రప్రభుత్వ పౌరసేవలు

సాకారమయ్యేలా సమగ్ర అధ్యయనం చేయిస్తా

గుంటూరులో గ్రామీణ డాక్‌సేవక్ సమ్మేళనంలో సీఎం చంద్రబాబు 3లో

గ్రామీణ డాక్ సేవక్‌లు భరతమాతకు ఆభరణాలు

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా



మేరఠ్‌లో కొత్తగా ప్రారంభించిన మెట్రో రైలులో ప్రయాణికులతో సంభాషిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఆ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు పంకజ్ చౌధరీ

ముందు ప్రజా హృదయాలను గెలవండి

- ప్రధాని పదవిని చేరాలంటే అది అవసరం
- మహిళా ఎంపీలను నా సీటు ఆక్రమణకు పంపిస్తారా?
- విపక్షాలది మరీ అంత దొల్లతనమా?: మోదీ 3లో

యూపీలో అత్యంత వేగవంతమైన మెట్రో ప్రారంభం

దేశీయంగా కేసీ-390 విమానాల తయారీ

ఆసియా దేశాలకు ఇక్కడి నుంచే ఎగుమతి చేస్తాం

ఎంబ్రాయెర్ సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెజ్



దిల్లీ: బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయెర్, మనదేశంలో కేసీ-390 మిలీనియం విమానాల తయారీకి సుముఖత చూపుతోంది. ఇందుకోసం ప్రధాన ఉత్పత్తి కేంద్రాన్ని భారత్‌లో నెలకొల్పేందుకు సిద్ధమని ఎంబ్రాయెర్ సీఈఓ ఫ్రాన్సిస్కో గోమెజ్ ఆదివారం ఇక్కడ తెలిపారు. భారత్ నుంచే ఆసియా పసిఫిక్ దేశాలకూ ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. రవాణాకు ఉపయోగపడే ఈ రకం 80 విమానాలకు భారత వైమానిక దళం నుంచి ఆర్డరు వస్తే, ప్లాంటు ఇక్కడే స్థాపిస్తామని పీటీఐ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. చిన్నపాటి రన్‌వేలపై నుంచి బయలుదేరేందుకు, శరవేగంగా బలగాలు-ఆయుధ సామగ్రిని తరలించేందుకు కేసీ-390 మిలీనియం విమానాలు పేరొందాయి. ఆకాశంలోనే ఇంధనం నింపుకొనే సదుపాయం కూడా వీటికి ఉంది. ఈ విమానాల కోసం భారత్‌లో ఎంఆర్‌ఓ (మరమ్మతు, నిర్వహణ, ఓవర్‌హాల్ సేవలు) కేంద్రాన్ని (మిగతా 3లో)

మావోయిస్టు చీఫ్ దేవ్‌జీ లొంగుబాటు!

- అదేబాటలో అగ్రనేతలు మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహారెడ్డి
- ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం
- తెలంగాణ ఎస్‌ఐబీ చరిత్రలో ఇదో కీలక ఆపరేషన్



తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీకి అతి పెద్ద శరాఘాతం. పార్టీ చీఫ్ తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు. ఆయనతో పాటు కేంద్రకమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ ఎలియాస్ మీసాల సత్తన్న, రాష్ట్రకమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న సైతం ఇదే మార్గాన్ని ఎంచుకొన్నారు. వీరితో పాటు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ), ఇతర కేడర్‌కు చెందిన మరో 40-50 మంది వరకు ప్రస్తుతం పోలీసుల రాడార్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లో వీరి లొంగుబాటును అధికారికంగా ప్రకటించే అవకాశముంది. దేవ్‌జీ జగిత్యాల జిల్లా కోరుట్ల అంబేడ్కర్‌నగర్ వాసి కాగా.. సంగ్రామ్‌ది పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రుల్లపల్లె. గంగన్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వల్లూరు. దేవ్‌జీ, సంగ్రామ్‌లు వారం, పది రోజుల క్రితమే మధ్యవర్తుల ద్వారా తెలంగాణ నిఘా విభాగంతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఆ చర్చలు కొలిక్కిరావడంతో ఆదివారం ఉదయం కేంద్ర నిఘా వర్గాలకు తెలంగాణ పోలీసులు (మిగతా 3లో)

రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యల కల్లోలం

ఒకే ప్రాంతంలో 14 మంది బాధితులు.. ఇద్దరి మృతి

కల్తీ పాలే కారణమని అనుమానం

ఈనాడు, రాజమహేంద్రవరం, వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో ఒకే ప్రాంతానికి చెందిన పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడి ఆసుపత్రుల్లో చేరడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. ఇక్కడి లాలా చెరువు సమీపం చౌడేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఈ నెల 15 తర్వాతి నుంచి వాంతులవడం, మూత్రవిసర్జన కాకపోవడం, పొట్ట ఉబ్బడం తదితర సమస్యలతో ఒక్కొక్కరుగా 14 మంది ఆసుపత్రిలో చేరారు. వీరిలో ఇద్దరు మృతిచెందారు. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడినవారే కాగా 5 నెలల శిశువు, మూడేళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనారోగ్యానికి గురవడంతో వారు ఆదివారం అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుల్లో భాగిశెట్టి కనకరత్నం (76) అనే మహిళకు కిడ్నీలు దెబ్బతినగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో (మిగతా 8లో)

ఎల్ఐసి పాలసీదారులకు గమనిక
మీ రివార్డులు పొందేందుకు సమయం ఆసన్నమైంది
కేవలం అప్‌డేట్ చేయండి మీ బ్యాంక్ వివరాలు



మీ పాలసీ డబ్బులు మీ కోసం ఎదురుచూస్తుండొచ్చు
2 సరళతరమైన చర్యలతో మీ పాలసీ డబ్బు క్లెయిమ్ చేసుకోండి
» మీ బ్యాంక్ వివరాలు అప్‌డేట్ చేయండి » మీ కెవైసి సమర్పించండి
మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి
డౌన్‌లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital
సందర్శించండి: licindia.in
కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827
మమ్మల్ని ఫాలో అవ్వండి: LIC India Forever | IRDAI Regn No.: 512
వివరాల కొరకు, మీ ఏజెంట్‌ని/సమీపంలో ఉన్న ఎల్ఐసి బ్రాంచిని సంప్రదించండి లేదా 56767474కి మీ నగరం పేరు ఎస్ఎంఎస్ చేయండి
*ఆన్‌లైన్‌లో కూడా చేయవచ్చు, షరతులు వర్తిస్తాయి
LIC లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా
LIC/P1/2024-25/51/Tel

ప్రేమల్లో 'మునుగుతున్నారు'!

ఇన్‌స్టా స్నేహాల మోజులో మైనర్లు • పిల్లల సోషల్ మీడియా ఖాతాలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేమి

విజయవాడ వాంబే కాలనీకి చెందిన బాలిక (16) ఇంటర్ చదువుతోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఓ యువకుడు పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో అతను చెప్పిన మాటలు నమ్మింది. ఓ రోజు తన స్నేహితులతో కలిసి కారులో విజయవాడ వచ్చిన యువకుడు.. బాలికను ఎక్కించుకొని పల్నాడు జిల్లా సత్తెనపల్లి తీసుకెళ్లి లాడ్జిలో అత్యాచారం చేశాడు. బాలిక తప్పించుకుని విజయవాడ చేరింది.

ఫిల్మ్‌నగర్‌కు చెందిన బాలిక (17) ఇన్‌స్టాలో పరిచయమైన యువకుడితో ప్రేమలో పడింది. అతని మాటలు నమ్మి, ఇంట్లోంచి బంగారు నగలు, నగదు తీసుకొని వెళ్లిపోయింది. ఇద్దరూ బస్టాండులో కలుసుకున్నారు. బాలిక వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో.. ఆమె తెచ్చిన బ్యాగ్‌తో ఉడాయించాడా యువకుడు.



ఈనాడు – అమరావతి

మంచీ చెడూ తెలియని వయసులో డిజిటల్ స్నేహాలు.. రొమాంటిక్ స్నేహాలుగా మారుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వారితో ప్రేమలో పడుతున్న కౌమార దశలోని పిల్లలు.. భవిష్యత్ గమనం, గమ్యం తెలియక అంతిమంగా జీవితాలను పణంగా పెడుతున్నారు. అపరిపక్వ వయసులో ముక్కూ ముఖం తెలియని వ్యక్తులను నమ్మి మైనర్లు ఇళ్ల నుంచి వెళ్లిపోయేందుకూ వెనుకాడటం లేదు. ఇటీవల ఈ తరహా కేసులు పెరుగుతున్నాయి.

పట్టించుకోకనే..

పిల్లల ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల అతి వినియోగంపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపిస్తోంది. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాల్లో పిల్లలకు సరిపడా సమయం కేటాయించలేకపోతున్నారు. పిల్లల దైనందిన జీవితం, అలవాట్లు, అభిరుచులను కనిపెట్టలేకపోతున్నారు. కొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రుల మధ్యే నిత్యం విభేదాలు, వైరుధ్యాలు పొడచూపుతుండటంతో ఆ ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతోంది. ఇంట్లో కోల్పోయిన ప్రేమను బయట వెతుక్కొనే ప్రయత్నంలో సోషల్ మీడియాకు ఆకర్షితులై, డిజిటల్ స్నేహాలకు అర్రులు చాస్తున్నారు. కొవిడ్ వ్యాప్తి సమయం నుంచి విద్యార్థుల్లో ఫోన్లు, ట్యాబ్‌ల వినియోగం పెరిగింది. (మిగతా 3లో)

(c) eenadu

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం:
28-03-1970

మరణం:
09-02-2026



కీ॥శే॥ భావన రామచంద్రరావు (BSR రాము) గారు

పారిశ్రామికవేత్త, తెనాలి

ఎల్లప్పుడూ చిరునవ్వుతో పలకరించే మీ రూపం కళ్ళెదుటే ఉంది. మీ పలుకు వినిపిస్తూనే ఉంది. మీ ఆకస్మిక మరణం మాకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. మీరు భౌతికంగా దూరమైననూ మీ జ్ఞాపకాలను స్మరించుకుంటూ.. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్ధిస్తూ.. అశ్రునయనాలతో..

భార్య : **భావన మాధవి**

కుమారుడు : **భావన గోపికృష్ణ** కుమార్తె - అల్లుడు : **త్రివేణి - రోళ్ళ వెంకట ఉమాశంకర్**

సోదరులు

భావన నరసింహారావు (లేటు) - చంద్రమ్మ; ఆదినారాయణ, ధనలక్ష్మి
భావన మధుసూదనరావు - శివకుమారి (లేటు); రాజ్యలక్ష్మి, కోటేశ్వరి, ఆదిలక్ష్మి
భావన వెంకట్రావు - అంజమ్మ ; ప్రభావతి, సునీత, శ్రావణి
భావన శ్రీనివాసరావు (BSR) - ఝాన్సీరాణి ; గోపిచంద్, లావణ్య, సౌజన్య
భావన మల్లేశ్వరరావు (లేటు) - శాంతకుమారి; కృష్ణకార్తీక్, భరత్‌సాయి (లేటు), మమతకుమారి
భావన నాగేశ్వరరావు - శారద; గోపిచంద్, తేజశ్విని

తల్లిదండ్రులు : **భావన ఆదినారాయణ** (లేటు) **- అనసూర్యమ్మ**


సోదరీమణులు

వెంకంశెట్టి విజయలక్ష్మి - తిరుపతి రాయుడు (లేటు)
అనిల్(లేటు), రాంబాబు, శ్రీదేవి
పసుపులేటి రోజారాణి - శివనాగేశ్వరరావు
లీలావిజయ్‌శంకర్, భవాని, గాయత్రిదేవి
మనుమలు, మనుమరాండ్రు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: ది.23-02-2026 సోమవారం తెనాలి సుల్తానాబాద్‌లోని నవోదయ ఫంక్షన్‌హాల్ నందు జరుగును. కావున తెలియపరచటమైనది

MANAGEMENT & STAFF
B.SRINIVASARAO POWER CONSTRUCTIONS PVT.LTD.
Manufacturers of Power Transformers & PSCC Poles & Trunkey Electrification Projects
Plot No: 68, 69, 74, 75, Autonagar, TENALI
Venue QR Code

ముందు ప్రజా హృదయాలను గెలవండి



ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో నమో భారత్ రైలును ప్రారంభించిన అనంతరం అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

ప్రధాని పదవిని చేరాలంటే అది అవసరం
విపక్షాలకు మోదీ చురక

మేరఠ్: ప్రధానమంత్రి సీట్లో కూర్చోవాలని తపనపడుతున్నవారు ముందుగా ప్రజల హృదయాలను గెలవాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రధాని సీటును ఆక్రమించుకోవాలని మహిళా ఎంపీలను ఉసిగొల్పడం ద్వారా ఎవరూ ఆ స్థానాన్ని చేరుకోలేరని స్పష్టంచేశారు. మాతృమూర్తుల్ని, సోదరీమణుల్ని ఇలా పార్లమెంటులో ముందుకు నెట్టేంత దొల్లగా మారిపోయారా అని పరోక్షంగా లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దేశంలోనే అత్యంత వేగంగా గంటకు 120 కి.మీ. వెళ్లే మెట్రో రైలును ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఆదివారం మోదీ ప్రారంభించారు. నమో భారత్ రైలునూ జెండా ఊపి ప్రారంభించారు. రూ.12,930 కోట్ల ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించి, విద్యార్థులు, అధికారులతో ముచ్చటించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు.

కాంగ్రెస్ నగ్నత్వం దేశానికి తెలుసు

దిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని మోదీ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా దీనిని మార్చుకుందని విమర్శించారు. విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. కాంగ్రెస్ నేతలు సైద్ధాంతికంగా దివాలా తీసి, తమ దారిద్ర్యాన్ని చాటుకున్నారని చెప్పారు. "కాంగ్రెస్ నగ్నత్వం దేశానికి తెలుసు. ఇప్పటికే ప్రజల దృష్టిలో ఆ పార్టీ నేతలు దిగజారిపోయారు. ఇంకా ఇలాంటి పనులు చేయాల్సిన అవసరం ఏముంది? దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసేపనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉంది. రాజకీయ విభేదాల కంటే వ్యక్తిగత శత్రుత్వంపైనే వారు దృష్టి పెడుతున్నారు. గతంలో నన్ను, నా తల్లిని అవమానించారు. ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారు. అన్ని పరిమితుల్నీ వారు దాటిపోయారు. తమ చర్యలకు సిగ్గుపడాల్సింది పోయి అదొక గొప్ప అని ప్రచారం చేసుకుంటున్నారు. దేశాన్ని గొప్పదిగా చేసేందుకు ప్రజలు అహోరాత్రులూ కష్టపడుతుంటే, విజయాలు సాధిస్తుంటే కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయి" అని మండిపడ్డారు. ఇలాంటివాటిని తాను తప్పుపడితే 'విపక్షాలపై విరుచుకుపడ్డ మోదీ' అనే పతాక శీర్షికలు పెట్టొద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఏఐ సదస్సు ఒక అంతర్జాతీయ కార్యక్రమమని, దానిలో భాజపా నేతలెవరూ లేరని చెప్పారు.

తొలి ఆర్ఆర్‌టీఎస్

దిల్లీ నుంచి మేరఠ్ మధ్య తిరగనున్న నమో భారత్ రైలు దేశంలోనే తొలి 'ప్రాంతీయ శీఘ్ర రవాణా వ్యవస్థ' (రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్- ఆర్ఆర్‌టీఎస్) కిందికి వస్తుంది. ఇది గంటకు 180 కి.మీ.ల వేగంతో ప్రయాణించేలా రూపొందించారు. 82 కిలోమీటర్ల కారిడార్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. మేరఠ్ మెట్రో, నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్‌లు ఒకే మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుంటాయి.



తక్కువ సమయం.. ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ

వ్యవసాయానికి అనేక ఆధునిక పరికరాలు అందుబాటులోకి వస్తున్న తరుణంలో 'ఎలక్ట్రిక్ సెల్ఫ్ ప్రొపెల్డ్ బూమ్ స్ప్రేయర్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రైతుబడి ఆధ్వర్యంలో జరుగుతున్న అగ్రి షోలో ఈ యంత్రాన్ని ప్రదర్శించారు. ట్రాక్టర్లకు బిగించకుండా పొలాల్లో పంటలపై సమానంగా మందు పిచికారీ చేయడంతో పాటు మందులు నీటిని కలిపే సదుపాయం ఇందులో ఉంది. నీటి వృథా తగ్గడంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పనులు పూర్తి చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ వర్సిటీలో రూపొందించిన ఈ యంత్రం పూర్తిగా బ్యాటరీతో నడుస్తుంది. 3 గంటల ఛార్జింగ్‌తో సుమారు 60 కిలోమీటర్ల వరకు పనిచేస్తుందని చెప్పారు. ఈ స్ప్రేయర్ ధర సుమారు రూ.6 లక్షలపైనే ఉంది. వచ్చేనెల నుంచి మార్కెట్లో లభించనుంది.

– ఈనాడు, హైదరాబాద్

తపాలాశాఖ సేవలను మరువలేం

జీడీఎస్‌ల ద్వారా రాష్ట్రప్రభుత్వ పౌరసేవలు

- ఏపీలో ఎలక్ట్రిక్ సైకిల్ మోడల్‌కు శ్రీకారం చుట్టండి
- గుంటూరులో గ్రామీణ డాక్‌సేవక్ సమ్మేళనంలో సీఎం చంద్రబాబు


ఈనాడు, అమరావతి: 'తపాలాశాఖ సేవలను ఎప్పటికీ మరువలేం. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ వ్యవస్థ దేశానికి స్వాతంత్ర్యం రాకముందునుంచి పనిచేస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ సమరయోధుల మధ్య లేఖలు, పత్రికలు, మనియార్డర్లు చేరవేయడంలో తిరుగులేని పాత్ర పోషించింది. ఇప్పుడు సరైన లక్ష్యాలు, మార్గనిర్దేశనం చేస్తే గ్రామీణ డాక్ సేవక్‌లు అద్భుతాలు చేయగలరు. ఆ దిశగా పనిచేస్తే దేశంలో పటిష్ఠమైన లాజిస్టిక్ వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. రాష్ట్రప్రభుత్వ పౌరసేవలన్నీ జీడీఎస్ (గ్రామీణ డాక్ సేవక్)ల ద్వారా అందించేందుకు అవసరమైన అంశాలపై సమగ్ర అధ్యయనం చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివారం గుంటూరు శివారులోని సత్యసాయి ఆధ్యాత్మిక నగరిలో జరిగిన గ్రామీణ డాక్‌సేవక్ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపాలాశాఖతో తన అనుబంధాన్ని, దేశచరిత్రలో గ్రామీణ డాక్‌సేవక్ భాగస్వామ్యాన్ని వివరించారు. 'మిమ్మల్ని చూస్తే నాకు పాతరోజులు గుర్తుకొస్తున్నాయి. నేను చదువుకునే రోజుల్లో మేమంతా పోస్ట్‌మ్యాన్‌పైనే ఆధారపడేవాళ్లం. ఉత్తరాలు పంపాలన్నా, పెళ్లిపత్రికలు చేయాలన్నా పోస్టాఫీసుకు వెళ్లేవాళ్లం. ఏ వార్త అందాలన్నా, పార్సిల్ తేవాలన్నా పోస్టే ఆధారం. అలాంటి గ్రామీణ డాక్‌సేవక్ సేవలు దేశచరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్ వర్సిటీల్లో చదివిన జ్యోతిరాదిత్య సింధియా కేంద్రమంత్రిగా ఉండడం గొప్ప విషయం. ఆయన కుటుంబంతో నాకు, తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు విడదీయరాని అనుబంధం ఉంది' అని పేర్కొన్నారు.

33 శాతం డీబీటీ మీ ద్వారానే..

'దేశంలో 1.64 లక్షల పోస్టాఫీసుల్లో 3 లక్షల మంది గ్రామీణ డాక్‌సేవకులు ఉన్నారు. మన

ఏపీ మోడల్‌గా ఉండాలి

'ప్రపంచవ్యాప్తంగా నిపుణులను పంపి అధ్యయనం చేయించి జీడీఎస్ వ్యవస్థను మెరుగ్గా తీర్చిదిద్దుతానని జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. ప్రతి జీడీఎస్‌కు ఎలక్ట్రిక్ సైకిల్ ఇవ్వాలన్నారు. ఏపీని మోడల్‌గా తీసుకుని ఈ ప్రాజెక్టును అమలుచేయాలని కోరుతున్నా. రాష్ట్రప్రభుత్వ సేవలను గ్రామీణ డాక్ సేవక్ ద్వారా అందించేలా కేంద్రమంత్రులిద్దరూ డ్రైవ్ చేయాలి' అని సీఎం కోరారు.



గుంటూరు శివారులో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో 9,100 పోస్టాఫీసుల్లో 17వేలకు పైగా జీడీఎస్‌లు ఉన్నారు. నేను పెట్టిన సూపర్-6 సూపర్‌హిట్ అవడానికి ప్రధాన కారణం మీరు. 33% డీబీటీ మీ ద్వారానే జరిగింది. బ్యాంకింగ్, బీమా సేవలు, డీబీటీ అనుసంధాన సేవలు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు, పౌరసేవలు, ఈ-కామర్స్ లాజిస్టిక్ సేవలు.. ఇలా అనేకం మీద్వారా అందుతున్నాయి. జ్యోతిరాదిత్య సింధియా మీకో డ్రెస్ కోడ్ డిజైన్ చేసి మీ గౌరవాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నారు. డబ్బులే కాదు. గౌరవం కూడా ఉండాలి. జీడీఎస్‌లు జాతి కోసం, ప్రధాని మోదీ వికసిత భారత్ 2047 కోసం పనిచేస్తున్నారు. 11 ఏళ్లలో నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన మనం.. అందరం కలిసి పనిచేస్తే 2047కు తప్పకుండా మొదటిస్థానాన్ని అందుకుంటాం. యంత్రాలు, ఏఐ ఏదీ వచ్చినా మానవస్పర్శకు ప్రత్యామ్నాయం కాదు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఏ పార్సిల్ వెళ్లాలన్నా మీరుండాల్సిందే. ఇంత గొప్ప వ్యవస్థకు ఒక విజన్ ఇచ్చి మార్గనిర్దేశం చేస్తే అద్భుతాలు చేయగలరు. వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్‌కు వెన్నెముకగా మారగలరు' అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

80 దేశాల ప్రతినిధులు ఆశ్చర్యపోయారు

'దిల్లీలో జరిగిన ఏఐ సదస్సుకు నేనూ హాజరయ్యా. 80 దేశాల ప్రతినిధులు మనం చేసే ఏఐ అప్లికేషన్లు చూసి ఆశ్చర్యపోయారు. కార్పొరేట్ రంగం, ప్రపంచంలోని అధినేతలు, మన వద్ద నేర్చుకునేందుకు ఆసక్తి చూపారు. ప్రధాని మోదీ అంత గొప్ప కార్యక్రమం చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లి అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం సరికాదు. దీన్ని అందరం ఖండించాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు.



సమ్మేళనంలో పాల్గొన్న డాక్ సేవక్‌లు

గ్రామీణ డాక్ సేవక్‌లు భరతమాతకు ఆభరణాలు



గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా. వేదికపై సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, పోస్టల్ సర్వీస్ బోర్డు సభ్యుడు సువేందుకుమార్, సీపీఎంజీ శ్రీదేవి తదితరులు

- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వ్యాఖ్య
- గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో ప్రసంగం

ఈనాడు, అమరావతి: "ఎండ, వాన, చలి, తుపానులు ఇలా ఏ వాతావరణమైనా సరే.. గ్రామీణ డాక్‌సేవక్ (జీడీఎస్)లు క్షేత్రస్థాయిలో తప్పక కనిపిస్తారు. శరీరంలోని ప్రతి భాగానికీ గుండె రక్తాన్ని పంపింగ్ చేసినట్లు దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారిలోని చిట్టచివరి ప్రాంతానికీ సేవలందిస్తూ బలమైన శక్తిగా జీడీఎస్‌లు నిలిచారు. మీరు భరతమాతకు ఆభరణాలు. మీకు శిరస్సు వంచి ప్రణామం చేస్తున్నా" అని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. గుంటూరు నగర శివారులోని సత్యసాయి ఆధ్యాత్మికనగరిలో ఆదివారం సాయంత్రం గ్రామీణ డాక్‌సేవక్‌ల సమ్మేళనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ.. "ఏపీలోనే విశాఖపట్నంలోని సింధియా అనే ప్రాంతంతో మా కుటుంబానికి అవినాభావ సంబంధం ఉంది. అక్కడ మా పూర్వీకులు వందేళ్ల క్రితం నౌకల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆ ప్రదేశం సింధియాగా విరాజిల్లుతోంది. సీఎం చంద్రబాబుతోనూ మా కుటుంబానికి రాజకీయ అనుబంధం ఉంది. జీడీఎస్‌లకు ఎలవెన్సులు, వారి పిల్లలకు కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాం" అని తెలిపారు.

లోటును లాభంగా మార్చి ఆదాయం పెంచాలి: పెమ్మసాని చంద్రశేఖర్

దేశంలో తపాలా శాఖ ఖర్చు రూ.1800 కోట్లు ఉంటే ఆదాయం రూ.600 కోట్లుగా ఉందని.. లోటును లాభంగా మార్చి ఆదాయాలను పెంచేలా చూడాలని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. "దేశవ్యాప్తంగా 7% వృద్ధిరేటు ఉన్న సమయంలో ఏపీలో దేశానికే ఆదర్శంగా 14% వృద్ధిరేటు సాధించిన ఉద్యోగులకు అభినందనలు. ప్రభుత్వోద్యోగులుగా కాకుండా వందల సంవత్సరాల సంప్రదాయానికి వారసులుగా పనిచేస్తున్నారు. మీ చేతుల్లో ఉండేవి కేవలం ఉత్తరాలు కాదు. అవి ప్రజావసరాలు, ప్రజలతో మీ అనుబంధాలు. మీరు చేస్తోంది గొప్ప దేశ సేవ" అని కొనియాడారు.

ఉత్తమ గ్రామీణ డాక్ సేవక్‌లకు సన్మానం

ఉత్తరాల బట్వాడా, సేవింగ్స్ బ్యాంకు ఖాతాల ప్రారంభం, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సేవలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది గ్రామీణ డాక్‌సేవక్‌లను సమ్మేళనంలో సన్మానించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లు జ్ఞాపికలు, పోస్టల్ బ్యాగ్‌లు అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ సర్వీసెస్ బోర్డు సభ్యులు సువేందు కుమార్ స్వైన్, చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీదేవి, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, రామాంజనేయులు, గుంటూరు నగర మేయర్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

ప్రేమల్లో 'మునుగుతున్నారు'!

(మొదటి పేజీ తరువాయి)

వాటిలోని సామాజిక మాధ్యమాలకు అతుక్కుపోతున్నారు. అవసరం లేకపోయినా ఇన్‌స్టాలో ఐడీలు క్రియేట్ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ స్నేహితులను పెంచుకుంటున్నారు. పెద్దల నుంచి పొందలేని ప్రేమ, ఆప్యాయతలు వారి నుంచి లభిస్తున్నాయన్న భ్రమలో పడి గుడ్డిగా ఇళ్ల నుంచి పారిపోతున్న ఉదంతాలు పెరిగాయి. వీటిలో పోలీసు కేసుల వరకూ వెళ్తున్నవి కొన్నే. పిల్లల మానసిక స్థితి, కెరీర్ దృష్ట్యా కుటుంబ సభ్యులు తమ పరిధిలోనే చక్కదిద్దుకుంటున్నవి ఎక్కువగా ఉంటున్నాయి.

అవగాహన అవసరం

–డాక్టర్ బి.ప్రసాద్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్, సైకాలజిస్ట్ ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, విజయవాడ

సోషల్ మీడియా వాడకంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఎన్నో అనర్థాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ దుష్ప్రభావం పిల్లలపై పడకుండా తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేయాలి. వారి పర్యవేక్షణ చాలా అవసరం. పిల్లలకు మేమున్నామన్న ఆత్మస్థైర్యం నిరంతరం కలిగించాలి. పిల్లలు తమ భావాలన్నీ స్వేచ్ఛగా చెప్పే స్నేహపూర్వక వాతావరణం ఇంట్లో కల్పించాలి. సరైన పర్యవేక్షణ లేకుండా మితిమీరిన స్వేచ్ఛ ఇవ్వడం, పిల్లలు ఏం చేస్తున్నారో పట్టించుకోకపోవడం వల్ల ఇలాంటి విపరిణామాలే తలెత్తుతాయి. తల్లిదండ్రులు ఫోన్లను పరిమితంగా వాడుతూ, పిల్లలతో ఎక్కువ సమయాన్ని గడిపితే వారిలో ఒంటరితనం అనే భావన రాదు.

ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

(మొదటి పేజీ తరువాయి)

కమ్యూనికేషన్లశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇదీ ప్రాజెక్టు లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా 13,426 పంచాయతీలకు ఈ ప్రాజెక్టు ద్వారా సేవలు అందనున్నాయి. భారత్ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్ (బీబీఎన్ఎల్) మొదటిదశలో పనులు నిర్వహించిన 1,692 పంచాయతీల్లో నెట్‌వర్క్ అప్‌గ్రేడ్, బీబీఎన్ఎల్-2 దశలోని 11,254 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీని పూర్తి చేయడం, కొత్తగా ఏర్పడిన 480 పంచాయతీల్లో కనెక్టివిటీ కల్పించేలా చర్యలు తీసుకోవడం. డిమాండ్ ఆధారంగా 3,942 గ్రామాల్లో చిట్టచివరి వరకు కనెక్టివిటీ పెంచేఅంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

టెలికాంలో సంస్కరణలు తేవాలని కోరా

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'నేను తొలిసారి సీఎం అయ్యాక 1995లో బ్యాండ్‌విడ్త్ పెంచాలని బీఎస్ఎన్ఎల్‌ను అడిగా. పెంచిన బ్యాండ్‌విడ్త్‌తో కలెక్టర్ల కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్‌లు పెట్టేవాడిని. టెలికాం రంగంలో సంస్కరణలు తేవాలని నాటి ప్రధాని వాజ్‌పేయీని కోరా. అప్పట్లో జాతీయస్థాయిలో వేసిన కమిటీకి సంస్కరణలు చేపట్టేందుకు వీలుగా నివేదిక ఇచ్చాం. ఆ తర్వాతే దేశవ్యాప్తంగా సంస్కరణలు అమలయ్యాయి' అని పేర్కొన్నారు.

ఫైబర్‌నెట్ వ్యవస్థను వైకాపా పాడుచేసింది

రాష్ట్రంలో ప్రతి ఇంటికీ కేబుల్, నెట్, ల్యాండ్ లైన్ ఫోన్ సేవలు అందించేందుకు వీలుగా 2014-19 మధ్య ఫైబర్‌నెట్ వ్యవస్థను ఏర్పాటుచేసినట్లు సీఎం పేర్కొన్నారు. 'సుమారు 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్‌నెట్ కనెక్షన్లు ఇచ్చాం. వైకాపా ప్రభుత్వం ఏపీ ఫైబర్‌నెట్‌ను పూర్తిగా ఇబ్బందుల్లోకి నెట్టింది. కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది. ఇప్పుడు కేంద్ర సాయంతో డిజిటల్ కనెక్టివిటీని పెంచుతున్నాం. దానివల్ల ప్రజలకు సేవలు కూడా చాలా సులువుగా అందుతాయి' అని సీఎం అభిప్రాయపడ్డారు.

ఏపీకి దిగ్గజ సంస్థలు

– జ్యోతిరాదిత్య సింధియా

ప్రధాని మోదీ నేతృత్వంలో గత 11 ఏళ్లలో టెలికాం రంగంలో పురోగతి సాధ్యమైందని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. '22 నెలల్లో బీఎస్ఎన్ఎల్ 5జీ రోల్ అవుట్ పూర్తిచేయడం రికార్డు. దేశంలో 40 కోట్లమంది 5జీ వినియోగదారులు ఉన్నారు. 2030 నాటికి 100 కోట్లకు చేర్చడమే లక్ష్యం. ఏపీలో భారీ పెట్టుబడులకు ప్రపంచ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో భారత్ నెట్ ప్రాజెక్టును వేగంగా అమలుచేస్తాం' అన్నారు.

అన్ని గ్రామాలకు సెల్ నెట్‌వర్క్

– పెమ్మసాని చంద్రశేఖర్

'రాష్ట్రంలో ఏబీఎన్‌పీ ప్రాజెక్టు ద్వారా 5 లక్షల కొత్త కనెక్షన్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఒక్కో కనెక్షన్‌కు రూ.10 వేల చొప్పున కేంద్రం అందిస్తుంది. ఈ లెక్కన రూ.500 కోట్లు అందుతాయి. ఏబీఎన్‌పీ ప్రాజెక్టు పదేళ్ల నిర్వహణ కింద రూ.2,428 కోట్లు కేంద్రం అందిస్తుంది. మారుమూల ప్రాంతాలకు టెలికాం నెట్‌వర్క్ సేవలు కల్పించేందుకు 1,250 కొత్త టవర్లను ఏర్పాటుచేశాం. వాటిద్వారా 2,200 గ్రామాలకు నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చింది. మరో 900 టవర్లు ఏర్పాటుచేయనున్నాం. వాటి ద్వారా సుమారు 1,600 గ్రామాలకు నెట్‌వర్క్ అందుబాటులోకి తేనున్నాం. దీనికి రూ.1,000 కోట్లు ఖర్చుచేస్తాం' అని కేంద్రమంత్రి పెమ్మసాని పేర్కొన్నారు.

దేశీయంగా కేసీ-390 విమానాల తయారీ

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసేందుకూ ఎంబ్రాయెర్ సిద్ధమవుతోంది. ఇప్పటికే నాటో కూటమిలోని స్వీడన్, నెదర్లాండ్స్, పోర్చుగల్ కూడా ఈ విమానాలను కొనుగోలు చేశాయని వివరించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఏఎన్-32, ఐఎల్-76 విమానాల స్థానంలో కొత్తగా 80 మీడియం ట్రాన్స్‌పోర్ట్ విమానాలు సమకూర్చుకోవాలన్నది భారత వైమానిక దళం ప్రణాళిక. ఈ కాంట్రాక్టు కోసం కేసీ-390 మిలీనియంతో పాటు, ఎయిర్‌బస్ డిఫెన్స్- స్పేసెస్ ఎ-400ఎం, లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన సీ-130జె సూపర్ హెర్క్యులస్ విమానాలూ పోటీ పడుతున్నాయి.

గ్రహం అనుగ్రహం

23–2–2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం
షష్ఠి: ఉ.10-03 తదుపరి సప్తమి
భరణి: సా 5-33 తదుపరి కృత్తిక
వర్జ్యం: తె. 4-45 నుంచి 6-14 వరకు
అమృత ఘడియలు: మ. 1-02 నుంచి 2-33 వరకు
దుర్ముహూర్తం: మ. 12-36 నుంచి 1-22 వరకు తిరిగి 2-55 నుంచి 3-41 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.27; సూర్యాస్తమయం: సా.6.00

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	17.0	32.0
విశాఖపట్నం	21.0	31.8
కడప	21.0	34.0
విజయవాడ	21.4	34.1
రాజమహేంద్రవరం	21.5	39.0
శ్రీకాకుళం	22.0	30.0
అనంతపురం	22.0	36.2
కర్నూలు	22.5	37.0
నరసాపురం	22.7	34.8
తాడేపల్లిగూడెం	23.0	36.0
నెల్లూరు	24.0	33.8

మావోయిస్టు చీఫ్ దేవ్‌జీ లొంగుబాటు!

(మొదటి పేజీ తరువాయి)

సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్‌శర్మ అక్కడి మీడియాతో దేవ్‌జీ, సంగ్రామ్‌లు లొంగిపోయారని బహిరంగంగా వెల్లడించారు. అయితే తెలంగాణ పోలీసులు మాత్రం అధికారికంగా చెప్పలేదు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కీలకంగా ఉన్న తెలంగాణ రాష్ట్రకమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ లొంగుబాటుపై మాత్రం స్పష్టత రాలేదు.

ఆపరేషన్ కగార్‌తోనే..

1980 దశకంలో కొండపల్లి సీతారామయ్య(కేఎస్) నేతృత్వంలో ఏర్పాటైంది సీపీఐ-పీపుల్స్‌వార్ పార్టీ. దాదాపు పుష్కరకాలం తర్వాత అప్పటి పరిస్థితుల్లో కేఎస్ పార్టీ నుంచి బహిష్కృతుడయ్యారు. ఆయన స్థానంలో ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు ఎలియాస్ గణపతి పార్టీకి సారథ్యం వహించారు. మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాత సైతం చీఫ్‌గా కొనసాగారు. ప్రస్తుతం ఆయన ఆచూకీపై స్పష్టత లేదు. నేపాల్ మీదుగా విదేశాలకు వెళ్లి ఉంటారని నిఘావర్గాలు అనుమానిస్తున్నాయి. వయోభారం కారణంగా 2018లో సారథ్యం నుంచి ఆయన తప్పుకొని నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్(బీఆర్)కు బాధ్యతలు అప్పగించారు. గతేడాది మే 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతిచెందారు. అనంతరం పార్టీకి పెద్దదిక్కుగా ఉంటూ వచ్చిన దేవ్‌జీ ప్రస్తుతం లొంగిపోవాలని నిర్ణయించుకున్నారు. ఆపరేషన్ కగార్(అంతిమ యుద్ధం) ఉద్ధృత రూపం దాల్చడమే ఈ పరిస్థితికి కారణమని తెలుస్తోంది. కాగా.. మావోయిస్టు కార్యకలాపాల అణచివేతలో తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) గతంలో ఎన్నో ఆపరేషన్లు నిర్వహించినా ఏకంగా చీఫ్‌ను లొంగిపోయేలా చేయడం అత్యంత కీలకమైనదిగా చెబుతున్నారు.

చరమాంకంలో మావోయిస్టు ఉద్యమం

పార్టీ చీఫ్ లొంగిపోవడంతో నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ అనుభవం కలిగిన మావోయిస్టు ఉద్యమం చరమాంకానికి చేరిందని చెప్పవచ్చు. గణపతి, మిసిర్‌బెస్రా, పసునూరి నరహరిలాంటి ఒకరిద్దరు అగ్రనేతలు మాత్రమే మిగిలి ఉన్నారు. వారు సైతం కేడర్‌కు దిశానిర్దేశం చేసే పరిస్థితుల్లో లేరు. పీపుల్స్‌వార్.. 2004లో మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా(ఎంసీసీఐ)తో కలిసి సీపీఐ-మావోయిస్టుగా ఆవిర్భవించిన సమయంలో 16 రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తూ సుమారు 20వేలకుపైగా పీఎల్‌జీఏ సైన్యంతో విస్తరించింది. అలాంటి పార్టీ క్రమేపీ ప్రాభవం కోల్పోతూ వచ్చింది. 2024లో ఆపరేషన్ కగార్ చేపట్టిన కేంద్రబలగాలు మావోయిస్టులకు పెట్టనికోటగా మిగిలిన అబూజ్‌మడ్ అడవుల్లోకి చొచ్చుకెళ్లడంతో ఏడాదిన్నర కాలంలోనే పార్టీ కకావికలమైంది. గతేడాది బీఆర్ సైతం మృతిచెందడంతో పాటు ఆ ఏడాది పది మందికిపైగా పొలిట్‌బ్యూరో, కేంద్రకమిటీ సభ్యులు ఎదురుకాల్పుల్లో మరణించడంతో పార్టీ కోలుకోలేకపోయింది. బీఆర్ అనంతరం పార్టీకి చీఫ్‌గా వ్యవహరించిన దేవ్‌జీ సైతం ఇప్పుడు లొంగిపోవడంతో ఇక మావోయిస్టు శకం అంత్యదశకు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విద్యార్థి సంఘం నుంచి మావోయిస్టు అగ్రనేతగా..

కోరుట్ల, మంథని, న్యూస్‌టుడే : ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారనే వార్త వారి కుటుంబాల్లో సంతోషం నింపింది. కోరుట్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తిప్పిరి వెంకటనర్సయ్య, గంగుబాయి దంపతులకు ముగ్గురు కుమారులు తిరుపతి(దేవ్‌జీ), వెంకటి, గంగాధర్... కూతురు లీల ఉన్నారు. చిన్నతనం నుంచి చదువులో చురుగ్గా ఉన్న తిరుపతి 1981-83లో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1983లో కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరారు. అదే సమయంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ) భావజాలానికి ఆకర్షితుడయ్యారు. అప్పట్లో ఏబీవీపీ, ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘాల మధ్య గొడవలు చోటుచేసుకోగా పోలీసులు తిరుపతిపై కేసులు నమోదు చేశారు. ఆ సమయంలోనే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుపతి తల్లిదండ్రులు 15 ఏళ్ల కిందట మృతి చెందగా, సోదరుడు వెంకటి గతంలోనే చనిపోయారు. కోరుట్లలో వారి కుటుంబానికి చెందిన పెంకుటిల్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. తన అన్నను సుమారు 42 ఏళ్ల కిందట చివరిసారిగా చూశానని, ఆయన రాక కోసం ఎదురు చూస్తున్నానని గంగాధర్ తెలిపారు.

ఉద్యోగంలో చేరకుండా ఉద్యమ బాట

మంథని మండలం శాస్త్రుల్లపల్లికి చెందిన మల్లా వెంకట్‌రెడ్డి, రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు రాజిరెడ్డి, భీంరెడ్డి. హెచ్ఎస్‌సీ వరకు చదివిన రాజిరెడ్డి 1975లో ఆర్ఎస్‌యూలో చురుగ్గా పాల్గొన్నారు. 1977లో గ్రామంలో ఓ మహిళకు సంబంధించిన కేసులో వరంగల్ జైలుకు వెళ్లారు. జైలులో ఉద్యమకారుల సాన్నిహిత్యంతో పీపుల్స్‌వార్ ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అదే సమయంలో సోదరులిద్దరికి ఒకేసారి సింగరేణిలో ఉద్యోగాలు వచ్చాయి. అయితే రాజిరెడ్డి తన నియామక పత్రం చింపి అడవి బాట పట్టారు. అజ్ఞాతంలో ఉంటూనే సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) కార్యదర్శిగా పని చేసి కార్మికుల్లో చైతన్యం నింపారు. మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాజిరెడ్డి ఉద్యమంలో ఉండగా దాదాపు 40 సంవత్సరాల కిందట ధర్మపురిలో పోలీసులు అరెస్టు చేశారు. జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన అనంతరం తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు. 2007లో కేరళలోని ఎర్నాకులంలో పోలీసులకు పట్టుబడి రెండేళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరిగారు. బెయిల్ లభించిన అనంతరం మళ్లీ అడవి బాట పట్టారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు హత్య కేసులో రాజిరెడ్డి నిందితుడు. 2023 ఆగస్టులో రాజిరెడ్డి మృతి చెందారని వదంతులు వ్యాపించాయి. ఆ తర్వాత నుంచి ఆయన ఆచూకీ లభించలేదు. తన అన్న పోలీసులకు లొంగిపోయారన్న వార్త సంతోషం కలిగించిందని, ఆయన క్షేమంగా ఇంటికి రావాలని కోరుకుంటున్నామని సోదరుడు భీంరెడ్డి పేర్కొన్నారు.



మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్

ఈనాడు

నిండు జీవితాలతో ఆటలు!

జీవితాలతో చెలగాటమాడుతున్న ఆన్‌లైన్ మనీ గేమింగ్, బెట్టింగ్ యాప్‌ల ద్వారా ఆర్థిక అవకతవకలు పెద్దయెత్తున సాగుతున్నాయి. అక్రమ నగదు చలామణికీ, పన్నుల ఎగవేతకు అవి వేదికలవుతున్నాయి. ఉగ్రవాదానికి ఊతంగా నిలుస్తూ దేశభద్రతకు ముప్పుగా పరిణమిస్తున్నాయి. ఈ మేరకు కట్టుతప్పుతున్న సంస్థల ప్రమాదకర పోకడలను కేంద్రం గతంలోనే సుప్రీంకోర్టుకు నివేదించింది. వాటిని నిషేధించడం సబబేనని స్పష్టం చేసింది. మనీల్యాండరింగ్ వ్యవహారాల్లో రెండు ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలకు చెందిన రూ.523 కోట్ల డిపాజిట్లను ఈడీ ఇటీవల స్తంభింపజేసింది. నిరుడు అక్రమ గేమింగ్ సైట్లతో జరిగిన రూ.13వేల కోట్లకు పైగా చీకటి లావాదేవీలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ హైదరాబాద్ జోనల్ విభాగం తాజాగా గుర్తించింది. ఈ సిండికేట్‌లో కీలక సూత్రధారికి చెందిన సంస్థ షెల్ కంపెనీల కోసం మోసపూరిత కేవైసీ ధ్రువీకరణలకు, రియల్ మనీ గేమింగ్ వేదికల నగదు చలామణికి సహకరించినట్లు వెల్లడించింది. ఆన్‌లైన్ గేముల మోజులో పడి భారతీయులు ఏటా రూ.20వేల కోట్ల మేర నష్టపోతున్నారు. డబ్బులు పోసి ఆన్‌లైన్‌లో ఆటలాడుతూ, బెట్టింగులు కాస్తూ నిండా మునిగి ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతుండటం సామాజిక కల్లోలానికి దారితీస్తోంది!

ఉపాధి కోసం బిహార్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఒక యువకుడు ఆన్‌లైన్ ఆటలకు బానిసై పెద్దమొత్తంలో డబ్బు పోగొట్టుకున్నాడు. ఆ బాధను తట్టుకోలేక గతనెలలో ఉరిపోసుకున్నాడు. ఆ గేములకు అలవాటు పడి భారీగా అప్పులు చేసిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భార్యాబిడ్డలను చంపి తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో సర్వం కోల్పోయిన దిగులుతో అన్నమయ్య జిల్లాలో కొద్దిరోజుల కిందట ఒక యువకుడు ఉసురు తీసుకున్నాడు. దేశవ్యాప్తంగా ఇలాంటి విషాద ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. బెట్టింగ్ మాయాజాలంలో చిక్కి, డబ్బులకోసం దొంగతనాలు, సొంతవారిపైనే దాష్టీకాలకు తెగబడుతున్న వారూ కోకొల్లలు. వాళ్లలో కొందరు హత్యలకూ వెనుదీయడంలేదు. మోసకారి ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లు, సైట్లపై నిషేధాజ్ఞలు విధిస్తున్నా మారురూపాల్లో అవి పుట్టగొడుగుల్లా మొలుచుకొస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణలో బెట్టింగ్ కేసులు 2024తో పోలిస్తే నిరుడు రెట్టింపయ్యాయి. ఆ పందేల వల్ల బాధితులు కోల్పోయిన సొమ్ముల విలువ గతంలో కంటే మూడు రెట్లకు పెరగడం మాయదారి యాప్‌ల దోపిడీపర్వాలకు అద్దం పడుతోంది.

ఇండియాలో అనైతిక జూద విపణి విలువ రూ.8.30 లక్షల కోట్ల దాకా ఉంటుందని అంచనా. అది ఏటా 30శాతం చొప్పున పెరుగుతూ సమాజ శ్రేయస్సును కబళిస్తోంది. దేశీయంగా ప్రతిరోజూ 14 కోట్లమంది ఆన్‌లైన్ బెట్టింగుల్లో నిమగ్నమవుతున్నారు. ఐపీఎల్ సమయంలో వారి సంఖ్య అంతకు రెండున్నర రెట్లకు పెరుగుతోంది. కాసులకు కక్కుర్తిపడి కొంతమంది సినీతారలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు దగాకోరు గేమింగ్, బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం కల్పిస్తుండటంతో యువత పెద్ద సంఖ్యలో వాటివైపు ఆకర్షితులవుతున్నారు. నెమ్మదిగా ఆ ఊబిలో కూరుకుపోయి మానసికంగా, ఆర్థికంగా నలిగిపోతున్నారు. యువతరం భవితను చిదిమేస్తూ దేశ ప్రగతిని దిగలాగుతున్న దుర్మార్గపు వేదికలపై, దొడ్డిదారిలో వాటి విజృంభణకు తోడ్పడుతున్న వారిపై అత్యాధునిక సాంకేతికత సాయంతో ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి. డబ్బుతో ముడిపడిన ఆన్‌లైన్ ఆటలు ప్రమాదకరమైనవని, బెట్టింగులతో ఇల్లూ ఒళ్లూ గుల్లచేసుకోవడం తప్ప సాధించేదేదీ ఉండదని యువత కూడా తెలుసుకోవాలి!


అంపశయ్యపై సమాచార హక్కు!

'భారత ప్రజలకు సమాచార హక్కు అనేది పార్లమెంటు ఉదారంగా ఇచ్చిన వరం కాదు. అది 19(1)(ఎ)వ రాజ్యాంగ అధికరణ భరోసా ఇచ్చిన హక్కు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.కె.మాథ్యూ చరిత్రాత్మక తీర్పు వెలువరించారు. ప్రజాప్రతినిధులు తీసుకునే చర్యలు, చేపట్టే విధానాల గురించి తెలుసుకునే హక్కును ప్రజలకు ఈ అధికరణ కల్పిస్తోందని స్పష్టం చేశారు. కానీ, వాస్తవిక పరిస్థితుల్లో సమాచార హక్కు నీరుగారిపోతోందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

రాజ్యాంగం కల్పించిన భరోసాకు పార్లమెంటు 2005లో సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) రూపంలో చట్టబద్ధత కల్పించింది. ఫలితంగా పౌరులు ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వాములుగా మారారు. ఆర్‌టీఐ చట్టం పౌరుడిని ప్రజాస్వామ్యంలో సార్వభౌమాధికారం కలిగిన వ్యక్తిగా గుర్తించింది. పౌరులు కోరిన సమాచారం వెల్లడించడాన్ని తప్పనిసరి నియమంగా పరిగణించింది. చట్టంలోని 8వ సెక్షన్‌లో ఇచ్చిన 10 మినహాయింపుల కింద తప్ప మిగతా అన్ని సందర్భాల్లో పౌరులు కోరిన సమాచారాన్ని అధికారులు వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. అవినీతి, అధికార దుర్వినియోగం, నిరంకుశ పోకడలను ప్రశ్నించడానికీ, సంబంధిత సమాచారాన్ని డిమాండ్ చేయడానికీ పౌరులకు పది సందర్భాల్లో తప్ప మరే విధంగానూ అడ్డంకి లేదు.

తలకిందులైన చట్ట నిర్మాణం

వ్యక్తిగత సమాచార గోప్యతను ఆర్‌టీఐ చట్టం ఎన్నడూ విస్మరించలేదు. ప్రజా ప్రయోజనాలకు, కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం వెల్లడించాలని పేర్కొంది. ప్రజల ప్రయోజనాలతో ముడిపడి లేని వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవచ్చని సెక్షన్ 8(1)(జె) చెబుతోంది. పార్లమెంటు ఈ విషయంలో మరో అడుగు ముందుకేసింది. వ్యక్తిగత గోప్యతను నిర్వచించడంలో అధికారులు ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో ఒక నిర్ణయాత్మక నిబంధనను చట్టంలో చేర్చింది. దాని ప్రకారం పార్లమెంటుకు కానీ, రాష్ట్ర శాసనసభకు కానీ ఇవ్వాల్సిన సమాచారాన్ని పౌరుడికీ ఇచ్చి తీరాలి. చట్టసభలకు ఇవ్వలేని సమాచారాన్ని పౌరులకూ ఇవ్వనవసరం లేదని స్పష్టీకరించింది. తద్వారా గోప్యతను ప్రజాస్వామిక జవాబుదారీతనంతో ముడిపెట్టింది. అయితే, ఈ రక్షణ కవచం తరవాత తుత్తునియలైంది. గిరీశ్ రామచంద్ర దేశ్‌పాండే కేసుతో ఆర్‌టీఐ సెక్షన్ 8(1)(జె)లోని 87 పదాల క్లాజు మొదటి ఆరు పదాలకు తగ్గిపోయి, వాటి ఆధారంగా సమాచార నిరాకరణకు అవకాశం చిక్కింది. దానివల్ల దాదాపు ఏ రికార్డునైనా సంబంధిత వ్యక్తితో ముడిపెట్టవచ్చు. దీంతో సమాచారాన్ని వెల్లడించే విషయంలో అధికారులకు విచక్షణాధికారం పెరిగింది. సమాచార వెల్లడి తగ్గింది. దీన్ని సరిదిద్దాల్సిన ప్రభుత్వం ఏకంగా ఆర్‌టీఐ చట్టాన్నే మార్చాలని నిశ్చయించింది. డిజిటల్ వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం ద్వారా సెక్షన్ 8(1)(జె)లోని 81 పదాలను తొలగించి, ఇప్పటికే నష్టం చేకూర్చిన మొదటి ఆరు పదాలను మాత్రమే ఉంచింది. వ్యక్తి అనే పదానికి విస్తృత నిర్వచనమిచ్చింది. ఇకపై వ్యక్తి (పర్సన్) అనే పదం పరిధిలోకి వ్యక్తులతోపాటు కంపెనీలు, సంఘాలు, ప్రభుత్వం కూడా వస్తాయి. దీంతో వీటికి సంబంధించిన అన్ని సమాచారాలు 'వ్యక్తిగతమైనవి'గా పరిగణన పొంది, సమాచార హక్కు పరిధి నుంచి మినహాయింపు పొందుతున్నాయి. ఇది ఆర్‌టీఐ చట్ట నిర్మాణాన్ని తలకిందులు చేయడమే.



వ్యక్తిగత సమాచార గోప్యత చట్టం సమాచార వెల్లడిని నేరంగా పరిగణిస్తూ భారీగా జరిమానా విధించేందుకూ అవకాశమిస్తోంది. దీనివల్ల ప్రజాసమాచార అధికారి వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడిస్తే చిక్కులపాలవ్వాల్సిందే. దీనివల్ల సమాచారం ఇవ్వకుండా మౌనందాల్చడమే సురక్షితమని అధికారులు భావిస్తారు. ఇక ఆర్‌టీఐ వల్ల వ్యక్తిగత గోప్యతకు, పరిపాలనకు ముప్పు వాటిల్లుతుందని 2026 ఆర్థిక సర్వే ఆందోళన వ్యక్తం చేయడం ప్రభుత్వ వైఖరిని వెల్లడిస్తోంది. అనేక దేశాలు వ్యక్తిగత సమాచార వెల్లడిపై ఆంక్షలు విధించాయని ఆర్థిక సర్వే గుర్తుచేసింది. అయితే అవినీతిని అరికట్టడమే సమాచార హక్కు చట్టం లక్ష్యమన్న కీలకాంశాన్ని ఆర్థిక సర్వే విస్మరించింది. అవినీతి నిర్మూలనలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవ్వడం వల్లనే ఆర్‌టీఐ వంటి చట్టం అవసరం తలెత్తిందన్న సంగతిని గుర్తించడం లేదు. పౌరులను అవినీతి తనిఖీదారులుగా మార్చడం స.హ.చట్టం ప్రత్యేకత. దీనివల్ల అవినీతిపై నిఘా వికేంద్రీకృతమైంది. సమాచార హక్కువల్ల పరిపాలనకు విఘాతం కలిగినట్లు, అవినీతి పెరిగినట్లు దాఖలాలు లేవు. పైగా అధికారులను జవాబుదారీగా మారుస్తోంది.

గోప్యతకన్నా పారదర్శకతే ముఖ్యం

పుట్టస్వామి కేసుతో ఆర్‌టీఐ విషయంలో స్పష్టత వచ్చింది. 2017లో జస్టిస్ కె.ఎస్.పుట్టస్వామి (విశ్రాంత) వెర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 9 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అయితే రాజ్యాంగ నిర్మాణ సభ గోప్యతను, ముఖ్యంగా ఉత్తరప్రత్యుత్తరాల గోప్యతను రాజ్యాంగబద్ధం చేయాలనే ప్రతిపాదనపై చర్చించి తిరస్కరించిందని సుప్రీం తీర్పు గుర్తుచేసింది. రాజ్యాంగ నిర్మాణసభలో గోప్యత గురించి చర్చ జరిగినా, ఉద్దేశపూర్వకంగానే గోప్యతా హక్కును పక్కన పెట్టారన్నమాట. అయినా కూడా గోప్యతను ప్రాథమిక హక్కుగా ప్రకటించడం విశేషం. ఈ విషయంలో న్యాయపాలిక సృజనాత్మకతను కనబరిచినా, ఆర్‌టీఐ పరిధిని కుదించడం వల్ల లాభంలేకుండా పోయింది. తెలుసుకునే విషయంలో పౌరుడికి ఉన్న హక్కు నీరుగారిపోయింది.

గోప్యత అంటే సార్వత్రిక నైతిక సూత్రమేమీ కాదు. ప్రజలు డిమాండ్ చేసినప్పుడు అధికారులు గోప్యతను పక్కనపెట్టాల్సిందే. ఇలాంటి సందర్భాల్లో ప్రజాస్వామ్యానికి గోప్యతకన్నా, పారదర్శకతే అవసరం. కానీ, ఇప్పుడు మనకు సంస్కరణకు బదులు తిరోగమనం కనిపిస్తోంది. సమాచారాన్ని తెలుసుకునే హక్కు (ఆర్‌టీఐ) కాస్తా, సమాచారాన్ని నిరాకరించే హక్కు(ఆర్‌డీఐ)గా మారిపోతోంది. ఈ మార్పు గుట్టుగా జరిగిపోతోంది. ప్రాథమిక హక్కులను ఒక్కసారిగా రద్దు చేయకుండా క్రమక్రమంగా నీరుగార్చే ప్రయత్నమిది. సమాచార హక్కు చట్ట పరిధిని ప్రజలకు తెలియకుండా నెమ్మదిగా కుదించి వేస్తున్నారు. గోప్యత ఎక్కడ ముగుస్తుంది, జవాబుదారీతనం ఎక్కడ మొదలవుతుంది అనే దానిపై దేశంలో చర్చ జరగాలి. లేకపోతే, సమాచార హక్కు చట్టం పేరుకే మిగులుతుంది. దాని ఆత్మ అంతరించిపోతుంది.

శైలేష్ గాంధీ
కేంద్ర మాజీ సమాచార కమిషనర్



నాన్నకు అబద్ధం చెప్పి...


'మరణశయ్యపై ఉన్నవారికి ఎవరైనా అబద్ధం చెబుతారా' కోప్పడింది చార్ల్స్ లెక్లెర్క్ తల్లి. చార్ల్స్ అప్పటికింకా ఫార్ములా-2 రేసరే. కొడుకును ఫార్ములా-1 ట్రాక్‌పై చూడాలన్నది అతడి తండ్రి కల. అలాంటాయనకు చార్ల్స్ అబద్ధం ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే...

చార్ల్స్ తండ్రి పేరు హెర్వే లెక్లెర్క్. మొనాకో దేశానికి చెందిన ఆయనకు మోటార్ స్పోర్ట్స్ అంటే పిచ్చి ఇష్టం. ఫార్ములా-3లో పాల్గొనేవాడు. ఎప్పటికైనా ఫార్ములా-1 ట్రాక్‌పై కారు నడపాలన్నది ఆయన కోరిక. పేదరికం, ఆర్థిక ఇబ్బందుల వల్ల అది నెరవేరలేదు. కానీ కొడుకు చార్ల్స్‌కు రేసింగ్‌పై చిన్నప్పుడే ఆసక్తి ఏర్పడింది. ఒకసారి చిన్నారి చార్ల్స్‌ని సరదాగా రేసింగ్ ట్రాక్ దగ్గరికి తీసుకెళ్లాడు హెర్వే. అదే తొలిసారి అతడు రేసింగ్ ప్రాక్టీస్ చూడటం. ట్రాక్‌మీద రయ్యిమని వేగంగా దూసుకెళ్లే కార్లను చూసి తెగ ముచ్చటపడ్డాడు. దాంతో హెర్వే కొడుక్కి శిక్షణ ఇప్పించడం మొదలుపెట్టాడు. అయిదో ఏట కార్టింగ్ మొదలెట్టిన చార్ల్స్ ఎనిమిదో ఏట నుంచే పోటీల్లో పాల్గొన్నాడు. పట్టుదలతో సాధన చేసి అంచెలంచెలుగా ఎదిగిన చార్ల్స్ ఫార్ములా-2 రేసర్‌గా రాణిస్తున్నాడు. ఫార్ములా-1 రేసింగ్‌కు ఇంకా అర్హత సంపాదించలేదు.

అది 2017.. తీవ్రమైన అనారోగ్యంతో హెర్వే లెక్లెర్క్ మంచాన పడ్డాడు. పరిస్థితి విషమిస్తోందని వైద్యులు తేల్చేశారు. అది చూసి చార్ల్స్ తీవ్ర మానసిక సంఘర్షణకు గురయ్యాడు. తను ఫార్ములా-1 రేసర్ కావడం చూడకుండానే తండ్రి చనిపోతాడేమోనన్న బెంగ పట్టుకుంది. చివరి క్షణాల్లో తండ్రి కళ్లలో ఆనందం చూడటం కోసం అబద్ధం చెప్పేశాడు. ఆయన దగ్గర కూర్చుని ఫార్ములా వన్ రేసింగ్ అగ్రిమెంట్ మీద సంతకం చేశానని చెప్పాడు. కానీ...

కొడుకు అబద్ధం చెప్పడం తల్లికి సుతరామూ ఇష్టం లేదు. 'చనిపోబోతున్న వ్యక్తికి అబద్ధం చెబుతారా ఎవరైనా' అంటూ తనయుణ్ని మందలించింది. కొంతకాలానికి హెర్వే కాలం చేశాడు. తండ్రికి చెప్పిన అబద్ధమే చార్ల్స్‌ను వెంటాడుతోంది. ఎలాగైనా దాన్ని నిజం చేయాలని నిర్ణయించుకున్నాడు. మరింత కఠోర సాధన మొదలుపెట్టాడు. రాత్రింబవళ్లు రేస్ ట్రాక్‌మీదే గడిపేవాడు. శ్రమ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుందంటారు. అదే జరిగింది చార్ల్స్ విషయంలో. అనతికాలంలోనే అనుకున్నది సాధించాడు. 2018లో ఫార్ములా వన్ అగ్రిమెంట్ మీద సంతకం చేశాడు. అంతే కాదు, 2019లో ప్రపంచ ప్రఖ్యాత ఫెరారీ కార్ల సంస్థతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నాడు. అతి తక్కువ వయసులో ఈ ఘనత సాధించిన రేసర్‌గా చార్ల్స్ లెక్లెర్క్ రికార్డు సృష్టించాడు. ఇప్పటికే ఎనిమిది గ్రాండ్ ప్రిక్స్ అతని ఖాతాలో చేరాయి. 2024లో సొంత దేశమైన మొనాకోలో గ్రాండ్ ప్రిక్స్ గెలుపొందాడు. తండ్రికి ఇచ్చిన మాట నిజం చేసేందుకు కఠోర సాధన చేసిన చార్ల్స్ ఇప్పుడు రేసింగ్ ట్రాక్‌పై తారగా వెలుగొందుతున్నాడు.

– బాలస్వామి నరసింగ



పరిశుభ్రత, సమానత్వం, నిరాడంబర జీవనం, సహానుభూతి, సేవాభావం... ప్రతి ఒక్కరూ ఈ అయిదు లక్షణాలనూ అలవరచుకుంటే అది ఆదర్శవంతమైన సమాజం అవుతుంది.

– సంత్ గాడ్గే బాబా, సంఘ సంస్కర్త

వరకట్నం కోరల్లో...

వరకట్నం తీసుకోవడం చట్టరీత్యా నేరం. కానీ, ఇప్పటికీ ఈ సామాజిక జాడ్యం నిరాటంకంగా కొనసాగుతోంది. పైగా వివాహమైన తరవాతా అదనపు కట్నం తేవాలని చాలామంది భర్తలు భార్యలను హింసిస్తున్నారు. ప్రాణాలు సైతం తీస్తున్నారు. అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఎంతోమంది వివాహితలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ కేసుల్లో దోషులకు శిక్షలు అరకొరగానే పడుతున్నాయి. ఆయా సంవత్సరాల్లో ఇండియాలో వరకట్న మరణాల పరంగా నమోదైన కేసులు, ఇతర వివరాలు...



సం॥	నమోదైన కేసులు	ఛార్జిషీటు దాఖలైన వ్యక్తులు	శిక్షలు పడినవారు
2021	6753	13630	1969
2022	6450	13940	2591
2023	6156	13518	3202

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

మానస సరోవరం

మనసు ఒక సరోవరం లాంటిది. అందుకనే దాన్ని మానస సరోవరం అన్నారు. భౌతికంగా అది హిమాలయాల్లో ఉన్నా ప్రతి మనిషికీ మెదడే మానస సరోవరం. అన్నిరకాలైన ఆలోచనలకు అది కేంద్రస్థానం. కష్టసుఖాలకు కారణ స్థానం.

నిజంగా కష్టం కలిగినా దాని గురించి పెద్దగా పట్టించుకోకపోతే అది అంతగా బాధించదు. ఏదైనా మనం అనుకునేదాన్నిబట్టి ఫలితం ఉంటుంది. కష్టపడి చదవాలనుకున్నా, లక్ష్యాన్ని సాధించాలనుకున్నా, కావాల్సింది సంకల్ప బలం. అది మనసే కల్పిస్తుంది. మనిషి తన మనసును నడిపించుకునే విధానాన్నిబట్టి కష్టసుఖాలు అనుభవానికి వస్తాయి. రామదాసు మనసంతా రామనామ సంకీర్తనతో నిండిపోయింది. తానీషా అనుచరులు కొరడాలతో కొట్టినా ఆయన ఓర్చుకున్నాడు. సామాన్య మానవుడు అలా సహించలేడు. ఒక చిన్నమాట అంటేనే రెచ్చిపోయి కక్ష తీర్చుకోవాలనుకుంటాడు. అలాంటిది రామదాసు ఆ దెబ్బలను ఓర్చుకోవడమే కాక అచంచల భక్తితో కీర్తనలను కూడా ఆలపించాడు. బాధలోనూ రామనామాన్ని విడిచిపెట్టలేదు. అది ఆయన సంకల్పం, కోరిక కాదు. రామదాసు ఏమీ కోరుకోలేదు. శ్రీరామచంద్రుడికి ఆలయం నిర్మించి సేవించాలనుకున్నాడు. అది ఆయన ధర్మమేగానీ కోరిక కాదు. కోరికలు మనిషిని పతనం చేస్తాయి. విశాలమైన సముద్రంలో వేలాది ప్రవాహాలు, నదీనదాలు వచ్చి చేరతాయి. నిజానికి వాటి చేరిక వల్ల సాగరం ఉప్పొంగిపోవాలి. ప్రళయాన్ని సృష్టించాలి. కానీ వాటి కలయిక వల్ల అది ఎటువంటి పొంగునూ చూపించదు. తన ప్రశాంతతను వీడదు. భూమిపై ఒక ఉద్ధృతిలో పొంగిపొర్లిన ప్రవాహాలు కూడా సముద్రుణ్ని చేరగానే అంతటి ఆర్భాటాన్నీ కోల్పోతాయి. ఈ ప్రవాహాలన్నీ కోరికలవంటివి. చెలరేగిపోతూ మానస సరోవరాన్ని అతలాకుతలం చేయాలని చూస్తాయి. మనిషిని నానా రకాల బాధలకు గురిచేస్తాయి. అందుకే సకలవిధాల అశాంతికి కోరికలే మూలమని గీతాచార్యుడు చెప్పాడు.



అంతర్యామి

సాధారణంగా గుడికి వెళ్లినప్పుడో పెద్దవారిని దర్శించినప్పుడో దీవించమని కోరుకుంటాం. 'అభీష్టసిద్ధిరస్తు' అని ఆశీర్వదించాలని ఆశపడతాం. నిజమే. కానీ ఎవరైనా కోరుకోవాల్సింది ఏంటంటే... 'భగవంతుడా! నీ దయావిశేషాన్ని నాపై ప్రసరించు. ప్రశాంతిని కలిగించు. నిరంతరం నా మదిలో నీ రూపం నిలిచేటట్లు అనుగ్రహించు' అని కోరుకోవాలి. ఇవి నిజానికి కోరికలు కావు, సంకల్పాలు. సాధించాల్సిన లక్ష్యాలు. నిజమైన కోరికలు చాలా మనస్తాపాన్ని కలుగజేస్తాయి. వాటిని అదుపులో ఉంచుకుని నిమిత్తమాత్రంగా జీవితం గడపడమే ఉత్తమమైన పరిస్థితి అని 'ఏషాబ్రాహ్మీ స్థితిః పార్థా!' అంటూ సాంఖ్యయోగంలో వివరించాడు పరమాత్మ. ఈ స్థితికి చేరినవారు మరణ సమయంలో కూడా ప్రశాంతంగానే ఉండగలరు. జీవన సాఫల్యం అంటే ఇది. సకల సౌఖ్యాలను సమకూర్చే యోగమిది. కోరికలు పుడతాయి. వాటివెంట పరుగుదీస్తే అవి పతనమార్గానికి తీసుకువెళ్తాయి. వాటిని మహాసముద్రంలా జీర్ణం చేసుకుంటే ప్రశాంతత మిగులుతుంది. సంతృప్తి కలుగుతుంది. ఏదీ కోరుకోకుండా ఉంటే ఈ కోరిక తీరలేదే అనే బాధ ఉండదు. అప్పుడు తామరాకుపై నీటిబొట్టులా ఉండగలం.

– డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ

ప్రజాస్కామ్‌యం

వెనకటికి నాయకులకు నమ్మకం మీద ఓట్లు పడేవి. ఇప్పుడు అమ్మకం మీద పడుతున్నాయి. నాయకులు గెలిచి మాత్రం వెలగబెట్టేదేమిటి అని కొందరు ఓటర్లు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో బేరసారాలకు దిగుతున్నారు. విజయం సాధిస్తున్నారు. పూర్వం నాయకులు శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారానికి వేల రూపాయలు ఖర్చుపెట్టి 'అమ్మబాబోయ్' అనుకునేవారు. అది సత్తె కాలం. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో వార్డుమెంబర్‌గానో, పురపాలక ఎన్నికల్లో కౌన్సిలర్‌గానో నిలబడాలన్నా కోట్లు కుమ్మరించాల్సిందే. ఒక్కో ఓటుకు కనీసం 10-30వేల రూపాయలు (కొండొకచో లక్ష కూడా), అరతులం బంగారం, మద్యం, మందుబాబులు తూలి కింద పడకుండా ముందుజాగ్రత్తగా పోలింగ్ బూతుల వరకు రవాణా సౌకర్యం కల్పించడం తప్పనిసరి అవసరం ఇప్పుడు!

ప్రజాస్వామ్య షేర్‌మార్కెట్‌లో ఓటు విలువ ఊహాతీతంగా, ఇంతగా పెరిగిందేంటి? ఇదేనా రాజ్యాంగ నిర్మాతలు కలలుకన్నదని కంగారుపడి ప్రయోజనం లేదు. ఇంత పెద్దయెత్తున నిధులు ప్రతి నిధులకు ఎలా వస్తున్నాయని తెగ విచారించినా ఫలితం నాస్తి. పార్టీ నుంచి వచ్చే నిధులు కొంత, అభ్యర్థి తాను నానా గడ్డీ తిని తెచ్చే నిధులు మరికొంత. అంతా కలిపితే ఇంత! ఎన్ని పార్టీల వాళ్లు ఎంత మంది డబ్బు ఇచ్చినా కొంతమంది ఓటర్లు కిమ్మనకుండా తీసుకుంటున్నారు. అందరి దగ్గరా అందినంత అందుకుని, తమకు పూర్తిగా ఇష్టమైన అభ్యర్థికి ఓటు వేయడం అవినీతిలో ఒక రకమైన నిజాయతీ. నోటు ఇవ్వకపోతే నోటాకు కూడా ఓటెయ్యడానికి ఇష్టపడని వారున్నారన్న అతిశయోక్తి అలంకారం మన జనస్వామ్యానికి ఉంది. కీర్తిశేషులు కూడా మన ఎన్నికల ప్రక్రియలో చొరబడి ఓటు ముద్ర వేయడం లక్ష్మీప్రసన్న ఫలితమే.

ఓడినవాడు ఓట్ల లెక్కింపు కేంద్రం దగ్గర ఏడిస్తే, గెలిచినవాడు ఖర్చయిన డబ్బు వడ్డీతో సహా రాబట్టుకోకపోతే నడ్డి విరిగిపోతుందని తలపువచ్చి ఇంటి తలుపులు వేసుకుని ఏడుస్తుంటాడు. ఇదంతా ఎందుకు? ప్రజలు 'ఉచిత ఓటు పథకం' అనుసరిస్తే ఈ



బాధే ఉండదు కదా అనుకున్నా ఏడుపే. జనం ఉచితంగా ఓట్లు వేస్తే పార్టీ నిధులు రావు, తమకు అయిన వాళ్లు పైసా విదల్చరు. అలాంటప్పుడు వచ్చే డబ్బులో వీలైనంత బొక్కేసే ఛాన్స్ మిస్సు అవుతుందని కొందరు దిగులు ముఖాలు పెడుతున్నారు. దైవ ప్రసాదాన్నే కల్తీ చేసే 'ధనాపాటీలు' ప్రజాస్వామ్యాన్ని మాత్రం కల్తీ చేయకుండా ఉంటారా? జనతంత్రం అంతా ధనస్వామ్యం అయినప్పుడు, ఎన్నికల ప్రచారం అనే డబ్బా ఇక వేస్ట్ కదా అన డానికీ కుదరదు. ఎన్నికల్లో ఉదారంగా ఎంత ఖర్చుపెట్టినా స్వడబ్బాతో పాటు తన అధినేత డబ్బా కొట్టకున్నా, ఎదుటి పక్షం వాణ్ని తిట్టకున్నా ఆధునిక ప్రజాస్వామ్యానికే అర్థముండదు. అందుకే ప్రచార సభలకూ డబ్బిచ్చి మరీ జనాన్ని రప్పిస్తున్నారు.

వాళ్ల అవసరం వాళ్లది. వీళ్ల అవసరం వీళ్లది.

ఒకవేళ ఎన్నికల్లో బొక్క బోర్లా పడినా, లేస్తే మనిషిని కాదనే నాయకులూ మనకున్నారు. ఓడిపోయాక 'ఏముంది వాళ్ల పవర్ అయిదేళ్లే కదా! ఇలా కళ్లు మూసి తెరిచేలోపు మళ్లీ ఎన్నికలు వస్తాయి. మేమే గెలుస్తాం' అని ఆత్మవంచన పరవంచన కలిపి రంచనుగా చెబుతారు. ఈ మాటలు విన్న ప్రత్యర్థులు మాత్రం 'మీరు గెలిస్తే ప్రజలకు ప్రతి దినమూ, ప్రతి క్షణమూ నరకమేగా! కళ్లు మూసి తెరిస్తే అయిదేళ్లు అయిపోవులే' అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు.

ఏదిఏమైనా పైసామే ప్రజాస్వామ్యం! డబ్బుకు జనతంత్రం దాసోహం! అన్నట్లుగా పరిస్థితులు ఎప్పుడో మారిపోయాయి. జనం ముందు పొర్లు దండాలు పెట్టినా, ఆప్యాయంగా కౌగిలించుకున్నా ఓటేసే రోజులు ఏనాడో పోయాయి. అవిగో ఎన్నికలు అనగానే ఇవిగో అంటూ నాయకుల్లో 'నోట్ల' కట్టలు తెంచుకున్న ఉత్సాహం ముంచుకొస్తుంది. ఎవరి కోటాలు వారివి. ఎవరి వాటాలు వారివి. బడా బడా నేతలు తమకు 'సందు మిత్రులు' అయిన ఛోటా మోటా నాయకులను పిలిచి నోట్లు వెదజల్లి 'ఇంద తీసుకో/ఇపుడే దందా చేసుకో' అంటారు. 'మజా'స్వామ్యం మొదలవుతుంది. ఎన్నికల రాజకీయాల్లో 'ఇచ్చిపుచ్చుకోవడాలు' సహజమే. గెలవడానికి ఇవ్వడంలో ఉన్న హాయి వేరెక్కడా లేనే లేదులే అని అభ్యర్థులు ఇంటింటికీ తిరిగి డబ్బు ఇతరాలు పంచిపెట్టడం నిజం. అయితే అలా పందేరం చేసి ఓడిపోయిన తరవాత మళ్లీ ఇంటింటికీ తిరిగి ఇచ్చిన డబ్బు, చీరల్ని వెనక్కు తెచ్చుకోవడం చిత్రం. అసలు ఓటర్లు తిరిగివ్వడం గొప్ప విషయం! తెలంగాణలో ఇటీవలి ఎన్నికల్లో ఈ చిత్రాలు చాలానే కనిపించాయి. అన్ని దానాల్లోకి తీసుకున్న దాన్ని తిరిగివ్వడం- అన్నదానానికి మించిన గొప్ప దానం! వీటన్నింటి వల్లా ప్రజాస్వామ్యం ప్రజా'స్కామ్'యం అయిపోయింది. ఈ తలనొప్పినంతా భరించలేక ప్రజాస్వామ్య మాత సర్వకాల సర్వావస్థల్లో ఝండూబామ్ రాసుకుంటోంది!

– శంకర నారాయణ

రాజన్న పెట్టిన పరీక్ష!

వెంకటాపురంలో రాజన్న అనే రత్నాల వ్యాపారి ఉండేవాడు. తన దుకాణంలో అన్ని పనులూ తానే చూసుకోలేక వీరన్న, సూరన్న అనే యువకులను పనిలో పెట్టుకున్నాడు. ఒకరోజు వాళ్లిద్దరినీ పిలిచి.. 'దీన్ని మీ సొంత వ్యాపారం అనుకుని బాధ్యతగా నడపండి' అని చెప్పాడు. రాజన్న వారి పనితీరును, నిజాయతీని పరీక్షించడానికి ప్రతి వారం ఏదో ఒక చిక్కుముడి వేసేవాడు. మొదటి వారం.. 'ఏంటి లెక్కలో పది రత్నాలు తక్కువగా వస్తున్నాయి ఎందుకని?' అని అడిగాడు. దాంతో భయపడిపోయిన వీరన్న.. 'ఏమోనండీ.. నాకేం తెలియదు' అని తప్పుకొన్నాడు. కానీ సూరన్న లెక్కల పుస్తకాన్ని బాగా పరిశీలించి, రాజన్న కావాలనే చేసిన తప్పును సరిచేసి చూపించాడు.



రెండో వారం.. నగదు పెట్టెలో డబ్బు తక్కువగా ఉందని ప్రశ్నించాడు. అప్పుడు కూడా వీరన్న తప్పించుకున్నాడు. సూరన్న మాత్రం.. ఊరి జమీందారు ముందే ఇచ్చిన డబ్బు, ఆరోజు తీసుకెళ్లిన రత్నాలు, అమ్మకాల గురించి చక్కగా వివరించి రాజన్నను సంతృప్తి పరిచాడు. రెండు నెలల తరవాత.. 'మీరు రోజూ ఏదో విధంగా ఇబ్బంది పెడుతూనే ఉన్నారు. ఇలాగైతే నేను ఇక్కడ పనిచేయలేను' అంటూ వీరన్న అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎదురైన ప్రతి సమస్య నుంచి వీరన్న ఎలా తప్పించుకోవాలనే చూశాడు. అందులో తన తప్పేమీ లేదని నిరూపించుకోవడానికి కూడా ప్రయత్నించలేదు. కానీ ఇచ్చిన పనిని బాధ్యతగా చేస్తూ ప్రతి చోటా తనను తాను నిరూపించుకుంటూ, యజమాని దగ్గర నమ్మకం పొంది.. ఎక్కువ జీతం తీసుకోసాగాడు సూరన్న. అందుకే ఎప్పుడైనా మనం చేస్తున్న పనికి సంబంధించి పూర్తి బాధ్యత తీసుకోవాలి. అప్పుడే అందులో మనం రాణించగలం.

హాయ్! బుజ్జీ!!

– మొర్రి గోపి

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయగలరా?

1. □□□□□ ఒలిచి □□□ పెట్టినట్లు.
2. □□ వాడికి □□ వాడు లోకువ.
3. □□ లేకుండా □□ రాదు.
4. □□ మాటకు □□ లేదు.

(c) eenadu




విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్గానిక్ రైతోత్సవం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు కలెక్టర్ లక్ష్మీశ రైతులకు తమ ఉత్పత్తులు అమ్ముకునేందుకు ఉన్న అవకాశాలు, జిల్లా యంత్రాంగం తరఫున అందిస్తున్న సేవలను వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ స్టాళ్లను పరిశీలించారు. - ఈనాడు, అమరావతి

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఈ నెల 23వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్లు వివరించారు. అర్జీలను Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అర్జీల స్థితి తెలుసుకునేందుకు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

వేసే మందు.. చూడు ముందు

- కొన్నవన్నీ అమ్మేయాలనే నకిలీ తేదీలు
- అధికంగా వాడే ఔషధాలే లక్ష్యం

ఈనాడు, అమరావతి

గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల వరకూ ప్రస్తుతం గ్యాస్ బిళ్లలను విచ్చలవిడిగా వాడుతున్నారు. కనీసం వైద్యుల సూచన లేకుండా నేరుగా మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి మింగేస్తున్నారు. ఇదే అదనుగా కాలంచెల్లిన గ్యాస్ట్రిక్ ట్యాబ్లెట్లను సైతం నకిలీ తేదీలు, వివరాలతో మార్కెట్‌లో అమ్మేసి సొమ్ము చేసుకునే అక్రమార్కులు పెరిగారు. ఔషధాల గడువు ఒకటి రెండు నెలల్లో ముగుస్తోందనగా.. దానికి మరో ఆరు నెలలు పొడిగించి నకిలీ స్టాంపులతో తేదీలను ముద్రిస్తున్నారు. వాటి ఎక్స్‌పైరీ తేదీలను టిన్నర్లను వాడి చెరిపేస్తున్నారు. మందుల బ్యాచ్ నంబర్లు సైతం మార్చేస్తూ తయారీ తేదీలు నకిలీవి ముద్రించి.. రోగులకు అంటగడుతున్నారు.

వెనక్కిచ్చే వీల్లేక అక్రమాలు

ఔషధాల రంగంలో 'ప్రోపగాండా కం డిస్ట్రిబ్యూషన్(పీసీడీ)' అనేది బాగా ప్రాచుర్యం పొందిన విక్రయ విధానం. మెడికల్ ఫీల్డ్‌లో అనుభవం ఉన్న కొంతమంది.. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) నుంచి అనుమతి తీసుకుని మందులు సరఫరా చేస్తుంటారు. తాజాగా విజయవాడ సత్యనారాయణపురంలో నకిలీ తేదీలను ముద్రించి ఔషధాలను విక్రయిస్తూ దొరికిన.. డైకన్ హెల్త్‌కేర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ కూడా ఇలాంటిదే. వీళ్లు ఫార్మా సంస్థల నుంచి బల్క్‌గా ఔషధాలు కొంటారు. వాటిని తమ కంపెనీ పేరుతోనే మార్కెట్‌లో హోల్‌సేల్‌గా విక్రయిస్తారు. ప్రధానంగా వైద్యులతో అనుసంధానమై, ఆస్పత్రులకు అనుబంధంగా ఉండే మెడికల్ షాపుల్లోనే వీరి ఔషధాలు అమ్ముకుంటారు. ఒకవేళ ఔషధాల గడువు తీరిపోతే వాటిని తిరిగి ఫార్మా కంపెనీకి పంపించడానికి అవకాశం ఉండదు. మిగతా మెడికల్ షాపుల్లో ఉండే ఏ మందైనా.. గడువు తీరిపోతే.. దానిని తయారు చేసిన సంస్థకు వెనక్కి పంపించేయొచ్చు. ఈ పీసీడీ విధానంలో డిస్ట్రిబ్యూషన్ చేసే వ్యాపారులకు ఆ అవకాశం లేకపోవడంతో ఎలాగైనా తెచ్చిన మందులన్నీ గడువులోగా అమ్మేయాలి. అందుకే నకిలీ తేదీలు ముద్రిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

మధుమేహ, గ్యాస్ బిళ్లలు..

తాజాగా నకిలీ తేదీలతో దొరికిన మందులన్నీ మధుమేహ, గ్యాస్ట్రిక్ సమస్యకు వినియోగించేవే కావడం గమనార్హం. జనం ఎక్కువగా వినియోగించే గ్యాస్, మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, నరాలు, ఎముకలకు సంబంధించిన అనారోగ్య సమస్యల మందులపైనే.. విజయవాడలో పీసీడీ వ్యాపారం జరుగుతోంది. గడువు రెండు మూడు నెలలుంటే.. వైద్యులు వీటిని తీసుకోరు. అందుకే ఆరేడు నెలలు పొడిగించి.. తొమ్మిది నెలలుందని నమ్మించి అంటగడుతున్నారు.

సర్వోత్తమ స్ఫూర్తి.. సాహిత్య దీప్తి..

ఉచితంగా 40వేల పుస్తకాల పంపిణీ

విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తకాల పండగ.. సాహిత్య పరిమళాన్ని వెదజల్లింది. గ్రంథాలయ ప్రాంగణమంతా పుస్తక ప్రియులతో కళకళలాడింది. సామాజిక మాధ్యమాలు రాజ్యమేలుతున్న కాలంలోనూ పుస్తకం పట్ల ఆదరణ తగ్గలేదని నిదర్శనం. రెండు రోజుల పుస్తక ప్రదర్శన, పంపిణీ ఆదివారంతో ముగిసింది. - పటమట, న్యూస్‌టుడే

ఈ ఏడాది సుమారు 15 వేల మంది సందర్శించారు. మనిషికి 2 చొప్పున పుస్తకాలు ఉచితంగా ఇచ్చారు. అన్ని రంగాల పుస్తకాలు 40 వేలకుపైగా పంపిణీ చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. ఇక్కడే పుస్తకాల హుండీ ఏర్పాటు చేశారు. ఎవరైనా తాము చదివిన పుస్తకాలు తీసుకొచ్చి అందులో వేస్తే చాలు. వాటినే తిరిగి పంపిణీ చేస్తారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ.. 'పుస్తక పంపిణీ 2015లో ప్రారంభించాం. మొదట్లో ఆరు వేలు, ఇప్పుడు దాదాపు 40 వేల పుస్తకాలు పంపిణీ చేశాం. కొందరు దయతలచి వారి వద్ద ఉన్న పుస్తకాలు మాకు ఇచ్చారు. అన్ని రకాల పుస్తకాలకు ఆదరణ లభిస్తోంది.' అని వివరించారు.



పుస్తకాలు పరిశీలిస్తున్న సాహిత్య ప్రియులు



ఎంపిక సులభం

నేను ఎంబీఏ చదువుతున్నా. కళాశాల గ్రంథాలయంలో నిపుణుల పుస్తకాలు చదవడానికి వీలు కలగడం లేదు. ఇక్కడ ప్రదర్శనలో పుస్తకాలు సబ్జెక్టు వారీగా ఉన్నందున ఎంపిక సులభమైంది. మాలాంటి వాళ్లందరూ ఈ గ్రంథాలయానికి రుణపడి ఉంటారు. - మానస, ఎంబీఏ విద్యార్థిని



అమ్మానాన్న చెబితే వచ్చా

నేను ఐదో తరగతి చదువుతున్నా. పుస్తకాలంటే ఇష్టం. మా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉచిత పుస్తక ప్రదర్శన గురించి చెబితే వచ్చా. ఇక్కడ కథలు, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు, అన్ని తరగతుల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. కొత్త ప్రపంచంలో అడుగు పెట్టినట్లు ఉంది. - జైష్ణవి, విద్యార్థిని



ఊహించిన కంటే ఎక్కువే ఉన్నాయి

మాధ్యమాల ద్వారా ఉచిత పుస్తక వితరణ గురించి తెలుసుకున్నా. ఈ విషయాన్ని మా కళాశాల పాలకవర్గానికి తెలియజేశా. వాళ్లు పరిశీలించి రమ్మన్నారు. ఇక్కడకు వచ్చి చూస్తే నేను ఊహించిన దానికంటే ఎక్కువ పుస్తకాలు కనబడ్డాయి. ప్రత్యేక అనుమతితో కళాశాల గ్రంథాలయంలో లేని 500 పుస్తకాలు తీసుకెళ్తున్నా. - ఎ.వసుంధర, గ్రంథాలయాధికారిణి, తీగల రామిరెడ్డి విద్యాసంస్థలు, హైదరాబాద్

రంజాన్ వేళలు



ఇఫ్తార్: (సోమవారం) సాయంత్రం: 6.17
సహరి: (మంగళవారం) ఉదయం: 5.11

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 36,928 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 39,980 మంది, మొత్తం 76,908 మంది పరీక్షలు రాయనున్నారు. వారి కోసం జిల్లాలోని వివిధ కళాశాలలో 98 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1235 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. 4 సిటింగ్ స్క్వాడ్, 4 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు.



ఎస్ఆర్ఆర్ కళాశాలలో డీఐఈవో ప్రభాకర్ పరిశీలన

★ ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం అవుతుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించేది లేదని డీఐఈవో బి. ప్రభాకర్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల వద్ద తాగునీటి వసతితో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. హాల్ టికెట్, పెన్ను మినహా ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతించమని తెలిపారు. ★ మాల్‌ప్రాక్టీస్ జరగకుండా అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించి సందేహాలు, సమస్యలు ఉంటే 0866-2442362 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.




భానుడి సెగ.. భక్తులకు కష్టమేగా..

కొండపైకి వెళ్లడానికి దుర్గాఘాట్ వద్ద భక్తులు ఒకరినొకరు తోసుకోకుండా బస్సులు ఎక్కడానికి దేవస్థానం వరుసలు ఏర్పాటు చేయడం మంచి ఆలోచనే. అయితే భక్తులు ఎండ తీవ్రత తట్టుకోలేక, బస్సుల కోసం నిరీక్షించలేక అవస్థలు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రం కానున్న నేపథ్యంలో భక్తులకు నీడ ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది. -ఈనాడు అమరావతి



కృష్ణమ్మ చెంత.. దుర్గంధం చింత

ఇది కృష్ణా పుష్కరాల సమయంలో రూ.కోట్లతో విజయవాడలో నిర్మించిన కృష్ణవేణి స్నానఘాట్. నాడు లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు ఇక్కడ. కానీ నేడు నీరు నిలిచి మురుగు మడుగు కట్టింది. ఘాట్ వద్దకు వచ్చే పర్యాటకులు, శనైశ్చరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు అపరిశుభ్రతను చూసి దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. -ఈనాడు, అమరావతి

మేము సైతం.. ప్రకృతి హితం

ఆర్గానిక్ సాగులో దూసుకుపోతున్న హాలికులు

ఈనాడు, అమరావతి

రసాయన ఎరువుల తాకిడికి తాళలేక తల్లడిల్లుతున్న నేల తల్లికి సేంద్రియ సాగుతో సాంత్వన కలిగించడమే లక్ష్యంగా ఈ రైతులు ఆర్గానిక్ సాగులో దూసుకెళ్తున్నారు. ప్రకృతిలో దొరికే ఔషధ గుణాలున్న ఆకులు, ఇతర పదార్థాలతో తయారు చేసిన కషాయాలు, ఎరువులతో అద్భుతాలు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక రాబడి పొందుతూనే ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచాల్లా మారుతున్నారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవంలో వీరి ఉత్పత్తులు ప్రదర్శించారు.

14 రకాల వరి

✪ ఏ.కొండూరుకు చెందిన శబరీనాథ్ పదేళ్లుగా సేంద్రియ సాగులో కొనసాగుతున్నారు. కాజీపటాలియ, నవారా, మైసూరు మల్లిగ, బ్లాక్‌రైస్, కాలాబట్ట, రాజముడి, రక్తశాలి వంటి 14 వరి రకాలను పండిస్తున్నారు. మిరపకు అంతర పంటలుగా శనగలు, కందులు, పసుపు, మునగను 54 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ✪ సాధారణంగా వరికి ఎకరానికి రూ.40వేలు పెట్టుబడి అవుతుంటే ఈయన రూ.25వేలతో సాగు చేసేస్తున్నారు. స్వయంగా తయారు చేసుకున్న బీజామృతం, ఘన, ద్రవ జీవామృతాలనే వినియోగిస్తున్నారు. తాను పండించిన వరి, పప్పుధాన్యాలు, మిరప మర పట్టించి ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. ✪ వీటి వినియోగం వల్ల లైంగిక సామర్థ్యం పెంపుతో పాటు మలబద్ధకం, మధుమేహం, రక్తహీనత, అధిక బరువు, మహిళల్లో పీసీవోడీ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. సేంద్రియ సాగులో శబరీనాథ్ కృషికి 2021లో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా రైతు నేస్తం పురస్కారం పొందారు.



సేంద్రియ ఉత్పత్తులతో శబరీనాథ్, సిబ్బంది

విభిన్న పంటలతో...



తాను పండించిన స్వీట్‌కార్న్ చూపుతున్న వీరభద్రరావు

✪ పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడుకు చెందిన వీరభద్రరావు 14 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. 8.5 ఎకరాల్లో మిరప ప్రధాన పంటగా ధనియాలు, ఆవాలు, ఉల్లిపాయ, పెసర, స్వీట్‌కార్న్, బొబ్బర వంటి 10 అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. ✪ రసాయన ఎరువులు వాడిన పొలాల్లో ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తే గొప్ప. సేంద్రియ సాగు ద్వారా ఎకరానికి రూ.1.5లక్షల పెట్టుబడితో 20 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. ✪ సాధారణంగా క్వింటాల్ మిర్చి రూ.15-20వేలు ఉండడం గగనం. వీరభద్రరావు రూ.50వేలకు అమ్ముతున్నారు. మిర్చి విక్రయాలతో పాటు ఆయనే కారం మర పట్టించి అమ్ముతున్నారు. ఈ సీజన్‌లో 12క్వింటాళ్ల కారం అమ్మారు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.

పర్యవేక్షణ కరవు.. అక్రమాల నెలవు!

కేజీబీవీల నిర్వహణపై విమర్శల వెల్లువ

ఈనాడు, అమరావతి

★ ఎ.కొండూరు కేజీబీవీలో విద్యార్థినులపై ఎలుకల దాడి ఘటనతో అంతా ఉలిక్కిపడ్డారు. వసతి గృహంలో పరిస్థితి దారుణంగా ఉందని.. బాలికలు చెప్పినా.. అధికారులు పెడచెవిన పెట్టారు. 12 మంది విద్యార్థినులపై ఎలుకలు దాడి చేయడంతో ఉరుకులు పరుగులు పెట్టారు. వసతి గృహంలో పరిస్థితి చూసి.. ఉన్నతాధికారులు ముక్కున వేలేసుకున్నారు.
★ రెడ్డిగూడెం మండలం రంగాపురంలోని కేజీబీవీలో సరకులు పక్కదారి పట్టిస్తున్న విషయం తాజాగా వెలుగు చూసింది. 687 కిలోల బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు లాంటివి బయటకు తరలించేందుకు దాచినట్లు తేలింది. దీంతో ప్రిన్సిపల్ శ్యామలపై చర్యలకు ఉపక్రమించారు.



రంగాపురం కేజీబీవీలో అక్రమంగా దాచిన బియ్యం బస్తాలు

పేద బాలికల కోసం వెనుకబడిన ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సమస్యలను ఏళ్ల తరబడి పరిష్కరించకుండా వదిలేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో రంగాపురం, ఎ.కొండూరు, గంపలగూడెంలో కేజీబీవీలున్నాయి. ఎ.కొండూరులో ఎలుకలు, అపరిశుభ్రత, రంగాపురంలో సరకుల పక్కదారి వంటి ఘటనలు బయటపడ్డాయి. ఈ తంతు చాలాకాలంగా జరుగుతుండగా.. ఇప్పటికి వెలుగులోకి వచ్చాయి.

అధికారులకు మామూళ్లు..

★ ప్రతి నెలా ఒక్కో విద్యాలయం నుంచి.. జిల్లా స్థాయి అధికారులకు మామూళ్లు ఇవ్వాలనే కారణంతో సరకులు పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే.. అక్రమాలు జరుగుతున్నా.. ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ★ ఎ.కొండూరు విద్యాలయంలో 2024 సెప్టెంబరులో బాలికలను ఎలుకలు కరిచాయి. సెప్టిక్ ట్యాంక్ నిండి.. దుర్వాసన వస్తోందని, ఎలుకలు తిరుగుతున్నాయని విద్యార్థినులు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. తాజాగా 12 మందిని ఎలుకలు కొరకడంతో.. అధికారులు పరుగులు పెట్టారు. కిటికీలకు మెష్‌లు సరిగా లేవు. దోమల వల్ల తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. స్నానాల గదులకు గొళ్లాలు సరిగా లేవని చెప్పినా.. పట్టించుకునే వారు కరవయ్యారు. నిర్వహణ ఖర్చుల కింద ఏటా ఇస్తున్న రూ.2 లక్షలు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి.

చూస్తే మీరు.. ఫ్లాట్ అవుతారు!




గత వైకాపా పాలనలో చుట్టూ పిచ్చి మొక్కలతో బూత్ బంగ్లాల్లా మారిన టిడ్కో గృహాలపై కూటమి ప్రభుత్వం రాగానే దృష్టి సారించింది. విజయవాడ గ్రామీణ మండలం జక్కంపూడి పరిధిలో 3వేల గృహాలకు రంగులు వేసి పూర్తి స్థాయిలో సిద్ధం చేశారు. ఏప్రిల్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. -ఈనాడు, అమరావతి




బ్రహ్మాండనాయకునికి కల్యాణ శోభ

మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటిరోజు స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలుగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. - మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

విద్యుత్తు అదాలత్ రేపు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంగళవారం విద్యుత్తు అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. సూర్యారావుపేట లోక్‌భవన్ సమీపంలోని సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ ఈ అదాలత్ నిర్వహిస్తారు. అంతరాయాలు, మీటర్, లోఓల్టేజీ, బిల్లింగ్ సమస్యలు, సరఫరాలో లోపాలు వంటివాటిపై రాతపూర్వకంగా ఇస్తే.. పరిష్కరిస్తారు. విజయవాడ టౌన్ డివిజన్ పరిధిలోని గొల్లపూడి, భవానీపురం, కేజీ మార్కెట్, కొత్తపేట, రామరాజ్యనగర్, చిట్టినగర్, పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్, గాంధీనగర్, ముత్యాలంపాడు, మధురానగర్, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, మొగల్‌రాజపురం, కృష్ణలంక, స్క్యూబ్రిడ్జి విద్యుత్తు సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ కోరారు.

కక్కుర్తిపడితే.. కటకటాలే..!

అనిశాకు చిక్కుతున్న ఉద్యోగులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

✪ నగరానికి చెందిన సుబ్బారావుకు బ్యాంకు లాకరుతో పాటు ఖాతాల్లో రూ.50 లక్షల వరకు నగదు ఉంది. పెద్ద మొత్తంలో స్థిరాస్తులూ ఉన్నాయి. ఒక రోజు అకస్మాత్తుగా చనిపోయారు. ఆయన పేరుతో ఉన్న ఆస్తుల కోసం కుటుంబ సభ్యులు బ్యాంకును ఆశ్రయించారు. కుటుంబ ధ్రువీకరణ పత్రం తెస్తేనే.. అవి ఇస్తామన్నారు.
✪ వారసత్వంగా వచ్చిన ఆస్తి విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొంది. తర్వాత ఇద్దరూ రాజీపడ్డారు. రెవెన్యూ అధికారులను సంప్రదించగా.. కుటుంబ ధ్రువీకరణ పత్రం తెస్తేనే ఆస్తిని బదలాయిస్తామని స్పష్టం చేశారు.
ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్తుల బదలాయింపు, ఇతర ఆర్థిక లావాదేవీల్లో కుటుంబ ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకంగా మారింది. దీన్నే ఆసరాగా చేసుకున్న కొంత మంది అధికారులు.. లంచం డిమాండ్ చేస్తున్నారు. దీనికి ఇష్టపడని ప్రజలు.. అనిశా అధికారులకు ఫిర్యాదు చేసి.. అక్రమార్కులను పట్టిస్తున్నారు. గత నెల 23న రామలింగేశ్వరపేటకు చెందిన కూచిభొట్ల వెంకట పర్వతేశ్వర రవికుమార్ అనే వ్యక్తి.. కుటుంబ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వార్డు రెవెన్యూ సెక్రటరీ వంజరపు వెంకటేశ్.. రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తర్వాత రూ.50 వేలు తెమ్మన్నారు. చివరకు రూ.45వేలు తీసుకుంటూ అనిశా అధికారులకు దొరికిపోయాడు. ఇదే కేసులో మరో రెవెన్యూ సెక్రటరీ గుడ్డేటి విజయ గాంధీ అనిశా అధికారులకు దొరకకుండా పారిపోయాడు. తాజాగా శనివారం విజయవాడ నార్త్ ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తున్న అప్పారావు రూ.12వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు.



జనవరి 23న అనిశా అధికారులకు దొరికిన వంజరపు వెంకటేశ్

జారీ చేసే పద్ధతి ఇదీ.. కుటుంబ ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తారు. దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి చుట్టుపక్కల వారిని విచారిస్తారు. కుటుంబ సభ్యుల వివరాలను ఆరా తీసి నిర్ధారించుకుంటారు. ఆ సమయంలో దరఖాస్తులో పేర్కొన్న సభ్యులందరితో మాట్లాడతారు. అన్నీ నిర్ధారించుకుని, సక్రమంగా ఉంటే పత్రం ఇస్తారు. దీనికి కొన్ని రోజులు పడుతుంది. అలాంటిది ఏమీ లేకుండా.. తూతూమంత్రంగా విచారణ జరిపి, కుటుంబ పత్రం ఇస్తామని కొందరు అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా.. లంచం ఎందుకు ఇవ్వాలని దరఖాస్తుదారులు అనిశా అధికారులకు ఫిర్యాదు చేసి పట్టించేస్తున్నారు.

లంచం అడిగితే ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి.
టోల్ ఫ్రీ: 1064
విజయవాడ రేంజ్ డీఎస్పీ: 94404 46164

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

యూరాలజీ సేవలు.. మరింత నాణ్యంగా..!

సిద్ధార్థ మెడికల్ కళాశాలకు పీజీ సీట్ల మంజూరు
కొత్తాసుపత్రిలో వైద్యుల కొరతకు పరిష్కారం

ఈనాడు, అమరావతి


డాక్టర్ శ్రీధర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండలు

విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో యూరాలజీ సూపర్ స్పెషాలిటీ సేవల నిర్వహణ మరింత మెరుగుపడనుంది. ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న సిద్ధార్థ వైద్య కళాశాలకు.. తాజాగా యూరాలజీ విభాగంలో రెండు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసిన ఇద్దరు వైద్యులు.. ఇక్కడ ఎంసీహెచ్ యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ కోర్సు చేస్తూ ఆసుపత్రిలో సేవలు అందించనున్నారు.

కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ సేవల కోసం రూ.150 కోట్లతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో అధునాతనంగా ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. కానీ సూపర్‌స్పెషాలిటీ సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిద్ధార్థ కళాశాలలో ప్రస్తుతం న్యూరో సర్జరీ 05, ప్లాస్టిక్ సర్జరీ 05, న్యూరాలజీ 05 చొప్పున సూపర్‌స్పెషాలిటీ పీజీ సీట్లున్నాయి. గతంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ఎ.వి.రావు, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్, ప్రస్తుత ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు ఆధ్వర్యంలో.. నెఫ్రాలజీ, కార్డియాలజీ విభాగాల్లో నాలుగేసి, యూరాలజీకి రెండు సూపర్‌స్పెషాలిటీ సీట్లు కావాలంటూ ఎన్ఎంసీకి ప్రతిపాదన పెట్టారు. ఈ నేపథ్యంలోనే యూరాలజీకి రెండు సీట్లను ఎన్ఎంసీ కేటాయించింది.

వైద్యులు లేక ఇబ్బందులు..

ఆసుపత్రిలోని యూరాలజీ విభాగంలో ప్రొఫెసర్, ఒక అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్లుండాలి. కానీ ఒక ప్రొఫెసర్, అసిస్టెంట్ వైద్యులు మాత్రమే ఉన్నారు. వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా ఎన్ఎంసీ రెండు ఎంసీహెచ్ యూరాలజీ సీట్లను కేటాయించడంతో ఇద్దరు వైద్యులు అదనంగా సేవలు అందించేందుకు రాబోతున్నారు.

ఈ ఏడాది నుంచే అందుబాటులోకి..

సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే రెండు ఎంసీహెచ్ యూరాలజీ సూపర్‌స్పెషాలిటీ సీట్లు అందుబాటులోకి రానున్నాయని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఏడుకొండలు తెలిపారు. యూరాలజీ విభాగానికి ఈ రెండు సీట్లు కేటాయించడం.. కళాశాలకు గౌరవ కారణమని ఆనందం వ్యక్తం చేశారు. యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్, ఇతర వైద్యులను ఆయన అభినందించారు. గత కొన్నేళ్లుగా అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలు, అధ్యాపకుల కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. మరింత నాణ్యంగా సూపర్‌స్పెషాలిటీ సేవలను ప్రజలకు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు.

సేంద్రియ స్వప్నం.. సాకారం సాధ్యం

విజయవంతంగా ముగిసిన ఆర్గానిక్ రైతోత్సవం


సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పట్టాభి, దినకర్, గద్దె అనూరాధ, దేవదత్, జేసీ ఇలక్కియా తదితరులు


స్టాల్స్ వద్ద సందర్శకుల సందడి

ఈనాడు, అమరావతి, విజయవాడ, క్రీడలు న్యూస్‌టుడే: 'సేంద్రియ సాగు విస్తరించాలన్న ఉద్దేశంతో జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆర్గానిక్ రైతోత్సవం విజయవంతంగా ముగిసింది. రెండో రోజైన ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ఆర్గానిక్ రైతులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. వారి ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు స్టాళ్లు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన వినియోగదారులు వాటిని ఆసక్తిగా కొనుగోలు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మార్కెటింగ్ నిపుణులు రైతుల సందేహాలు నివృత్తి చేశారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. రైతులకు తమ ఉత్పత్తులు అమ్ముకునేందుకు ఉన్న అవకాశాలు, జిల్లా యంత్రాంగం తరఫున అందిస్తున్న సేవలపై వివరించారు.

ఒక్కో మండలంలో 3 రోజుల సదస్సులు

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ..'కేశినేని ఫౌండేషన్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో సేంద్రియ సదస్సులు నిర్వహించేందుకు నా సొంత నిధులు ఖర్చు చేస్తా. ఒక్కో మండలంలో మూడు రోజుల పాటు అవగాహన, శిక్షణ, క్షేత్ర పర్యటన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఒక్కో గ్రామం నుంచి ఐదుగురు రైతుల చొప్పున మండలానికి 100 మంది సదస్సులో పాల్గొంటారు. మొత్తం 225 రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని' తెలిపారు. - ఎంపీ శివనాథ్

5లక్షల టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి మాట్లాడుతూ..'అర్బన్ ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న చెత్తను సేకరించి వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ద్వారా ఆర్గానిక్ పంటలకు ఏటా 5లక్షల టన్నుల ఎరువులు తయారు చేస్తాం. మార్క్‌ఫెడ్ ద్వారా బ్రాండ్ ఏర్పాటు చేసి విక్రయిస్తాం' అన్నారు. - కొమ్మారెడ్డి పట్టాభి

☛ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ..'ఆర్గానిక్ పంటల వ్యాప్తికి ప్రభుత్వం ఇప్పటికే మంచి ప్రోత్సాహం ఇస్తోందని, రైతుల ఆలోచన విధానం మారాలని' తెలిపారు.

☛ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ..' ఆరోగ్యవంతమైన రాష్ట్రం కావాలంటే ఆరోగ్యకరమైన పంటలు ఉండాలి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో సేంద్రియ సాగుకు పెద్దపీట వేస్తున్నారని' తెలిపారు.

☛ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, జేసీ ఇలక్కియా, డీపీఎం శంకర్‌నాయక్, ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలు కలుషితం కావడం బాధాకరం

రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల


రవీంద్రకుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సమాజంలో నేర ప్రవృత్తి పెరిగిపోయిందని రాజ్యసభ మాజీ సభ్యుడు, సుప్రీం కోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. రెండ్రోజులుగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవం ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని, రాజకీయ నాయకుల ప్రవర్తన మారిపోయిందని, రోజురోజుకూ రాజకీయాలు కలుషితం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రజలు ప్రాథమిక హక్కుల కోసం పోరాడేవారని, ప్రస్తుతం ఆత్మరక్షణ కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. సాంకేతికత వల్ల లాభనష్టాలు ఉంటాయని, దానిని మంచికే వినియోగించుకోవాలని సూచించారు. విజన్ 2047 కోసం పీఎం, సీఎం మాట్లాడుతున్నారని, అందుకు అనుగుణంగా అందరూ కృషి చేయాలని కోరారు. ఇక్కడ తాను చదువుకోవడం గర్వంగా భావిస్తున్నానని అన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివితే జీవితంలో విజయాలు సాధించవచ్చని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. 'నేను పీబీ సిద్ధార్థ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా రసాయన శాస్త్రంలో తక్కువ మార్కులు వచ్చాయి. అధ్యాపకుడు కృష్ణప్రసాద్ బాధపడ్డారు. బెటర్‌మెంట్ రాసి 59/60 మార్కులు సాధించాను. ఆ జ్ఞాపకాలు గుర్తున్నాయి' అని తెలిపారు. ప్రిన్సిపల్ మేకా రమేష్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎ.ప్రశాంత్, కోశాధికారి డి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవన శైలి మార్పులతో గుండె జబ్బుల నివారణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పూర్ణానంద్, భానుప్రసాద్, కిరణ్, సుధాకర్ తదితరులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఆరోగ్యకరమైన జీవన శైలితో 80 శాతం గుండె జబ్బుల నివారణ సాధ్యపడుతుందని గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎ.పూర్ణానంద్ అన్నారు. ప్రజారోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'యువతతో సహా పెరుగుతున్న గుండె జబ్బులు-కారణాలు- నివారణ మార్గాలు' అంశంపై ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. రకాలు, కారణాలు, నివారణ మార్గాలపై పత్రసమర్పణ చేశారు. ఒకప్పుడు వృద్ధుల్లో అధికంగా ఉండే గుండె జబ్బులు ప్రస్తుతం యువతలో అధికమవుతున్నాయని చెప్పారు. కొవిడ్ తర్వాత మరింత పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. జీవనశైలిలో మార్పులు, అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు, అధికమైన మానసిక ఒత్తిడి, మద్యం, ధూమపానం వంటి వ్యసనాలు జబ్బులకు కారణమని వివరించారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమతుల ఆహారం, ప్రతిరోజు వ్యాయామం, సరిపడా నిద్ర, సంతోషకరమైన కుటుంబ, సామాజిక సంబంధాలు, మానసిక, శారీరక విశ్రాంతి ద్వారా జబ్బులను నివారించవచ్చన్నారు. ఆయన రచించిన 'గుండెపోటు-నివారణ మార్గాలు' పుస్తకాన్ని సేవ్ యంగ్ హార్ట్ ఫౌండేషన్, కిరణ్ తేజ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు చదలవాడ భానుప్రసాద్ తదితరులు ఆవిష్కరించారు. భానుప్రసాద్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా 30-45 మధ్య వయసు ఉన్న వారికి ఉచితంగా గుండె పరీక్షలు చేసి, కొంతమందినైనా కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణయ్య మాట్లాడుతూ.. యువత తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ఠం చేయాలని కోరారు. వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్ ప్రకాష్ అధ్యక్షత వహించారు. డాక్టర్ మాకినేని కిరణ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, డాక్టర్ ఎం.సీతారామారావు, డాక్టర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్‌లో ఆకర్షణీయంగా వివిధ ఆకారాల్లో సొరకాయలు
చిన్నచెంబు ఆకారంలో..

సొర.. విభిన్నంగా..

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఎన్టీఆర్ ఆర్గానిక్ మేళా-2026 ప్రదర్శనలో భాగంగా వన్ ఎర్త్-వన్ లైఫ్ టెర్రస్ గార్డెన్ గ్రూప్‌లో ఏర్పాటు చేసిన మిద్దె తోటల సాగు స్టాల్‌లో ప్రదర్శనకు ఉంచిన విభిన్న ఆకారాల సొరకాయలు ఆకర్షించాయి. వీటిలో పొడవుగా ఎదిగిన, గుండు ఆకారంలోని, చిన్న, పెద్ద సైజుల సొరకాయలను ప్రదర్శనగా ఉంచారు. ఇవన్నీ మిద్దె తోటలపై పండించినవి కావడం విశేషం. - ఈనాడు, అమరావతి

క్రీడలకు సిద్ధం..



ఈ నెల 25 నుంచి జరగబోయే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల క్రీడల కోసం ఇందిరాగాంధీ మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. పొక్లెయిన్లు, రోడ్డు రోలర్ల సాయంతో మైదానం మొత్తం చదును చేశారు. స్టేడియంలో ఫ్లడ్‌లైట్లను సైతం ఏర్పాటు చేశారు. - ఈనాడు, అమరావతి

నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ బదిలీ



విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నార్త్ ఏసీపీ స్రవంతి రాయ్‌ను అనిశాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నార్త్ డివిజన్ పరిధిలోని సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న పోలీస్‌స్టేషన్లు అత్యంత సున్నితమైనవి. కేసుల నమోదు ఎక్కువే. అలాంటి కీలకమైన పోలీస్‌స్టేషన్లలో సంచాలనాత్మక కేసులను ఆమె సులువుగా ఛేదించారు. వివాదాలకు తావు లేకుండా సేవలు అందించారు. తాజాగా ఈమెను అనిశాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం (నేడు) రిలీవ్ అయి.. పండిట్ నెహ్రూ బస్టాండ్‌లోని అనిశా కేంద్ర కార్యాలయంలో రిపోర్టు చేయనున్నారు.

మాచవరం పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ఫిర్యాదుపై విచారణకు పాస్టర్‌ని పిలిచిన పోలీసులు


స్టేషన్ వద్దకు వచ్చిన విశ్వాసులు


రిసెప్షన్ వద్ద ప్రదీప్‌కుమార్

పటమట, న్యూస్‌టుడే: మాచవరం పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓ ఫిర్యాదుపై విచారణ నిమిత్తం పాస్టర్‌కు పోలీసులు ఫోన్ చేసి పిలవడంతో.. అతనితో పాటు చర్చికి వచ్చిన విశ్వాసులు పెద్ద సంఖ్యలో స్టేషన్‌కు చేరుకున్నారు. మాచవరం సీఐ వెంకటరమణ వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ మండలం ఎనికేపాడులోని ఓ చర్చి పాస్టర్‌గా పని చేస్తున్న ప్రదీప్ కుమార్ మీద తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన కె.హరినారాయణ సీఎంవో కార్యాలయం పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. ప్రదీప్ విజయవాడ మొగల్రాజపురంలోని ఫ్లాట్ తనకు విక్రయిస్తానని చెప్పి విడతల వారీగా రూ.70 లక్షలు తన వద్ద తీసుకున్నారని అందులో పేర్కొన్నారు. దానిని సీఎంవో కార్యాలయం నుంచి మాచవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మూడు రోజుల కిందట మాచవరం పోలీసులు ప్రదీప్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నిమిత్తం మాట్లాడేందుకు రావాలని పిలవగా.. రెండు రోజులు ఆగి వస్తానని ఆయన పేర్కొన్నారు. ఆకస్మాత్తుగా ఆదివారం 150 మందిని వెంట పెట్టుకొని స్టేషన్‌కు వెళ్లారు. పాస్టర్‌ని మాట్లాడేందుకు మాత్రమే పిలిచామని, అరెస్ట్ చేసేందుకు కాదని పోలీసులు చెప్పగా.. విశ్వాసులు వెళ్లిపోయారు. స్టేట్‌మెంట్ తీసుకుని ప్రదీప్‌ని కూడా పంపించారు. ప్రదీప్‌పై గతంలో స్పాప్ జిమ్ ఘటనతో పాటు పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భారీ సంఖ్యలో జనాలను స్టేషన్ వద్దకు తీసుకువచ్చి నిరసన తెలిపి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినందుకు పాస్టర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విభిన్న సంస్కృతుల సమ్మేళనం 'విటోపియా'



విజేతలకు బహుమతులు అందిస్తున్న జ్యోతి యర్రాజీ, వీఐటీ ఏపీ వర్సిటీ ప్రతినిధులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, క్రీడా పోటీల సమ్మేళనంగా 'విటోపియా 2026' నిలిచిందని వీఐటీ ఏపీ వైస్ ఛాన్సలర్ డా.పి ఆరుల్మోళివర్మన్ పేర్కొన్నారు. అమరావతిలోని ఆ వర్సిటీలో ఆదివారం ఈ కార్యక్రమ ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా అథ్లెటిక్స్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సత్తాచాటాలని సూచించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వర్సిటీ రిజిస్ట్రార్ డా.జగదీష్ చంద్ర ముదిగంటి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ప్రారంభమైన అభ్యాస హ్యాకథాన్

ఏఎన్‌యూ(తాడేపల్లి), న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వద్ద ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం అర్ధరాత్రి నుంచి అభ్యాస హ్యాకథాన్‌ను డీన్ డాక్టర్ శ్రీనాథ్ ప్రారంభించారు. కేఎల్‌యూలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్కిల్ పలావర్ మూడో దశను విజయవంతంగా నిర్వహించామని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. బీసీఏ, ఎంసీఏ, ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సర విద్యార్థుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మొదటి దశలో ప్రధానంగా సమస్యలకు పరిష్కారం చూపడం, రెండో దశలో అంతర్గత మూల్యాంకనం, ప్రాథమిక డిజైన్‌లు, మూడో దశలో సమీక్షలు చేశామని డీన్ తెలిపారు. చివరి దశను ఫిబ్రవరి 28న నిర్వహిస్తామన్నారు. మూడో దశలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను, అభివృద్ధి చేసిన నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


ఖజానా, లెక్కల గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : ఏపీ ఖజానా, లెక్కల గెజిటెడ్ అధికారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాజ రాజకుమార్, డి.జె.సంపత్‌రావు, 14 మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఖజానా శాఖలో పలువురు పైస్థాయి పదోన్నతులు రాకుండానే పదవీ విరమణ చేస్తున్నారని చెప్పారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న డిసిప్లినరీ కేసులను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరేళ్లుగా అడ్‌హక్ బేసిస్‌లో పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించి, పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు మాట్లాడుతూ... ఆరేళ్లుగా ఎలాంటి జవసత్వాలు లేకుండా నిర్వీర్యమైన సంఘాన్ని పటిష్టపరిచేందుకు చర్యలు చేపడతామన్నారు. 26జిల్లాల నుంచి ఖజానా, లెక్కల గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతలోనే ఆయువు తీరింది

బారికేడ్‌ను తప్పించబోయి వ్యక్తి దుర్మరణం


ఏసుబాబు (పాత చిత్రం)

కొండపల్లి, న్యూస్‌టుడే : రెండు నిమిషాల్లో ఇంటికి చేరతాడనుకున్న వ్యక్తి తిరిగి రాని లోకాలకు వెళ్లారు. రోడ్డుపై రక్షణగా ఉంచిన బారికేడు ఆ ప్రాణాన్ని భక్షించేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొండపల్లి వడ్డే నగర్‌కు చెందిన ఏసుబాబు(61) ఆదివారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం ఇబ్రహీంపట్నం వెళ్లి మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై తిరిగి బయలు దేరారు. స్థానిక డీఏవీ పాఠశాల వద్ద బారికేడును తప్పించబోయి రోడ్డుపైనున్న ఇసుక జారడంతో వేగంగా వెళ్లి బారికేడును ఢీకొన్నారు. ఆ సమయంలో తలకు శిరస్త్రాణం ఉన్నా అది పగిలిపోయి తలకు తీవ్ర గాయమై కిందపడ్డారు. ప్రమాదాన్ని గుర్తించిన వాహనదారులు ఆయన్ను చూసే సరికి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న భార్య, పిల్లలు అక్కడకు వచ్చి బోరున విలపించారు. డీఏవీ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఈ బారికేడ్లతో నెల తిరగకుండానే మరో ప్రాణం పోయింది. ప్రమాదాల నివారణకు పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెక్‌కోవ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

జీవిత ఖైదీ మృతి

భవానీపురం, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం చేసి జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి జైలులో అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. భవానీపురం అవుట్ ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉండే మద్ది సుబ్బారావు(65) ఐదేళ్ల క్రితం ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారు. అప్పటినుంచి సుబ్బారావు నెల్లూరు జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గత ఏడాది మే నెలలో అతడికి యావజ్జీవ కారాగార శిక్ష ఖరారైంది. జైలులో ఉన్న సుబ్బారావు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జైలులో చనిపోయిన విషయాన్ని భవానీపురం పోలీసులకు జైలు అధికారులు సమాచారం అందించారు.

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము
ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి), ఏలూరు జిల్లా-534426, ఫోన్: 08829 - 271427
Website: www.dwarakatirumala.org, e-mail: eo_dwarakatirumala@yahoo.co.in
REV65-OPOM0EOFF/1/2023-D1, Dt:21/02/2026
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అవసరమగు పూలు మరియు పూల దండలు ది.01-04-2026 నుండి ది.31-03-2027 వరకు ఒక సంవత్సర కాల పరిమితికి సప్లయి చేయుటకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. పూర్తి వివరములకు కొరకు www.apeprocurement.gov.in నందు తెలుసుకొనగలరు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండరు టెండర్ బాక్స్ నందు దాఖలు చేయు ప్రారంభ తేది:23-02-2026 ఉ॥ 10.00 గం॥ల నుండి చివరి తేది:09-03-2026 మ॥ 01.00 గం॥ వరకు. ఇతర వివరముల కొరకు ఫోన్: 9866730425, 9037567894 లను సంప్రదించగలరు.
శ్రీ యస్.వి. సుధాకరరావు, అధ్యక్షులు మరియు వ్యవస్థాపక ధర్మకర్త
సం/- వై. భద్రాజీ, కార్యనిర్వహణాధికారి (FAC)

విలు విద్య చరిత్రపై అవగాహన అవసరం


బాణాన్ని ఎక్కుపెట్టిన కలెక్టర్ లక్ష్మీశ, పక్కనే సత్యనారాయణ, రమణ, శ్రావణ్‌కుమార్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులకు ఎన్టీఆర్ జిల్లా కేంద్ర బిందువు కావాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. స్థానిక సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నుంచి 3వ ఎన్టీపీసీ ఖేలో ఇండియా జాతీయ ర్యాంకింగ్ ఆర్చరీ టోర్నీ (మహిళలు) నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై తొలి బాణం సంధించి టోర్నీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విలువిద్య క్రీడ చరిత్రను ప్రతి క్రీడాకారుడు అవగాహన చేసుకోవాలని సూచించారు. టోర్నీలో మంచి ఫలితాలు సాధించి మీ మీ ప్రాంతాలకు విజయాలు అందించాలని అన్నారు. క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వందలాది మంది క్రీడాకారులు దరఖాస్తు చేస్తున్నారని వివరించారు. క్రీడలతో ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని చెప్పారు. ముందుగా అంతర్జాతీయ కోచ్ దివంగత చెరుకూరి లెనిన్ చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు. టోర్నీ కాంపిటీషన్ డైరెక్టర్ అరుంధతి సిలో, రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ, కోశాధికారి చెరుకూరి కృష్ణకుమారి, ఉమ్మడి కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘం కోశాధికారి గొట్టిపాటి ప్రేమ్‌కుమార్, ఒలింపియన్ బొమ్మదేవర ధీరజ్ తండ్రి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

బంగారం కొనబడును బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. 81422 92071

BUSINESS OFFER

విజయవాడ గుంటూరు జిల్లాలో ఉద్యోగ అవకాశాలు మీ ఇంటి నుంచి సంపాదించే అవకాశం. ఏవిధమైన పెట్టుబడి లేని వ్యాపార ఉద్యోగాల కోసం 93999 99867.

FOR SALE

Sale- ఎలెక్ట్రోప్లేటింగ్ రేక్టిఫైర్లు, నికెల్ సొల్యూషన్, టైటానియం బాస్కెట్స్, కేబుల్స్. Cont: 94401 95400, 93476 80600

FINANCIAL SERVICES

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

HOUSE FOR SALE

గుడివాడ 200 గజాలు, సీలామహల్ దగ్గరలో సూరంవారి వీధి నందు రెండు అంతస్తుల ఇంటితో అమ్మకానికి కలదు. గజం-75 వేలు. సంప్ర: 81064 03490

LAND FOR SALE

కృష్ణాజిల్లా మల్లవల్లి A.P. ఇండస్ట్రియల్ ఫుడ్‌పార్క్‌కు ఆనుకుని 6 ఎకరములు ఆదాయం వచ్చు మామిడితోట అమ్మకము. కాంటాక్ట్: 99483 16161.

PLOT FOR SALE

GANNAVARAM

Vacant Plot 150 sqy West Facing near Highway Pottipadu Gannavaram sale. contact Malleswara: 96769 24785

TO LET

COMMERCIAL

బందరు రాజుగారి సెంటర్ మెయిన్‌రోడ్డు సిరివెంకట్ థియేటర్ ప్రక్కన 3x1000Sft 3ఫ్లోర్స్ కొత్తబిల్డింగ్ కమర్షియల్‌గా లీజుకు, లిఫ్ట్‌కలదు. ✆ 92474 33232

విజయవాడలో హైవే ఫేసింగ్‌తో కమర్షియల్ / రిటైల్ స్పేస్ లీజు / అద్దెకు
10,500 చ.అ. మెజ్జనైన్ 2500 చ.అ., వెస్ట్‌సైడ్ ఎదురుగా, ఎనికేపాడు, విజయవాడ
9866 9966 44
8712 3355 77

JOBS

విజయవాడలోని ప్రముఖ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నందు పనిచేయుటకు డేటాఎంట్రీ ఆపరేటర్స్, టెలికాలర్స్, కౌన్సిలర్స్ కావలెను. Age:18-30Yrs. ✆ 89777 96932

నర్సింగ్ హోమ్ నందు పని చేయుటకు నర్సులు (ANM) మరియు ల్యాబ్ టెక్నీషియన్లు కావలెను. ఉచిత వసతి కలదు. కానూరు, విజయవాడ. ✆ 96667 08089

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ & రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ పర్సన్స్, కార్ డ్రైవర్, DTP ఆపరేటర్ కావలెను. జీతం: 12,000 to 18,000 ✆ 94901 84848

శివ కార్తికేయ హోంకేర్‌లో వృద్ధులు, పేషంట్స్, పిల్లలను చూసుకొనుటకు నర్సులు, వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి, భో.జీ. 20K. ✆ 99120 11499, 99120 11899

MARKETING/ SALES

Anand Masale Require Sales & Marketing Manager, Marketing Executives. Contact: 98496 55105, 98480 53144 Email: anandmasalaappltd@gmail.com

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

వ్యాపారాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం



ఏఐపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : గుంటుపల్లి రైజ్ కేంద్రంలో ఆదివారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన సిటిల్లా ఏఐ ఏజెన్సీ 'ఏఐ ఫర్ ఫ్యూచర్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా మహిళా వ్యాపారవేత్తలకు కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంపై అవగాహన, సొంత వ్యాపార బ్రాండ్ రూపకల్పన, ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం ప్రచార వీడియోలు రూపొందించడం తదితరాలపై శిక్షణ ఇచ్చారు. సిటిల్లా ఏఐ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ఏఐపై అవగాహనతో పాటు భవిష్యత్తులో వారి వ్యాపారాల్లో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశముంటుందని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



గంగినేని రామాలయం సమీపంలోని పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

★ విస్సన్నపేట తిరుమలమ్మ గుడి ఏరియాలో చెత్త పేరుకుపోయి, దీంతో దుర్వాసన వస్తోందని స్థానికులు పంచాయతీ అధికారులకు తెలిపారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

యోగా సాధనతో చక్కని ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఆరోగ్యకరమైన చక్కని జీవితానికి యోగా ఎంతో మేలు చేస్తుందని ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీర్ శివరామాంజనేయులు అన్నారు. శాంతిసేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ వీస్ఫ్ సిటీ క్లబ్ ఆవరణలో సంపూర్ణ యోగా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, ఫౌండేషన్ అధ్యక్షుడు జనార్దన్ పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రైవేటు, అన్ ఎయిడెడ్ విద్యాలయాల్లో 2026- 27 ఏడాదిలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీవైఈవో ఎ. శ్యామసుందరరావు కోరారు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బలహీన, పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రైవేటు విద్యాలయాల్లో ఉచిత విద్య అందించేందుకు 25 శాతం సీట్లు ఒకటో తరగతిలో కేటాయించినట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో..రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 24 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తులను సమీప మీసేవా కేంద్రాల్లో చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆర్.శైలజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని నాగార్జున, ప్రభుత్వ, శ్రీనిధి, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో సోమవారం నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా మండల పరిధిలోని కోడూరు మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.రాంప్రదీప్ ఒక వినూత్న కార్యక్రమాన్ని రూపొందించారు. ఆదివారం కోడూరు గ్రామంలో ఇంటింటా తిరుగుతూ తమ పిల్లలను బడిలో చేర్పాలని తల్లిదండ్రులను విజ్ఞప్తి చేశారు.

పనుల్లో వేగం.. పరిశ్రమలకు ఊతం

మైలవరం, న్యూస్‌టుడే



పునాదులకు సిద్ధం చేస్తున్న ఇనుము

నియోజకవర్గ ప్రగతిరథ చక్రాల్ని తిప్పనున్న ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. తొలి దశలో కేటాయించిన నిధులతో పునాదులు వేసేందుకు కావాల్సిన తవ్వకాలు చేపట్టడంతో ఆ రూపు రానుంది. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి, పరిశ్రమలను ప్రోత్సహించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యం మేరకు గతేడాది నవంబరులో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా మండలంలోని చంద్రగూడెంలోని రెవెన్యూ గుట్టపై పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతం జాతీయ రహదారి నుంచి సుమారు 4 కి.మీ దూరంలో ఉంది. హైవే నుంచి అనంతవరానికి నిర్మించిన రోడ్డుకు అనుబంధంగా, ఇరువైన రహదారి కావడంతో పరిశ్రమలు అనుకూలంగా తొలిదశ సంస్థలు నెలకొల్పనున్నారు. దాంతో నిదానంగా ప్రారంభించిన పనులను, గత నెలలో పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ వేగవంతం చేయాలని సూచించారు.

ఎంఎస్ఎంఈ వివరాలు ఇలా..	
కేటాయించిన భూమి	6.21 ఎకరాలు
నిధులు మంజూరు	రూ.14.50 కోట్లు
తొలి దశ విస్తీర్ణం	2 ఎకరాల్లో..
నిర్మాణ విస్తీర్ణం	26 వేల చ.అ

రెండు విభాగాలుగా.. విశాల భాగస్వామ్య సదస్సులో ప్రకటన మేరకు చంద్రగూడెంలోని గుట్ట పోరంబోకు భూమి 6.21 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా ఎంఎస్ఎంఈకి కేటాయించారు. పనులు దక్కించుకున్న సంస్థ రెండు విభాగాలుగా పునాదుల నిర్మాణం చేపట్టేందుకు కావాల్సిన తవ్వకాలను నెలరోజులుగా కొనసాగిస్తున్నారు. జిల్లాలోనే ప్రథమంగా శంకుస్థాపన చేసిన ఎంఎస్ఎంఈ కావడంతో కలెక్టర్ దీనిపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే మౌలిక వసతులు, పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు సమకూర్చేందుకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయగా పనులు సాగుతున్నాయి. ఇది పూర్తి అయితే నియోజకవర్గంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని పలువురు నుంచి ఆశాభావం వ్యక్తమవుతోంది.

తిరువూరు నగర పంచాయతీని అప్‌గ్రేడ్ చేయాలి



ఎంపీ కేశినేని చిన్నికి వినతిపత్రం ఇస్తున్న తెదేపా నాయకులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు నగర పంచాయతీని తక్షణమే రెండవ గ్రేడ్ పురపాలక సంఘంగా అప్‌గ్రేడ్ చేయడానికి సహకరించాలని కోరుతూ తెదేపా నాయకులు ఆదివారం ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కి ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తన వంతు ప్రయత్నంగా ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం..: గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఎంపీ కేశినేని చిన్నికి ఆలయ అధికారులు, తెదేపా నాయకులు ఆహ్వానపత్రం అందజేశారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి ఈ నెల 28 నుంచి మార్చి 5 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, అలాగే మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించే పూజ లాగడం ఎడ్ల ప్రదర్శన కార్యక్రమాలకు ఆయనకు ఇచ్చారు. స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి

తిరువూరు, న్యూస్‌టుడే : జి.కొత్తూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ముత్యాలమ్మ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం తిరువూరులోని 8,14,16 వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వైభవంగా శాంతి కల్యాణం

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక కోదండ రామాలయంలో ఆదివారం స్వామి వారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి, పట్టు వస్త్రాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మైలవరంలో హారతి ఇస్తున్న పండితులు

భక్తిశ్రద్ధలతో పుట్టలమ్మ - మారెమ్మల విగ్రహ ప్రతిష్ఠ

కొండపల్లి, న్యూస్‌టుడే : పుట్టలమ్మ, మారెమ్మల నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం కొండపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. తెదేపా నాయకుడు సీతారామయ్య పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో పుట్టలమ్మ గట్టు ప్రాంతవాసులు, తెదేపా కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు

నేటి నుంచి దేవతా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

సత్యాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని సత్యాలపాడులో విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గుడిలో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.



నూతనంగా నిర్మించిన శివాలయం ఇదే..

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్ర జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రం వడోదరలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగే 72వ జాతీయ సీనియర్ పురుషుల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో తలపడే రాష్ట్ర జట్టును రాష్ట్ర కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఆదివారం వెల్లడించారు. రైల్వే స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను ఆర్‌సీటీ (రైల్వే క్లైమ్స్ ట్రిబ్యునల్) అదనపు సంచాలకుడు కె.రాజేంద్రప్రసాద్, రాష్ట్ర కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కల అర్జునరావు, సంయుక్త కార్యదర్శి కేవీ నాంచారయ్య అభినందించారు. పి.దుర్గారావు (కెప్టెన్, తూర్పు గోదావరి), వి.గోపి, జి.హరీష్ (పల్నాడు), జి.లక్ష్మారెడ్డి, పి.బ్రహ్మారెడ్డి, కె.హరిప్రసాదరెడ్డి (బాపట్ల), ఎన్.తేజ (విశాఖ), సీహెచ్ నాగబాబు, కె.మనోహర్ (కాకినాడ), కె.రాంబాబు, కె.దినేష్ (తిరుపతి), కె.ఫణీంద్ర (ఎన్టీఆర్), జి.పవన్‌కుమార్ (కృష్ణా), ఎస్‌కే బాషా (గుంటూరు) జట్టులో స్థానం సాధించారు.



క్రీడాకారులతో రాజేంద్రప్రసాద్, అర్జునరావు, శ్రీకాంత్ తదితరులు

కలిసి పని చేద్దాం.. ఉత్తమ సేవలు అందిద్దాం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కలిసి పనిచేద్దాం.. సంస్థ ఉత్తమ సేవలను ప్రజలకు అందిద్దామని ఎన్టీటీపీఎస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సునీల్ అన్నారు. ఎంప్లాయీస్ వెల్ఫేర్ అమరావతి సర్కిల్ సమావేశాన్ని ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా యూనియన్ ముందుకెళ్తుందన్నారు. మార్చి నెలలో జనరల్ బాడీ మీటింగ్‌ను నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్, శ్రీనివాస్, విజయమాధవి, దిలీప్, వినీత తదితరులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్ ప్రారంభం

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే : మండలంలోని కొణతమాత్మకూరు శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దాత సహకారంతో నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను ఆదివారం ప్రారంభించారు. దాత మేడపల్లి లక్ష్మణదాస్ తన సొంత నిధులు రూ.12 లక్షలు విరాళంగా ఇవ్వడంతో 500 మందికి భోజనాలు ఏర్పాటు చేసుకునేలా హాల్ నిర్మించారు. దీనిని దాతతో పాటు సర్పంచి లగడపాటి పుష్పరేణి, గ్రామ తెదేపా నాయకుడు బాబి ప్రారంభించారు.

శిశు సంక్షేమం.. అనారోగ్యం పాలు!

తిరువూరు, న్యూస్‌టుడే

సరకుల నాణ్యతలో పలు అనుమానాలు

తిరువూరు డివిజన్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రతి నెల అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారం అందిస్తున్నారు. కానీ వీటిలో రాగి పిండి, కోడి గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె, చిక్కీలు తదితరాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వీటిని కేంద్రాలకు సరఫరా చేసే గుత్తేదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని వాపోతున్నారు. సరకుల పంపిణీలో అవకతవకలు, తక్కువ బరువు, నాసిరకం పదార్థాలను ఇస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన పరిస్థితులు

డివిజన్‌లోని 265 అంగన్‌వాడీ కేంద్రాల్లో కొన్ని చోట్ల పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉంటున్నాయి. సరైన తాగునీటి సదుపాయం లేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర శిశు అభివృద్ధి సేవలు లబ్ధిదారులకు చేరేందుకు అధికారులు సమన్వయంతో పని చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. డివిజన్ పరిధి తిరువూరు, గంపలగూడెం, ఏ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,545 మంది చిన్నారులు, 2,082 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. 125 సొంత అంగన్‌వాడీ భవనాలు, 77 అద్దె వాటిల్లో చిన్నారులకు ప్రాథమిక అందిస్తున్నారు.

☛ ఈ విషయమై సీడీపీవో కృష్ణకుమారి మాట్లాడుతూ.. కొన్నిచోట్ల పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. త్వరలోనే వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రాలకు సరకులు సరఫరా చేసే గుత్తేదారులపై ఆరోపణలపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

మైలవరం, న్యూస్‌టుడే : చంద్రగూడెంలో స్థానిక ఏఎంసీ ఛైర్మన్ పి. సవ్యశ్రీ, జనసేన మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బెస్ట్ ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్‌రావు, నాయకులు శ్రీకాంత్, నాని, శివరాంప్రసాద్, తిరుపతిరావు పాల్గొన్నారు.



మైలవరంలో శిబిరం ప్రారంభిస్తూ..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలోని స్వర్ణ గ్రామ పంచాయతీ సచివాలయంలో స్టాన్లీ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో వైద్యుడు ప్రభుదాసు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామస్థులకు కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఊటుకూరులో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు సతీమణి రాణి వర్ధంతి సందర్భంగా రక్తదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత శిబిరాన్ని ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఊటుకూరు: ఆరోగ్య పరీక్షలకు వచ్చిన ప్రజలు



కొండపర్వలో..

కౌలు రైతులను ఆదుకోండి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని కంభంపాడులో గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రావుల.రామకృష్ణ, బి.శ్రీను, కేశవులు, రాము తదితరులు పాల్గొన్నారు.



కంభంపాడులో గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కౌలు రైతులు

మౌలిక సౌకర్యాల నిమిత్తం విరాళం

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లయన్స్ వైకుంఠధామంలో ఏర్పాటు చేసిన మార్చురీ గది సౌకర్యాల నిమిత్తం రూ.75 వేల నగదు విరాళాన్ని గౌడ సంఘీయులు ఆదివారం గ్రామ పెద్దలు, ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ.సుధాకరరావుకు అందజేశారు. వైకుంఠధామంలో ఇప్పటికే పలు సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని, అంతర్గత రహదారుల అభివృద్ధి, గ్యాస్ ఆధారిత దహన ప్లాంటు ఏర్పాటుకు దాతలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బాలాజీ ప్రసాద్, సంఘం నాయకులు సాంబశివరావు, శ్రీను, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని గణపవరానికి చెందిన తెదేపా కార్యకర్త చుట్టుకుదురు జమలయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఈ మేరకు అతని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని తెదేపా నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్, అంబేడ్కర్, రాజేష్, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బాలిక బలవన్మరణం

జి.కొండూరు, న్యూస్‌టుడే : తండ్రి చనిపోయాడు, తల్లి వేరే చోట ఉండడంతో నాయనమ్మ వద్ద ఉంటూ తనను ఎవరు పట్టించుకునే వారు లేరని మనస్తాపంతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన జి.కొండూరు మండలంలో చోటు చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి వీరంగం

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి ఖిల్లా రోడ్డు నాలుగు కూడళ్ల ప్రాంతంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో ప్రాణాపాయ చేష్టలు చేసిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు నలభై సంవత్సరాలు కలిగిన ఓ వ్యక్తి తీవ్రంగా మద్యం తాగాడు. నాలుగు కూడళ్ల ప్రాంతంలోకి వచ్చి అటుగా రాకపోకలు సాగించే వాహనాలకు అడ్డుగా నిల్చున్నాడు. ఒకనొక సమయంలో వెళ్తున్న లారీ దగ్గరకు వెళ్లి అడ్డుగా పడుకొన్నాడు. వెంటనే లారీ డ్రైవర్ అప్రమత్తమై సడన్ బ్రేక్ వేశాడు. డ్రైవర్ లారీ నుంచి కిందకు దిగి ఆ వ్యక్తికి దేహశుద్ధి చేశాడు. అప్పటికే అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది మత్తులో ఉన్న వ్యక్తిని పలుమార్లు వారించినా ప్రయోజనం లేకపోయింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అబాకస్ పోటీల్లో ప్రతిభ

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో స్థానిక ఎస్ఎస్‌కే హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహనరావు తెలిపారు. పలు విభాగాల్లో మొత్తం 15 మంది విద్యార్థులు బహుమతులు పొందారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్, కరస్పాండెంట్ శ్రీభావన, ఉపాధ్యాయులు తదితరులు వారిని అభినందించారు.



సాధించిన పతకాలతో విద్యార్థులు

'వైఫల్యాలు ప్రశ్నిస్తుంటే దాడులా?'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే దాడులు చేయడం హేయమని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఆయన ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఫల్యాలను ఎదుర్కొలేక భౌతిక దాడులు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇలా ఐతే రాకపోకలు ఎలా

తిరువూరులోని జైభావి సెంటర్ నుంచి ప్రధాన రహదారికి వెళ్లే మార్గంలో రోడ్డు ఆక్రమణలకు గురై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రోడ్డు మధ్యలో ఇసుక, కంకరను గుట్టలుగా పోశారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తీయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు



ఉత్సాహంగా మిడ్ టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక సీహెచ్‌ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మిడ్‌టౌన్ బ్యాడ్మింటన్ లీగ్-2026'ని కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, స్నేహ సంబంధాలు పెంపొందించాలనే లక్ష్యంతో లీగ్‌ని ప్రారంభించామని తెలిపారు. లీగ్‌లో బాలబాలికలు, స్త్రీ, పురుషులు సుమారు 150 మంది పాల్గొన్నారని, వారిని 8 జట్లుగా విభజించి పోటీలు నిర్వహించామని చెప్పారు. దీని ద్వారా సమకూరే రూ.1.5 లక్షలను పల్స్ పోలియో నిధికి అందజేస్తామని తెలిపారు. పోటీలకు ప్రాయోజకులుగా 'ముకుతశ్రీ గోల్డ్ అండ్ డైమండ్స్', సహ ప్రాయోజకులుగా 'దివి స్వచ్ఛ సిల్వర్ జువెలరీ' వ్యవహరించినట్లు తెలిపారు. 'ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్' ప్రథమ, 'త్రినాథ్ ఇన్‌ఫ్రా' ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాయి. క్లబ్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర్ నాయకత్వంలో నిర్వహించిన పోటీలో కో-ఛైర్మన్లు టి.ఉదయ్, కె.మధుసూదనరావు, కార్యదర్శి పొదిలె నాగ వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. క్లబ్ ఛైర్మన్ టి.కిషన్‌బాబు విజేతలకు ట్రోఫీలు బహూకరించారు.



విజేతగా నిలిచిన ఉమా ఈవెంట్స్ అండ్ స్పీడ్ పూల్

స్తంభించిన సేవలు.. అన్నదాతలకు అవస్థలు

గంపలగూడెం, న్యూస్‌టుడే



ఆందోళన చేస్తున్న పీఏసీఎస్‌ల ఉద్యోగులు

పీఏసీఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మెతో తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో వారం రోజులుగా సహకార సంఘాల్లో సేవలు స్తంభించాయి. తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 2025 డిసెంబరు 6 నుంచి దశల వారీగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె చేపట్టి సంఘాలకు తాళాలు వేశారు. ఎరువుల విక్రయాలు ఆపేశారు. దీంతో ఆర్థిక లావాదేవీలు జరగడం లేదు.

స్పందన కొరవడడంతో..

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పీఏసీఎస్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నా స్పందన కొరవడడంతో సమ్మెకు దిగినట్లు సంఘం రాష్ట్ర నాయకుడు బొల్లినేని రఘురామ్ తెలిపారు. ఉద్యోగులకు చట్టపరంగా గ్రాట్యూటీ చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, 2019 తర్వాత చేరిన తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 2019- 24 వరకు వేతన సవరణ అమలు చేయాలని 70 రోజులుగా దశల వారీగా ఉద్యమం సాగుతోంది. ఈ నేపథ్యంలో కార్యాలయాల తలుపులకు తాళాలు వేసి సమ్మె నోటీసు అంటించారు. మండల వారీగా గంపలగూడెం- 12, తిరువూరు- 8, ఎ.కొండూరు- 7, రెడ్డిగూడెం- 4, విస్సన్నపేట- 7 పీఏసీఎస్‌లు ఉన్నాయి. మొత్తం 38 సంఘాల్లో 170 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వీరిలో 80 మంది తాత్కాలిక ఉద్యోగులున్నారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోతుల ఆగడాలు.. తప్పించుకోవడానికి విన్యాసాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే

రబీలో వరి కంటే మొక్కజొన్న లాభదాయకంగా ఉంటుందని అన్నదాతలు అధిక శాతం దాని వైపు మొగ్గు చూపారు. విస్సన్నపేట మండలంలో కలగర, తాతకుంట్ల, కొర్లమండ తదితర గ్రామాల్లో మెరక, మాగాణి భూముల్లో 2,600 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. వర్షాలు అధికంగా ఉండడంతో ఈ ఏడాది విత్తనాలు ఆలస్యంగా నాటారు. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా పంట కంకి, పొట్ట దశలో ఉంది. కానీ అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లినట్లు కోతుల బెడద వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వానరాలు గుంపులుగా పొలాలపైకి రావడంతో పంటను రక్షించుకోవడం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

ధ్వనులు పలికిస్తూ..

వీటి బెడద నుంచి తప్పించుకోవడానికి కొందరు మైకుల ద్వారా రకరకాల ధ్వనులు పలికిస్తున్నారు. మరికొందరు అవి భయపడే విధంగా పొలాల ముందు ఫ్లెక్సీలు వేలాడదీశారు. కొన్ని గ్రామాల్లో నాటు తుపాకులు, దీపావళి టపాసులు పేల్చి కోతులను పారదోలుతున్నారంటే వానరాల బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయమై మండల ఏవో మాట్లాడుతూ మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందన్నారు. కోతుల బెడద వాస్తవమేనని, పొలాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడం, లౌడ్ స్పీకర్ల ద్వారా ధ్వనులు వినిపించడం వంటి వాటితో పంట రక్షించుకోవచ్చని సాగుదారులకు సూచించారు.

(c) eenadu

నింగి రహస్యాలు ఛేదిద్దాం.. రండి!

- భావి శాస్త్రవేత్తలకు 'ఇస్రో' ఆహ్వానం
- 'యువిక-2026' పేరిట పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- 27 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఈనాడు డిజిటల్, తిరుపతి: అంతరిక్షం అంటే అంతులేని ఆసక్తి ఉందా? భవిష్యత్తులో శాస్త్రవేత్తగా మారి దేశఖ్యాతిని ఇనుమడింపజేయాలని కలలు కంటున్నారా? అయితే మీలాంటి బాలమేధావుల కోసమే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అద్భుత అవకాశం కల్పిస్తోంది. 'యువ విజ్ఞాని కార్యక్రమ్' (యువిక-2026) పేరుతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనుంది. స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్స్‌లో ప్రాథమిక జ్ఞానాన్ని, అత్యాధునిక పోకడలను విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ఎవరు అర్హులు?

- దేశం నలుమూలలా ఉన్న పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **అర్హత:** 2026 జనవరి 1 నాటికి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు.
- **వెబ్‌సైట్ లింక్:** ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు సమర్పించడానికి ఇస్రో ప్రత్యేకంగా 'జిగ్యాస' jigyasa.iirs.gov.in/yuvika పోర్టల్ నిర్వహిస్తోంది. లేదా www.isro.gov.in నుంచి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



షిల్లాంగ్‌లో గతేడాది నిర్వహించిన యువిక కార్యక్రమంలో టెలిస్కోప్ పరిశీలిస్తున్న విద్యార్థులు

రిజిస్ట్రేషన్ విధానం

- ముందుగా జిగ్యాస వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, ఈ-మెయిల్ ఐడీతో రిజిస్టర్ చేసుకోవాలి. మీ ఈ-మెయిల్‌కు వచ్చే లింక్‌పై క్లిక్ చేసి వెరిఫై చేసుకోవాలి.
- లాగిన్ అయిన తర్వాత, విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఇది ఒక్కసారి మాత్రమే రాసే అవకాశం ఉంటుంది. ఇందులో వచ్చిన మార్కులకు ఎంపికలో 10 శాతం వెయిటేజీ ఉంటుంది.
- క్విజ్ పూర్తయ్యాక, వ్యక్తిగత వివరాలు, చదువుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ఫామ్‌లో నింపాలి.
- మీ అర్హతను నిర్ధారించే సర్టిఫికెట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి.
- మీరు పంచాయతీ పరిధిలోని పాఠశాల (గ్రామీణ ప్రాంతం)లో చదువుతున్నట్లయితే, దానికి సంబంధించిన ధ్రువపత్రాన్ని (ప్రధానోపాధ్యాయుడు లేదా సంబంధిత అధికారి సంతకంతో) అప్‌లోడ్ చేయాలి. దీనివల్ల 15 శాతం అదనపు వెయిటేజీ లభిస్తుంది.
- అన్ని వివరాలు సరిచూసుకున్న తర్వాత దరఖాస్తును సబ్మిట్ చేయాలి. ఆ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరుచుకోండి.
- ఎనిమిదో తరగతిలో పొందిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఉంటుంది. గత మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహించిన ఏదైనా వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ప్రతిభ పరీక్షలు, ఒలంపియాడ్‌లో పాల్గొని మొదటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వారికి 10 శాతం వరకు వెయిటేజీ ఇస్తారు. రిజిస్టర్డ్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన వారు, స్కౌట్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌లలో సభ్యులుగా ఉన్నవారికి 5 శాతం వరకు వెయిటేజీ కేటాయిస్తారు.

ముఖ్యమైన తేదీలివే..

- **రిజిస్ట్రేషన్లు ప్రారంభం:** ఫిబ్రవరి 27
- **రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ:** మార్చి 31
- **మొదటి ఎంపిక జాబితా విడుదల:** ఏప్రిల్ 13
- **రెండో జాబితా (ఖాళీల ఆధారంగా):** ఏప్రిల్ 20
- **శిక్షణ (యువిక):** మే 11 నుంచి 22 వరకు

తెలుగు రాష్ట్రాల్లో రెండు కేంద్రాలు

ఎంపికైన విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఉన్న ఏడు ఇస్రో కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ ఉన్నాయి. మిగిలిన కేంద్రాలు డెహ్రాడూన్, తిరువనంతపురం, బెంగళూరు, అహ్మదాబాద్, షిల్లాంగ్‌లలో ఉన్నాయి.

ఖర్చులన్నీ ఇస్రోవే..

ఎంపికైన విద్యార్థులకు అయ్యే ఖర్చు మొత్తం ఇస్రోనే భరిస్తుంది.

- కోర్సు మెటీరియల్, భోజనం, వసతి ఉచితం.
- ప్రయాణ ఖర్చులు (రైలు లేదా ఏసీ బస్సు ఛార్జీలు) విద్యార్థికి తిరిగి చెల్లిస్తారు.



నమూనా రాకెట్ లాంచింగ్‌ను తిలకిస్తున్న విద్యార్థులు



బీసీ సింహగర్జన సభలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్, తదితరులు

బీసీల డిమాండ్లు పరిష్కరించకుంటే దీక్ష

బీసీ సింహగర్జన సభలో బోడె రామచంద్రయాదవ్

గుంటూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'బీసీలపై గత ప్రభుత్వ హయాంలో దాడులు జరిగాయని, తెదేపా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో బీసీ రక్షణ చట్టం తెస్తామని చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఆ ఊసే లేదు. వెంటనే బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలి' అని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరులో ఆదివారం బీసీ సింహగర్జన సభ జరిగింది. సభలో బోడె రామచంద్రయాదవ్ మాట్లాడుతూ 'అమరావతిలో వెయ్యి ఎకరాలు బీసీలకు కేటాయించాలి' అని కోరారు. దళితులు, కాపులు, ఇతర సామాజిక వర్గాలవారు తమ వాటా ఎంతో తేల్చుకోవాలన్నారు. 'బీసీల సమగ్ర కులగణన చేపట్టాలి. జనాభా దామాషా ప్రకారం చట్టసభలు, విద్య, ఉద్యోగాల్లోనూ 44% రిజర్వేషన్లు అమలుచేయాలి. తక్షణం ఎన్నికలకు వెళ్లాలి. బీసీ కార్పొరేషన్ల నిధులు కేటాయించాలి. ఈ డిమాండ్లు మార్చి 31 లోగా పరిష్కరించాలి. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్ 11న విజయవాడలో నిరాహార దీక్షకు దిగుతా' అని పేర్కొన్నారు. బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్ మాట్లాడుతూ బహుజనుల కోసం రామచంద్రయాదవ్ పోరాడుతున్నారని, ఆయనకు అందరూ అండగా ఉండాలన్నారు. బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ మాట్లాడుతూ బీసీలను రాజకీయ బానిసత్వం నుంచి విముక్తి కల్పించడానికి ఉద్యమిస్తామన్నారు. సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, దర్శకుడు శంకర్, బీసీ నేతలు పాల్గొన్నారు.



సభకు హాజరైన మద్దతుదారులు



చూడ చక్కని 'జంట'

నూతన జంట చిత్రాన్ని ఫ్రేమ్‌లో మళ్లీ పక్కనే పెట్టారేంటని అనుకుంటున్నారా? అయితే మీరు పొరపడినట్లే. ఎందుకంటే చిత్రంలో ఉన్నది ఒకటి కాదు రెండు జంటలు. కవలలైన యువకులిద్దరు.. కవలలైన అమ్మాయిలను ఒకే ముహూర్తానికి వివాహమాడారు. అదీ.. అంతర్జాతీయ కవలల దినోత్సవం రోజున. ఆదివారం జరిగిన అరుదైన వివాహ మహోత్సవానికి కామారెడ్డి జిల్లా కేంద్ర శివారు లింగాపూర్‌లోని కల్యాణ మండపం వేదికగా నిలిచింది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌కు చెందిన దంపతి విజయ్‌కుమార్, వినయ్‌కుమార్‌లిద్దరూ కవలలు. వీరికి ఇదే జిల్లా తాడ్వాయి మండలం దేవీకలాన్ గ్రామానికి చెందిన కవలలు కుమ్మరి కీర్తన, కీర్తితో పెద్దలు వివాహం నిశ్చయించారు. రెండు జంటలు బంధుమిత్రుల సమక్షంలో, వేద మంత్రాల సాక్షిగా ఒక్కటయ్యాయి. నవదంపతులు విజయ్‌కుమార్-కీర్తన, వినయ్‌కుమార్-కీర్తి అందరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు.

–న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

రాజమహేంద్రవరంలో కిడ్నీ సమస్యల కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఆమె కుమారులు తెలిపారు. మరో బాధితురాలు తాడి కృష్ణవేణి (75) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని 5 ప్రైవేటు ఆసుపత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారు. 'బాధితుల్లో ఎక్కువమంది మధుమేహంతో బాధపడుతున్నారు. సాధారణంగా వీరికి కిడ్నీలు పూర్తి సామర్థ్యంతో పనిచేయవు. ఈ క్రమంలో ఆహార కల్తీ జరిగితే కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడుతుంది' అని ఓ వైద్య నిపుణుడు తెలిపారు

పోలీసుల అదుపులో పాల వ్యాపారి

ఆసుపత్రుల పాలైన బాధితులందరికీ ఒకే వ్యక్తి పాలు పోస్తుండటంతో అక్కడే కల్తీ జరిగి ఉండొచ్చని వైద్యాధికారులు, బాధితులు పోలీసులకు తెలిపారు. శివరాత్రి (15వ తేదీ) రోజు పాలు, పెరుగు చేదుగా అనిపించాయని కొంతమంది బాధితులు చెప్పారు. కోరుకొండ మండలానికి చెందిన గణేష్ అనే వ్యాపారి వీరందరికీ పాలు పోస్తున్నట్లు గుర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. బాధితుల నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాలను టాక్సికాలజీ పరీక్షకు పంపించారు. పాల నమూనాలను విజయవాడ, ముంబయి పంపించారు. నివేదికలు వచ్చిన తర్వాత అసలు కారణం తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు. గణేష్ రోజూ ఎవరికి పాలు పోస్తున్నాడో వివరాలు సేకరించి, ఆయా కుటుంబాలను సర్వే చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు.

ఘటనపై ఎంపీ పురందేశ్వరి ఆరా

ఈ ఘటనపై ఎంపీ పురందేశ్వరి ఆరా తీశారు. జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.





భాగిశెట్టి కనకరత్నం చిత్రపటంతో కుమారులు ◆ ఆసుపత్రిలో బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

అప్రమత్తంగా ఉన్నాం

రాజమహేంద్రవరంలో వెలుగులోకి వచ్చిన అనూరియా (మూత్రం రాకపోవడం) అనుమానిత కేసులపై వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉందని కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. పాలు, నీరు, ఇతర నమూనాలు సేకరించామని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ప్రకటన విడుదల చేశారు.

–వైద్యారోగ్యశాఖ కమిషనర్

చేనేత రంగాన్ని ఆదుకోండి


ఐకాస నాయకుల డిమాండ్

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చేనేత రంగానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి, నేత కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (ఐకాస) నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం 'చేనేత గర్జన' పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. తొలుత పట్టణంలోని నృసింహస్వామి ఆలయం నుంచి నేతన్న సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఐకాస ఛైర్మన్, సీపీఎం నేత పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ చేనేతరంగం అభివృద్ధికి కేంద్రం రూ.25వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2,000 కోట్లు సకాలంలో కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేత రంగానికి రూ.115 కోట్లు కేటాయించడం చిన్నచూపని విమర్శించారు. రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.203 కోట్లను విడుదల చేసి, కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారు ఆనందప్రసాద్, కట్టా దుర్గారావు, వి.రమేష్, కృష్ణప్రసాద్, మాచర్ల మోహన్ పాల్గొన్నారు.



మంగళగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సిసలైన విలాసమంటే... కులాసానే



వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో మార్పులు వస్తుంటాయి. అప్పటి వరకూ మామూలుగా అనిపించిన విషయాలే తరువాత ఎంతో ఖరీదైనవిగా కనిపిస్తాయి. అందులోనూ ఆరోగ్యం మరీ అమూల్యమవుతుంది. అందుకే ఆస్తులతో పాటు ఆరోగ్యాన్ని పెంచుకోవాలి. నాలుగు పదుల వయసు వచ్చే సరికి సంపాదనా, ఆస్తులు ఎన్ని ఉన్నా అనారోగ్యం పాలైతే ప్రశాంతతే ఉండదు. అందుకే ఆ రోజుల్లో అసలైన విలాసాల్లో ఈ అంశాలే ముఖ్య పాత్ర పోషిస్తాయి.

1. నొప్పిలేని శరీరం

చిన్నప్పటి నుంచి ఎన్నో పనుల్లో బిజీగా ఉంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. దాని ప్రభావం 40 ఏళ్లనుంచి మొదలవుతుంది. అయితే ఈ సమయంలో మోకాళ్లు, కీళ్ల నొప్పులు, నడుము పట్టేయడం లేకుండా ఉంటే శరీరం అన్నింటికంటే ఖరీదైనదిగా భావించవచ్చు.

2. హార్మోన్ల సమతూకం

కుటుంబ పోషణలో ఎన్నో కష్టాలు, నష్టాలను చూస్తుంటారు. ఇలాంటి సమయంలో అనవసరమైన ఒత్తిళ్లతో హార్మోన్లలోనూ సమతుల్యత దెబ్బతింటుంది. అయితే మనలోని శక్తి, ప్రశాంతమైన మనసు వల్ల హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. ఎలాంటి మానసిక ఒడిదొడుకులు లేకుండా ఉంటే జీవన నాణ్యత కూడా పెరుగుతుంది.

3. ప్రశాంతమైన నిద్ర

సులభంగా నిద్రపోవడం, రాత్రంతా అది కొనసాగడం వయస్సుతో పాటు తగ్గుతుంది. ఇలాంటి సమయంలో పడుకోగానే నిద్రపట్టడం ఓ వరంతో సమానం. మంచి నిద్ర శరీరాన్ని పునరుద్ధరిస్తుంది. మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. సౌందర్య చికిత్సల కన్నా మెరుగ్గా శరీరాన్ని, మొహాన్ని మెరిపిస్తుంది.

4. సరైన జీర్ణక్రియ

కోటి విద్యలు కూటికొరకే అంటారు. అయితే ఒక వయసు వచ్చే సరికి అనేక సమస్యలతో ఆహారాన్ని త్యాగం చేయాల్సి వస్తుంది. బరువు పెరగడం, జీర్ణక్రియ సమస్యలు వస్తాయేమో అన్న భయం లేకుండా తినగలగడం అనేది ఒక ఆశీర్వాదం. మంచి ఆహారం ద్వారా వచ్చే మెటాబాలిజం రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

5. రోజంతా శక్తి

నడి వయసులోకి వచ్చేసరికి తెలియకుండానే మనలో శక్తి క్షీణిస్తుంటుంది. అయితే రోజంతా అలసటతో కూర్చోకుండా, పని చేయడానికి, నడవడానికి, ఇతరులతో కలవడానికి, జీవితాన్ని ఆస్వాదించడానికి ఉండే శక్తే నిజమైన సంపద.

6. లోపల నుంచి మెరిసే చర్మ కాంతి

సంపదలో అందమూ ఓ భాగమే. ఇది శారీరకమే కాదు మానసికమైనదిగా కూడా ఉండాలి. అయితే నిజమైన కాంతి మనం వాడే క్రీమ్‌ల వల్లే రాదు. మంచి ఆహారం, నీరు, నిద్ర, ఆరోగ్యకరమైన జీవనశైలి వల్ల చర్మం సహజంగా మెరుస్తుంది.

7. మనశ్శాంతి

ఎప్పుడూ ఇల్లు, కుటుంబ బాధ్యతలతో సతమతమయ్యే వారికి విశ్రాంతి కావాల్సిన సమయం నలభైల్లోనే ఆసన్నమవుతుంది. అయితే అదే సమయంలో వచ్చే ఆరోగ్య సమస్యలతో మనశ్శాంతి కోల్పోయే వారు ఎందరో ఉంటారు. అందుకే మనసు ప్రశాంతంగా ఉండే ఆరోగ్యమూ బాగుంటుందని గుర్తుంచుకోవాలి.

8. అర్థవంతమైన బంధాలు

నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు అంటారు వేమన. అంటే పనికి రానివి మన చుట్టూ ఎన్ని ఉన్నా వ్యర్థమే. అలాగే మన విజయాలకు ఆనందించని, మన కష్టాల్లో తోడుగా ఉండని వారు ఎంత మంది ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే మనల్ని అర్థం చేసుకునే, ప్రోత్సహించే, తోడుగా ఉండే కొద్దిమందితో ఉండటం ఎంతో ముఖ్యం. మంచి సంబంధాలు మనుషులను, మనసులనూ బలంగా మారుస్తాయి.

ముందు జాగ్రత్త ముఖ్యం..

వీటిని సాధించాలంటే ఎలాగైతే విలాసవంతమైన జీవితం కోసం కష్టపడతామో అలాగే ఆరోగ్యంపై జాగ్రత్త కూడా అవసరం. రెండూ సమాంతరంగా కొనసాగిస్తేనే జీవితం సాఫీగా సాగుతుంది.

- రోజూ వ్యాయామం, మంచి శరీరాకృతి కొనసాగించడం
- రోజూ 7-8గంటలు నిద్రపోవడం, ఫోన్ల వాడకాన్ని తగ్గించడం
- ధూమపానం, మద్యపానం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ.. సరిపడా నీళ్లు తాగడం
- ఎట్టి పరిస్థితుల్లోనూ అల్పాహారం మానేయకూడదు. ప్రోటీన్ ఉన్న పండ్లు, కూరగాయలు తినాలి.
- మనసుకు హానిచేసే మనుషులకు దూరంగా ఉండటం.
- పనికీ, విశ్రాంతికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.
- మంచి కమ్యూనికేషన్, క్షమించడం అలవాటు చేసుకోవాలి.

నాలుగు పదులు దాటుతుంటే..

- ప్రతిరోజూ శ్వాస వ్యాయామాలు, ఫిజియోథెరపీ ఎక్సర్‌సైజ్‌లు చేయాలి
- బరువు తగ్గడం, విటమిన్ డి, క్యాల్షియం వంటివి చెక్ చేసుకోవాలి.
- క్రమం తప్పకుండా హెల్త్‌చెకప్‌లకు వెళ్లాలి. ఒత్తిడిని నియంత్రించుకోవాలి.
- సరైన నిద్రా సమయాలు, రాత్రిపూట తేలికైన ఆహారం తీసుకోవాలి.
- చక్కెర, రిఫైన్డ్ వంటలు తగ్గించడంతో పాటు తిన్న తరువాత తప్పనిసరిగా నడవాలి.
- అనవసరపు అంచనాలు, వాదనలు తగ్గించి జీవితాన్ని యథాతథంగా స్వీకరించాలి.

ఈ అలవాట్లను యవ్వనం నుంచే పాటిస్తే తర్వాత జీవితాన్ని ఆనందంగా గడపవచ్చు. కాస్త ఆలస్యమైనప్పటికీ నలభైల్లో మొదలు పెట్టినా క్రమశిక్షణతో కూడిన జీవనశైలితో సురక్షితమైన, నాణ్యమైన జీవితాన్ని సాధించవచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

హే వాట్సాప్..! కూలీలు దొరుకుతారా?





చాట్‌బాట్ సేవలు ఇలా... ◆ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమిట్‌లో అవార్డు అందుకున్న ధనేష్ (ఎడమవైపున్న వ్యక్తి)

పొలం పనులు మొదలుపెడదామంటే అనుకున్న సమయానికి, అనుకున్న కూలీకి మనుషులు దొరకని పరిస్థితి రైతులది.. పని చేద్దాం అంటే దగ్గర్లో ఎక్కడ పనులు జరుగుతున్నాయో తెలియక ఇబ్బందులు పడేది కూలీలు. వీరిని సులువుగా అనుసంధానించడానికి వినూత్న పరిష్కారం చూపించారు కడియాల ధనేష్. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన ఆయన.. వాట్సప్‌లో బ్లూ కనెక్ట్ పేరుతో చాట్ బాట్‌ను రూపొందించారు. దీనిని ఉపయోగించాలంటే ముందుగా 6281685487 నంబర్‌ను సేవ్ చేసుకోవాలి. వాట్సప్ చాట్‌లో నంబర్ ఓపెన్ చేయగానే బ్లూ కనెక్ట్ చాట్‌బాట్ ఆహ్వానం పలుకుంది. హాయ్ అని పెట్టగానే పని ఇవ్వాలనుకుంటున్నారా (రైతు) లేదా పని కోరుతున్నారా (కార్మికుడు) అని అడుగుతుంది. ఎంపికకు అనుగుణంగా తెలుగులోనే ప్రశ్నలు వరుసగా వస్తాయి. వాటికి సమాధానాలు ఇస్తే మనకు కావాల్సిన వారితో అనుసంధానం చేస్తుంది. ఈ ప్లాట్‌ఫాం ద్వారా రైతులు తమకు పది కి.మీ. పరిధిలో పనులకు అందుబాటులో ఉన్న కూలీలను సంప్రదించవచ్చు. ఈ చాట్‌బాట్‌లోనే వాతావరణ, ప్రభుత్వ పథకాల సమాచారమూ అందుబాటులో ఉంది. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా పనిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యమని ధనేష్ తెలిపారు.

త్వరలోనే మరిన్ని గ్రామాలకు

బ్లూ కనెక్ట్ రూపకర్త ధనేష్ 2023లో మెకానికల్ సబ్జెక్ట్‌లో బీటెక్ పూర్తిచేశారు. అప్పటి నుంచి చిన్న, చిన్న ఉద్యోగాలు చేసి కొంత నగదు కూడబెట్టారు. ప్రస్తుతం ఆ నగదుతోనే ఇలాంటి వాట్సప్ చాట్‌బాట్‌లు రూపొందిస్తున్నారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమిట్-2026లో సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్ కేటగిరీలో బ్లూ కనెక్ట్ ప్రాజెక్టుకు అవార్డునూ అందుకున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ చాట్‌బాట్‌ను భవిష్యత్తులో మరిన్ని గ్రామాలకు విస్తరించాలనేది తన లక్ష్యమని ధనేష్ చెప్పారు.

– న్యూస్‌టుడే, బిక్కవోలు

'ప్రసాద్' పథకంతో కాణిపాకం ఆలయాభివృద్ధికి కృషి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న 'ప్రసాద్' పథకం ద్వారా నిధులు కేటాయించి కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మాజీ ఎంపీ గల్లా జయదేవ్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌లతో కలిసి స్వామిని ఆదివారం దర్శించుకుని విలేకర్లతో మాట్లాడారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ వి.మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడిని దర్శించుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎంపీ జయదేవ్, ఎమ్మెల్యే మురళీమోహన్ తదితరులు



సోషల్ మీడియా వాడే ముందు ఈ ప్రశ్నలు వేసుకోండి

సామాజిక మాధ్యమాల్లో లాగిన్ అయ్యే ముందు రెండు ప్రశ్నలు వేసుకోండి. నేను ఇప్పుడు ఏ విషయం చెప్పాలనుకుంటున్నాను? ఎవరికి అది ఉపయోగపడుతుంది?- వీటికి మీ వద్ద స్పష్టమైన సమాధానం లేదంటే అర్థం మీరు సోషల్ మీడియాను ఉపయోగించుకోవడం లేదు, అదే మిమ్మల్ని ఉపయోగించుకుంటోందని. అలాంటప్పుడు అసలు లాగిన్ అవ్వొద్దు.

– గ్రెగ్ మెక్‌కెవొన్, రచయిత

జగన్‌కు దేవుడంటే భయం లేదు

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా ధ్వజం

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ కలియుగ రాక్షసుడని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం విశాఖపట్నంలోని తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ''జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులకు దేవుళ్లంటే భక్తి, భయం లేవు. హిందువుల మనోభావాలంటే అసలు లెక్కేలేదు. తిరుమల వేంకటేశ్వరస్వామిని రాజకీయాలకు వాడుకునే స్థాయికి వైకాపా నేతలు దిగజారిపోయారు. జగన్ ఆదేశాలతోనే ఆ పార్టీ ఎమ్మెల్సీలు చెప్పులు, బూట్లు వేసుకుని.. వేంకటేశ్వరస్వామి చిత్రపటాలతో మండలిలో ఆందోళన చేశారు. హిందూ మతవిశ్వాసాలపై, తితిదే సంప్రదాయాలపై జగన్‌కు మొదటి నుంచీ చిన్నచూపే. తిరుమల లడ్డూలో జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలు వినియోగించి కల్తీ చేశారు. పరకామణిలో నిధులు కాజేసిన నిందితుడితో రాజీ కుదుర్చుకోవడం జగన్‌కే చెల్లింది'' అని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. సమావేశంలో పాల్గొన్న విశాఖ జిల్లా జనసేన అధ్యక్షులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైకాపా పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా రావన్నారు. విశాఖ లోక్‌సభ నియోజకవర్గం తెదేపా అధ్యక్షుడు చోడె వెంకటపట్టాభిరామ్, నగర భాజపా నాయకుడు చక్రవర్తి వైకాపా తీరును విమర్శించారు.



మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చిత్రంలో కూటమి నాయకులు

పుర్రె, ఎముకలతో మహిళకు పార్సిల్

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులో ఓ మహిళకు పార్సిల్‌లో మనిషి పుర్రె, ఎముకలు వచ్చిన ఘటన కలకలం సృష్టించింది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నైలోని వ్యాసర్పాడికి చెందిన శ్రుతి అనే మహిళ ప్యారిస్ ప్రాంతంలో ఉన్న ఓ దుకాణంలో పనిచేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆ దుకాణం సెక్యూరిటీ గార్డు వద్దకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి.. శ్రుతికి పార్సిల్ వచ్చిందని ఇచ్చి వెళ్లాడు. అనంతరం సెక్యూరిటీ గార్డు ఆమెకు ఆ పార్సిల్ తీసుకెళ్లి ఇవ్వగా అది తనది కాదని చెప్పారు. దీంతో అతడు దుకాణ యజమానికి అప్పగించగా.. అందరి సమక్షంలో తెరిచి చూశారు. అందులో మనిషి పుర్రె, మూడు ఎముకలు, విభూతి ఉండటంతో భయాందోళన చెందారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. అదే దుకాణంలో పనిచేస్తున్న దినేష్‌కుమార్‌కు శ్రుతి తమ్ముడు సింగారవేలన్‌తో గొడవలున్నాయని.. దీంతో అతడు శ్రుతి, సింగారవేలన్‌ను భయపెట్టేందుకు ఇలా పార్సిల్ పంపాడని తేలింది. దినేష్‌కుమార్, అతడి స్నేహితులు శ్రీనివాసన్, జోసఫ్‌లను పోలీసులు శనివారం అరెస్టు చేశారు.

(c) eenadu

పరిశోధనల 'వరస'



'నువ్వు డాక్టరు అయితే సమాజంలో ఎలాంటి మార్పు కోసం ప్రయత్నిస్తావు?' అంటూ ఒక ప్రముఖ వైద్యసంస్థ 'యంగ్ డాక్టర్స్ క్యాంపెయిన్' పేరుతో పోటీ నిర్వహించింది. పదమూడేళ్ల ద్యాప వరస దానిలో పాల్గొనడమే కాదు, తన ఆలోచనల్ని 13 పేజీల్లో రాసి పంపింది. జాతీయస్థాయిలో తొలిస్థానంలో నిలిచింది. అది అప్పుడు. ఇప్పుడామె హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నుంచి 'బెస్ట్ యంగ్ హోమియోపత్' అవార్డు అందుకుంది. ఇంతకు తనేం చేసింది?



డాక్టర్ వరసది హైదరాబాద్. నాన్న విజయ్ కుమార్ కార్టూనిస్ట్. అమ్మ వనిత. వరసకి ముందునుంచీ నేర్చుకోవాలనే ఆసక్తి ఎక్కువ. పేదలకు సేవ చేయాలని కోరిక. అలాంటి తనని చిన్నప్పుడే వైద్యవృత్తి ఆకర్షించింది. యంగ్ డాక్టర్స్ క్యాంపెయిన్‌లో గెలిచాక దీన్నే కెరియర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. అందుకే బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్)లో చేరింది. చదువుతున్నప్పుడే అధ్యాపకులు, సీనియర్ల సలహాలతో రీసర్చ్‌నీ మొదలుపెట్టింది. రోగులపై పరిశోధనలు చేసి 'హోమియోపతి: ఎ టైమ్‌లెస్ సైన్స్ ఆఫ్ హీలింగ్' పేరుతో వ్యాసం రాసింది. హోమియోపతి ద్వారా అనారోగ్యానికి గురైన శరీరాన్ని స్వాభావికసిద్ధంగా తిరిగి ఆరోగ్యంగా మలచడం, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా అనారోగ్యాన్ని మూలాల నుంచి నయం చేసే విధానాల గురించి అందులో పేర్కొంది. ఈ వైద్యంలో ఏఐని ప్రవేశపెట్టి రోగులకు కచ్చితత్వంతో చికిత్స, ఔషధాలు అందివ్వడంపైనా ప్రయోగాలు చేస్తోంది. 'ఏఐ మీడియేటెడ్ షిఫ్ట్స్ ఇన్ రెమెడీ సెలక్షన్: హౌ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఈజ్ రీవైరింగ్ ది ఇన్‌ట్యుయేషన్ ఆఫ్ మోడర్న్ హోమియోపతిక్ ప్రాక్టీస్' పేరుతో పరిశోధిస్తోంది. హోమియోపతి ఆవశ్యకత గురించి విద్యాసంస్థల్లో సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహిస్తోంది. మహిళల్లో గర్భసంచి తొలగించకుండానే సమస్యని మందుల ద్వారా నయం చేయడం, హోమియో ఔషధాలతో సాధారణ ప్రసవమయ్యేలా చూడటంపై ప్రస్తుతం పనిచేస్తోంది. తన కృషికి గుర్తింపుగా తాజాగా హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ నుంచి బెస్ట్ యంగ్ హోమియోపత్ అవార్డును అందుకుంది. వరస వైద్యంకే పరిమితం కాలేదు. బాగా పాడుతుంది, రాస్తుంది. డ్రాయింగ్, పెయింటింగ్, వక్తృత్వం ఇలా చాలా పోటీల్లో పాల్గొని బహుమతులు గెల్చుకుంది. 'ఇండియా ఎట్ సెంటినరీ ఇయర్ ఆఫ్ ఇండిపెండెన్స్- మై విజన్' అనే వ్యాసంతో జాతీయస్థాయి అవార్డు అప్పటి గవర్నర్ తమిళిసై చేతులు మీదుగా అందుకుంది. 59వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వందేమాతరం 'ఎ సెల్యూట్ టు ది మదర్ ఇండియా' అనే కార్యక్రమంలో అప్పటి స్పీకర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభాశాలి పురస్కారం తీసుకుంది. 'వైద్యం ఖరీదవుతోంది. దీంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. హోమియోతో ఖర్చు తక్కువ. దీన్ని ప్రజలకు చేరువ చేయాలి. దీర్ఘకాలిక అనారోగ్యాలకు పరిష్కారాలు కనుక్కునేలా మరిన్ని పరిశోధనలు చేయాలి. ప్రజలకు చవకైన వైద్యాన్ని అందించేలా కృషి చేయాలన్నవి నా లక్ష్యాలు' అంటోంది వరస.

– శ్రీనివాస్ బాలె, హైదరాబాద్

వసుంధర

vasundhara@eenadu.in

చదువు వ్యాపారంగా మారిన ఈ కాలంలో... అక్షరాలు నేర్పడాన్ని సేవగా భావించేవాళ్లు ఉన్నారా అన్న సందేహానికి సమాధానం మాలతి ముర్మూ. చుట్టూ అడవి. ప్రభుత్వ పథకాలు చేరని చిన్న ఊరు. అలాంటిచోట భావితరాలను తీర్చిదిద్దుతున్నారీమె. అలాగని ప్రభుత్వ టీచరమ్మ కాదు... ఓ అమ్మ!

గిరిజన టీచర్... అమ్మ!



చుట్టూ మట్టి గోడలు, వాటి మధ్య ఒక బోర్డు... ఆ స్కూల్లో ఏకైక టీచర్ మాలతి ముర్మూ. ఎవరో ఇచ్చిన ఉద్యోగం కాదది. ఆమె తీసుకున్న బాధ్యత. మాలతిది పశ్చిమ్ బంగాలోని జిలింగ్‌సెలింగ్ అనే గిరిజన గ్రామం. పెళ్లి తరవాత అక్కడికి చేరుకున్న ఆమెకి పిల్లల భవిష్యత్తును తలుచుకుంటే భయమేసింది. అక్కడ ప్రభుత్వ బడి లేదు. పిల్లలు చదువుకోవాలంటే 25 కి.మీ.లు ప్రయాణించాలి. పోనీ అంత కష్టపడి వెళ్లినా ఉపాధ్యాయులు వస్తారో రారో తెలియదు. దీంతో చదువు మానేసి, తల్లిదండ్రులతోపాటు పనులకు వెళ్లే వాళ్లే ఎక్కువ. ఇలాగైతే తరవాతి తరాలూ పేదరికంలో మగ్గిపోతూ ఉండాల్సి వస్తుందని ఆమే చొరవ తీసుకున్నారు. భర్త సాయంతో పాత ఇంటికి మట్టిగోడలు కట్టి, బడిలా తీర్చిదిద్దారు. గ్రామస్థులు పుస్తకాలు అందించారు. అలా ఆమె పాఠశాల ప్రారంభమైంది. మాతృభాష సంథాలీలో ఓల్ చికి లిపితోపాటు బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లోనూ బోధన చేస్తున్నారు. అదీ ఉచితంగా! ఆమె బోధన విధానాలకు పిల్లలూ ఆకర్షితులయ్యారు. ప్రస్తుతం 85మంది విద్యార్థులున్నారు. నాలుగో తరగతి వరకూ పాఠాలు బోధిస్తున్నారు మాలతి. ఆవిడ చదివింది పన్నెండో తరగతే! కానీ తనకున్న పరిజ్ఞానంతో పిల్లల్లో చదువుపట్ల ఆసక్తి రేపుతున్నారు. 'చదువు రూపురేఖలు మారుతున్నాయి. డిజిటల్ తరగతులు ఏర్పడుతున్నాయి. అలాంటప్పుడు మాలాంటి గ్రామాల పిల్లలు మాత్రం చదువుకు ఎందుకు దూరమవ్వాలి అనుకున్నా. ఎన్నో ఎన్‌జీవోలు వచ్చినా కొద్దికాలంలోనే వెళ్లిపోయేవి. అందుకే నావంతుగా ప్రయత్నిస్తున్నా'నంటారు మాలతి. తనకి ఏడాది వయసున్న బిడ్డ. పాపాయిని చూసుకుంటూనే పాఠాలు చెబుతున్నారీమె. తన కృషికి ఆ రాష్ట్ర నాయకులే కాదు... ఎంతోమంది నుంచి ప్రశంసలూ అందుకుంటున్నారు.

నా స్నేహితురాలి భర్త ఈమధ్యే అనారోగ్యంతో చనిపోయారు. అతని వైద్యం కోసమని ఉన్న డబ్బంతా ఖర్చుపెట్టింది. అయినా ఉపయోగం లేకపోయింది. చికిత్స సమయంలో అంతా ఆశలు వదిలేసుకున్నా... తను మాత్రం చాలా ధైర్యంగా ఉంది. కానీ ఇప్పుడు పూర్తిగా కుంగిపోయింది. తనకు రెండేళ్ల పాప కూడా ఉంది. పాప బాధ్యత కూడా మరచి డిప్రెషన్‌లోకి వెళ్లిపోతోంది. తనని ఇలా చూడలేకపోతున్నా. దీన్నుంచి బయటపడాలంటే తనకెలాంటి సహాయం అందించాలి? - ఓ సోదరి

తన బాధని తగ్గించేదెలా..!

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి, మానసిక నిపుణురాలు

మీ స్నేహితురాలు తన భర్త ఆరోగ్యం కోసం, ఆయన్ని కాపాడుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నించింది. అయినా ఆయన బతక్కపోవడంతో నిరాశ, నిస్పృహలు ఆమెను ఆవరించినట్లు తెలుస్తోంది. పైగా, ఆర్థికంగానూ చితికిపోయింది. అయినవాళ్లు దూరమైనప్పుడు ఇలా బాధలో కూరుకుపోవడం సహజమే. కొందరు పరిస్థితుల్ని అర్థం చేసుకుని ప్రస్తుతంలోకి రాగలుగుతారు. కొందరు అదే ఆలోచనలతో కుంగిపోతారు. భవిష్యత్తు, ఆర్థిక భద్రత వంటి అంశాలు ఈ దశలో మహిళల్ని వేదనకు గురిచేస్తాయి. మీరు చెబుతున్న దాన్నిబట్టి చూస్తే మీ స్నేహితురాలికి డిప్రెషన్ లక్షణాలు ఎక్కువవుతున్నట్టు అనిపిస్తోంది. ఆమెను తక్షణమే సైకియాట్రిస్టు దగ్గరకు తీసుకువెళ్లండి. తన పరిస్థితి అంచనా వేసి మందులు సిఫార్సు చేస్తారు. వాటిని వాడితే స్థితిలో కొంత మెరుగుదల వచ్చాక కౌన్సెలింగ్‌కు పంపిస్తారు. అక్కడ ఆమెకు బిడ్డ పట్ల ఉన్న కర్తవ్యాన్ని తెలుపుతూ కౌన్సెలింగ్ ఇస్తారు. అలానే మీరు, మీలాంటి స్నేహితులు కలిసి ఆమె అర్హతలకు తగిన ఉద్యోగాన్ని చూపించడానికి ప్రయత్నించండి. దీనివల్ల ఆమెకు ఆర్థిక రక్షణ ఏర్పడుతుంది. ఆమె తరఫున బంధువులు, అమ్మానాన్నలను పాప బాధ్యతలను కొన్నాళ్లు తీసుకునేలా ప్రోత్సహించండి. దీనివల్ల మీ స్నేహితురాలికి కోలుకునే సమయం దొరుకుతుంది. ఆర్థికంగా, సామాజికంగా మద్దతు లభిస్తే సమస్య నుంచి బయటపడుతుంది.

'పాలమ్మ... పాలు. ఎవరి కెన్ని లీటర్లు కావాలి?' అని ఉజ్వలా వాడేకర్ అరవడం తడవు... పిల్లలంతా చుట్టూ చేరి 'నాకు ఈ గిన్నె నిండా కావాలి' 'నాకు కొన్ని పోయండి' అంటూ అడుగుతుంటారు. అలాగని ఉజ్వల పాలమ్మే వ్యక్తి అనుకునేరు! కానేకాదు. మరెవరంటే...



మహారాష్ట్ర, జలగావ్ జిల్లాలోని పాత్రి గ్రామంలో ఉపాధ్యాయురాలు ఉజ్వల. 31 ఏళ్లుగా రాష్ట్రంలోని పలు గ్రామాల్లో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూ కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకి ఏ మాత్రం తీసిపోరని నిరూపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారీమె. ఇలా పాలు అమ్మడం కూడా అందులో భాగమే. 'పిల్లలకి పుస్తకాలతో కన్నా పట్టి నేర్చుకున్న పాఠాల కన్నా... క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్‌గా తెలుసుకున్న విషయాలే ఎక్కువకాలం గుర్తుంటాయి' అనే ఉజ్వల తరగతిలో చెప్పే పాఠాలతోపాటు వారానికోసారి క్షేత్రస్థాయి అనుభవాల్నీ పరిచయం చేస్తుంటారు. ఇందుకోసం ఒకసారి పాలమ్మే వ్యక్తిగా మారితే... ఇంకోసారి పూలు, కూరగాయలు అమ్ముతూ పిల్లల్ని వినియోగదార్లని చేస్తారు. ఈ క్రమంలో గణితం, బేరసారాలు, కొలతలు దేన్ని ఎలా, ఎందుకు పిలుస్తారన్నది నేర్పుతుంటారు. పిల్లలూ ఆడుతూ పాడుతూ అన్నీ తెలుసుకుంటారు.

పాలమ్మినా పూలమ్మినా... పాఠం కోసమే!

సొంత డబ్బులతో...

తన జీతంలో సగానికిపైగా క్షేత్రస్థాయి పర్యటనలు, వర్క్‌షాపులు, పిల్లలకు కావాల్సిన స్టేషనరీ... వంటివి కొనివ్వడానికి వెచ్చిస్తున్నారు ఉజ్వల. 'పిల్లలకి మంచి విద్యని అందించాలని తల్లిదండ్రులు చేయని ప్రయత్నాలు ఉండవు. ఏరి కోరి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ ఉండే పాఠశాలలను ఎంపిక చేసుకుని మరీ చేరుస్తుంటారు. కానీ మా గ్రామాల్లో పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడమూ గగనమే. విద్యకు రూ.100 కూడా కేటాయించలేని స్థితిలో ఉంటారు ఈ పిల్లల అమ్మానాన్నలు. అలాంటి వాళ్లని తీర్చిదిద్ది ఉన్నత చదువులవైపు ప్రోత్సహించాలనేదే నా లక్ష్యం' అంటారు ఉజ్వల. ఈ స్కూల్లో పిల్లలు హిందీ, ఇంగ్లిష్ మాట్లాడటంతోపాటు సైగల భాషని కూడా అలవోకగా అర్థంచేసుకోగలరు. అంతేనా, పెద్ద అంకెల గుణకారాల్నీ సులువుగా చేసేస్తారు. రెండు రూపాయల చాక్లెట్ తయారీ నుంచి అంతరిక్ష వ్యవహారాల దాకా ఏం అడిగినా గుక్క తిప్పుకోకుండా చెబుతారు.

ప్రతి వృత్తినీ గౌరవించాలని...

'పిల్లలకి నైపుణ్యాలతోపాటు తల్లిదండ్రుల కష్టం కూడా తెలియాలి. అప్పుడే అమ్మానాన్నల పట్ల గౌరవం ఏర్పడుతుంది. సంబంధిత వృత్తి పట్ల అవగాహనా వస్తుంది' అనే ఉజ్వల నెలకోసారి పిల్లల అమ్మానాన్నలు పనిచేస్తోన్న కర్మాగారాల సందర్శనకు తీసుకెళుతుంటారు. అలా ఒకసారి చాక్లెట్ తయారీ గురించి తెలుసుకుంటే... మరోసారి చెప్పులు కుట్టడం ఎలానో నేర్చుకుంటున్నారు పిల్లలు. వీటన్నింటి ఫలితమే ఏటా ఇక్కడి పిల్లలంతా నవోదయా పరీక్షలు రాసి, ఎంపికవుతున్నారు. ఈమె అవలంబిస్తున్న విధానాల్ని స్థానిక స్కూళ్లలోనూ అమలయ్యేలానూ చూస్తున్నారు అధికారులు. ఈ కృషికి గుర్తింపుగా ఉజ్వల అందుకున్న అవార్డులు, బహుమతులెన్నో. వాటి ద్వారా వచ్చే మొత్తాన్నీ పిల్లల విద్యకే ఖర్చుచేస్తున్న ఈమె ప్రయాణం స్ఫూర్తిదాయకం కదూ!

నచ్చినవి నేర్చేసుకోండి..

ఈ రోజుల్లో చాలామంది మహిళలకు సామాజిక మాధ్యమాలే కాలక్షేపం. వంట, ఇంటి పనులు పూర్తయ్యాక విశ్రాంతి పేరుతో గంటలు గంటలు దీంతోనే గడిపేస్తున్నారు. అయితే, ఇలా చేయడంవల్ల ఉపశమనం మాట అటుంచి ఆందోళన, పీర్ ప్రెజర్ పెరిగిపోతాయి అంటున్నాయి పలు అధ్యయనాలు. అయితే వాటిని సరైన పద్ధతిలో వాడుకోగలిగితే బోలెడన్ని ప్రయోజనాలట. అందుకే, వాటిని వినోదం కోసమే చూస్తూ సమయం వృథా చేయకుండా... అభిరుచికి సానపెట్టుకోవడానికి ఉపయోగించండి. మీకు మొక్కలు పెంచడం ఇష్టమైతే గార్డెనింగ్ గ్రూపులు, ఖాతాలను అనుసరిస్తూ మెలకువలు తెలుసుకోండి. విత్తనాలను ఇచ్చిపుచ్చుకోండి. చిన్నప్పుడు ఎప్పుడో మీరు నేర్చుకుంటాను అనుకున్న పెయింటింగ్ కోసం ఇప్పుడు సమయాన్ని కేటాయించుకోండి. మీకు క్రాఫ్ట్స్ చేయడం ఇష్టమైతే... ఎక్కడికో వెళ్లి సాధన చేయక్కర్లేదు. యూట్యూబ్, పింట్రెస్ట్ వంటివాటిని తెరిచి మొదలుపెట్టండి. ఇంటిని అలంకరించుకోవడం, స్టిచింగ్... వంటివన్నీ ఇలానే చేయొచ్చు. ఇవేవీ కాదంటారా? అయితే ఓ కొత్త భాషను నేర్చుకోండి. ఈ పనులన్నీ మీకు ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వడమే కాదు... నెట్‌వర్కింగ్‌నీ అందిస్తాయి.



పెరుగు పులవకుండా...



చివరి ముద్ద పెరుగుతో తిననిదే భోజనం చేసినట్లు ఉండదు చాలామందికి. ఇది మహిళలకు ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా వెజైనల్ ఇన్ఫెక్షన్లు, ఎముకల బలహీనత, హార్మోన్ల అసమతుల్యత వంటివాటిని అడ్డుకుంటుంది. అయితే, ఇది పుల్లగా అయితే, చాలామంది తినలేరు. అసలే రానున్నది వేసవికాలం. ఇట్టే పులుస్తుంది. అలాకాకుండా కమ్మగా, రుచిగా ఉండాలంటే...

- పాలను బాగా మరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడే తోడు వేయాలి. అది కూడా పుల్లగా లేకుండా చూసుకోవాలి. తోడు కాస్త తక్కువ వేయండి. వేసవికాలంలో చల్లగా ఉండే ప్రదేశంలో, వర్షాకాలం, చలికాలంలో వెచ్చగా ఉన్న చోట దీన్ని ఉంచాలి.
- అల్యూమినియం, ఇనుప పాత్రల్లో పెరుగు తోడు పెట్టొద్దు. ఇవి పుల్లదనాన్ని పెంచుతాయి. మట్టికుండ, ఎయిర్‌టైట్ గాజు, సెరామిక్ పాత్రల్లో తోడు పెట్టొచ్చు. మట్టికుండ చల్లగా ఉండటంతో పెరుగు త్వరగా తయారవుతుంది.
- సాధారణంగా ఉదయం, రాత్రిపూట పెరుగు తోడు పెడుతుంటాం. రాత్రిపూట కాకుండా సాయంత్రం ఆరు గంటల వేళ తోడు పెడితే అది అయిదారు గంటల్లో తోడుకుంటుంది. ఆ పెరుగును ఫ్రిజ్‌లో పెడితే మరుసటి రోజుకి తియ్యగా మారుతుంది.
- పెరుగును ఎల్లప్పుడూ ఫ్రిజ్‌లోనే భద్రపరచాలి. అరలో వెనక్కి పెడితే దానికి కావాల్సినంత చల్లదనం అందుతుంది. మరో సంగతి ఏమిటంటే... పెరుగు గిన్నెపై మూత తప్పనిసరి. మూత లేకపోతే మిగిలిన పదార్థాల వాసనలు పెరుగులో కలిసిపోయి అది పులిసిపోతుంది.
- తోడు పెట్టేటప్పుడు అందులో ఓ తమలపాకో, ఎండుమిర్చో వేస్తే పులుపు రాదు.

అదిరింది హిప్పో..!

ఒకప్పుడు కూర్చోవడానికి సోఫాలుంటే చాలనుకునేవాళ్లు. కానీ ఇప్పుడు ఇల్లో, ఫ్లాటో కొనుక్కోగానే హాల్లో ఎలాంటి ఫర్నిచర్ పెట్టుకుంటే బాగుంటుంది. బెడ్‌రూమ్‌లో కూర్చునేందుకు ఎలాంటివి తెచ్చుకుంటే బాగుంటుందంటూ ఆలోచిస్తున్నారు. అతిథులొస్తే ఆకర్షించేలా కనిపించాలంటూ ఫర్నిచర్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. కొత్త కొత్త డిజైన్ల కోసం సోషల్ మీడియాలోనూ వెతుకుతున్నారు. అలా వైరల్ అయినవే ఈ హిప్పో సోఫాలు. నిజానికి వీటి పేరు 'మోడ్రన్ స్కల్ప్ బెంచెస్' కానీ వీటి కింద ఉండే బేస్ గోళాకారంగా సీటింగ్ ఏరియా హిప్పో మోడల్‌ని పోలి ఉండటంతో వీటిని హిప్పో సోఫాలుగా పిలుస్తున్నారు. ఎత్తు తక్కువగా ఉండి, చిన్న స్థలంలోనూ చక్కగా ఇమిడిపోయేలా మోడ్రన్ లుక్‌తో డిజైన్ చేస్తున్నారు వీటిని. కంఫర్ట్, ఎక్కువ కాలం మన్నికగా ఉండేందుకు ఫ్యాబ్రిక్ లేదా మైక్రో ఫ్యాబ్రిక్‌తో తయారుచేస్తున్నారు. దాంతో లివింగ్ రూమ్, హాల్, బెడ్‌రూమ్‌లో ఈ తరహా ఫర్నిచర్‌కే ఓటేస్తున్నారంతా. మీకూ నచ్చాయా? అయితే ఓసారి చూసేయండి.



మెడపట్టి గెంటేయండి...



మనపైన దాడిచేసేవాళ్లు ప్రతిఘటనను ఊహించరు. ఆ సమయంలో మనం చేసే ఎదురుదాడి వాళ్లను అయోమయానికి గురిచేస్తుంది. కాబట్టి దాడిచేసినప్పుడు భయపడిపోకుండా ఎదురు దాడికి సిద్ధమవ్వండి. దాడికి పాల్పడే వ్యక్తిని ఒక చేత్తో నిలిపి ఇంకో చేతిని మెడవైపు వేగంగా పోనివ్వాలి. బొటనవేలు ఒక్కటి వేరుగా, మిగతా నాలుగు వేళ్లు కలిపి ఉంచి మెడ పట్టుకోవాలి. కొద్ది క్షణాలు అలా పట్టుకుని వెనక్కి తోసి అక్కణ్నుంచి తప్పించుకోవాలి. ప్రాక్టీసుతో దీన్ని సులభంగా అవలంబించవచ్చు. అదే సమయంలో శారీరకంగా దృఢంగా ఉండటానికి మంచి ఆహారం తీసుకోవడంతోపాటు, వ్యాయామాలూ చేయాలి.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

మీకు తెలుసా!

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అధ్యయనాల ప్రకారం... నెలసరి రక్తస్రావంలో రోగనిరోధక కణాలు, సాధారణ రక్తంలో కనిపించని ప్రొటీన్లు అధికంగా ఉంటాయట. అలానే యాంటీ బాక్టీరియల్ లక్షణాలూ ఎక్కువేనట. ఇవన్నీ యోని పీహెచ్ స్థాయుల సక్రమ నిర్వహణకూ, పునరుత్పత్తి వ్యవస్థ ఆరోగ్యానికీ సహకరిస్తాయట.

ఇల్లు దులుపుతాం, గిన్నెలు కడుగుతాం... దుప్పట్లు మారుస్తాం, దుస్తులు ఉతుకుతాం. కానీ, కొన్ని పనులు చిన్నవిగా అనిపించి నిర్లక్ష్యం చేస్తాం. కానీ, అవి సూక్ష్మక్రిములకు ఆవాసాలుగా మారతాయి. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా అనారోగ్యాలకు కారణం అవుతాయి. అవేంటంటారా?

సూక్ష్మక్రిముల ఆవాసాలివి...



వంటింట్లో సింక్ కడగడం, పొడిగా ఉంచడం వంటి పనులు తప్పక చేస్తాం. కానీ, సింక్ కింద శుభ్రం చేయడానికి బద్ధకిస్తుంటాం. లీకేజీల వల్ల ఆ ప్రాంతంలో ఎప్పుడూ ఫంగస్ ఉంటుంది. దీనికి దుమ్ము, ధూళీ తోడై మరింత ప్రమాదకరంగా మారొచ్చు. అందుకే దీన్ని ఎప్పటికప్పుడు తడిలేకుండా తుడవాలి. రెండు రోజులకోసారి బేకింగ్ సోడా లేదా బ్లీచింగ్ వంటివి చల్లడం మరిచిపోవద్దు. లేదంటే చెదలూ, బొద్దింకలు వంటివి చుట్టూ చేరతాయి.

- టూత్ బ్రషలను నెలలు కాదు... ఏళ్ల తరబడి వాడేస్తారు చాలామంది. దాన్ని ఎలా వాడాలో తెలుసుకోరు. వాడే ముందు తప్పనిసరిగా కడగాలి. వాడాక గాలికి ఆరనివ్వడమో, ఎండలో ఉంచడమో చేయాలి. రెండు రోజులకోసారి రెండు సెకన్లయినా వంటసోడా వేసిన వేణ్నీళ్లలో ముంచి తీయాలి. అప్పుడే సూక్ష్మక్రిములు నోట్లోకి చేరకుండా ఉంటాయి. బ్రషలను స్నానాల గదిలో ఎట్టిపరిస్థితిలోనూ ఉంచొద్దు.
- సోఫాలో కూర్చున్నంత సేపూ మన వేళ్లు రిమోట్ మీదే ఉంటాయి. అలానే మొబైల్ కూడా ఎప్పుడూ చేతిలోనే ఉంటుంది. వీటిపై అత్యధిక స్థాయిలో ప్రమాదకర బ్యాక్టీరియా స్థానం ఏర్పరచుకుంటుందని ఇప్పటికే అనేక అధ్యయనాలు వెల్లడించాయి. మరి వీటిని శుభ్రం చేయడంపై ఏ మాత్రం దృష్టిపెడుతున్నారు? ఆ మాటే గుర్తుండదు. కానీ, చేయాలి. వినెగర్, వంటసోడా, నీళ్ల కలిపిన మిశ్రమంలో ముంచిన దూదితో రోజుకోసారైనా తప్పక తుడవండి. ఈ రెండింటితోపాటు కీబోర్డు, మౌస్‌పైనా దృష్టిపెట్టండి. వారానికోసారి బోర్డుకి బ్లోయర్ కొట్టించాలి. కళ్లద్దాలు శుభ్రం చేసుకునే ద్రావణంతో తుడుస్తుండాలి.

చిన్న మార్పుతో ఎంతో మేలు!

మీ డెస్క్, మీరు కూర్చునే చోటు, అక్కడి వెలుగు తదితరాలు కూడా మీలో ఒత్తిడికి కారణం అవుతాయని తెలుసా? 'మనం ఏమైనా రోజంతా అక్కడే ఉండిపోతామా? పనిచేసుకుని వెళ్లిపోవాల్సిందే కదా'! అని ఆ చోటును తేలిగ్గా తీసుకోకండి. చుట్టూ ఉన్న వాతావరణం బాగుంటేనే మానసిక, శారీరక ఆరోగ్యాలు భద్రంగా ఉండేది. అందుకు ఏం చేయాలంటే..

- జీవనశైలిలో ఒత్తిడీ, ఆందోళనా ఎక్కువవుతున్నాయి. వాటి ప్రభావం పని మీదా పడుతుందన్న ఆలోచన ఏ మాత్రం వచ్చినా.. . వెంటనే ఆఫీస్‌లో మీ స్థలాన్ని మార్చుకోండి. కిటికీలకు దగ్గరగా డెస్క్ ఉండేలా చూసుకోండి. ఎందుకంటే ఆందోళన ఎక్కువైనప్పుడు ఇరుకైన భావన వెంటాడుతుంటుంది. ఇలాంటప్పుడు కూర్చునే చోటు మారడంవల్ల మనసూ, మెదడూ కాస్త ప్రశాంతంగా ఉంటాయి.



- ఒక మంచి ఇండోర్ మొక్కని తెచ్చుకుని డెస్క్‌ని అలంకరించండి. ఇది సానుకూల వాతావరణానికే కాదు, గాలి స్వచ్ఛతకూ మేలు చేస్తుంది. మీకు నచ్చిన మినియేచర్లతో డెస్క్‌ను అలంకరించండి. ఒత్తిడి ఎక్కువైనప్పుడల్లా వాటిని చూస్తే ఉపశమనం కలుగుతుంది.
- నచ్చిన, స్ఫూర్తి పొందిన వాళ్ల ఫొటోలకు డెస్క్, స్క్రీన్ మీద చోటివ్వండి. నిరాశ, నిస్పృహ వ్యాపించినప్పుడు వీళ్లు మీకు ప్రేరణగా నిలుస్తారు.
- మంచి కోట్, మీకు వచ్చిన ప్రశంస, మీరు విజయం సాధించిన ప్రాజెక్టు వివరాలు వంటి వాటికీ డెస్క్‌పై చోటిస్తే.. అలసట, నిరాశ పక్కకు వెళ్లి, సానుకూల వాతావరణం ఇట్టే దరి చేరుతుంది.

(c) eenadu




వక్క మట్టితో చేసిన సబ్బుల పెట్టెలు, చెక్క సబ్బు పెట్టెలు, క్లిప్పులు

పర్యావరణహితమైన ప్రదర్శన!



వెదురుతో తయారు చేసిన డైరీ

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఏర్పాటుచేసిన 'ఎన్టీఆర్ ఆర్గానిక్ రైతోత్సవం నేచురల్ ఫార్మింగ్ మేళా-2026'లో పర్యావరణహితమైన ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పూర్తిగా వెదురుతో చేసిన డైరీ, వక్క మట్టలతో చేసిన సబ్బు పెట్టెలు, ఎన్నో రకాల కలప ఉత్పత్తులు ఇందులో ఉన్నాయి. - ఈనాడు, అమరావతి



గోవా సీఎం ప్రమోద్ సావంత్‌ను సత్కరించి వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, బృంద సభ్యులు

గోవా పర్యాటక విధానం ఆదర్శం

- సీఎం ప్రమోద్ సావంత్‌ను కలిసిన బాపట్ల కలెక్టర్ బృందం

బాపట్ల, న్యూస్‌టుడే: గోవాలో అమలుచేస్తున్న పర్యాటక విధానాలు బాగున్నాయని బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్లను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా పర్యాటకరంగ అభివృద్ధిపై అధ్యయనం చేయడానికి నాలుగు రోజుల గోవా పర్యటనకు వెళ్లిన కలెక్టర్ బృందం శనివారం రాత్రి ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ మేరకు సీఎంను కలెక్టర్ సత్కరించి వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందించారు. ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ.. సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిలో సీఆర్‌జడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వాటికి లోబడి నిర్మాణాలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, భవిష్యత్తులో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ఈ-పాలన విధానంపై ప్రశంసలు కురిపించారు. సాంకేతికత ఆధారంగా అందిస్తున్న డిజిటల్ సేవలను పరిశీలించడానికి గోవా అధికారుల బృందం త్వరలోనే ఏపీలో పర్యటిస్తుందని వెల్లడించారు. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దారు గోపీకృష్ణ, ఎంపీడీవో రాజేష్‌బాబు, జిల్లా పర్యాటక అధికారి అలీ అస్గర్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి చౌహాన్‌ను కలిసిన అచ్చెన్నాయుడు

- వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమంపై చర్చలు
- సూక్ష్మ సేద్యానికి నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి



కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తిరుమలలో కలిసి పలు కీలకాంశాలపై చర్చించారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమ కార్యక్రమాల, కేంద్ర పథకాల అమలు తీరును వివరించారు. రైతుల ఆదాయవృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సాగు ఖర్చుల తగ్గింపు దిశగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతోందని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరువురు ఆకాంక్షించారు. రాష్ట్రంలో అమలవుతున్న సూక్ష్మ సేద్యం పథకానికి కేంద్ర వాటా నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేసిన పథకాల కింద కేంద్ర వాటాగా రూ.695 కోట్లు రావాల్సి ఉండగా, రూ.50 కోట్లే విడుదలయ్యాయని.. మిగిలినవి వెంటనే వచ్చేలా చూడాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌కేవీవై-పీడీఎంసీ పథకానికి కనీసం మరో రూ.400 కోట్లు కేంద్ర వాటాగా విడుదల చేయాలని కోరారు. వాటిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. కేంద్రమంత్రి వెంట తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ఉన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
తితిదే రవాణా విభాగం
ఈ-టెండరు ప్రకటన
Proc.Roc.No.TA2/45021(108)/88/2025
NIT No.05/GM(T)/TTD/2026 టెండరు ఐడి నెం:903987
తితిదే వాహనాల నిర్వహణ కొరకు ఎక్సైడ్, అమరన్ మరియు ఎస్ఎఫ్ సోనిక్ తయారీ మరియు తత్సమాన ఆవశ్యకతలు కలిగిన ఇతర పేరొందిన తయారీ బ్యాటరీల సరఫరా నిమిత్తం తయారీదారులు/అధీకృత డిస్ట్రిబ్యూటర్లు/ అధీకృత డీలర్ల నుండి ఈ-టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు డాక్యుమెంట్లను https://tender.apeprocurement.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాల కొరకు కార్యాలయపు పనిదినములలో ఫోన్ నెం.0877-2264346, 4356 పై సంప్రదించగలరు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 28-02-2026, ఉ.11-00 గంIIలు నుంచి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేదీ: 11-03-2026, మ.1-00 గంIIల వరకు. బిడ్ స్వీకరణకు ఆఖరు తేదీ మరియు సమయం: 11-03-2026, మ.3-00 గంIIల వరకు.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.409), Dt: 21.02.2026. కార్యనిర్వహణాధికారి

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
(A Government of Andhra Pradesh Undertaking & An ISO 27001-2022 Certified Company)
NOTICE INVITING TENDER
The APTRANSCO invites bids online for the following work with **Spec. No: PMMTC2-e-10/2026. Name of the Work:** Supply, Erection / Stringing and Commissioning of OPGW cable and associated equipment under PSD funding for providing reliable communication system upto 132 kV substations in Six Lots. Date & Time of availability of Tender on e-procurement platform i.e., **www.tender.apeprocurement.gov.in** on **23.02.2026 @17:00 Hrs. Contact No. Dy.EE: 8332949383.**
Sd/- CHIEF ENGINEER / TELECOM & IT
R.O. No.: GMCC/APTRANSCO/53/26

OFFICE OF THE SUPERINTENDENT
S.V.R.R. GOVERNMENT GENERAL HOSPITAL, TIRUPATI
Rc.No.65415/S1/SVRRGGH/2026 Dated: 23-02-2026
TENDER NOTIFICATION
Sealed Tenders are invited from the Medical Agencies for Supply of Surgicals, Consumables, disposables, Pediatric Equipment's, Reagents, Laboratory instruments, Implants for Orthopedics, Plastic Surgery and Neuro Surgery Departments and other items for use in SVRR G G Hospital, Tirupati for a period of (2) two years.
The Tender Forms along with terms and conditions can be obtained from the O/o the Superintendent, SVRR Govt. General Hospital, Tirupati on payment of Rs.3,000/- (Rupees Three thousands only) to each category tender form by way of demand draft (non-refundable) taken in any nationalized bank payable at Tirupati in favour of Hospital Development Society, S.V.R.R. Govt. General Hospital, TIRUPATI during the working days from 10.30 AM to 5 PM.
1. Date of Issue of Tender Forms - 25.02.2026
2. Last Date of Sale of Tender Forms - 04.03.2026, 12 P.M.
3. Last Date for submission of Tenders - 04.03.2026 upto 5.00 P.M.
4. Opening of Tenders - 05.03.2026 at 4.00 P.M.
SD/- DR.J. RADHA, SUPERINTENDENT, SVRR GOVT. GENERAL HOSPITAL, TIRUPATI.
SD/- RONANKI GOVINDA RAO, I.A.S. JOINT COLLECTOR/ADDL. DISTRICT MAGISTRATE & CHAIRMAN, DISTRICT PURCHASE COMMITTEE, TIRUPATI.

22ఎ భూముల సమస్య పరిష్కారానికి త్వరలో మాసోత్సవాలు!

- ఆటో ఐడెంటిఫికేషన్ ద్వారా గుర్తింపు.. 15 రోజుల్లో తొలగింపు
- తొలగించకపోతే.. కారణాలేంటో ఆధారాలతో నమోదు చేయాలి

ఈనాడు, అమరావతి: రెవెన్యూ శాఖకు అందే ఫిర్యాదుల్లో 22ఎ భూముల సమస్య ఒకటి.. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీసీఎల్ఏ స్థాయిలోనే ఆటో ఐడెంటిఫికేషన్ ద్వారా వాటిని గుర్తించి కలెక్టర్లకు పంపి చర్యలు తీసుకునేలా.. కేంద్రీకృత విధానం అమలు చేయనుంది. రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రత్యేకంగా ఇదే సమస్య పరిష్కారం కోసం మోహరించనుంది. నెల రోజులపాటు మాసోత్సవాలు నిర్వహించనుంది. ఈనాం భూములతో పాటు వివిధ రకాల 22ఎ భూముల సమస్యకు పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం లక్ష్యం. త్వరలో విధి విధానాలు విడుదల కానున్నాయి. సోమవారం జరిగే మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

వైకాపా హయాంలో అడ్డగోలుగా: రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో 22ఎ ఒకటి. వైకాపా పాలనలో ఆ పార్టీ నేతల భూకబ్జాలకు అంతే లేదు. ఎదురు తిరిగిన రైతులు, భూయజమానుల్ని వేధించేందుకు వారి భూముల్ని నిషేధిత జాబితాలో పెట్టించారు. ప్రతిపక్ష నాయకుల భూముల్ని కూడా కావాలనే ఇందులో చేర్పించారు. రీసర్వే సమయంలో పట్టా భూముల్ని కూడా 22ఎలో పెట్టేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఈ సమస్య ఇన్నాళ్లుగా కొలిక్కి రాలేదు.

5 రకాల భూముల పరిష్కారానికి ఆదేశాలిచ్చినా

22ఎ కింద వివిధ రకాల భూములు ఉన్నాయి. ఇందులో ఐదు రకాల భూముల్ని 22ఎ జాబితా నుంచి తొలగించేందుకు జనవరి 1న ప్రభుత్వం మార్గదర్శకాలు జారీచేసింది. స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితులకు ఇచ్చినవి, మాజీ సైనికోద్యోగులు, ప్రస్తుత సైనికోద్యోగులకు ఇచ్చినవి, 1954 జూన్ 18కి ముందు ఎసైన్ చేసినవి, ప్రైవేటు పట్టాదారులకు చెందినవి, ఒకే సర్వే నంబరులో ప్రభుత్వ/దేవాదాయ, ప్రైవేటు వ్యక్తుల భూమి ఉంటే.. ప్రైవేటు వ్యక్తుల భూమికి విముక్తి కల్పించాలని ఆదేశాలిచ్చింది. కలెక్టర్ల నుంచి తాజా 22ఎ జాబితాలు అందాక అందుకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయనుంది.

వేధిస్తున్న ఈనాం భూముల సమస్య

వైకాపా హయాంలో రైత్వారీ పట్టాలు కలిగిన ఈనాం భూములనూ 22ఎ జాబితాలో పెట్టేశారు. వారికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నా, దశాబ్దాలుగా బ్యాంకుల్లో తనఖా పెట్టి పంటరుణాలు తీసుకుంటున్నా రీసర్వే సమయంలో వీటిని 22ఎ కిందకు చేర్చారు. ఆర్ఎస్ఆర్ ప్రకారం నమోదు చేయడమే దీనికి కారణం. వీటిని వెబ్‌ల్యాండ్ 1.0 ఆధారంగా నమోదు చేస్తే ఇబ్బందులు ఉండేవి కావు. అయినా అప్పట్లో రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ సర్వీస్ ఈనాం భూములే 1.37 లక్షల ఎకరాలు చిక్కుల్లో ఉన్నాయి.

ఆటో ఐడెంటిఫికేషన్ విధానంలో తొలగింపులు?

22ఎ భూముల జాబితా నుంచి తొలగించాలని భూయజమానుల నుంచి దరఖాస్తులు అందుతున్నా.. జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోల స్పందన కొరవడుతోంది. తొలగిస్తే ఏమవుతుందో అనే భయంతో వెనకాడుతున్నారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ప్రతి సమస్యకు పరిష్కారం ఎలా చూపాలో తెలియజేస్తూ మార్గదర్శకాలు జారీ చేస్తున్నా.. వాటిని అమలు చేయడం లేదు. దీంతో అర్హత కలిగిన వాటిని 22ఎ నుంచి తొలగించేందుకు ఆటో ఐడెంటిఫికేషన్ విధానం అమలు చేయాలని రెవెన్యూశాఖ యోచిస్తోంది.

- పట్టా, ఈనామ్ భూమిని పొరపాటున 22ఎ జాబితాలో ఉంటే.. అలాంటి వాటిని ఆటో ఐడెంటిఫికేషన్ ద్వారా సిస్టమ్ గుర్తిస్తుంది. వాటన్నిటిని నేరుగా కలెక్టర్ లాగిన్‌కు పంపిస్తారు. 15 రోజుల్లోగా వాటిని తొలగించాలి. ఒకవేళ 22ఎ లోనే ఉంచాలనుకుంటే తగిన కారణాన్ని (న్యాయస్థాన ఉత్తర్వులు, భూసేకరణ తదితర) తెలియజేస్తూ సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి. లేకుంటే వాటిని 22ఎ నుంచి తొలగిస్తారు. ఒకసారి 22ఎ నుంచి తొలగిస్తే.. మళ్లీ చేర్చడానికి వీలుండదు. సీసీఎల్ఏకు అప్పీలు చేయడం ద్వారా మాత్రమే మార్చడానికి సాధ్యం అవుతుంది.
- కలెక్టర్ 22ఎ నుంచి తొలగించిన వెంటనే.. వెబ్‌ల్యాండ్ 2.0, రిజిస్ట్రేషన్ శాఖల్లో దానంతట అదే అప్‌డేట్ అవుతుంది.
- దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించిన దరఖాస్తులు రెవెన్యూ అధికారుల వద్ద ఆగకుండా.. నేరుగా దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌కు వెళ్తాయి. వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో వీరికి ప్రత్యేక లాగిన్ సౌకర్యం కల్పిస్తారు. దీనిద్వారా వారు భూమి రికార్డుల్ని పరిశీలిస్తారు. క్షేత్రస్థాయి నివేదిక ఆధారంగా దేవాదాయ కమిషనర్, వక్ఫ్‌బోర్డు సీఈఓ నిర్ణయం తీసుకుంటారు. వారు ఆమోదించిన వెంటనే రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్‌కు చేరతాయి. ఆ శాఖలో ఆ భూమిపై ఉన్న నిషేధం తొలగుతుంది.
- పురపాలికల్లో విలీనమైన గ్రామాలకు సంబంధించి. . పట్టణ ఆస్తుల రిజిస్టర్ ప్రామాణికంగా తీసుకుంటారు. పొరపాటున 22ఎ కింద నమోదైన వాటిని కమిషనర్ సిఫార్సు మేరకు కలెక్టర్ ద్వారా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపి తొలగిస్తారు. గ్రామకంఠం భూములైతే.. స్వామిత్వ పథకంలో భాగంగా వ్యవసాయ భూముల్ని వేరు చేస్తారు. వాటికి వెబ్‌ల్యాండ్ 2.0లో ప్రత్యేక చైల్డ్ ఎల్‌పీఎంలుగా గుర్తిస్తారు.

22ఎలో వివిధ రకాల భూములు

- మాజీ సైనికులు, ప్రస్తుతం పనిచేస్తున్న వారు, స్వాతంత్ర్య సమరయోధులు
- 1954 కంటే ముందు జరిగిన ఎసైన్‌మెంట్స్
- షరతులున్న పట్టాలు
- చుక్కల భూములు
- సర్వీస్ ఈనాములు
- రాజకీయ ప్రేరేపితంగా మార్చిన భూములు
- కొందరు రైతుల ప్రైవేటు పట్టాభూములు
- కొంత విస్తీర్ణమే 22ఎ కింద ఉన్నా.. మొత్తం సర్వే నంబరు పెట్టేసినవి

ఇళ్లస్థలాలూ.. 22ఎ కిందే

గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల పట్టాలు ఇచ్చిన భూములు కూడా 22ఎ జాబితాలోనే ఉన్నాయి. వాటిని తొలగించడం లేదు. 10 ఏళ్లు దాటిన వాటిని ఫ్రీహోల్డ్ చేయొచ్చనే నిబంధనలున్నా అమలు కావడం లేదు. పదులకొద్దీ లేఅవుట్లు ఇలా 22ఎ జాబితాలోనే కొనసాగుతున్నాయి. దీంతో బ్యాంకు రుణాలు కూడా అందడం లేదు. ఇలాంటి సమస్యలు ఒక్కో మండలంలో 2,000కు పైగా ఉన్నాయి.

ప్రహసనంగా.. ఫ్రీహోల్డ్

ఫ్రీహోల్డ్ భూముల సమస్య కూడా కొలిక్కి రావడం లేదు. రాష్ట్రంలో 13.59 లక్షల ఎకరాల భూముల్ని అప్పట్లో ఫ్రీహోల్డ్ చేశారు. వాటిలో నిబంధనల ప్రకారం చేసినవి 7.85 లక్షల ఎకరాలే. 5.74 లక్షల ఎకరాలకు సంబంధించి అడ్డగోలుగా వ్యవహరించారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో సామాన్య రైతులే అధికంగా ఉన్నారు.

చంద్రబాబుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ

- రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాల ప్రారంభంపై చర్చ




సీఎం క్యాంపు కార్యాలయంలో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధులు ఇస్తున్న పీపీటీని వీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబుతో డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ ప్రతినిధులు ఉండవల్లి నివాసంలో ఆదివారం సమావేశమయ్యారు. ఏవియేషన్, డిఫెన్స్ తయారీ రంగాల్లో సంస్థ కార్యకలాపాలపై ఈ సందర్భంగా వారు ప్రజంటేషన్ ఇచ్చారు. రక్షణ రంగంలో సంస్థ అనుభవాల్ని వివరించారు. ఏపీ ప్రభుత్వ విధానాలు, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో రాష్ట్రంలో ఉన్న విస్తృత అవకాశాల్ని ఈ సందర్భంగా చంద్రబాబు వారికి వివరించారు. సమావేశంలో సంస్థ ఛైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉదయంత్ మల్హోత్రా, ఏరోస్పేస్ విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ హెడ్ పి.చలపతి, డైరెక్టర్ అహిత్యా మల్హోత్రా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆండ్రియా మిలానీ, సంస్థ యూరప్ వ్యాపార కార్యకలాపాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ క్రిస్టినా లిడేగార్డ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

చిట్టి గుండెకు.. గట్టి భరోసా!

- 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' లక్ష్యం అదే
- ఖర్చు భరించలేక ఎవరూ గుండె వైద్యానికి దూరం కాకూడదు
- తెలుగు రాష్ట్రాల్లో ఏటా 20 వేల మందికి పుట్టుకతోనే గుండెజబ్బులు
- సత్వర చికిత్సతోనే ప్రాణాలకు రక్ష



పిల్లల గుండె వైద్యనిపుణుడు డాక్టర్ నాగేశ్వరరావు కోనేటి



ఈనాడు, హైదరాబాద్: దేశంలో ప్రతి వెయ్యి మంది పిల్లల్లో 10 మందికి పుట్టుకతోనే గుండె జబ్బులొస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏడాదికి సుమారు 20 వేల మంది శిశువుల్లో ఈ సమస్యలు ఉంటున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. సరైన సమయంలో తగిన చికిత్స అందించకపోతే.. వీరిలో సుమారు 90 శాతం మంది చిన్నారులు తమ మొదటి పుట్టినరోజు కూడా జరుపుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని రెయిన్‌బో చిల్డ్రన్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో పిల్లల గుండె వైద్యనిపుణుడు డాక్టర్ నాగేశ్వరరావు కోనేటి తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా.. చాలామంది తమ పిల్లలకు చికిత్స అందించడంలేదని, ఆడపిల్లల విషయంలో మరింత అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితి నివారణకు నాలుగేళ్ల కిందట ఏర్పాటైన 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' ద్వారా 633 మంది పేద పిల్లలకు ఉచితంగా గుండె చికిత్సలు చేసినట్లు తెలిపారు. చికిత్సకు నయం కాని గుండెజబ్బులు కేవలం ఒక శాతమే ఉంటాయని, ఆయా తల్లిదండ్రులు నిరాశకు గురికావాల్సిన అవసరం లేదని ధైర్యం చెబుతున్నారు. పేదలు ఎవరైనా ఆర్థిక సమస్యల కారణంగా తమ చిన్నారులకు గుండె శస్త్రచికిత్సకు వెనకడుగువేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేస్తున్నారు. గుండెలో రంధ్రాలున్న చిన్నారులకు తగిన చికిత్స అందిస్తే.. వారు క్రీడలు, ఏ వృత్తిలోనైనా రాణించగలరని, పతకాలు సాధించగలరని భరోసా ఇస్తున్నారు.

పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు.. కారణాలు

బ్లాక్‌లు, గుండెలో రంధ్రాలు, బ్లూ బేబీస్ (శిశువు పెరుగుతున్న కొద్దీ ఈ జబ్బు బయటపడుతుంది) తదితర సమస్యలు శిశువుల్లో వస్తుంటాయి. గర్భం దాల్చే మహిళలు... ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లను ఎక్కువగా తినడం, తింటున్న ఆహారాల్లో ఫోలిక్ యాసిడ్, విటమిన్ డి, విటమిన్ బి 12 వంటివి తగ్గిపోవడం... తీవ్ర ఒత్తిడికి గురవడం, శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, మద్యపానం, మేనరికాలు, జన్యుపరమైన లోపాలు ఇందుకు ప్రధానంగా కారణమవుతున్నాయి.

ఆదుకుంటున్న సీఎస్ఆర్ నిధులు

జబ్బుతో బాధపడుతున్న శిశువును మా దగ్గరికి తీసుకొచ్చినప్పుడు.. వెంటనే చికిత్స అందించాలా? కొంతకాలం ఆగవచ్చా? అనేది వైద్యనిపుణులుగా మాకే అర్థమవుతుంది. ఒకసారి నిరుపేద దంపతులు గుండె సమస్య ఉన్న ఐదు రోజుల బేబీని తీసుకొచ్చారు. వారికి తెల్ల రేషన్‌కార్డు కూడా లేదు. కానీ బేబీకి వెంటనే చికిత్స చేయకపోతే చాలా ప్రమాదకరం. ఆ విషయం మాకు తెలుసు. ఉచిత చికిత్స కోసం తెల్ల రేషన్‌కార్డు తెచ్చుకోవాలని లేదంటే ప్రభుత్వం నుంచి ఎల్ఓసీ తీసుకురావాలని చెప్పి పంపించవచ్చు. ఇవన్నీ తీసుకొని రావడానికి కచ్చితంగా సమయం పడుతుంది. కానీ చికిత్సను ఆలస్యం చేయడానికి లేదు. దీంతో వైద్యులమే సొంతంగా మొదట్లో రూ.25-30 లక్షల మూలధనం కూడగట్టాం. ఈ నిధుల నుంచి అత్యవసరం అనుకున్న చిన్నారులకే చికిత్స అందించడం ప్రారంభించాం. మిగిలిన పిల్లలను వెనక్కి పంపించాల్సి రావడం ఎంతో బాధ కలిగించేది. ఉచిత సేవను విస్తరించడంలో భాగంగా 'కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)' నిధుల సేకరణపై దృష్టిపెట్టాం. తొలి మూలధనంగా రెయిన్‌బో హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల రూ.కోటి అందించారు. నటుడు మహేశ్‌బాబు, లారస్ ల్యాబ్స్, ఇతర సంస్థలు ఆర్థిక సాయం చేశాయి. అలా 2022 ఫిబ్రవరి 25న 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' ఆవిర్భవించింది. పుట్టుకతో గుండెజబ్బు సమస్య ఉన్న 18 ఏళ్ల లోపు వారికి ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చికిత్స అందిస్తున్నాం. ఆ చిన్నారి కుటుంబం పేదా? కాదా? అనేది డాక్టర్లే అంచనా వేస్తారు. ఫౌండేషన్ ప్రతినిధుల ప్రమేయం ఏమీ ఉండదు.

అమ్మాయికి జబ్బుంటే చికిత్సకు రావడం లేదు

ఈ ప్రక్రియలో కొన్ని షాకింగ్ అంశాలను గుర్తించాం. ఉచితంగా చికిత్స చేస్తామని చెప్పినా కొందరు తల్లిదండ్రులు వెళ్లిపోతున్నారు. గుండె జబ్బు ఉందని తెలియగానే.. చిన్నారి మళ్లీ నార్మల్ అవుతారా? లేదా? అనే సందేహాలు తల్లిదండ్రుల్లో ఏర్పడుతున్నాయి. కొందరికి రెండు సర్జరీలు అవసరమవుతాయని చెప్పినప్పుడు.. ఎక్కువమంది తల్లిదండ్రులు అసలు చికిత్సలు చేయించడం లేదు. మేం ఉచిత చికిత్స అందించిన 633 మందిలో 67 శాతం మంది అబ్బాయిలే ఉన్నారు. 33 శాతమే బాలికలున్నారు. చికిత్స పొందకుండా వెళ్లిన వారికి ఫోన్ చేసి అడిగితే.. 'అమ్మాయే కదా సర్.. జరిగిందేదో జరిగిపోయింది. ఇక మేము రాము' అని చెప్పిన వాళ్లున్నారని డాక్టర్ నాగేశ్వరరావు కోనేటి 'ఈనాడు'కు తెలిపారు.

90 శాతానికి పైగా ఆరోగ్యంగా..

ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకూ 633 మంది చిన్నారులకు ఉచితంగా చికిత్స అందించగా.. దాదాపు 90 శాతం మంది ప్రస్తుతం ఆరోగ్యంగా జీవిస్తున్నారని.. ఇందులో 37 శాతం అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలున్నాయని వివరించారు.

ఫౌండేషన్‌లో ఉచిత చికిత్స పొందిన వారు వయసుల వారీగా..

12 నెలల లోపు:	342 (54%)
1–2 సంవత్సరాలు:	120 (19%)
3–5 సంవత్సరాలు:	51 (8%)
6–10 సంవత్సరాలు:	44 (7%)
11 సంవత్సరాలు పైబడి:	76 (12%)

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సంఘీభావం తెలుపుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు తదితరులు

విజయవాడ (పటమట), న్యూస్‌టుడే: వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ప్లానింగ్ సెక్రటరీల పే స్కేల్, సర్వీస్‌రూల్స్, ఉద్యోగోన్నతులు తదితర సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషిచేస్తానని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ సెక్రటరీస్ టెక్నికల్ అసోసియేషన్ మొదటి రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా బొప్పరాజు వెంకటేశ్వర్లుతో పాటు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఉద్యోగుల సమస్యలను ఏపీ ప్లానింగ్ సెక్రటరీస్ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు యు.నవీన్ వివరించారు.

నెయ్యి నాణ్యత తేల్చే 'ఈ-టంగ్, ఈ-నోస్'

- త్వరలో ఫ్రాన్స్ నుంచి దిగుమతి
- తిరుమలలో సిద్ధమవుతున్న ఆహార ప్రయోగశాలలో ఏర్పాటు
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: తిరుమలకు సరఫరా అయ్యే నెయ్యిలో ఏ మాత్రం నాణ్యత తగ్గినా వెంటనే పసిగట్టేందుకు 'ఈ-టంగ్, ఈ-నోస్ యంత్రాలు' సమకూరుస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందుకు రూ.3.5 కోట్లతో ఫ్రాన్స్ నుంచి యంత్రాలను దిగుమతి చేసుకుంటున్నట్లు వెల్లడించారు. నెయ్యి నాణ్యతలో చిన్న లోపమున్నా ఇవి గుర్తిస్తాయని చెప్పారు. రూ.25 కోట్లతో తిరుమలలో నెలకొల్పుతున్న అత్యాధునిక ఆహార ప్రయోగశాలలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైకాపా హయాంలో తిరుమలకు పెద్ద ఎత్తున కల్తీ నెయ్యి సరఫరా జరిగిన నేపథ్యంలో.. అలాంటివాటికి ఆస్కారం లేకుండా చేసేందుకు ఆధునిక యంత్రాలు ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. ఇప్పటికే 90% పూర్తయిన అత్యాధునిక ఆహార ప్రయోగశాలలో వచ్చేనెల నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. 'ఈ-టంగ్, ఈ-నోస్' యంత్రాలు మే నెలకల్లా వస్తాయన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానాంశాలివి...

- శ్రీవారి ప్రసాదాల తయారీలో ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, బాదం, శనగలు, చక్కెర, యాలకులు, పసుపు, కారం లాంటి 60 రకాల ముడి సరకులు, ప్రసాదాల నాణ్యత ఈ ఆహార ప్రయోగశాలలో పరీక్షిస్తారు.
- ప్రయోగశాలలో మైక్రోబయోలజీ, కెమిస్ట్రీ తదితర విభాగాల్లో పరీక్షలు చేస్తారు. ప్రసాదాలు, ముడి సరకుల్లో పురుగుమందుల అవశేషాలు, భారలోహాలు, క్రిమికీటకాలు, యాంటీబయాటిక్స్ లాంటి అవశేషాలేమైనా ఉన్నాయా? అనేది ఇక్కడ గుర్తించొచ్చు. మొత్తం 200 రకాల అవశేషాలు గుర్తించే సామర్థ్యం కలిగిన యంత్రాలు ఈ ప్రయోగశాల ద్వారా అందుబాటులోకి రానున్నాయి.
- ల్యాబ్‌లో తితిదే జలప్రసాదాల నమూనాలనూ పరీక్షిస్తారు. వీటన్నింటి కోసం 50రకాల పరికరాలు/యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు. వైద్యారోగ్య శాఖ, తితిదే కలిపి 40 మంది ఉద్యోగులను అందుబాటులోకి తీసుకొస్తారు. దీనిపై త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటారు.
- తిరుమలలోని పిండిమిల్లు ఆవరణలో 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న రెండు అంతస్తుల భవనాన్ని ప్రయోగశాల ఏర్పాటుకు కేటాయించారు. గతేడాది జులైలో పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే అన్ని ఏర్పాట్లు పూర్తికానున్నాయి.

తిరుమల మాడవీధుల్లో చెప్పులతో తిరిగిన జగన్: బుచ్చి రాంప్రసాద్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమల మాడవీధుల్లో జగన్‌రెడ్డి చెప్పులు వేసుకుని తిరిగారని బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఆరోపించారు. ఇప్పుడు వైకాపా ఎమ్మెల్సీలు చెప్పులు ధరించి శ్రీవారి చిత్రపటాల్ని ప్రదర్శించి మరో అపచారం చేశారని దుయ్యబట్టారు. మరోవైపు వరుస ప్రెస్‌మీట్లతో ఒక ప్రణాళిక ప్రకారం తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తున్నారని ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.



లక్ష్యసాధనకు ఏం చేయాలో తెలుసు కానీ..

లక్ష్యాన్ని సాధించాలంటే ఏం చేయాలో అందరికీ తెలుసు. కానీ చాలా కొద్ది మంది మాత్రమే ఆ పని చేస్తారు. మిగతావారంతా తమకు సమయం లేదని, ఎవ్వరూ సాయం చేయడం లేదని, వచ్చే వారం నుంచి మొదలు పెడతామని.. ఇలా రకరకాల సాకులు చెబుతుంటారు. నిజానికి బద్ధకమే వారి అసలు సమస్య. దాన్ని వదిలించుకోకపోతే ఎప్పటికీ విజయం సాధించలేరు.

– లిల్లీ, కంటెంట్ క్రియేటర్

(c) eenadu

టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

చాంపియన్


అమెరికా మీద ఆపసోపాలు పడ్డారు.. పాకిస్థాన్‌పైనా తడబడి పుంజుకున్నారు.. నెదర్లాండ్స్ మ్యాచ్‌లోనూ ఇబ్బంది తప్పలేదు.. అయితేనేం ప్రతి మ్యాచూ గెలిచేశారని, గ్రూప్ దశలో అగ్రస్థానం సాధించారని సంబరపడ్డాం! సూపర్-8లో అసలు బలం బయటికి తీస్తారని.. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాకు న్యాయం చేస్తారని.. టైటిల్‌కు హాట్ ఫేవరెట్‌గా మారతారని ఆశలు పెట్టుకున్నాం! కానీ బలమైన జట్టు ఎదురయ్యేసరికి టీమ్‌ఇండియా డొల్లతనమంతా బయటపడిపోయింది. సూపర్-8లో సూపర్ ఆరంభానికి అవసరమైన బలమైన పునాది పడ్డా.. సద్వినియోగం చేసుకోలేకపోయిన సూర్యకుమార్ సేన.. అహ్మదాబాద్‌లో ఘోరపరాజయం చవిచూసింది. సఫారీల చేతిలో మరీ చిత్తుగా ఓడడం ద్వారా పీకల మీదికి తెచ్చుకుంది భారత్. ఇక మిగతా రెండు మ్యాచ్‌ల్లోనూ భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ చేరడానికి అవకాశముంటుంది.


మిల్లర్ 63

ధమాల్

- సూపర్-8 పోరులో చేతులెత్తేసిన భారత్
- దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగులతో ఓటమి
- తేలిపోయిన బ్యాటర్లు

● టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాకు పరుగుల పరంగా ఇదే (76) అతి పెద్ద ఓటమి. 2010లో ఆస్ట్రేలియాపై బ్రిడ్జ్‌టౌన్‌లో 49 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.


సూర్యకుమార్

అహ్మదాబాద్

టీ20 ప్రపంచకప్‌లో బలహీన జట్లపై గెలిచి సూపర్-8కు వచ్చేసిన భారత్.. దక్షిణాఫ్రికా రూపంలో బలమైన జట్టు ఎదురయ్యేసరికి తేలిపోయింది. ఆదివారం గ్రూప్-1లో జరిగిన తొలి సూపర్-8 మ్యాచ్‌లో భారత్ ఏకంగా 76 పరుగుల తేడాతో సఫారీ జట్టు చేతిలో చిత్తయింది. మొదట బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా (3/15), అర్ష్‌దీప్ సింగ్ (2/28) అద్భుత ఆరంభాన్నిచ్చినా భారత్ ఉపయోగించుకోలేకపోయింది. 20/3తో పీకల్లోతు కష్టాల్లో పడ్డ స్థితి నుంచి దక్షిణాఫ్రికా 187/7తో ఇన్నింగ్స్‌ను ముగించింది. డేవిడ్ మిల్లర్ (63; 35 బంతుల్లో 7×4, 3×6), డెవాల్డ్ బ్రెవిస్ (45; 29 బంతుల్లో 3×4, 3×6), ట్రిస్టన్ స్టబ్స్ (44 నాటౌట్; 24 బంతుల్లో 1×4, 3×6) చెలరేగిపోయారు. అనంతరం మార్కో యాన్సెన్ (4/22), కేశవ్ మహరాజ్ (3/24), కార్బిన్ బోష్ (2/12)ల ధాటికి టీమ్‌ఇండియా 18.5 ఓవర్లలో 111 పరుగులకే కుప్పకూలింది. శివమ్ దూబె (42; 37 బంతుల్లో 1×4, 3×6) ఒక్కడే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాడు. భారత్ గురువారం తన తర్వాతి మ్యాచ్‌లో జింబాబ్వేను ఢీకొంటుంది.

షాక్ మీద షాక్: రెండో ఇన్నింగ్స్‌లో పిచ్ నెమ్మదించడం, బ్యాటింగ్ కొంచెం కష్టంగా మారడం వాస్తవమే. దక్షిణాఫ్రికా బౌలింగ్, ఫీల్డింగ్ కూడా గొప్పగా సాగింది నిజమే. కానీ అంతర్జాతీయ భారత బ్యాటర్లు కూడా తమ వైఫల్యాన్ని ఒప్పుకుంటారేమో. బౌలర్లు పిచ్‌కు తగ్గట్లు తెలివిగా వేగం తగ్గించి బంతులేశారు. ఫీల్డింగ్ మోహరింపు కూడా వ్యూహాత్మకంగా ఉన్నా.. అదేమీ పట్టనట్లు గుడ్డిగా షాట్లు ఆడి వికెట్లు ఇచ్చేశారు. తొలి ఓవర్లో స్పిన్నర్‌కు వికెట్ ఇచ్చేయడం భారత్‌కు బలహీనతగా మారిన నేపథ్యంలో నేరుగా బౌలింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా కెప్టెన్ మార్‌క్రమ్ నాలుగో బంతికే ఫలితం రాబట్టాడు. ఇషాన్ కిషన్ (0).. స్లో డెలివరీని ముందుకొచ్చి భారీ షాట్ ఆడబోతే అది షార్ట్ కవర్స్‌లో గాల్లోకి లేచింది. రికెల్టన్ క్యాచ్ అందుకున్నాడు. నెమ్మదిగా ఆడుతున్నందుకు విమర్శలు ఎదుర్కొంటున్న తిలక్ (1).. యాన్సెన్ బౌలింగ్‌లో ముందుకొచ్చి షాట్ ఆడబోతే ఎడ్జ్ తీసుకుని వికెట్ కీపర్ చేతుల్లో పడింది. ఈ స్థితిలో అభిషేక్.. రబాడ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ కొట్టి స్కోరు బోర్డులో కొంచెం కదలిక తెచ్చాడు. కానీ పరుగుల వేగం తగ్గిపోవడం, షాట్లు గురి తప్పడంతో అతను అసహనానికి గురయ్యాడు. ఇదే అదనుగా యాన్సెన్ వేగం తగ్గించి బంతి వేయగా.. అభిషేక్ (15) గుడ్డిగా బంతిని గాల్లోకి లేపేశాడు. కెప్టెన్ సూర్యకుమార్ (18), సుందర్ (11) కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నా.. పరిస్థితేమీ మెరుగుపడలేదు. ఒక సిక్స్ కొట్టి ఆశలు రేకెత్తించిన సుందర్.. ఆ వెంటనే వికెట్ ఇచ్చేశాడు. చాలా సహనంతో ఉన్న సూర్యకుమార్ కూడా ఔటైపోవడంతో భారత్ 51/5తో ఘోర పరాభవం దిశగా అడుగులు వేసింది. ఈ స్థితిలో హార్దిక్ (18), దూబె నిలవడంతో భారత్ కొంచెం గౌరవప్రదంగా అయినా ఓడుతుందనిపించింది. 14 ఓవర్లకు స్కోరు 86/5.


కేశవ్ ఢీకొట్టినప్పటికీ అభిషేక్ క్యాచ్‌ను ఒడిసిపడుతున్న కార్బిన్ బోష్

కానీ కేశవ్ మహరాజ్.. తర్వాతి ఓవర్లో భారత్‌కు ట్రిపుల్ షాక్ ఇచ్చాడు. హార్దిక్, రింకు (0), అర్ష్‌దీప్ (1) ముగ్గురూ షాట్లకు ప్రయత్నించి కేశవ్‌కు వికెట్లు ఇచ్చేశారు. మూడు క్యాచ్‌లనూ బౌండరీ వద్ద స్టబ్సే అందుకోవడం విశేషం. 88/8కు చేరుకున్న భారత్.. వందైనా చేస్తుందా అనిపించింది. కానీ దూబె కొన్ని షాట్లు ఆడి మూడంకెల స్కోరు సాధించిపెట్టాడు. 19వ ఓవర్లో అతను ఔటయ్యాక ఇంకో రెండు బంతులకే ఇన్నింగ్స్ ముగిసిపోయింది.

ఏదో అనుకుంటే..: అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లో కేవలం నాలుగు పరుగులు. రెండో ఓవర్లో బుమ్రా.. ప్రమాదకర డికాక్ (6)ను ఔట్ చేసేశాడు. అర్ష్‌దీప్ తిరిగి బౌలింగ్‌కు వచ్చి ప్రత్యర్థి జట్టు కెప్టెన్ మార్‌క్రమ్ (4)ను పెవిలియన్‌కు పంపించేశాడు. తర్వాతి ఓవర్లో రికెల్టన్ (7) బుమ్రాకు రెండో వికెట్ అందించాడు. 4 ఓవర్లు అయ్యేసరికి దక్షిణాఫ్రికా స్కోరు 20/3. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నందుకు ఆ సమయంలో మార్‌క్రమ్ ఎంత చింతించి ఉంటాడో! కానీ బౌలింగ్‌ను ఇలా మొదలుపెట్టిన జట్టు.. తర్వాత అంత తడబడుతుందని, ఇలాంటి ఆరంభం తర్వాత ప్రత్యర్థి అంత భారీ స్కోరు చేస్తుందని ఎవ్వరూ ఊహించి ఉండరు. పేసర్లే ఇంతగా విజృంభిస్తే, బంతి బాగా తిరిగే మోదీ స్టేడియంలో స్పిన్నర్లు ఇంకెంత రెచ్చిపోతారో అనుకుంటే.. మిల్లర్, బ్రెవిస్, స్టబ్స్ త్రయం ఎదురుదాడికి కుదేలైపోయారు. బ్యాటర్లను ఆత్మరక్షణలోకి నెట్టి, ఉక్కిరిబిక్కిరి చేసే వరుణ్‌ను తొలి ఓవర్లో ధాటిగా ఆడడం ద్వారా భారత్ వ్యూహానికి చెక్ పెట్టాడు మిల్లర్. తొలి ఓవర్లో 11 పరుగులిచ్చుకున్న వరుణ్.. రెండో ఓవర్లో 17 పరుగులు సమర్పించుకున్నాడు. మిగతా బౌలర్లనూ ధాటిగా ఆడిన మిల్లర్, బ్రెవిస్ జోడీ.. చూస్తుండగానే మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. 11.1 ఓవర్లకే దక్షిణాఫ్రికా స్కోరు 100కు చేరుకుంది. అర్ధశతకం దిశగా సాగుతున్న బ్రెవిస్‌ను దూబె ఔట్ చేసినా.. అతడి స్థానంలో వచ్చిన స్టబ్స్ చెలరేగడంతో స్కోరు వేగం తగ్గలేదు. మిల్లర్ ఔటయ్యాక వరుసగా వికెట్లు పడుతున్నా స్టబ్స్ జోరు కొనసాగించడంతో దక్షిణాఫ్రికా భారీ స్కోరు సాధించింది.

"ఆరంభంలో మేం బౌలింగ్ బాగానే చేశాం. 7 నుంచి 15 ఓవర్ల మధ్య వాళ్లు గొప్పగా బ్యాటింగ్ చేశారు. ఆ తర్వాత మేం పుంజుకున్నాం. చక్కగా బౌలింగ్ చేశాం. కానీ బ్యాటింగే మెరుగ్గా చేయాల్సింది. పవర్‌ప్లేలో మ్యాచ్ గెలవలేమని, కానీ ఓడిపోవచ్చని గ్రహించాలి. మాకు అవసరమైన భాగస్వామ్యాలను నెలకొల్పలేకపోయాం. ఇది ఆటలో భాగం. మేం పుంజుకుంటాం"
– సూర్యకుమార్

ఇక ఎదురీతే..

ఈనాడు క్రీడావిభాగం

టీ20 ప్రపంచకప్ ఆరంభానికి రెండు నెలల ముందు భారత్‌లో టీ20 సిరీస్‌లో 1-3తో ఓడింది దక్షిణాఫ్రికా. ఇప్పుడు అదే జట్టు చేతిలో చిత్తు చిత్తుగా ఓడింది టీమ్‌ఇండియా. భారత జట్టు ఆనుపానులన్నీ తెలుసుకుని పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన సఫారీలు ఆదివారం మామూలు దెబ్బ తీయలేదు. ఇలాంటి కీలక మ్యాచ్‌లో 20/3కి చేరుకున్న జట్టు.. 187 పరుగులు చేయడం ఆషామాషీ విషయం కాదు. నిజానికి అహ్మదాబాద్ పిచ్ అంత తేలిగ్గా లేదని.. మ్యాచ్ ఆరంభమైన తీరు, తర్వాత భారత జట్టు బ్యాటింగ్ సాగిన వైనాన్ని బట్టి అర్థమవుతుంది. కానీ అద్భుత ఆరంభం తర్వాత భారత్‌ను ఒకింత ఉదాసీనత ఆవహించింది. వికెట్‌ను అనుసరించి బౌలింగ్ చేయకపోవడం, ఫీల్డింగ్ కూడా ఉత్తమంగా సాగకపోవడంతో ప్రత్యర్థి భారీ స్కోరు సాధించింది. ఒక ప్రణాళిక లేకుండా, పరిస్థితులకు అన్వయించుకోకుండా సాగిన బ్యాటింగ్ వల్ల భారత్‌కు ఘోర పరాభవం తప్పలేదు. ఆడితే బంతిని గాల్లో లేపడం, లేదంటే కుచించుకుపోవడం.. ఇదీ బ్యాటర్ల వరస. అంతే తప్ప స్ట్రైక్ రొటేట్ చేస్తూ సమయోచితంగా షాట్లు ఆడడంలో బ్యాటర్లు విఫలమయ్యారు. ఈ ఓటమి భారత్ సామర్థ్యం మీద అనేక సందేహాలు రేకెత్తించింది. ఆస్ట్రేలియా లాంటి పెద్ద జట్టు గ్రూప్ దశలో నిష్క్రమించింది కదా, కప్పు గెలవడానికి మన అవకాశాలు మెరుగయ్యాయని అనుకుంటే.. ఇప్పుడు ఆతిథ్య జట్టు పరిస్థితే ఇబ్బందికరంగా మారింది. ఇకపై టోర్నీలో భారత్‌ది ఎదురీతే. దక్షిణాఫ్రికాపై మామూలుగా ఓడితే.. సెమీస్ చేరడానికి ఎక్కువ కష్టపడాల్సిన పని ఉండేది కాదు. కానీ ఏకంగా 76 పరుగుల తేడాతో చిత్తవడంతో నెట్‌రన్‌రేట్ బాగా దెబ్బ తినేసింది. టీమ్‌ఇండియా నెట్‌రన్‌రేట్ ప్రస్తుతం - 3. 800. ఇక జింబాబ్వే, వెస్టిండీస్‌లపై ఘనంగా గెలవాల్సిందే. అదే సమయంలో దక్షిణాఫ్రికా మిగతా రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం కూడా భారత్‌కు ఎంతో అవసరం. లేదంటే సొంతగడ్డపై ఆడుతూ, సెమీస్ కూడా చేరకుండానే డిఫెండింగ్ ఛాంపియన్ ఇంటిముఖం పట్టాల్సి రావొచ్చు.


బుమ్రా

ఆ ఇద్దరూ అదరగొట్టినా..

బుమ్రా 4-0-15-3.. అర్ష్‌దీప్ 4-0-28-2.. ఇద్దరు ప్రధాన పేసర్లు ఇంత గొప్ప గణాంకాలు నమోదు చేసినా.. ప్రత్యర్థి జట్టు 188 పరుగులు చేయడం అనూహ్యమే. వీళ్లిద్దరూ కలిసి 8 ఓవర్లలో 43 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టారు. కానీ మిగతా బౌలర్లంతా కలిసి 12 ఓవర్లలోనే 145 సమర్పించుకున్నారు. ఎప్పుడూ పొదుపుగా బౌలింగ్ చేసే వరుణ్.. ఈ మ్యాచ్‌లో 4 ఓవర్లలో ఏకంగా 47 పరుగులు ఇచ్చేశాడు. హార్దిక్ 4 ఓవర్లలో 45 పరుగులు.. దూబె 2 ఓవర్లలో 32 పరుగులు సమర్పించుకున్నారు.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 4; డికాక్ (బి) బుమ్రా 6; రికెల్టన్ (సి) దూబె (బి) బుమ్రా 7; బ్రెవిస్ (సి) అభిషేక్ (బి) దూబె 45; మిల్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 63; స్టబ్స్ నాటౌట్ 44; యాన్సెన్ (సి) రింకు (బి) అర్ష్‌దీప్ 2; బోష్ (సి) అండ్ (బి) బుమ్రా 5; రబాడ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **187**; **వికెట్ల పతనం:** 1-10, 2-12, 3-20, 4-117, 5-152, 6-158, 7-167; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-28-2; బుమ్రా 4-0-15-3; వరుణ్ చక్రవర్తి 4-0-47-1; సుందర్ 2-0-17-0; హార్దిక్ 4-0-45-0; శివమ్ దూబె 2-0-32-1

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) రికెల్టన్ (బి) మార్‌క్రమ్ 0; అభిషేక్ శర్మ (సి) బోష్ (బి) యాన్సెన్ 15; తిలక్ వర్మ (సి) డికాక్ (బి) యాన్సెన్ 1; సూర్యకుమార్ (సి) బ్రెవిస్ (బి) బోష్ 18; వాషింగ్టన్ సుందర్(సి) డికాక్ (బి) బోష్ 11; శివమ్ దూబె (సి) ఎంగిడి (బి) యాన్సెన్ 42; హార్దిక్ పాండ్య (సి) స్టబ్స్ (బి) కేశవ్ 18; రింకు (సి) స్టబ్స్ (బి) కేశవ్ 0; అర్ష్‌దీప్ (సి) స్టబ్స్ (బి) కేశవ్ 1; వరుణ్ నాటౌట్ 0; బుమ్రా (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 0; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (18.5 ఓవర్లలో ఆలౌట్) 111; **వికెట్ల పతనం:** 1-0, 2-5, 3-26, 4-43, 5-51, 6-86, 7-86, 8-88, 9-111; **బౌలింగ్:** మార్‌క్రమ్ 1-0-5-1; యాన్సెన్ 3.5-0-22-4; రబాడ 4-0-32-0; ఎంగిడి 4-0-15-0; కేశవ్ మహరాజ్ 3-0-24-3; కార్బిన్ బోష్ 3-0-12-2

అక్షర్ ఎందుకు లేడు?

3 మ్యాచ్‌లు.. 6 వికెట్లు.. 12.16 సగటు.. 6.63 ఎకానమీ.. ఇలాంటి గణాంకాలు నమోదు చేసిన బౌలర్‌ను తుది జట్టు నుంచి ఎవరైనా తీసేస్తారా? కానీ కీలకమైన దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో అక్షర్ పటేల్ మీద వేటు వేసి ఆశ్చర్యపరిచింది జట్టు యాజమాన్యం. సూపర్ ఫామ్‌లో ఉన్న అతను.. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ సత్తా చాటాడు. పాకిస్థాన్‌తో కీలక పోరులోనూ 2/29 గణాంకాలు నమోదు చేశాడు. అలాంటి బౌలర్‌ను తప్పించి.. ఇటీవల పెద్దగా మ్యాచ్‌లు ఆడని వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. అక్షర్ లేడంటే.. అతడికి గాయమైందేమో అనుకుంటే.. అతడిపై వేటు వేసి మరీ సుందర్‌ను ఆడించారు. చివరికి చూస్తే మ్యాచ్‌లో అతడితో 2 ఓవర్లే బౌలింగ్ చేయించారు. సుందర్ వికెట్ తీయకుండా 17 పరుగులిచ్చాడు. అక్షర్‌కు అహ్మదాబాద్ సొంత నగరం. ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలో అతడికి మంచి రికార్డు కూడా ఉంది. ఎడమ చేతి వాటం కావడం వల్ల జట్టు బౌలింగ్‌కు అతను వైవిధ్యం తీసుకొచ్చేవాడు. బ్యాటింగ్‌లోనూ అతను సుందర్ కన్నా మెరుగే. సుందర్ ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో 11 పరుగులే చేశాడు. అతణ్ని అయిదో స్థానంలో ఆడించడం బెడిసికొట్టింది. మరి అక్షర్‌ను తప్పించి సుందర్‌ను ఆడించడంలో ఆంతర్యమేంటో కెప్టెన్, కోచ్‌లకే తెలియాలి.


అక్షర్

ట్రోఫీతో.. సుందర్ పిచాయ్

అహ్మదాబాద్: భారత్-దక్షిణాఫ్రికా మధ్య అహ్మదాబాద్‌లో టీ20 ప్రపంచకప్ సూపర్-8 మ్యాచ్‌కు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. మ్యాచ్ ఆరంభానికి ముందు భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్‌తో పాటు పిచాయ్ ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారు. క్రికెట్ అంటే ఎంతో ఇష్టపడే ఆయన.. ఇండియా ఏఐ టూర్‌లో భాగంగా ఇటీవల గురుగ్రామ్ గూగుల్ ఆఫీస్‌లో భారత స్టార్ శుభ్‌మన్ గిల్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తాను పుల్ షాట్‌ను ఎలా ఆడతానో పిచాయ్‌కు శుభ్‌మన్ వివరించాడు.


సుందర్ పిచాయ్, గావస్కర్

శ్రీలంక చిత్తు

- ఇంగ్లాండ్ ఘనవిజయం
- విజృంభించిన జాక్స్, ఆర్చర్
- చెలరేగిన సాల్ట్

పల్లెకెలె

సొంతగడ్డపై శ్రీలంకకు గట్టి దెబ్బ. గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శన చేసిన ఆ జట్టు.. సూపర్ 8ను పేలవంగా ఆరంభించింది. సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 51 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ చేతిలో చిత్తుగా ఓడింది. దునిత్ వెల్లలాగె (3/26) సూపర్ బౌలింగ్‌తో మొదట ఇంగ్లాండ్ 9 వికెట్ల నష్టానికి 146 పరుగులే చేయగలిగింది. మదుశంక (2/25), తీక్షణ (2/21) కూడా విజృంభించడంతో ఆ జట్టు పరుగుల కోసం చెమటోడ్చింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ ఇన్నింగ్స్ ఊపందుకోలేదు. అయితే మిగతా బ్యాటర్లు విఫలమైనా.. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (62; 40 బంతుల్లో 6×4, 2×6) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడి పోరాటమే ఇంగ్లాండ్‌కు గౌరవప్రదమైన స్కోరును అందించింది. ఛేదనలో శ్రీలంక ఘోరంగా విఫలమైంది. ఇంగ్లాండ్ పేస్, స్పిన్ బౌలింగ్‌కు దాసోహమన్న ఆ జట్టు.. 16.4 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. విల్ జాక్స్ (3/22), ఆర్చర్ (2/20), లియామ్ డాసన్ (2/27), అడిల్ రషీద్ (2/13) లంకను దెబ్బతీశారు. కెప్టెన్ శానక (30; 24 బంతుల్లో 1×4, 2×6) టాప్ స్కోరర్. ఆర్చర్, జాక్స్ ధాటికి విలవిల్లాడిన శ్రీలంక.. 34 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ పోటీలో లేదు. శానక ప్రయత్నించాడు. కానీ అది సరిపోలేదు. లంక ఇన్నింగ్స్‌లో కమిందు మెండిస్ (13) రెండో అత్యధిక స్కోరర్. విల్ జాక్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. శ్రీలంక గ్రూప్-2లో ఆఖరి స్థానంలో ఉంది.


విల్ జాక్స్ 3/22

ఇంగ్లాండ్ ఇన్నింగ్స్: ఫిల్ సాల్ట్ (సి) హేమంత (బి) వెల్లలాగె 62; బట్లర్ ఎల్బీ (బి) వెల్లలాగె 7; బెతెల్ (సి) మదుశంక (బి) తీక్షణ 3; బాంటన్ రనౌట్ 6; హ్యారీ బ్రూక్ ఎల్బీ (బి) వెల్లలాగె 14; సామ్ కరన్ (సి) మిషార (బి) చమీర 11; విల్ జాక్స్ (సి) వెల్లలాగె (బి) మదుశంక 21; డాసన్ (సి) శానక (బి) తీక్షణ 6; ఒవర్టన్ నాటౌట్ 10; ఆర్చర్ (సి) హేమంత (బి) మదుశంక 0; అడిల్ రషీద్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **146; వికెట్ల పతనం:** 1-16, 2-32, 3-49, 4-68, 5-94, 6-106, 7-124, 8-135, 9-135; **బౌలింగ్:** మదుశంక 4-0-25-2; వెల్లలాగె 4-0-26-3; తీక్షణ 4-0-21-2; హేమంత 4-0-38-0; చమీర 4-0-34-1

శ్రీలంక ఇన్నింగ్స్: నిశాంక (సి) ఒవర్టన్ (బి) ఆర్చర్ 9; మిషార (సి) ఒవర్టన్ (బి) ఆర్చర్ 6; కుశాల్ మెండిస్ (సి) అండ్ (బి) జాక్స్ 4; రత్నాయకే (సి) బాంటన్ (బి) జాక్స్ 0; వెల్లలాగె (సి) బ్రూక్ (బి) జాక్స్ 10; కమిందు మెండిస్ (సి) అండ్ (బి) డాసన్ 13; శానక (సి) బ్యాంటన్ (బి) రషీద్ 30; హేమంత హిట్ వికెట్ (బి) ఒవర్టన్ 5; చమీర (బి) డాసన్ 6; తీక్షణ నాటౌట్ 10; మదుశంక (బి) రషీద్ 0; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (16.4 ఓవర్లలో ఆలౌట్) **95**; **వికెట్ల పతనం:** 1-15, 2-20, 3-20, 4-22, 5-34, 6-52, 7-69, 8-82, 9-94; **బౌలింగ్:** ఆర్చర్ 3-0-20-2; విల్ జాక్స్ 4-0-22-3; డాసన్ 4-0-27-2; అడిల్ రషీద్ 3.4-0-13-2; ఒవర్టన్ 2-0-13-1



భారత్‌దే రైజింగ్ స్టార్స్ ట్రోఫీ

బ్యాంకాక్: మహిళల ఆసియాకప్ రైజింగ్ స్టార్స్ ట్రోఫీని డిఫెండింగ్ ఛాంపియన్ భారత్-ఎ నిలబెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో రాధ యాదవ్ బృందం 46 పరుగుల తేడాతో బంగ్లాదేశ్-ఎను చిత్తు చేసింది. మొదట భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 134 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తేజల్ హసబ్నీస్ (51 నాటౌట్; 34 బంతుల్లో 3×4, 2×6), రాధ (36; 30 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. ఒక దశలో భారత్ 44/4తో ఇబ్బందుల్లో పడినా.. తేజల్, రాధ జట్టును ఆదుకున్నారు. ఈ జంట అయిదో వికెట్‌కు 69 పరుగులు జత చేయడంతో భారత్ పోరాడే స్కోరు చేయగలిగింది. ప్రత్యర్థి బౌలర్లలో ఫహీమా (4/25) సత్తా చాటింది. ప్రేమ రావత్ (3/12), సోనియా (2/21) విజృంభించడంతో బంగ్లా 19.1 ఓవర్లలో 88 పరుగులకే ఆలౌటైంది. షమీమా సుల్తానా (20), సర్మీన్ సుల్తానా (18) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు.

● హాకీ ప్రొ లీగ్

భారత్.. పోరాడినా పోయింది

హోబర్ట్: హాకీ ప్రొ లీగ్‌లో భారత్ ఓటమి బాట వీడడం లేదు. ఆదివారం ఆస్ట్రేలియాపై అద్భుతంగా పోరాడినా.. చివరికి షూటౌట్‌లో 5-4తో పరాజయమే ఎదురైంది. గత మ్యాచ్‌లతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన చేసిన భారత్ 2-2తో ఆస్ట్రేలియా పోరును టైగా ముగించింది. అమిత్ రోహిదాస్ (15వ నిమిషం), జుగ్‌రాజ్ సింగ్ (43వ నిమిషం) గోల్స్‌తో భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. అయితే జోయెల్ రింటాలా (47, 56 నిమిషాలు) రెండు గోల్స్ కొట్టి స్కోర్లు సమం చేశాడు. పెనాల్టీ షూటౌట్‌లో విఫలమైన భారత్ ఒక్క గోల్ తేడాతో ఓడింది. హాకీ ప్రొ లీగ్‌లో సొంతగడ్డపై నాలుగు ఓటములు సహా భారత్‌కు ఇది వరుసగా ఆరో పరాజయం.



నార్వేకు అగ్రస్థానం

ముగిసిన వింటర్ ఒలింపిక్స్

వెరోనా (ఇటలీ): వింటర్ ఒలింపిక్స్‌కు తెర పడింది. ఈ మెగా ఈవెంట్లో నార్వే 41 పతకాలతో (18 స్వర్ణాలు, 12 రజతాలు, 11 కాంస్యాలు) అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అమెరికా 33 (12 స్వర్ణాలు, 12 రజతాలు, 9 కాంస్యాలు), నెదర్లాండ్స్ 20 (10 స్వర్ణాలు, 7 రజతాలు, 3 కాంస్యాలు) తర్వాతి స్థానాలు సాధించాయి. భారత్ తరపున ఈ క్రీడల్లో ఆరిఫ్ ఖాన్ (అల్పైన్ స్కీయింగ్), స్టాంజిన్ లాండప్ (క్రాస్‌కంట్రీ స్కీయింగ్) పోటీ పడ్డారు. ఆరిఫ్ 39వ, స్టాంజిన్ 104వ స్థానాలతో నిరాశపరిచారు.

ఆధిపత్యమే లక్ష్యం


స్మృతి

అడిలైడ్: భారత మహిళల జట్టు స్థిరంగా అగ్రస్థానంలో కొనసాగుతూ ప్రపంచ క్రికెట్లో ఆధిపత్యం చలాయించాలని కోరుకుంటోందని వైస్ కెప్టెన్ స్మృతి మంధాన తెలిపింది. ఇటీవలే వన్డే ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత్.. ఈ ఏడాది చివర్లో జరిగే టీ20 వరల్డ్‌కప్‌ను నెగ్గాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. "ప్రస్తుత భారత జట్టు నిలకడగా రాణించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రత్యర్థి గురించి లేదా గతంలో ఏం జరిగిందన్న విషయాల్ని ఆలోచించట్లేదు. వాళ్లను ఓడించాం.. వీళ్లను మట్టికరిపించామన్నది ఇప్పుడు ముఖ్యం కాదని భావిస్తున్నా. ప్రపంచ క్రికెట్లో ఆధిపత్యం చలాయించాలనుకునే దశకు దగ్గర్లో ఉన్నామని అనుకుంటున్నా. ఎవరిని ఓడిస్తున్నామన్న పట్టింపు మాకు లేదు. అగ్రస్థానంలో స్థిరంగా ఉండాలనుకుంటున్నాం" అని స్మృతి వివరించింది.


హోప్


సికందర్ రజా

విండీస్‌కు ఎదురుందా?

నేడు జింబాబ్వేతో సూపర్-8 పోరు

రాత్రి 7 నుంచి

ముంబయి: టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో పెద్ద జట్లు ఆస్ట్రేలియా, శ్రీలంకలకు షాకిచ్చి సంచలనం రేపిన జింబాబ్వే.. సూపర్-8లో తొలి సవాలుకు సిద్ధమైంది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన విండీస్‌తో సోమవారం ఆ జట్టు తలపడనుంది. గ్రూప్ దశ ప్రదర్శన చూశాక జింబాబ్వేను విండీస్ తక్కువగా అంచనా వేసే అవకాశం లేదు. కానీ విండీస్ టోర్నీలో భీకర ఫామ్‌లో ఉంది. బ్యాటింగ్‌లో హోప్, హెట్‌మయర్, రూథర్‌ఫర్డ్ జోరుమీదున్నారు. బౌలింగ్‌లో హోల్డర్, షమర్, అకీల్, మోటీ నిలకడగా రాణిస్తున్నారు. జింబాబ్వే సమష్టితత్వాన్నే నమ్ముకుని బరిలోకి దిగుతోంది. కెప్టెన్ సికందర్ రజాతో పాటు బెనెట్, బర్ల్, ముజరబాని, ఎవాన్స్ ఫామ్ కొనసాగించాలని ఆ జట్టు కోరుకుంటోంది.

(c) eenadu

మరికొన్ని గంటల్లో ఇద్దరి పెళ్లిళ్లు..
జోధ్‌పుర్‌లో అక్కాచెల్లెళ్ల మిస్టరీ మరణం



ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ జిల్లా సూర్‌సాగర్ పోలీస్‌స్టేషన్ పరిధి మఘ్ఞ గ్రామంలో దీప్‌సింగ్ అనే వ్యక్తి తన ఇద్దరి కుమార్తెల వివాహాలు ఒకే ముహూర్తానికి ఖరారు చేయగా.. పెళ్లికి కొన్ని గంటల ముందు అక్కాచెల్లెళ్లు ఇద్దరూ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. శనివారం జరిగిన ఈ ఘటన గ్రామంలో కలకలం రేపింది. నలుగురు కుమార్తెలున్న దీప్‌సింగ్ పెద్దమ్మాయికి ఇప్పటికే పెళ్లి చేశారు. బీఈడీ చదివి స్థానిక స్కూలులో పనిచేస్తున్న శోభ (25), విమల (23)ల వివాహాలు కూడా ఖరారు చేశారు. శుక్రవారం నుంచే పెళ్లి సంబరాలు మొదలయ్యాయి. ఆదేరోజు అర్ధరాత్రి అక్కాచెల్లెళ్లు అస్వస్థతకు గురికాగా, ఆసుపత్రికి తరలించారు. దేహాలు నీలం రంగులోకి మారిన వారిద్దరూ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషం తాగి ఉండవచ్చని భావిస్తున్నారు. దీప్‌సింగ్ హడావుడిగా కుమార్తెల అంత్యక్రియలు ఏర్పాటుచేయగా.. పోలీసులు అడ్డుకొని మృతదేహాలను పోస్టుమార్టం పూర్తయ్యాక అప్పగించారు. నివేదికలు వచ్చిన తర్వాతే అసలు కారణాలు తెలుస్తాయని అదనపు డీసీపీ రోషన్ మీనా తెలిపారు. మేనకోడళ్లిద్దరూ ఒకేసారి చనిపోవడంపై శోభ, విమలల మేనమామ జస్వంత్ సింగ్ అనుమానం వ్యక్తం చేశారు. వారిద్దరికీ మొదట జరిగిన నిశ్చితార్థాలు రద్దు చేసి, తన బావ సోదరుల ఒత్తిడితో వేరే సంబంధాలు కుదిర్చారని చెప్పారు. ఈ పెళ్లిళ్లు అమ్మాయిలకు ఇష్టం లేదన్నారు.



యువతి ప్రాణం కాపాడిన
ఇందౌర్ సింగింగ్ కాప్

ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ నగర కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలు మేళవించి బాలీవుడ్ పాటలు పాడుతూ 'సింగింగ్ కాప్'గా పేరు తెచ్చుకున్న సోనాలి సోనీ మరోసారి తన సేవాతత్పరతను చాటుకున్నారు. ఈ నెల 18న స్థానిక పలాసియా కూడలిని దాటుతున్న ఓ యువతిని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్రగాయమైన ఆమె రోడ్డుపైనే కుప్పకూలింది. పాదచారులు, వాహనదారులు ఆమెకు సాయం చేయడానికి బదులు వీడియోలు తీయడం ప్రారంభించారు. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు సోనాలి సోనీ, సుబేదార్ లక్ష్మీ స్పృహ కోల్పోయిన ఆ యువతిని ఆసుపత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. చురుగ్గా స్పందించి ఓ నిండుప్రాణాన్ని కాపాడిన సోనాలి, లక్ష్మీలను అధికారులు అభినందించారు.

భారత్, అమెరికా చర్చలు వాయిదా

దిల్లీ: భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పంద పాఠాల్ని ఖరారు చేయడానికి సోమవారం నుంచి వాషింగ్టన్‌లో 3 రోజులపాటు జరగాల్సిన ముఖ్య సంధానకర్తల చర్చలు వాయిదా పడ్డాయి. సుంకాలపై అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో తలెత్తిన పరిణామాలు, ప్రభావాలపై అంచనాకు వచ్చాక త్వరలో ఈ చర్చలు తిరిగి ప్రారంభమవుతాయని ఆదివారం వాణిజ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ చర్చలకు వాణిజ్యశాఖ సంయుక్త కార్యదర్శి దర్పణ్ జైన్ నేతృత్వం వహిస్తున్నారు.

9 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో
1.70 కోట్లమంది ఓటర్ల తొలగింపు

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతో తొమ్మిది రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 1.70 కోట్లకు పైగా ఓటర్లను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తొలగించింది. గతేడాది అక్టోబరులో సర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 21.45 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సర్ ప్రక్రియ అనంతరం ప్రచురించిన తుది జాబితాలో ఆ సంఖ్య 19.75 కోట్లకు తగ్గింది. ఓటర్ల సంఖ్యలో 7.93 శాతం తగ్గుదల నమోదైంది. గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గోవా, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులకు సంబంధించిన తుది ఓటరు జాబితాలను ఈసీఐ విడుదల చేసింది. జాబితా నుంచి గుజరాత్‌లో అత్యధికంగా 68.12 లక్షల పేర్లను తొలగించడంతో.. అక్కడి ఓటర్ల సంఖ్య 5.08 కోట్ల నుంచి 4.40 కోట్లకు తగ్గింది. కేరళలో అత్యల్పంగా 8.97 లక్షల పేర్లు తొలగించారు. అక్కడ ఓటర్ల సంఖ్య 2.78 కోట్ల నుంచి 2.69 కోట్లకు తగ్గింది.

ఓటీపీలు చెప్పకండి.. పాస్‌వర్డ్‌లు మార్చండి

- డిజిటల్ మోసాలపై అప్రమత్తం సుమా
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ



దిల్లీ: లావాదేవీల్లో ఓటీపీలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పొద్దని, కాలాలకు అనుగుణంగా దుస్తులు, ఆహారంలో మార్పులు చేసుకున్నట్లే పాస్‌వర్డ్‌లను మార్చుకోవడం తప్పనిసరి అని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. డిజిటల్ మోసాలను అరికట్టే విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆదివారం 'మన్ కీ బాత్' కార్యక్రమంలో సైబర్ నేరాల గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఓటీపీలనే కాదు.. ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దు. డిజిటల్ అరెస్టులు, ఆర్థిక మోసాల బారినపడి అనేకమంది తమ జీవితకాల సంపాదనను పోగొట్టుకుంటున్నారు. 'మీ ఖాతాదారును తెలుసుకో' (కేవైసీ) అనే నిబంధనను పూర్తిచేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకు శాఖలకు వెళ్లి, లేదా బ్యాంకు యాప్‌లలో, ఇతరత్రా అధికారిక వేదికల ద్వారానే దీనిని పూర్తిచేయాలి. పింఛన్, రాయితీ, బీమా సొమ్ము, యూపీఐ.. అన్నీ బ్యాంకు ఖాతాతో అనుసంధానమై ఉన్నాయి. అందుకే బ్యాంకులు తరచూ కేవైసీ, రీ-కేవైసీ కోసం అడుగుతుంటాయి. మోసగాళ్లు ఈ విషయంలోనూ తప్పుడు కాల్స్, ఎస్ఎంఎస్‌లు, మోసపూరిత లింకుల ద్వారా రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు" అని మోదీ వివరించారు.

మన సాంకేతికత ఆశ్చర్యపరిచింది

ఏఐ శిఖరాగ్ర సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని, మన సాంకేతికత వాటిని ఆశ్చర్యపరిచిందని మోదీ చెప్పారు. ఏఐ వినియోగంలో ఇదొక కీలక మలుపు అవుతుందన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చిన తల్లిదండ్రులను ప్రశంసించారు. టి-20 ప్రపంచ కప్‌లో భారత మూలాలున్న క్రికెటర్లు ఇతర దేశాల తరపున ఆడి రాణిస్తుండటం ప్రజలకెంతో ఆనందాన్నిస్తోందని చెప్పారు. రాష్ట్రపతిభవన్‌లో బ్రిటిష్ ఆర్కిటెక్ట్ లుట్యెన్స్ విగ్రహం స్థానంలో భారతదేశ తొలి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించనున్నామని చెప్పారు.

పిల్లలు పరీక్షల యోధులు

పిల్లలంటే పరీక్షల యోధులని, మార్కుల పత్రమే వారి విలువకు ప్రామాణికం కాదని మోదీ చెప్పారు. 'చదివినవన్నీ గుర్తుంటాయా లేదా? జవాబులు రాయడానికి సమయం సరిపోతుందా? అనే సందేహాలు తలెత్తడం సహజం. మీరు మాత్రమే కాదు.. ప్రతి తరంలోని పిల్లలూ ఎదుర్కొనే పరిస్థితే ఇది. మీపై మీరు నమ్మకం ఉంచండి' అని చెప్పారు.

అఫ్గాన్ ఉగ్రస్థావరాలపై
పాక్ వైమానిక దాడులు

- 70 మంది ఉగ్రవాదులను హతమార్చామన్న ఇస్లామాబాద్

ఇస్లామాబాద్: అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ విరుచుకుపడింది. ఆ దేశంలోని తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ), దాని అనుబంధ సంస్థలకు చెందిన ఏడు ఉగ్రవాద స్థావరాలపై ఆదివారం తెల్లవారుజామున వైమానిక దాడులు నిర్వహించింది. నంగర్‌హార్, పక్తికా ప్రావిన్స్‌ల్లో జరిగిన ఈ దాడుల్లో 18 మంది ప్రాణాలు కోల్పోయారని, ఇందులో మహిళలు చిన్నారులు ఉన్నారని అఫ్గాన్ ప్రభుత్వం వెల్లడించింది. పాకిస్థాన్ మాత్రం 70 మంది ఉగ్రవాదులను హతమార్చామని పేర్కొంది. "చాలాకాలం నుంచి అఫ్గాన్ ప్రభుత్వం మా దేశంలోకి తీవ్రవాదాన్ని ఎగుమతి చేస్తోంది. చనిపోయిన 70 మందిలో కూడా చాలా మంది పాక్ జాతీయులే" అని పాక్ మంత్రి తలాల్ చౌధరీ తెలిపారు. మరోవైపు పాక్ వైమానిక దాడులను కాబుల్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఖండించింది. దీనికి ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది.



అఫ్గానిస్థాన్‌లోని సంగర్‌హార్‌లో ధ్వంసమైన ఇళ్ల వద్ద స్థానికులు



ఒత్తిడి మంచిదే

పనిలో ఒత్తిడి అనివార్యం.
ఒత్తిడి చాలా భారంగా అనిపిస్తుంది
కానీ, మీకే తెలియకుండా మిమ్మల్ని
సానబెడుతుంది. మీలో క్రమశిక్షణ,
ఏకాగ్రత, క్లిష్ట పరిస్థితుల్లోనూ
చలించని గుణాన్ని ప్రోది చేస్తుంది.
ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లోనే
మీ ఎదుగుదల ఉంటుంది తప్ప
దానివల్ల మీకు
ఎప్పటికీ నష్టం కలగదు.
– ఒలీవియా, గ్రోత్ మెంటార్

ట్రంప్ నివాసంలోకి సాయుధ దుండగుడి చొరబాటు

- కాల్చిచంపిన భద్రతా సిబ్బంది

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడటం తీవ్ర కలకలం సృష్టించింది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతణ్ని కాల్చిచంపారు. ఫ్లోరిడా పామ్ బీచ్‌లోని ట్రంప్ నివాసమైన మార్-ఎ-లాగో రిసార్టులో శనివారం అర్ధరాత్రి దాటాక (ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు) ఈ సంచలన ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో ట్రంప్, ఆయన సతీమణి మెలానియా ట్రంప్ అక్కడ లేరు. వారిద్దరూ శ్వేతసౌధంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. హతుణ్ని ఉత్తర కరోలినాకు చెందిన ఆస్టిన్ టకర్ మార్టిన్ (21)గా గుర్తించారు. అమెరికా సీక్రెట్ సర్వీస్ అధికార ప్రతినిధి ఆంథోనీ గుగ్లీల్మీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మార్-ఎ-లాగో ఉత్తర గేటు నుంచి ఓ వాహనం వెలుపలికి వెళ్తుండగా.. దుండగుడు తన వాహనంతో ఒక్కసారిగా లోపలికి దూసుకొచ్చాడు. ఇద్దరు సీక్రెట్ సర్వీసు ఏజెంట్లు, ఓ పోలీసు అధికారి అతణ్ని అడ్డుకున్నారు. అతడి వద్ద గ్యాస్ క్యాన్, షాట్‌గన్ ఉండటాన్ని గుర్తించి.. వాటిని కింద పడేయాలని హెచ్చరించారు. గ్యాస్‌క్యాన్‌ను కింద పెట్టిన అతడు.. షాట్‌గన్‌ను మాత్రం వదల్లేదు. కాల్పులు జరిపేందుకు వీలుగా దాన్ని ఎత్తి పట్టుకున్నాడు. దీంతో భద్రతా సిబ్బంది కాల్పులు జరిపి అతణ్ని హతమార్చారు. ఆస్టిన్ టకర్ మానసిక స్థితి, ట్రంప్ నివాసంలోకి దూసుకురావడానికి కారణాలను నిర్ధారించేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



ఆస్టిన్ టకర్

భారత్‌తో కలిసి షడ్భుజి కూటమి!

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

జెరూసలెం: భారత్, పశ్చిమాసియా, దాని చుట్టూ ఉన్న దేశాలతో కలిసి త్వరలో షడ్భుజి కూటమి ఏర్పాటు చేయనున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. 'ఇందులో భారత్, అరబ్, ఆఫ్రికా, ఆసియా దేశాలతోపాటు మధ్యధరా దేశాలు (గ్రీస్, సైప్రస్) ఉంటాయి. ఈ నెల 25 నుంచి ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి మండలి సమావేశంలో నెతన్యాహు మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌ను 'ప్రపంచ శక్తి'గా అభివర్ణించారు. ఇజ్రాయెల్ పర్యటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

ఉగ్రవాదుల అంతం చూసిన టైసన్

- గాయపడినా సైనికుల వెంటే..
- కశ్మీర్‌లో జైషే కమాండర్ సహా ముగ్గురు పాక్ ఉగ్రవాదుల హతం

జమ్మూ: కశ్మీర్‌లో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 'టైసన్' అనే స్నిఫర్ డాగ్ హీరోగా నిలిచింది. దానివల్లే ముగ్గురు పాక్ ఉగ్రవాదులను సైన్యం మట్టుబెట్టగలిగింది. ఇందులో జైషే మహమ్మద్‌కు చెందిన కరడుగట్టిన కమాండర్ సైఫుల్లా ఉన్నాడు. జమ్మూ కశ్మీర్‌లోని కిశ్త్‌వార్ జిల్లా ఛాత్రూ బెల్ట్‌లోని పాశర్‌కూట్ ప్రాంతంలో ఉగ్రవాదులున్నట్లు నిఘా వర్గాల ద్వారా సైన్యానికి సమాచారం అందింది. దీంతో 'వైట్ నైట్ కోర్' బలగాలు ఆపరేషన్‌ను చేపట్టాయి. వారు 2వ పారా స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన స్నిఫర్ డాగ్ సహకారం తీసుకున్నారు. ఉగ్రవాదులు దాక్కున్న ఇంటి వద్దకు తొలుత టైసన్ వెళ్లింది. అందులోనే వారు ఉన్నట్లు నిర్ధారించింది. సైనికులు ముందుకు సాగుతుండగా టైసన్ మరింత ముందుకు వెళ్లింది. దీంతో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. టైసన్ కాలికి గాయమైనా అది వెనక్కి తగ్గలేదు. ఉగ్రవాదులను గుర్తించేదాకా సైనికులతోనే ఉంది. ఎన్‌కౌంటర్ అనంతరం టైసన్‌ను హెలికాప్టర్‌లో ఉధంపుర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం దాని ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. 'ట్రాషి-ఐ' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయని, హతమైన వారిలో సైఫుల్లా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అతడు ఐదేళ్ల కిందట భారత్‌లోకి చొరబడ్డాడని, అప్పటి నుంచి క్రియాశీలంగా ఉన్నాడని వివరించారు. గతంలో పలు ఎన్‌కౌంటర్ల నుంచి అతడు తప్పించుకున్నాడని వివరించారు.



స్నిఫర్ డాగ్ టైసన్

1–2 ఏళ్లలోనే కేసు దర్యాప్తు పూర్తిచేయాలి

- అధికారులకు ఈడీ ఆదేశాలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో 500 ఛార్జిషీట్ల నమోదే లక్ష్యం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నగదు అక్రమ లావాదేవీల కేసులకు సంబంధించి 500 ఛార్జిషీట్లను నమోదు చేయాలని, కేసు రిజిస్టర్ అయిన 1-2 ఏళ్లలోనే దర్యాప్తును పూర్తిచేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లక్ష్యాలుగా నిర్దేశించుకుంది. ఇటీవల గువాహటిలో జరిగిన కాన్ఫరెన్స్ ఆఫ్ జోనల్ ఆఫీసర్స్ (క్యూసీజెడ్‌ఓ) త్రైమాసిక సమావేశాల్లో నిర్ణయించింది. "దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ముగించడానికి, చేపట్టబోయే కేసుల దర్యాప్తు సమయం తగ్గించడానికి ఈ లక్ష్యాలు అవసరం. సంక్లిష్టమైన ప్రత్యేక కేసులు తప్పితే.. మిగిలిన కేసుల్లో ఏడాది, రెండేళ్లలోనే దర్యాప్తు పూర్తి కావాలి. నగదు అక్రమ లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద దఖలుపడిన అధికారాలను విచక్షణతో, బాధ్యతతో ఉపయోగించాలి. సమన్లు, నోటీసులు జారీ చేస్తున్నప్పుడు అవి అవసరమా కాదా అనేది పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలి. విదేశాల్లో అక్రమ ఆస్తులు, బెట్టింగ్ యాప్‌లు, షేర్ మార్కెట్‌లో మోసాలు, దేశ ద్రోహ కార్యకలాపాలకు పాల్పడేందుకు వచ్చే విదేశీ నిధులు.. మొదలైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నాం' అని ఈడీ ఆదివారం జారీ చేసిన ప్రకటనలో పేర్కొంది. కొన్ని రాష్ట్రాల్లో పోలీసుల నుంచి సహకారం అందకపోవడం, మానవ వనరుల కొరత... ఇలా సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులపైనా సమావేశంలో చర్చించినట్లు వెల్లడించింది.

ట్రాఫిక్ జామ్‌తో టోల్ ఫీజు వాపసు

ముంబయి: ఇటీవల ముంబయి, పుణె ఎక్స్‌ప్రెస్ వేపై గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడిన కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు ఇబ్బంది పడిన ఘటనలో వారికి భారీ ఉపశమనం లభించనుంది. ఆ రోజున వసూలు చేసిన టోల్ ఫీజు రూ.5.16 కోట్లను తిరిగి ఇచ్చేయాలని నిర్ణయించినట్లు మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ (ఎంఎస్ఆర్‌డీసీ) అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. ఈ నెల 3న ఎక్స్‌ప్రెస్ వేలోని ఖోపాలి వద్ద గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో 33 గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ప్రమాదం జరిగిన వెంటనే టోల్ ఫీజులను వసూలు చేయవద్దని అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. అప్పటికే పలువురి ఖాతాల నుంచి ఫాస్టాగ్ ద్వారా టోల్ ఫీజు చెల్లింపులు జరిగాయి. దీంతో అటువంటి వారికి తిరిగి చెల్లించాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. 'టోల్ ఫీజుల వసూలును నిలిపేయాలని ఆదేశించిన తర్వాత ఫాస్టాగ్ ద్వారా చెల్లింపులు పూర్తయిన వాహన యజమానులకు తిరిగి చెల్లించాలని నిర్ణయించాం. కొద్ది రోజుల్లో వారి ఫాస్టాగ్ ఖాతాల్లో ఆ డబ్బు తిరిగి జమ అవుతుంది' అని ఎంఎస్ఆర్‌డీసీ అధికారి తెలిపారు.

నన్ను మళ్లీ చూడాలంటే వచ్చి కాపాడండి

- రాత్రివేళ ప్రియుడు నిద్రపోయాక తల్లికి త్రిపుర యువతి సందేశం



ఈటీవీ భారత్: చదువు కోసం త్రిపుర నుంచి హరియాణాకు వచ్చిన ఓ యువతి ప్రియుడి నిర్బంధం నుంచి పోలీసుల సాయంతో బయటపడింది. పోలీసు కథనం ప్రకారం.. త్రిపుర యువతి (19) గురుగ్రామ్‌కు వచ్చి స్థానిక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతోంది. సెక్టార్ 69లోని పీజీలో ఉంటున్న ఈమెకు ఆర్నెల్ల కిందట ఓ ఆన్‌లైన్ యాప్ ద్వారా దిల్లీకి చెందిన శివమ్‌తో పరిచయం ఏర్పడింది. తర్వాత ఇద్దరూ తరచూ కలుసుకోవడంతో పరిచయం కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొని సహజీవనం ప్రారంభించారు. కొద్దిరోజులకే శివమ్ ఆమెపై అనుమానాలు పెంచుకొని శారీరకంగా, మానసికంగా హింసించడం మొదలుపెట్టినట్లు ఆ యువతి తన వాంగ్మూలంలో పేర్కొంది. ఈ నెల 16వ తేదీ రాత్రి ఇద్దరూ గొడవపడ్డారు. శివమ్ తనపై సీసాతో దాడి చేసి, తలను గోడకేసి కొట్టినట్లు బాధితురాలు తెలిపింది. శానిటైజర్‌ను ప్రైవేట్ భాగాల మీద పోసి నిప్పంటించాడని వాపోయింది. ఆ తర్వాత కత్తితో కాళ్లపై గాయపరిచాడని, జీవితాంతం నడవలేని విధంగా చేస్తానని బెదిరించాడని వివరించింది. తన నగ్న వీడియోలు చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ చేసినట్లు ఆమె పోలీసులకు తెలిపింది. గొడవ జరిగిన మూడోరోజు అర్ధరాత్రి శివమ్ నిద్రపోయాక.. అతడి ఫోను నుంచి ఆమె తన తల్లికి "మీరు నన్ను సజీవంగా మళ్లీ చూడాలనుకుంటే వచ్చి కాపాడండి" అని మెసేజ్ పంపింది. త్రిపురలో పోలీసు అధికారి అయిన బాధితురాలి తల్లి అత్యవసర హెల్ప్‌లైను 112కు కాల్ చేయగా.. గురుగ్రామ్ పోలీసులు అక్కడికి చేరుకొని యువతిని కాపాడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం దిల్లీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఈయూ సైనిక దళాలపై ఉగ్ర ముద్ర

- ఇరాన్ నిర్ణయం



టెహ్రాన్: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ దేశ సైనిక విభాగమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ)ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన యూరోపియన్ యూనియన్ (ఈయూ)కు అదే రీతిలో బదులిచ్చింది. ఈయూ సభ్య దేశాలకు చెందిన నౌకాదళం, వాయుసేనలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాల ప్రాథమిక సూత్రాలకు వ్యతిరేకంగా ఈయూ వ్యవహరిస్తోందని మండిపడింది. ఈయూ సభ్య దేశాలు తమ సైనిక దళమైన ఐఆర్‌జీసీని ఉగ్రవాద జాబితాలో చేర్చడాన్ని చట్టవిరుద్ధమైనదిగా, ద్వంద్వ ప్రమాణాలతో కూడినదిగా ఇరాన్ అభివర్ణించింది. 2019లో అమెరికాకు వ్యతిరేకంగా ఇరాన్ చేసిన 'ఆర్టికల్ 7' చట్టాన్ని ఇప్పుడు ఈయూపై ప్రయోగించింది. ఐఆర్‌జీసీని ఉగ్రవాద సంస్థగా పరిగణించే ఏ దేశానికైనా లేదా కూటమికైనా ఇరాన్ దృష్టిలో అదే హోదా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో తలెత్తే పరిణామాలకు యూరోపియన్ యూనియన్, దాని సభ్య దేశాలే బాధ్యత వహించాలని స్పష్టం చేసింది. 1979 ఇస్లామిక్ విప్లవ రక్షణ కోసం ఏర్పడిన ఐఆర్‌జీసీ ఇరాన్ అణు, క్షిపణి కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంది. దీనిని ఐసిస్, అల్-ఖైదాతో పోల్చడాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తోంది. ఒక దేశపు అధికారిక సైనిక విభాగాన్ని 'ఉగ్రవాదులు'గా ప్రకటించడం అనేది ఆ దేశ సార్వభౌమాధికారాన్ని అవమానించడమేనని ఇరాన్ పేర్కొంది. అధికారిక ప్రభుత్వ సంస్థలపై ఇలాంటి ముద్ర వేయడం అంతర్జాతీయ సంబంధాల్లో ఒక ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీస్తుందని హెచ్చరించింది. ఐఆర్‌జీసీ అనేది కేవలం సైన్యం మాత్రమే కాదని, మధ్యప్రాచ్యంలో ఐసిస్ వంటి ఉగ్రవాద సంస్థలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించిన విభాగమని ఇరాన్ తన ప్రకటనలో సమర్థించుకుంది. అటువంటి సంస్థపై ఉగ్రవాద ముద్ర వేయడం వల్ల ప్రాంతీయ భద్రత దెబ్బతింటుందని పేర్కొంది.

మూడ్రోజులుగా మూసి ఉన్న ఇంట్లో..
అయిదు మృతదేహాలు

ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాస్‌గంజ్ జిల్లా అమన్‌పుర్‌లో ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు సభ్యులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. పట్టణంలోని పెట్రోల్ పంపు సమీపంలో శ్యామ్‌వీర్ సింగ్ (50) వెల్డరుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య రామ్‌శ్రీ (46), కుమార్తెలు ప్రాచి (14), ఆకాంక్ష (12), కుమారుడు గిరీశ్ (10) ఉన్నారు. గత మూడు రోజుల నుంచి శ్యామ్‌వీర్ కుటుంబసభ్యులు ఎవరూ బయటకు రాకపోవడంతో పొరుగింటివారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. శనివారం రాత్రి ఆ ఇంటి వద్దకు పోలీసులు చేరుకున్నారు. లోపలి నుంచి తాళం వేసి ఉన్న తలుపులను బద్దలుకొట్టి చూడగా.. అయిదుగురూ విగతజీవులుగా కనిపించారు. శ్యామ్‌వీర్ ఫ్యానుకు ఉరివేసుకొని కనిపించగా.. మిగతా నలుగురు కుటుంబసభ్యుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడున్నాయి. భార్యతోపాటు ముగ్గురు పిల్లలను హతమార్చాక, శ్యామ్‌వీర్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో పరిస్థితులు చూస్తే ఆత్మహత్యలుగానే కనిపిస్తోందని కాస్‌గంజ్ ఎస్పీ అంకిత శర్మ తెలిపారు. ఇంట్లోకి ఎవరూ వచ్చిన ఆధారాలు లేవన్నారు. ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నివేదికతో స్పష్టత వస్తుందని చెప్పారు.



శ్యామ్‌వీర్ ఇంటి ముందు గుమిగూడిన జనం

అజిత్ పవార్ దుర్ఘటనపై సీబీఐ దర్యాప్తును కోరాం


మహారాష్ట్ర సీఎం ఫడణవీస్

ముంబయి: మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఓ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోరినట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రమాదంపై వస్తున్న సందేహాలన్నీ తొలగిపోయేలా మహాయుతి సర్కారు చూస్తుందని చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ద్వారా విచారణ జరిపించాలంటూ భాజపా మిత్రపక్షమైన ఎన్సీపీ నుంచి కూడా తనకు లేఖ వచ్చిందని, ఇప్పటికే డీజీసీఏ, రాష్ట్ర సీఐడీ నిర్వహిస్తున్న విచారణకు అదనంగా సీబీఐ విచారణ కూడా ఉంటుందని తెలిపారు. లాగ్ పుస్తకాలు సహా విమానానికి సంబంధించిన వీఎస్ఆర్ కంపెనీ కార్యకలాపాలన్నింటినీ డీజీసీఏ పరిశీలిస్తోందని, విచారణ నివేదిక వచ్చేలోపు ఊహాగానాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

తీర రక్షకదళం అదుపులో ఇరాన్ పడవ

- అందులో రూ.5 కోట్ల విలువైన సిగరెట్లు

అహ్మదాబాద్: గుజరాత్ తీరంలోని అరేబియా మహా సముద్రంలో దాదాపు రూ.5 కోట్ల విలువైన 200 కార్టన్ల విదేశీ సిగరెట్లను తరలిస్తున్న ఇరాన్ పడవను భారతీయ తీర రక్షక దళం (ఐసీజీ) అదుపులోకి తీసుకుంది. అందులో ఉన్న నలుగురు ఇరాన్ పౌరులను అరెస్టు చేసింది. ద్వారకా తీరానికి 115 నాటికల్ మైళ్ల దూరంలో భారత ప్రత్యేక ఆర్థిక పరిధిలో పడవను గుర్తించి శనివారం ఆపరేషన్ చేపట్టినట్లు ఐసీజీ తెలిపింది. దాదాపు లక్ష సిగరెట్ ప్యాకెట్లతో ప్రయాణిస్తున్న ఆ పడవను అల్ ముఖ్తార్‌గా గుర్తించారు. దానిని పోర్‌బందర్‌కు తరలించినట్లు భద్రతా బలగాలు తెలిపాయి.



మసాజ్ చేస్తున్నారా.. వ్యభిచారమా..?

దిల్లీలో అరుణాచల్ మహిళలపై జాతి వివక్ష

దిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన ముగ్గురు మహిళలకు చేదు అనుభవం ఎదురైంది. దిల్లీలో నివాసం ఉంటోన్న వారు.. పొరుగింటి నుంచి తీవ్రమైన జాతి వివక్ష, వేధింపులకు గురయ్యారు. దీంతో నిందితులపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ మహిళలు దిల్లీలోని మాలవీయ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 20న వారింట్లో ఏసీ బిగించడానికి ఎలక్ట్రీషియన్ డ్రిల్లింగ్ చేస్తుండగా.. దుమ్ము, ధూళి పక్కింట్లో పడింది. దీంతో ఆగ్రహానికి గురైన పొరుగింటి హర్ష్ సింగ్-రుబీజైన్ దంపతులు అరుణాచల్ మహిళలపై బూతులతో విరుచుకుపడ్డారు. 'ఇంట్లో మసాజ్ సెంటర్ నడుపుతున్నారా? వ్యభిచారం చేస్తున్నారా? రూ.500కి మసాజ్ పార్లర్లలో వ్యభిచారం చేసే మహిళలు మీరు' అంటూ ఈశాన్య రాష్ట్రాల ప్రజల్ని కించపరిచేలా తీవ్రమైన పదజాలంతో దూషిస్తూ గొడవకు దిగారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రంగంలోకి దిగిన పోలీసులు నిందితులపై కేసు నమోదుచేశారు. పొరుగింటివారికి తాము క్షమాపణ చెప్పినా దూషణలతో విరుచుకుపడ్డారని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు.

తేజస్ యుద్ధవిమానానికి స్వల్ప ప్రమాదం

దిల్లీ: స్వదేశీ తేలికపాటి యుద్ధవిమానం తేజస్ స్వల్ప ప్రమాదానికి గురైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 7న శిక్షణ కార్యక్రమం అనంతరం ఓ వైమానిక స్థావరానికి తిరిగొచ్చినప్పుడు.. బ్రేక్ వైఫల్యం కారణంగా రన్‌వే అంచులను దాటి తేజస్ ముందుకు వెళ్లింది. ఈ ఘటనలో విమానం ఎయిర్‌ఫ్రేమ్ దెబ్బతింది. పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. తాజా పరిణామం నేపథ్యంలో.. సాంకేతిక పరీక్షల కోసం దాదాపు 30 తేజస్ యుద్ధవిమానాల గగన విహారాన్ని వైమానిక దళం తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది.

మహిళల అండాలతో వ్యాపారం

మహారాష్ట్రలో ముఠా గుట్టురట్టు

ఠాణె: మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో పేద మహిళలను లక్ష్యంగా చేసుకొని..వారి అండాలతో వ్యాపారం చేస్తున్న ఓ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు మహిళలను అరెస్టు చేశారు. రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు బాధిత మహిళలకు చెల్లిస్తూ వారి నుంచి ఈ ముఠా పదే పదే అండాలను సేకరిస్తోందని పోలీసులు తెలిపారు. వీటిని రూ.లక్షలకు అమ్మేస్తున్నట్లు వెల్లడించారు. దాదాపు 20 మంది మహిళలు ఈ ముఠా బారిన పడి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు.

(c) eenadu

ఏఐ శోధన.. నేర ఛేదన

- 'ఏఐ4 ఏపీ పోలీస్' ప్రాజెక్టుకు శ్రీకారం
- 8 మాడ్యూల్స్ సాయంతో పక్కాగా ఛార్జిషీట్
- డేటా, సాక్ష్యాల ఆధారిత పోలీసింగ్ వైపు పరివర్తన



పోలీసింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచేందుకు ఏపీ పోలీసు శాఖ 'ఏఐ 4 ఏపీ పోలీస్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. సంప్రదాయ విధుల నుంచి డేటా, సాక్ష్యాల ఆధారిత, ఏఐ సహాయ పోలీసింగ్ వైపు మళ్లేందుకు వీలుగా ఈ ప్రాజెక్టులో 8 ఏఐ మాడ్యూల్స్‌ను సిద్ధం చేసింది. అన్నమయ్య, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రమంతా విస్తరించనున్నారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చొరవతో సాంకేతిక సేవల విభాగం ఐజీ సీహెచ్ శ్రీకాంత్ పర్యవేక్షణలో 'ఏఐ 4 ఏపీ పోలీస్' సిద్ధమైంది.

1 పిటిషన్ ఏఐ

ఈ మాడ్యూల్ బాధితుల ఫిర్యాదుల్లోని సారాంశాన్ని సంగ్రహించి ఉన్నతాధికారులకు అందిస్తుంది. క్షేత్రస్థాయి సిబ్బంది సరిగ్గా విచారించారా? విచారణ నివేదిక సమగ్రంగా ఉందా? లోపాలేమైనా ఉన్నాయా? అవి ఏంటి? అవసరమైన పత్రాలన్నీ పొందుపరిచారా? వంటి అంశాలు వేగంగా సమీక్షించడానికి, నాణ్యత మదింపునకు, లోపాలను సరిదిద్దేలా క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలివ్వడానికి ఉపయోగపడుతుంది. మాన్యువల్‌గా ఒక్కో విచారణ నివేదిక సమీక్షకు 30-45 నిమిషాల సమయం పడుతుండగా, ఆ మాడ్యూల్ ద్వారా 5-10 నిమిషాలు చాలు.

2 డిజిటల్ ఎవిడెన్స్ ఏఐ

ఫోన్‌కాల్ డీటెయిల్ రికార్డులు, ఐపీడీఆర్‌లు, టవర్ డేటా కోసం దర్యాప్తు అధికారులు వివిధ టెలికాం ఆపరేటర్లకు, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాల సమాచారం కోసం బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, వివిధ పేమెంట్ గేట్‌వేలు, ఆన్‌లైన్ పేమెంట్ ఆప్‌లు, ఈ కామర్స్ సంస్థలకు చట్టప్రకారం నోటీసులు ఇస్తుంటారు. కేసు వివరాలు, కావాల్సిన సమాచారం పొందుపరిస్తే చాలు.. ఏ విభాగానికి ఎలా నోటీసులివ్వాలో ఈ మాడ్యూల్ ఓ ఫార్మాట్‌ను సిద్ధంచేసి దర్యాప్తు అధికారికి ఇస్తుంది. వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి, కేసుతో అనుసంధానిస్తుంది. నోటీసుల జారీ, స్వీకరణకు ఓ నోడల్ అధికారిగా ఉపయోగపడుతుంది.

3 కాగ్నిటివ్‌నెట్ ఏఐ

కాల్ డీటెయిల్ రికార్డులు, ఐపీడీఆర్‌లు, బ్యాంక్ లావాదేవీలు, ఉబర్ డస్, ఫుడ్ డెలివరీ రికార్డులు, పేమెంట్ గేట్‌వేలు, సహా ఇతరత్రా వనరుల నుంచి సేకరించిన సాంకేతిక ఆధారాలన్నింటినీ విశ్లేషించి వాటిల్లో నుంచి దర్యాప్తు అధికారికి కావాల్సిన సమాచారాన్ని వెలికితీస్తుంది. ఉదాహరణకు ఓ అనుమానితుడికి సంబంధించి వివిధ రూపాల్లో వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి, 'ఫిబ్రవరి 2న మధ్యాహ్నం 2-4 గంటల మధ్య ఆయన నిత్యం ముగ్గురు వ్యక్తులతో మాట్లాడారు. లొకేషన్ డేటా విశ్లేషణలో అతను విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్నట్లు ఉంది' అని సులభంగా అర్థమయ్యే రీతిలో సమాచారమిస్తుంది. అనుమానితుల ప్రవర్తనను విశ్లేషిస్తుంది. కేసుల దర్యాప్తు, నేరాల ఛేదనకు ఇది కీలకం.

4 ఇన్వెస్టిగేషన్ కోపైలట్



ఫిర్యాదు స్వీకరణ, కేసు నమోదు, దర్యాప్తు, ఆధారాల సేకరణ, కేసు ఫైల్, ఛార్జిషీట్ తయారీ వరకూ ప్రతి దశలోనూ దర్యాప్తు అధికారికి ఈ టూల్ సహాయపడుతుంది. ఫిర్యాదులోని తీవ్రత, నేరాంశాలను గుర్తించి, ఆ కేసుకు వర్తించే చట్టాలు, సెక్షన్ల సమాచారాన్ని అందిస్తుంది. ఆయా కేసుల దర్యాప్తునకు నిర్దేశించిన ప్రామాణిక పద్ధతి ప్రకారం కేసు డైరీ, ఆధారాలు సేకరించారా? అని పరిశీలిస్తుంది. తద్వారా దర్యాప్తులో లోటుపాట్లను సరిదిద్దుకొని సమగ్ర నివేదికను కోర్టులో సమర్పించవచ్చు. దోషులు తప్పించుకునే వీల్లేకుండా పక్కా సాక్ష్యాధారాలతో కేసును నిలబెట్టి, శిక్ష పడేలా చేస్తుంది. సాంకేతిక కారణాలతో కేసు వీగిపోయే అవకాశాలను తగ్గిస్తుంది.

5 డాక్స్2డేటా

పోలీసు ఉద్యోగుల సర్వీసు రికార్డులు, బదిలీ ఆర్డర్లు, శిక్షణ సర్టిఫికెట్లు, ఏసీఆర్‌లు, మెడికల్ రికార్డులు తదితర పర్సనల్ డాక్యుమెంట్లన్నీ ప్రస్తుతం కాగితాల్లో ఉన్నాయి. అవసరమైనప్పుడు వాటిని వెతుక్కోవడం పెద్ద పని. ఈ ఏఐ టూల్‌తో వాటన్నింటినీ డిజిటలైజ్ చేస్తారు. ఏ ఉద్యోగి సమాచారమైనా ఉన్నతాధికారులు క్షణాల్లో తెలుసుకోవచ్చు.

6 సోష్ఇంట్ఏఐ

వివిధ వాట్సప్ గ్రూపుల్లో పోటెత్తే మెసేజ్‌ల్లో పోలీసులకు అవసరమైనవి గుర్తించి, వాటిని అంశాల వారీగా వర్గీకరించి సంబంధిత జిల్లా, సబ్‌డివిజన్, పోలీసుస్టేషన్‌లకు పంపించేందుకు ఈ మాడ్యూల్ ఉపయోగపడుతుంది. ఆందోళనలు, ఆర్థిక మోసాలు, నేరాలు, శాంతిభద్రతల సమస్యలకు దారి తీసే మెసేజ్‌లను వడపోసి, ఆయా విభాగాలను పర్యవేక్షించే అధికారులకు పంపించి, అప్రమత్తం చేస్తుంది. తద్వారా పోలీసులు నేర నియంత్రణ, శాంతిభద్రతల రక్షణకు సత్వరమే స్పందించవచ్చు.

7 న్యూస్360ఏఐ

దినపత్రికలు, న్యూస్ వెబ్‌సైట్లు, డిజిటల్ మీడియా వేదికలో వేర్వేరు భాషల్లో వచ్చిన వార్తలను అనువదించి, విశ్లేషించి, వాటి సారాంశాన్ని సంక్షిప్తంగా సిద్ధం చేసి అందిస్తుంది. ఒక అంశానికి సంబంధించిన వార్తలన్నింటినీ ఒకేచోట క్రోడీకరించడం, లింక్ చేయడం ఈ మాడ్యూల్ పని. ఆయా వార్తల్లోని వ్యక్తులు, సంస్థలకు ఏవైనా నేరాల్లో సంబంధముంటే.. పసిగట్టి అప్రమత్తం చేస్తుంది. ఈ సమాచారాన్ని పోలీసులు ఆటోమేటెడ్ న్యూస్ ఇంటెలిజెన్స్‌గా వాడుకుంటారు.

8 ఏఐ ఫౌండేషన్

ఏఐ ఎకోసిస్టమ్‌కు ఇది వెన్నుముకలా పనిచేస్తుంది. ప్రాంప్ట్ మేనేజ్‌మెంట్, అబ్జర్వబిలిటీ, యాక్సెస్ కంట్రోల్, సెంట్రలైజ్డ్ అథెంటికేషన్ సహా రీయూజబుల్ ఏఐ బిల్డింగ్ బ్లాక్స్ అందిస్తుంది. డేటా సెక్యూరిటీకి హామీ ఇస్తుంది. కొత్త ఏఐ యూజ్ కేసుల తయారీకి దోహదపడుతుంది.



దర్యాప్తు నాణ్యత పెరుగుతుంది: హరీష్‌కుమార్ గుప్తా, డీజీపీ

'ఏఐ4 ఏపీ పోలీస్' ప్రాజెక్టు అమలుతో కేసుల దర్యాప్తునకు పట్టే సమయం తగ్గుతుంది. దర్యాప్తులో నాణ్యత మెరుగై, శిక్షల శాతం పెరుగుతుంది. పౌరుల సంతృప్తి శాతం పెరుగుతుంది. పోలీసుల సాధారణ విధులు, రోజువారీ పనులకు సమయం తగ్గుతుంది. తద్వారా వారు అత్యంత ముఖ్యమైన అంశాలపై, మెరుగైన పౌరసేవలపై దృష్టి పెట్టేందుకు వీలవుతుంది. సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుంది.



హ్యాక్‌థాన్ నుంచి అమలు స్థాయికి తెచ్చాం: సీహెచ్ శ్రీకాంత్, సాంకేతిక సేవల విభాగం ఐజీ

గతేడాది జూన్‌లో నిర్వహించిన 'ఏఐ4 ఆంధ్ర పోలీస్ హ్యాక్‌థాన్'లో ఎంపికైన యూజ్ కేసులను మన అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయించి, అమలు చేయిస్తున్నాం. '4సైట్స్ఏఐ' సంస్థ సీఈవో సూర్య కోటను నాలెడ్జ్ పార్టనర్‌గా నియమించుకున్నాం. దేశంలోనే తొలిసారిగా పోలీస్ సంబంధిత లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం)ను అభివృద్ధి చేసి, అమలు చేస్తున్న ఘనత ఏపీ పోలీసు శాఖదే. భవిష్యత్తులో పోలీసింగ్ పరంగా ఇది పెనువిప్లవానికి దారితీస్తుంది.

- ఈనాడు, అమరావతి

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి చంద్రబాబు నివాళి



ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

పాలు లేకుండా నెయ్యి తయారీనా.. ఇది మహానుభావుల గొప్పతనం!

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఎద్దేవా



కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

ఈనాడు, విజయనగరం: పాలు లేకుండా నెయ్యి తయారు చేసే శాస్త్రవేత్తలు పుట్టుకొచ్చారని గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్టు ఛైర్మన్ అశోక్ గజపతిరాజు ఎద్దేవా చేశారు. విజయనగరం కోటలో మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ లక్ష్మీపతిరాజు అధ్యక్షతన ఆదివారం ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తితిదేకు కల్తీ నెయ్యి సరఫరా వెలుగు చూశాక.. రసాయనాలతో నెయ్యి తయారవుతుందా అని ఇటీవల కొంతకాలంగా చర్చ జరుగుతోంది. చట్టాలు.. మంచివారి చేతిలో పెడితే మంచి, చెడ్డవారి చేతిలో పెడితే చెడు జరుగుతాయి. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 14లక్షల మంది విద్యార్థులను బడికి దూరం చేశారు. విద్యారంగం అభివృద్ధికి ఏర్పాటైన మాన్సాస్ ట్రస్టునూ ఇబ్బందిపెట్టారు' అని తెలిపారు. ట్రస్టును ఇబ్బందిపెట్టిన వ్యక్తి కూడా ఈ విద్యా సంస్థలో చదువుకున్నారని మాజీమంత్రి బొత్స సత్యనారాయణను ఉద్దేశించి అన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు మాన్సాస్ భూమి: విజయనగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మాన్సాస్ ట్రస్టు భూమి ఇచ్చిందని ఛైర్మన్ అశోక్ గజపతిరాజు తెలిపారు. ఇదే సంస్థపై గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు మాట్లాడుతూ 'అప్పులు మీవి.. ఆస్తులు మావి' అని హాస్యాస్పదంగా వ్యాఖ్యానించారు. గతంలో తనను శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపిస్తామన్నారని, వారికి భయపడకుండా ఎదుర్కొన్నానని గుర్తుచేశారు.

కల్తీ నెయ్యి అంశంపై శాసనసభలో చర్చ?

ఈ వారంలోనే ఏదో ఒకరోజు చేపట్టే అవకాశం

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం అంశంపై శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. బడ్జెట్‌పై చర్చ ఇప్పటికే ముగిసినందున సోమవారం నుంచి శనివారం మధ్యలో ఏదో ఒక రోజు దీనిపై చర్చించే అవకాశం ఉంది. తర్వాత మండలిలోనూ చర్చించే యోచన చేస్తోంది.

◆ శాసనసభలో సోమవారం ఏపీ జైళ్లు, సంస్కరణ సర్వీసుల బిల్లు, ఏపీ రైతుల నీటిపారుదల వ్యవస్థల యాజమాన్య (సవరణ) బిల్లుల్ని మంత్రులు ప్రవేశపెట్టనున్నారు. 2026-27 వార్షిక ఆదాయ, వ్యయ పట్టికల్ని శాఖలవారీగా మంత్రులు ప్రతిపాదిస్తారు. దీంతోపాటు శాంతిభద్రతలపై శాసనమండలిలో లఘుచర్చ చేపట్టనున్నారు. ఏపీ పురపాలక శాసనాల (సవరణ) బిల్లు, ఏపీ పురపాలక శాసనాల (రెండో సవరణ) బిల్లు, విద్యుత్ సుంకం (సవరణ) బిల్లు, ఏపీ పంచాయతీరాజ్ (సవరణ), అలోపతి ప్రైవేటు వైద్యసంరక్షణ సంస్థల రిజిస్ట్రీకరణ, క్రమబద్ధీకరణ, ధార్మిక హిందూ మతసంస్థలు, ఎండోమెంట్ల(సవరణ)బిల్లు, శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ (సవరణ) బిల్లుల్ని ఆయా శాఖల మంత్రులు ప్రతిపాదిస్తారు.

బుద్ధగయ మొలక.. అమరావతిలో చెట్టయింది!



అమరావతి వేణువనంలో 14వ దలైలామా నాటిన బోధి వృక్షం

పల్నాడు జిల్లాలోని అమరావతిని బౌద్ధులు ఎంతో పవిత్రస్థలంగా భావిస్తారు. ఇక్కడ మహా చైత్యం ఉండటంతో వివిధ దేశాల్లోని బౌద్ధులు వచ్చి దర్శించుకుంటారు. 2006లో ఇక్కడే అంతర్జాతీయ కాలచక్ర మహాదీక్ష ఉత్సవాలు నిర్వహించారు. ఆ సమయంలో 14వ దలైలామా టెన్జిన్ గ్యాట్సో బుద్ధగయ నుంచి తెచ్చిన బోధి మొక్క నాటారు. ఇప్పుడది ఏపుగా పెరిగింది. దాని చుట్టూ పర్యాటక ఏర్పాట్లు చేశారు. వివిధ మొక్కలు నాటి, ధ్యానం చేసుకునేలా కుటీరాలతో ఓ 'వేణువనం' సిద్ధం చేశారు. తర్వాత నిర్వహణ లేక అవన్నీ మూలకు చేరాయి. వైకాపా హయాంలో వేణువనాన్ని మూసేశారు. వేణువనాన్ని పునరుద్ధరించి, సందర్శనకు అనుమతించాలని పర్యాటకులు కోరుతున్నారు.

– ఈనాడు, అమరావతి

ఇండిగో విమానం దారి మళ్లింపు

దిబ్రూగఢ్: అహ్మదాబాద్ నుంచి అస్సాంలోని దిబ్రూగఢ్‌కు వస్తోన్న ఇండిగో విమానాన్ని ధూళి తుపాను కారణంగా దారి మళ్లించాల్సి వచ్చింది. దిబ్రూగఢ్ విమానాశ్రయంలో ఆదివారం ధూళి తుపాను ఏర్పడడంతో 144 మంది ప్రయాణికులతో బయలుదేరిన విమానాన్ని అత్యవసరంగా మణిపుర్ రాజధాని ఇంఫాల్‌కు మళ్లించారు. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. వాతావరణం అనుకూలించిన అనంతరం మధ్యాహ్నం 1.20 గంటల ప్రాంతంలో విమానం దిబ్రూగఢ్‌కు చేరినట్లు పేర్కొన్నారు.

వైకాపాలో చేరుతున్నామన్నది అసత్య ప్రచారమే

వంగవీటి రంగా కుమార్తె ఆశాలత



కంభం, న్యూస్‌టుడే: తాము వైకాపాలో చేరుతున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా కుమార్తె ఆశాలత స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లాలోని చారిత్రక కంభం చెరువును ఆదివారం ఆమె సందర్శించి, విలేకర్లతో మాట్లాడారు. కొందరు కావాలనే పనిగట్టుకుని వైకాపాలో చేరికపై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రాధా, రంగా మిత్ర మండలిని ఏకతాటిపైకి తెచ్చి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు సమయం ఉందని, ఏ నిర్ణయమైనా అభిమానుల అభిప్రాయం మేరకే ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

ఏఈవోల సమస్యల పరిష్కారానికి కృషి

ఈనాడు, అమరావతి: వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో) జాబ్‌చార్టు, హోదా మార్పు తదితర సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషిచేస్తామని ఏపీ జేఏసీ ఛైర్మన్, రాష్ట్ర ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. విజయవాడలోని ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన ఏఈవోల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవరావు తమ సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం సంఘ టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎన్జీవో సంఘం రాష్ట్ర కోశాధికారి భారతిప్రసాద్, ఏఈవో సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రెడ్డి, సుబానీ, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరవైల్లో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తే..



రెండు పదుల వయసులో మీరు జంక్ ఫుడ్ తిన్నా, రాత్రి నిద్రపోకుండా ఓటీటీలు చూసినా, వ్యాయామం చేయకపోయినా మీకేమీ తేడాగా అనిపించకపోవచ్చు. కానీ దీనివల్ల 30 ఏళ్ల వయసులో శక్తిహీనత, నొప్పులు, బరువు పెరుగుదల.. ఇలాంటి హెచ్చరిక సంకేతాలు కనిపిస్తాయి. అప్పటికీ జాగ్రత్తపడకపోతే నలభైల్లో ఆరోగ్య సమస్యలు వడ్డీల్లా పెరిగిపోతాయి. అందుకే 20 ఏళ్ల వయసు నుంచే ఆరోగ్యంపై శ్రద్ధపెట్టండి.

– సాన్యా, ఫిట్‌నెస్ మెంటార్

పదవీవిరమణ వరకూ పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్

- ముందే క్రిమినల్ ప్రొసీడింగ్స్ తొలగిపోతే అప్పటివరకే పరిమితం
- సస్పెన్షన్ ఎత్తేస్తే దర్యాప్తును ప్రభావితం చేస్తారు.. అందుకే పొడిగింపు



ఈనాడు, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి, ఏపీ సీఐడీ విభాగం మాజీ అధిపతి పీవీ సునీల్‌కుమార్‌పై విధించిన సస్పెన్షన్‌ను రాష్ట్రప్రభుత్వం మరోమారు పొడిగించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ ప్రొసీడింగ్స్ తొలగేంతవరకూ లేదా జూన్ 30న ఆయన పదవీవిరమణ చేసేవరకూ ఈ రెండింటిలో ఏది ముందైతే అప్పటివరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని పేర్కొంది. సస్పెన్షన్ ఎత్తేస్తే ఆయన నిందితుడిగా ఉన్న కేసులో విచారణలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, ఆధారాలు, సాక్ష్యాలు తారుమారు చేసే ప్రమాదముందని వెల్లడించింది. ఈ నెల 18న జరిగిన రివ్యూ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా సస్పెన్షన్ పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు సీఎస్ కె.విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయనపై విధించిన సస్పెన్షన్ గడువు ఈ నెల 24వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రఘురామకృష్ణరాజుకు చిత్రహింసల వెనుక కుట్ర వెలికితీయాలి

'శాసనసభ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు నరసాపురం ఎంపీగా ఉన్న సమయంలో ఆయన్ను సీఐడీ కస్టడీకి తీసుకుని చిత్రహింసలకు గురిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారనే ఫిర్యాదుపై గుంటూరు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో పీవీ సునీల్‌కుమార్ ప్రధాన నిందితుడు. ఈ కేసులో ఆయన దర్యాప్తు అధికారి ఎదుట హాజరైనా.. వాస్తవాలేవీ చెప్పలేదు. విచారణలో ప్రశ్నలన్నింటికీ సమాధానాలు దాటవేశారు. ఈ కేసులో ఆయనతో పాటు.. అప్పటి సీఐడీ డీఐజీ ఎం.సునీల్‌నాయక్‌ను ఇంకా లోతుగా విచారించాలి. ఈ చిత్రహింసల వెనుక ఉన్న విస్తృత కుట్రను వెలికితీయడం, రఘురామకృష్ణరాజును కొట్టడానికి వినియోగించిన ఆయుధాలు గుర్తించడం వంటివి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దశలో సస్పెన్షన్ ఎత్తేస్తే ఆయన తన పలుకుబడి, పరపతితో కేసుల దర్యాప్తు, విచారణను ప్రభావితం చేయడంతో పాటు, ఆధారాలు, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశముంది' అన్న నిర్ణయానికి వచ్చిన రివ్యూ కమిటీ ఆయన సస్పెన్షన్‌ను పొడిగించాలని నిర్ణయించింది.

◆ వైకాపా హయాంలో సీఐడీ విభాగాధిపతిగా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్.. అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను దుర్వినియోగం చేశారు. తెలంగాణలోని షాద్‌నగర్‌లో అగ్రిగోల్డ్ భూములు కొనుగోలు చేసిన వారిని కామేపల్లి తులసిబాబుతో కలిసి బెదిరించి భారీగా డబ్బు వసూలుచేశారు. సునీల్‌కుమార్ మళ్లించిన నిధులతో ఆయన కుమారులు రోహిత్ శౌర్య, హర్ష... దుబాయ్‌లో స్థిరాస్తి, హోటల్ వ్యాపారాలు చేస్తున్నారు' అంటూ రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదుపై ఏసీబీ విచారణ ఇంకా కొనసాగుతోంది. సాక్షుల విచారణ, వివిధ శాఖల నుంచి డాక్యుమెంట్ల సేకరణ ఇంకా పూర్తి కాలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో సునీల్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై రెగ్యులర్ ఎంక్వైరీ నివేదిక ఇంకా రావాల్సి ఉంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సస్పెన్షన్ పొడిగిస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అనుమతి లేకుండా విదేశీ పర్యటనలు చేశారంటూ తొలుత సస్పెన్షన్

◆ వైకాపా హయాంలో సీఐడీ విభాగాధిపతిగా, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన పీవీ సునీల్‌కుమార్.. రాష్ట్రప్రభుత్వ అనుమతి తీసుకోకుండా తరచూ విదేశీ పర్యటనలకు వెళ్లారని, మరికొన్ని సందర్భాల్లో ఒక దేశానికి వెళ్లేందుకు అనుమతి పొంది మరో దేశంలో పర్యటించారంటూ తొలుత 2025 మార్చి 2న ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. అనంతరం 2025 ఆగస్టు 28 వరకూ ఒకసారి, ఈ ఏడాది ఫిబ్రవరి 24 వరకూ మరోసారి సస్పెన్షన్ పొడిగించింది. ఆ గడువు ముగుస్తున్న నేపథ్యంలో రివ్యూ కమిటీ తాజాగా సమావేశమై సస్పెన్షన్ పొడిగించింది.

తిరుమల నెయ్యి కల్తీపై విచారణ కమిషన్ సబబేనా?

- సవాల్ చేస్తూ సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్
- నేడు సీజేఐ ధర్మాసనం ముందు విచారణ

దిల్లీ: తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసినా దానికి అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిషన్/కమిటీని ఏర్పాటుచేయాలని ఈ నెల 3వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించడాన్ని సవాలుచేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుచేశారు. ఇది సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు విచారణకు రానుంది. కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు కోసం సుప్రీంకోర్టు ప్రత్యేక సిట్ ఏర్పాటుచేసినా దానికి అతీతంగా కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్/కమిటీని ఏర్పాటుచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఆయన ఈ పిటిషన్‌ను ఈ నెల 11న దాఖలు చేయగా, 17న రిజిస్టరైంది.

రాజకీయపార్టీలు, మీడియా సంస్థలను నియంత్రించండి

ఈ కేసులో ట్రయల్ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో తితిదేతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలకు చెందిన వ్యవహారాలపై భక్తుల మనోభావాలను రెచ్చగొట్టేలా మాట్లాడి, విభిన్న వర్గాల మధ్య మతపరమైన విద్వేషాన్ని పెంచేలా ప్రకటనలు, వార్తలు ప్రచురించకుండా రాజకీయ పార్టీలు, మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమ వేదికలు, ఇతర భాగస్వాములను నియంత్రిస్తూ ఉత్తర్వులు జారీచేయాలని సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టును కోరారు.

దినేష్‌కుమార్ కమిటీ ఏర్పాటుకు ముందే దాఖలు

నెయ్యి టెండర్ల పర్యవేక్షణ, నిబంధనల సడలింపుల్లో లోపాలు, ఉద్దేశపూర్వక విస్మరణలు కల్తీ నెయ్యి సరఫరాకు ప్రధాన కారణమయ్యాయని, అందుకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు నియమించిన సిట్ అందించిన నివేదికను అధ్యయనం చేసి ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పాలని పేర్కొంటూ విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20వ తేదీన ఉత్తర్వులు జారీచేసింది. అయితే దీని ఏర్పాటుకు ముందే సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

రాష్ట్రంలో భాజపా అంటే.. బాబు, జగన్, పవన్: షర్మిల

ఈనాడు, అమరావతి: భాజపా అంటే బాబు, జగన్, పవన్‌లా మారారని.. వీరు ప్రధాని మోదీ మౌత్ పీసుల్లా పనిచేస్తున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో చైనా కుక్కబొమ్మతో (రోబో) మోదీ దేశం పరువు తీశారని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. "సమిట్‌లో శాంతియుత నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదం. బాధ్యతారాహిత్యం గురించి చంద్రబాబు, రాజకీయ ఐక్యత గురించి జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది" అని షర్మిల పేర్కొన్నారు.

డిగ్రీ అధ్యాపకులకు ఏఐపై శిక్షణ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు కృత్రిమ మేధ(ఏఐ) అప్లికేషన్లపై ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. ఈ నెల 23 నుంచి మార్చి 13 వరకు రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందించనుంది. 2025-26 విద్యాసంవత్సరం రెండో సెమిస్టర్ నుంచి ఏఐని నైపుణ్యాభివృద్ధి కోర్సుగా ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయించింది.

పప్పీలకూ... రెస్టారెంట్‌లో అతిథి మర్యాదలు



సాధారణంగా పెంపుడు జంతువులను రెస్టారెంట్లకు అనుమతించరు. కుటుంబ సభ్యులతో కలిసి డిన్నర్ చేయడానికి ప్లాన్ చేసుకుంటే.. ఆ రోజు పెంపుడు జంతువులను ఇంట్లోనే వదిలిపెట్టి వెళ్లాలి. ఇది యజమానుల మనసుకు బాధ కలిగించే అంశమే. అలాంటి వారికి పెంపుడు జంతువులతోపాటు ఆహ్వానం పలుకుతోంది విశాఖలోని 'పాఫీ రెస్టారెంట్ పెట్ ఫ్రెండ్లీ రెస్టో కేఫ్'. ఇది జంతు ప్రేమికులను విశేషంగా ఆకర్షిస్తోంది.

పెంపుడు జంతువులకు ఈతకొలను

ఆరు నెలల క్రితం సాగర్‌నగర్‌లో ఈ రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. పెంపుడు జంతువుల కోసం పలు సౌకర్యాలు అందుబాటులో ఉంచారు. ప్రవేశం ఉచితం. పెంపుడు జంతువులకు శిక్షణ పొందిన సిబ్బందితో ఇక్కడ సేవలు అందిస్తారు. ఈ రెస్టారెంట్‌కు తీసుకెళ్లే పప్పీలకు ప్రత్యేక ఈత కొలను, ప్లే జోన్, సంగీతం వినిపించే సౌకర్యాలున్నాయి. ఈత కొలను వినియోగానికి కొంత రుసుం తీసుకుంటారు.

ప్రత్యేక మెనూ...

పెంపుడు జంతువుల కోసం ప్రత్యేక మెనూ అందుబాటులో ఉంచారు. వీటి ధరలు రూ.150 నుంచి ఉంటాయి. చికెన్, మటన్, చేప, వెజ్ సూప్స్, రైస్‌బౌల్స్, చిరుతిండ్లు, బిస్కెట్స్, కీర, క్యారెట్, వాటర్‌మిలన్ జ్యూస్‌లు అందుబాటులో ఉంటాయి. కొన్ని జంతువులు యజమానితో కలిసి అదే టేబుల్‌పై ఆహారాన్ని దర్జాగా తింటాయి. పెంపుడు జంతువులకు అవసరమైన పెట్ స్టోర్, గ్రూమింగ్ ఏరియా సైతం అందుబాటులో ఉంచారు. ఇక్కడ వైఫై ఉపయోగించుకుని ల్యాప్‌టాప్‌లో పని చేసుకుంటూ ఓ కాఫీ తాగేలోపు పప్పీకి హెయిర్ కటింగ్, స్నానం చేయించి ఇస్తారు.



తమ పెట్‌తో రెస్టారెంట్‌కు వచ్చిన ఓ కుటుంబం

పుట్టినరోజు వేడుకలు..



పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్న ఓ పప్పీ....

పెంపుడు జంతువులకు పుట్టిన రోజు వేడుకలు కూడా ఇక్కడ చేస్తారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన కేకులు అందుబాటులో ఉంటాయి. ఇప్పటి వరకు ఇరవైకి పైగా పెంపుడు జంతువుల పుట్టిన రోజు వేడుకలు నిర్వహించామని యజమానులు మృణాళిని, బాషా దంపతులు తెలిపారు. పెంపుడు జంతువులతోపాటు కుటుంబ సభ్యులంతా కలిసి వచ్చి ఉల్లాసంగా గడిపి వెళ్లాలనే ఉద్దేశంతోనే ఈ రెస్టారెంట్ పెట్టామని చెబుతున్నారు.

- ఈనాడు, విశాఖపట్నం

(c) eenadu

కొడైకెనాల్ గెస్ట్‌హౌస్‌లో వ్యాపారవేత్త దారుణహత్య

● నగలు, నగదు, పత్రాలు దోచుకెళ్లిన దుండగులు


సూర్య నారాయణన్

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: తమిళనాడులోని కొడైకెనాల్‌లో వ్యాపారవేత్త, తమిళ సినీనటి తండ్రి దారుణ హత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన సూర్యనారాయణన్(73)కు ప్రముఖ పర్యాటక కేంద్రమైన కొడైకెనాల్‌లో గెస్ట్‌హౌస్ ఉంది. ఇందులో కోయంబత్తూర్‌కు చెందిన ఐదుగురు యువకులు రెండు రోజులుగా ఉంటున్నారు. శనివారం సాయంత్రం అక్కడ పనిచేసేవారు ఇళ్లకు వెళ్లిపోగా.. ఓ గదిలో సూర్యనారాయణన్, ఆయన సహాయకులు ఆర్ముగం, మురళి ఉన్నారు. ఇది గమనించిన మరో గదిలోని యువకులు సూర్యనారాయణన్ సహాయకులను తాళ్లతో కట్టేశారు. అనంతరం సూర్యనారాయణన్‌ని కుర్చీలో కూర్చోబెట్టి టేపుతో నోరు, ముక్కు, ఒళ్లంతా చుట్టేసి హత్య చేశారు. తాళ్లను విడిపించుకున్న ఓ సహాయకుడు బయటకు పరుగులు తీసి స్థానికులకు విషయం చెప్పాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గెస్ట్‌హౌస్‌లోని నగలు, నగదు, ముఖ్యమైన పత్రాలు, సీసీటీవీ హార్డ్‌డిస్క్‌ను దుండగులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. వారి కోసం గాలిస్తున్నారు. తమిళ సినిమా 'మాయావి'లో దివ్యాంగురాలిగా నటించిన విష్ణుప్రియ తండ్రి సూర్యనారాయణన్. కుమార్తె ప్రేమ వ్యవహారంలో డ్రైవర్‌ని హత్య చేయించినట్లు సూర్యనారాయణన్‌పై కేసు నమోదై, కోర్టులో విచారణలో ఉంది.

ఐదుగురు పోలీసులను బలి తీసుకున్న లారీ

● ఒడిశాలోని ఝార్సుగుడలో దుర్ఘటన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాత్రంతా గస్తీ నిర్వహించి ఆదివారం తెల్లవారుజామున పోలీస్‌స్టేషన్‌కు బొలెరో వాహనంలో వస్తున్న పోలీసు సిబ్బందిని మృత్యువు లారీ రూపంలో కాటేసింది. దీంతో ఘటనా స్థలంలోనే ఐదుగురు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఒడిశాలోని ఝార్సుగుడ సదర్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో 49వ నంబరు రహదారి వద్ద ఈ ఘటన జరిగింది. వేగంగా దూసుకొచ్చిన లారీ పోలీసుల వాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం బరగఢ్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. స్వల్ప గాయాలైన కానిస్టేబుల్ ఝార్సుగుడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరణించిన ఐదుగురూ ఝార్సుగుడ ఠాణా సిబ్బందే. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను ఝార్సుగుడ పోలీసులు అరెస్టు చేశారు. మరణించినవారిని ఎస్సై నిరంజన్ కుజురు, కానిస్టేబుళ్లు లింగరాజ్ ధరువా, దేవదత్తసింగ్, కాశీరామ్ బోయ్, హోంగార్డు భక్తబంధు మీర్ధాగా గుర్తించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

పేదల గూడుకు 10.42 లక్షల దరఖాస్తులు

● ఏప్రిల్ నుంచి మంజూరు చేయనున్న కేంద్రం
● ఇప్పటికి 60 వేల మంది అనర్హులుగా గుర్తింపు



ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇంటి నిర్మాణానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ్ 2.0 పథకం కింద 10.42 లక్షల మంది సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి 8.29 లక్షల మంది, స్థలం, ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు 2.13 లక్షల మంది ఉన్నారు. ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ ఇళ్లను మంజూరు చేయనుంది.

క్షుణ్నంగా పరిశీలన

ఇంటి కోసం వచ్చిన దరఖాస్తుల్ని ఆయా రాష్ట్రాలకు చెందిన క్షేత్రస్థాయి గృహనిర్మాణశాఖ అధికారులు తనిఖీ చేసి ఆమోదం తెలిపినా కేంద్ర ప్రభుత్వం మరోసారి ఆ వివరాల్ని పరిశీలిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన వివరాల్ని కేంద్రానికి నివేదించింది. మొత్తం 10.42 లక్షల దరఖాస్తుల్లో 5.24 లక్షల్ని కేంద్రం బ్యాక్ ఎండ్‌లో పున:పరిశీలిస్తోంది. ఇందులో 60వేల దరఖాస్తులను అనర్హులుగా గుర్తించింది. మార్చి 3 వరకు కేంద్రం పరిశీలన గడువు ఉంది.

ఎస్సీ, ఎస్టీలు భారీగానే..

పీఎంఏవై గ్రామీణ్-2.0కి వచ్చిన దరఖాస్తుల్లో ఎస్సీ, ఎస్టీలు భారీగానే ఉన్నారు. 1.43 లక్షలమంది ఎస్టీలు, 2.16 లక్షల మంది ఎస్సీలు సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దివ్యాంగులు 4,965 మంది ఉన్నారు. ఇతరులు 6.92 లక్షల మంది ఉన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం రెండు విధాలుగా చేపడుతోంది. సొంత స్థలముండి అక్కడే నిర్మాణం చేపడతామనే వారికి ఇల్లు (ఆర్థికసాయం) మంజూరు చేయనుంది. స్థలం లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లను కేటాయించి అక్కడ నిర్మాణం చేపట్టేందుకు ఇల్లు మంజూరుచేస్తుంది. సొంత స్థలమున్న, స్థలం లేనివారి వివరాల్ని అధికారులు సేకరించారు.

అత్యంత పేదలకే మొదటి ప్రాధాన్యం

దరఖాస్తుదారుల్లో అత్యంత పేదలకే తొలిగా కేంద్రం ఇళ్లను మంజూరు చేయనుంది. ఆ మేరకు దరఖాస్తుదారుల నుంచి తీసుకున్న వివరాల ఆధారంగా ఎంపిక చేయనుంది. ఒంటరి మహిళలు, వితంతువులు, ఎస్టీ, ఎస్సీలు, బీసీలు ఇలా ప్రాధాన్య క్రమంలో ఇల్లు మంజూరు చేస్తారు.

8 జిల్లాల్లో 50 వేలకు మించి..

ఇంటి నిర్మాణానికి వచ్చిన దరఖాస్తుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా తొలిస్థానంలో ఉంది. రెండో స్థానంలో శ్రీకాకుళం ఉంది. 8 జిల్లాల్లో 50 వేలకు మించి దరఖాస్తులొచ్చాయి. అత్యల్పంగా విశాఖ జిల్లా నుంచి వచ్చాయి.

జిల్లా	దరఖాస్తులు		
అల్లూరి సీతారామరాజు	77,353	నంద్యాల	34,880
అనకాపల్లి	45,129	నెల్లూరు	60,873
అనంతపురం	66,969	ఎన్టీఆర్	22,126
అన్నమయ్య	68,508	పల్నాడు	45,348
బాపట్ల	21,698	పార్వతీపురం మన్యం	31,325
చిత్తూరు	50,460	ప్రకాశం	41,706
తూర్పుగోదావరి	23,676	శ్రీసత్యసాయి	63,586
ఏలూరు	54,234	శ్రీకాకుళం	75,117
గుంటూరు	25,254	తిరుపతి	42,813
కాకినాడ	28,621	విశాఖ	7433
కోనసీమ	27,667	విజయనగరం	39,559
కృష్ణా	10,445	పశ్చిమగోదావరి	16,773
కర్నూలు	31,015	వైఎస్సార్ కడప	29,631
		మొత్తం	10,42,199



మాట్లాడుతున్న జ్యోతి యర్రాజి. చిత్రంలో వీఐటీ యూనివర్సిటీ ప్రతినిధులు

సవాళ్లను స్వీకరిస్తూ లక్ష్యం వైపు సాగాలి

● వీఐటీ-ఏపీలో అథ్లెట్ జ్యోతి యర్రాజి
● వార్షిక క్రీడాపోటీల బహుమతుల ప్రదానం

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, తుళ్లూరు: జీవితంలో విజయం సాధించాలంటే సవాళ్లను, సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజి అన్నారు. అమరావతిలోని వీఐటీ-ఏపీ యూనివర్సిటీలో విటోపియా-2026 ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వార్షిక క్రీడాపోటీల్లోని విజేతలకు ఆదివారం బహుమతుల ప్రదానం కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. తొలుత 5 కిలోమీటర్ల మారథాన్‌లో జ్యోతి యర్రాజి పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ముఖాముఖిలో విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వీఐటీ-ఏపీ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ పి.అరుల్మొళివర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగం కావాలని, జ్యోతి యర్రాజిని స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ముందడుగు వేయాలని సూచించారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సురేష్ మాట్లాడారు. సాయంత్రం జరిగిన ప్రో-షోలో మోహన భోగరాజు, అబ్దుల్ వహాబ్ బ్యాండ్, డీజే నోటోరియస్ సంగీత విభావరులు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో వీఐటీ-ఏపీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ ఎస్.గోపికృష్ణన్, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖాదీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది ఎల్‌ఈటీ ఉగ్రవాదుల అరెస్టు

● వారిలో ఏడుగురు బంగ్లాదేశీయులు
● తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో దిల్లీ పోలీసుల దాడులు

చెన్నై (ఆర్కే నగర్)- న్యూస్‌టుడే, దిల్లీ: ఉగ్రవాద అణచివేత చర్యల్లో భాగంగా దిల్లీ పోలీసులు దేశంలోని మూడు రాష్ట్రాల్లో విస్తరించిన లష్కరే తయ్యిబా (ఎల్‌ఈటీ) మాడ్యూల్‌ను ఛేదించారు. ఏడుగురు బంగ్లాదేశీయులు సహా ఎనిమిది మందిని అరెస్టుచేశారు. వీరంతా భారత్‌లోకి ప్రవేశించి నకిలీ గుర్తింపు పత్రాలతో చలామణి అవుతున్నట్లు ఓ అధికారి చెప్పారు. దేశ రాజధాని దిల్లీలోని వివిధ ప్రాంతాల్లో ఉగ్రవాది బుర్హాన్ వానీ చిత్రాలతో కూడిన.. పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థల అనుకూల నినాదాలున్న పోస్టర్లు వెలిసిన సంగతి తెలిసిందే. వీటి వెనుక తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో నక్కిన ఈ మాడ్యూల్ హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంటున్న జమ్మూ-కశ్మీర్‌కు చెందిన ఎల్‌ఈటీ ఉగ్రవాది షబ్బీర్ అహ్మద్ లోన్ అలియాస్ రజా అలియాస్ కశ్మీర్ ఈ మాడ్యూల్ నిర్వహిస్తున్నట్లు పోలీసు అదనపు కమిషనర్ (ప్రత్యేక విభాగం) ప్రమోద్‌సింగ్ ఆదివారం తెలిపారు. పోస్టర్ల విషయమై అందిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన దిల్లీ పోలీసులు ఈ నెల 15న పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన ఉమర్ ఫారుక్ (31), బంగ్లాదేశ్‌కు చెందిన రోబియుల్ ఇస్లాం (31)లను అరెస్టు చేశారు. శనివారం తమిళనాడులోని తిరుప్పూర్‌లో ఏకకాలంలో దాడులు జరిపి, బంగ్లాదేశ్‌లోని బోగురా జిల్లాకు చెందిన మరో ఆరుగురిని అరెస్టు చేశారు. వీరిని మొహమ్మద్ మిజానూర్ రెహ్మాన్ (32), మొహమ్మద్ సెహాయత్ హొస్సేన్ (34), మొహమ్మద్ జహీదుల్ ఇస్లాం (40), మొహమ్మద్ లిటన్ (40), మొహమ్మద్ ఉజ్జల్ (27), ఉమర్ (32)లుగా గుర్తించారు. బంగ్లాదేశ్‌కు చెందిన వీరు కార్మికుల ముసుగులో తిరుప్పూర్ వచ్చి బనియన్ కంపెనీల్లో చేరారని పోలీసులు తెలిపారు.

పోస్టర్లు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం

దాడుల సందర్భంగా, నిందితులు ఉంటున్న ఇళ్ల నుంచి పాకిస్థాన్ అనుకూల, ఉగ్రవాద అనుకూల పోస్టర్లు, అభియోగాలకు సంబంధించిన సమాచారం ఉన్న 10 మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులు, 25 క్రెడిట్/ డెబిట్ కార్డులు, ఐదు పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాలు, బంగ్లాదేశ్ పాస్‌పోర్టులు, గుర్తింపు కార్డులను స్వాధీనం చేసుకున్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పీవీఎన్ మాధవ్. చిత్రంలో పల్లా శ్రీనివాసరావు తదితరులు

కాంగ్రెస్ తీరుతో దేశ ప్రతిష్ఠకు భంగం

● భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: దిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌లో కాంగ్రెస్ శ్రేణుల ప్రవర్తనతో దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. వారి తీరుకు నిరసనగా ఎన్డీయే ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ఆందోళన నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వేదికపై యూత్ కాంగ్రెస్ నేతల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా 2.5 లక్షల మంది పరిశీలకులు, 600కు పైగా స్టార్టప్‌లు, 3,250 మందికి పైగా నిపుణులు పాల్గొన్న వేదికను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించుకోవడం సిగ్గుచేటన్నారు.






EENADU Vol: 52, Issue: 194 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఈనాడు సినిమా

పవన్‌కల్యాణ్‌కు పాటాభిషేకం



"థియేటర్‌కి వచ్చే ప్రతి అభిమాని అత్యుత్తమమైన పవన్‌కల్యాణ్‌ని ఇందులో చూడాలనే తపనతో సినిమాని చేశా. ఇందులో ఆయన్ను రెండు గంటలపాటు తృప్తిగా చూసుకుంటార"న్నారు హరీశ్‌శంకర్. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించారు. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం మార్చి 26న ప్రేక్షకుల ముందుకొస్తోంది. 'ఆర్ ఆఫ్ ఉస్తాద్...' అంటూ సాగే ఈ చిత్రంలోని పాటని ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. దేవిశ్రీప్రసాద్ స్వరకల్పనలోని ఈ పాటని ఆయనతోపాటు, పి.అభిషేక్ అండ్ ది ఇండియన్ కోరల్ ఎన్సెంబుల్ కలిసి ఆలపించారు. చంద్రబోస్ రచించారు. పాట విడుదల అనంతరం హరీశ్‌శంకర్ మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు, ఇతర సినీ ప్రేమికులు ఏమేం కోరుకుంటారో అవన్నీ పుష్కలంగా ఈ సినిమాలో ఉంటాయి. పాటలు, డ్యాన్సులు, వినోదం, సంభాషణలు, పవన్‌కల్యాణ్ మార్క్ హెయిర్, డ్రెస్సింగ్ స్టైల్... ఇలా అన్నీ ఉంటాయి. సహజంగా ఆయనలో ఉండే వెటకారం, ఉత్సాహం, స్టైల్ ఇందులో చూస్తారు. పవన్‌కల్యాణ్ ప్రాణం పెట్టి పనిచేశారు. కొన్నిసార్లు పగలు మంగళగిరిలో ఉంటూ, రాత్రి ఇక్కడకు వచ్చేవారు. రోజుకి 18 గంటలు పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. పవన్‌కల్యాణ్‌పై నాకున్న ప్రేమని చూపించేలా ఓ ప్రేమలేఖలా ఉండాలనుకున్నా. దానికి చంద్రబోస్ సిరా ఇచ్చారు. ఇందులో ప్రతీ పాట ఓ పండగలా ఉంటుంది. సినిమాలో ఒక సన్నివేశంలో 'మెడ ముట్టుకుంటే.. తొడ కొట్టినట్టే...' అనే సంభాషణ వస్తుంది. రెండు దశాబ్దాలుగా ఉన్న పవన్‌కల్యాణ్ మేనరిజమ్‌కి ఓ మాట రూపం ఇవ్వాలనే ఈ సంభాషణని రాశా. ఈ పాటకి ఇదే హుక్‌లైన్ అని చెప్పగానే సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఎగిరి గంతేశారు. ఇది అభిమానంతో వచ్చిన పాట కాదు, పవన్‌కల్యాణ్‌పై అవగాహనతో వచ్చిన పాట. ప్రతీ అభిమాని తన గురించి ఏం అనుకుంటారో ఈ పాటలో వినిపిస్తుంది. హీరోయిజం నేపథ్యంలో పాట రాస్తే అది ఏ హీరోకైనా సరిపోయేలా ఉంటుంది. కానీ ఈ పాట మాత్రం పవన్‌కల్యాణ్‌కి తగ్గట్టుగానే ఉంటుంది. ఈ పాటతో పవన్‌కల్యాణ్‌కు దేవిశ్రీప్రసాద్ పాటాభిషేకం చేస్తే, చంద్రబోస్ సిరాభిషేకం చేశారు. నిర్మాత నవీన్, రవిశంకర్ ఏ రోజూ చిన్నపాటి అసహనం, నిరాశ లేకుండా నిర్మాణంలో సహకారం అందించారు" అన్నారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ "ఈ పాట చాలా ప్రత్యేకమైనది. ఎప్పటికీ నిలిచిపోతుంది. ఇంత గొప్ప పాట పుట్టడానికి ప్రధాన కారణం హరీశ్‌శంకర్. ఇంతకుముందు విడుదల చేసిన దేఖ్‌లేంగే... పాట విని చాలా రోజుల తర్వాత నాకు డ్యాన్స్ చేయాలనే ఉత్సాహం కలిగిందని పవన్‌కల్యాణ్ చెప్పారు. ఈ పాట విన్నాక కూడా ఫోన్ చేసి చాలా బాగుందని అభినందించార"న్నారు. గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్ తొలి సినిమా నుంచీ నేను ఆయనకు పాటలు రాస్తున్నా. 'గబ్బర్‌సింగ్' సినిమాలోని ఆకాశం అమ్మాయైతే... మా కలయికలోనే వచ్చింది. ఇప్పుడు మళ్లీ మేం అందరం కలిసి ఈ పాట చేశాం. పవన్‌కల్యాణ్ నిజమైన మనస్తత్వం, ఆయన వ్యక్తిత్వం, నమ్మిన సిద్ధాంతాలు, ఆయన ఆచరించే సూత్రాలు, ఎంచుకున్న మార్గం, ఆ మార్గంలో పయనించే విధానం ఈ పాటలో వినిపిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠం వైస్‌ఛైర్మన్ ప్రీతిరెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవికి ఘనసన్మానం


కె.రాఘవేంద్రరావు, చిరంజీవి, కె.వి.రావు, అనిల్ రావిపూడి, బి.గోపాల్

'మన శంకరవరప్రసాద్‌గారు' మన విజయాన్ని పురస్కరించుకుని కథానాయకుడు చిరంజీవి, ఇతర చిత్రబృందాన్ని కాకినాడ పోర్ట్ చైర్మన్ కె.వి.రావు ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటితోపాటు, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతోపాటు సినీ ప్రముఖులు కె.రాఘవేంద్రరావు, సి.అశ్వనీదత్, అల్లు అరవింద్, డి.సురేష్‌బాబు, ఎ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, వి.వి.వినాయక్, బాబీ, బుచ్చిబాబు సానా, బండ్ల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

జై హనుమాన్‌కి శ్రీకారం


రిషబ్ శెట్టి, ప్రశాంత్ వర్మ

'హను-మాన్' చిత్రంతో జాతీయ స్థాయిలో సత్తా చాటారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఇప్పుడాయన ఆ సినిమాకి కొనసాగింపుగా 'జై హనుమాన్'ను పట్టాలెక్కించారు. రిషబ్ శెట్టి టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. టీ సిరీస్ భూషణ్ కుమార్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా హనుమంతుడి జన్మస్థలంగా విశ్వసించే హంపీలోని అంజనాద్రి బెట్టలో ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి భూషణ్ కుమార్ క్లాప్ కొట్టగా.. అనిల్ థడానీ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. తేజ సజ్జా గౌరవ దర్శకత్వం వహించారు. నవీన్ ఎర్నేని, రవిశంకర్, అనిల్, భూషణ్ సంయుక్తంగా దర్శకుడికి స్క్రిప్ట్ అందించారు. రిషబ్ ఇందులో ఆంజనేయ స్వామి పాత్రలో అలరించనున్నారు. "కలియుగం నేపథ్యంలో సాగే భారీ యాక్షన్ చిత్రమిది. దీంట్లో పురాణ అంశాలకు ప్రాధాన్యత ఉంటుంది. హనుమంతుడి భక్తి, విశ్వాసం, శాశ్వత బలానికి ప్రతీకలా ఈ సినిమా నిలవనుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. తొలి భాగంలో నటించిన తేజ ఇందులోనూ అదే పాత్రలో అలరించనున్నట్లు తెలుస్తోంది. రానా దగ్గుబాటి ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ సినిమాకి ఎంఎం కీరవాణి సంగీతమందిస్తున్నారు. శ్రీనాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్‌గా.. ఎస్ తిరునావుక్కరసు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఉత్తమ చిత్రం 'పుష్ప 2'.. ఉత్తమ నటుడు అల్లు అర్జున్


అల్లు అర్జున్

ప్రతిష్ఠాత్మక 70వ ఫిల్మ్‌ఫేర్ పురస్కారాల్లో 'పుష్ప 2' చిత్రం సత్తా చాటింది. అస్సలు తగ్గేదేలే... అంటూ అత్యధికంగా నాలుగు పురస్కారాల్ని సొంతం చేసుకుంది. కేరళలోని కొచ్చిలో ఇటీవల ఫిల్మ్‌ఫేర్ సౌత్ పురస్కారాల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. దక్షిణాది చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖ తారలు, సాంకేతిక నిపుణులు ఈ వేడుకకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. 2024లో విడుదలైన సినిమాలకుగానూ ఈ పురస్కారాల్ని ప్రదానం చేశారు. 'పుష్ప 2' చిత్రానికిగానూ ఉత్తమ నటుడుగా అల్లు అర్జున్ పురస్కారాన్ని గెలుపొందారు. అదే చిత్రానికిగానూ ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, ఉత్తమ స్వరకర్తగా దేవిశ్రీప్రసాద్, ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్లుగా రామకృష్ణ, మోనిక... 'కల్కి 2898 ఏడీ' ప్రొడక్షన్ డిజైనర్ నితిన్ జిహానీతో కలిసి పురస్కారాల్ని అందుకున్నారు. '35 చిన్న కథ కాదు' చిత్రానికిగానూ ఉత్తమ నటి పురస్కారాన్ని నివేదా థామస్ అందుకున్నారు. ఉత్తమ సహాయ నటుడుగా అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ), ఉత్తమ సహాయనటిగా అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి), ఉత్తమ తొలి చిత్ర దర్శకుడుగా యదువంశీ (కమిటీ కుర్రోళ్ళు), ఉత్తమ తొలి చిత్ర నటుడుగా సందీప్ సరోజ్ (కమిటీ కుర్రోళ్ళు), ఉత్తమ తొలి చిత్ర నటిగా నయన్ సారిక (గం గం గణేశా), ఉత్తమ గీత రచయితగా రామజోగయ్య శాస్త్రి (చుట్టమల్లె చుట్టేస్తోంది: దేవర), ఉత్తమ గాయకుడుగా శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టి: గుంటూరు కారం), ఉత్తమ గాయనిగా శిల్పారావు (చుట్టమల్లె - దేవర), ఉత్తమ నృత్యదర్శకుడిగా శేఖర్ (కుర్చీ మడతపెట్టి - గుంటూరు కారం), విమర్శకులు మెచ్చిన ఉత్తమ చిత్రంగా (లక్కీభాస్కర్), ఉత్తమ నటుడిగా తేజ సజ్జా (హను-మాన్), ఉత్తమ నటిగా కాజల్ అగర్వాల్ (సత్యభామ) పురస్కారాల్ని గెలుపొందారు. తమిళ, కన్నడ, మలయాళ చిత్రాలకూ, తారలకూ పురస్కారాల్ని ప్రదానం చేశారు.


విజయ్ దేవరకొండ, రష్మిక

విరోష్ వివాహం

ప్రముఖ తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తొలిసారి తమ వివాహం గురించి స్పందించారు. విరోష్ అంటూ తమ వివాహానికి ఎంతో ప్రేమతో అభిమానులు పేరు పెట్టారని, ఆ నిర్ణయాన్ని గౌరవిస్తూ అదే పేరుని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. విజయ్, రష్మిక కలిసి ఆదివారం రాత్రి ఇన్‌స్టాలో ఓ పోస్టని పంచుకున్నారు. "మేం మాకోసం ఏదైనా ఎంచుకోవాలనుకునేలోపే అభిమానులు స్పందించి ఆ పనిని పూర్తి చేసి పెడుతున్నారు. పెళ్లి విషయంలోనూ ఎంతో ప్రేమతో విరోష్ అని పేరు పెట్టి పిలుచుకుంటున్నారు. ఆ మేరకే మా పెళ్లి వేడుకకి వెడ్డింగ్ ఆఫ్ విరోష్ అని పేరు పెట్టాలని నిర్ణయించాం. మమ్మల్ని ఇంత ప్రేమాభిమానులతో ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు. అభిమానులు మాలో ఒక భాగం" అంటూ ఆ పోస్టులో రాసుకొచ్చారు విజయ్, రష్మిక. ఈ ఇద్దరి పేర్లని కలిపే విరోష్ అని నామకరణం చేశారు అభిమానులు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల్లో నటించి ప్రేక్షకుల్ని అలరించిన ఈ జంట ఈ నెల 26న కలిసి ఏడడుగులు వేయనుంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్ వివాహానికి వేదిక కానుంది. హైదరాబాద్‌లో మార్చి 4న వివాహ విందు వేడుకని నిర్వహించనున్నారు.

బంగారం వచ్చేది ఆరోజే


సమంత

'మా ఇంటి బంగారం' సినిమాతో ఈ వేసవి బరిలో సందడి చేయనుంది కథానాయిక సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ నాయికా ప్రాధాన్య చిత్రాన్ని నందినీ రెడ్డి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఓ బేబీ' విజయం తర్వాత వీళ్లిద్దరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత, రాజ్ నిడిమోరు, హిమాన్క్ దువ్వూరు నిర్మిస్తున్నారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం మే 15న థియేటర్లలోకి రానున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈమేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. అందులో తలుపు చాటు నుంచి తొంగి చూస్తున్నట్లుగా సామ్ కనిపించిన తీరు ఆసక్తిరేకెత్తించింది. "ఇదొక విభిన్నమైన రియలిస్టిక్ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్. సమంత పాత్ర రెండు కోణాల్లో అలరించనుంది. తన పాత్రలోని యాక్షన్ కోణం అందర్నీ ఆశ్చర్యపరిచేలా ఉండనుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సంతోష్ నారాయణన్, ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్.

లవ్ లాజన్ రాక అప్పుడేనా?



'తుడరుమ్' సినిమాతో విజయవంతమైన జోడీ అనిపించుకున్నారు మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్, దర్శకుడు తరుణ్ మూర్తి. ఈ హిట్ కలయికలో మరో సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. 'ఎల్ 366'(వర్కింగ్ టైటిల్) అనే పేరుతో పట్టాలెక్కిన ఈ చిత్ర షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్రాన్ని అక్టోబరు లేదా నవంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో లవ్ లాజన్ అనే పోలీసు అధికారిగా కనిపించనున్నారు మోహన్‌లాల్. ఈ చిత్రంలో మీరా జాస్మిన్.. నైసీ పాత్రలో అలరించనుంది. జూన్ నాటికి చిత్రీకరణ పూర్తయ్యే అవకాశముందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మోహన్‌లాల్ ఖాతాలో 'పేట్రియాట్', 'దృశ్యం 3', 'జైలర్ 2' లాంటి తదితర చిత్రాలు ఉన్నాయి.

పాత్రలతో ప్రయోగాలు చేయడమే ఇష్టం!


మాళవిక మోహనన్

ఈ ఏడాది ప్రారంభంలోనే అగ్ర హీరో ప్రభాస్‌తో కలిసి 'రాజాసాబ్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది కథానాయిక మాళవిక మోహనన్. వైవిధ్యమైన కథలతో దక్షిణాదిలో మంచి క్రేజ్ సంపాదించుకుంటోన్న ఈ భామ ఖాతాలో 'సర్దార్ 2' చిత్రం ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. ఇందులో నటించడం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. 'సర్దార్ 2' విడుదల కోసం అందరిలానే నేనూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఇందులో నేను కొన్ని కూల్, ఛాలెంజింగ్ సన్నివేశాలను చిత్రీకరించాను. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్ అయితే నరాలు కదిలించేవిగా ఉన్నాయి. నేను ఎంతో కష్టపడి చేసిన సన్నివేశాలన్నీ తెరపై చూడటానికి ఉత్సాహంగా వేచి చూస్తున్నా. ఈ సినిమాలో నా పాత్ర.. మునుపటి చిత్రాలకు చాలా భిన్నంగా ఉంటుంది. నాకు పాత్రలతో ప్రయోగాలు చేయడమంటేనే ఎక్కువ ఇష్టం" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం మాళవిక.. విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నావెల్' చిత్రీకరణలో బిజీగా ఉంది.

విధి వేచి చూస్తోంది!



కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ వరుస విజయాలతో జోరుమీదున్నారు నటుడు నివిన్ పౌలీ. ఇప్పుడాయన... ఓ పొలిటికల్ థ్రిల్లర్‌తో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు. నివిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ప్రతిఛాయ'. ఉన్నికృష్ణన్.బి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇప్పుడు రాజకీయాల్లో వ్యక్తిత్వాలు లేవు.. చిత్రాలు మాత్రమే' అంటూ ఇటీవలే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది చిత్రబృందం. "ఒడిదొడుకుల మధ్య విధి వేచి చూస్తోంది" అనే వ్యాఖ్యను జోడించింది. రాజకీయ పార్టీల మధ్య సంఘర్షణ నేపథ్యంలో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో బాలచంద్ర మేనన్, సాయి కుమార్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

ఇప్పుడలాంటి ప్రయత్నాలు చేయాలనుకోవట్లేదు!


సుదర్శన్

ప్రేక్షకులకు వినోదాన్ని పంచిచ్చేందుకు ఎలాంటి పాత్రలు చేయడానికైనా వెనకాడనన్నారు హాస్యనటుడు సుదర్శన్. 'హే బల్‌వంత్'లో తాను పోషించిన బంక పాత్రకు సినీప్రియుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటం ఆనందాన్నిస్తోందని తెలిపారు. సుహాస్ - శివానీ నాగారం జంటగా నటించిన ఈ చిత్రాన్ని గోపీ అచ్చర తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఇది ఇటీవల విడుదలైన నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు సుదర్శన్.

- "మేము నమ్మినట్లుగానే 'హే బల్‌వంత్'కి ప్రేక్షకుల నుంచి చాలా క్రేజీ ఆదరణ లభిస్తోంది. ఇది ఆద్యంతం వినోదాత్మకంగా ఉందని ప్రశంసిస్తున్నారు. దీంట్లో నేను చేసిన బంక పాత్రతో పాటు వెన్నెల కిశోర్, నరేశ్, సుహాస్, శివాని ఇలా ప్రతి ఒక్కరీ పాత్ర కడుపుబ్బా నవ్వించింది. ముఖ్యంగా సుహాస్‌తో చేసిన మందు సిట్టింగ్ సీన్, వెన్నెల కిశోర్‌తో చేసిన ప్రకృతి చికిత్సాలయం సీన్స్‌కు థియేటర్లు ఊగిపోతున్నాయి".
- "నేను అనుకోకుండా చిత్ర పరిశ్రమలోకి వచ్చా. తెరపైకి రాకముందు 'అమెరికాకు దారేది' అనే లఘు చిత్రంలో నటించా. దానికి ఊహించని రీతిలో మంచి ఆదరణ లభించడంతో.. 'రన్ రాజా రన్'లో నటించే అవకాశం దొరికింది. అలా నేనీ పరిశ్రమలోకి వచ్చా. ఇన్నేళ్లలో నేను చేసిన ప్రతి పాత్ర నాకు మంచి సంతృప్తినిచ్చింది. 'కుమారి 21ఎఫ్', 'పటాస్', 'సామజవరగమన', 'కిష్కింధపురి', 'నారీ నారీ నడుమ మురారి'.. ఇలా ప్రతి సినిమా నన్ను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ, కన్నడ నుంచి అవకాశాలు వస్తున్నాయి".
- "హాస్యనటులు హీరోగా చేస్తే కమెడియన్‌గా అవకాశాలు తగ్గిపోతాయన్న మాటలో నిజం లేకపోలేదు. ఒక సినిమాలో హీరోగా చేశాక మనకి వేరే చిత్రాల్లో చిన్న పాత్రలు ఇవ్వకూడదని.. అలా ఇస్తే బాగుండదని కొంతమంది భావించొచ్చు. దానివల్ల అవకాశాలు తగ్గిపోతాయి. నా కెరీర్ ఇప్పుడే ఊపందుకుంటోంది. అందుకే ఇప్పుడు నేను అలాంటి ప్రయత్నాలు చేయాలనుకోవట్లేదు. ఒకవేళ నేను హీరోగా చేయాలంటే అది హీరోలు చేయలేని చిన్న కాన్సెప్ట్ మూవీ అయ్యి ఉండాలి. అంతేతప్ప థియేటర్స్‌లో విడుదలయ్యే మెయిన్ లీడ్ సినిమా చేయాలని లేదు. కమెడియన్‌గా అందరి హీరోలతోనూ కలిసి పని చేయాలని ఉంది. ప్రస్తుతం 'మృత్యుంజయ్', 'గోదారి గట్టుమీద' చిత్రాల్లో మంచి పాత్రలు చేశా. అలాగే మరికొన్ని సినిమాలు చేస్తున్నా".

సరికొత్త సైఫై థ్రిల్లర్..


సుకు పూర్వాజ్, జ్యోతి

"భిన్న కోణాల్లో సాగే స్క్రీన్‌ప్లేతో సరికొత్త సైఫై థ్రిల్లర్‌గా 'కిల్లర్' ప్రతి ప్రేక్షకుణ్ని అలరిస్తుంది" అన్నారు దర్శకుడు సుకు పూర్వాజ్. ఆయన స్వీయ దర్శకత్వంలో జ్యోతి పూర్వాజ్‌తో కలిసి నటించిన ఈ చిత్రం త్వరలో థియేటర్లలోకి రానుంది. ఆయన దీన్ని ఎ.పద్మనాభ రెడ్డితో కలిసి నిర్మించారు. మనీశ్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్ర టీజర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నటి జ్యోతి పూర్వాజ్ మాట్లాడుతూ.. "మాకున్న పరిమితుల్ని దాటుకుని ఈ సినిమాని రూపొందించాం. నేనిందులో నాలుగైదు పాత్రల్లో కనిపిస్తాను. నేనిందులో యాక్షన్ కూడా చేశాను. అనిల్ రావిపూడి మా టీజర్ చూసి పూర్వాజ్‌లో దర్శకుడితో పాటు మంచి నటుడు ఉన్నారని చెప్పారు. తప్పకుండా ఇది అందరికీ నచ్చుతుంది" అన్నారు. "ఐదారేళ్ల క్రితం అనుకున్న స్క్రిప్ట్ ఇది. కృత్రిమ మేధ, ఎమోషనల్ డ్రామా, బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్, ప్రతీకారం.. ఇలా పలు ఆసక్తికర అంశాలతో మంచి సైఫై థ్రిల్లర్‌గా దీన్ని ముస్తాబు చేశాం. 'మీ మేధస్సుని ఉపయోగించండి' అని టీజర్‌లో ఎందుకు చెప్పామో సినిమా చూస్తే అర్థమవుతుంది. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తాం. అది మనసుల్ని బలంగా తాకేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు సుకు పూర్వాజ్. ఈ కార్యక్రమంలో కాళీ చరణ్, శ్రీనివాస్, విశాల్, గౌతమ్, సీతారామారావు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu



అత్యధిక బొగ్గు ఉత్పత్తి గనిగా గెవ్రా!

- 2026-27లో 63 మి.టన్నుల లక్ష్యం
- ఎస్ఈసీఎల్ సీఎండీ హరీశ్ దుహన్



కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లో కోల్ ఇండియాకు చెందిన గెవ్రా గని, వచ్చే ఏడాది 63 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించడం ద్వారా, ప్రపంచంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేసే గనిగా అవతరిస్తుందని సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్) సీఎండీ హరీశ్ దుహన్ వెల్లడించారు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన ఎస్ఈసీఎల్ నిర్వహిస్తున్న గెవ్రా గని, మన దేశంలో అతి పెద్ద ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని. 1981 నుంచి ఈ గనిలో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ ఏడాది 56 మి.టన్నుల బొగ్గు ఇక్కడ వెలికి తీయనున్నారు. ఈ గని సామర్థ్యాన్ని సంవత్సరానికి 70 మి.టన్నులకు విస్తరించడానికి ఇప్పటికే పర్యావరణ అనుమతి లభించింది కూడా. వచ్చే ఏడాదిలో గెవ్రా గని 63 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, ప్రపంచంలోనే నంబర్ వన్ గనిగా మారుతుందని హరీశ్ ధీమా వ్యక్తం చేశారు. అమెరికా (వయామింగ్)లోని పౌడర్ రివర్ బేసిన్‌లో ఉన్న బ్లాక్ థండర్ గని 61-62 మి.టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతి పెద్ద బొగ్గు గనిగా ఉంది. దీని తర్వాత నార్త్ యాంటెలోప్ రోషెల్ గని ఉంది. గెవ్రా గని ప్రతిష్ఠాత్మక లక్ష్యానికి అవసరమైన 4 ముఖ్యమైన వనరులు - భూమి, యంత్రాలు, మానవ వనరులు, బొగ్గు స్వీకరించే వినియోగదార్ల గిరాకీ అని వివరించారు. కచ్చితమైన ముందస్తు ప్రణాళికతో, అవసరమైన అన్ని వనరులను తమ బృందం కలిగి ఉందని హరీశ్ పేర్కొన్నారు. తగినంత భూమి, అవసరమైన అన్ని పరికరాలు, బొగ్గు సరఫరా కాంట్రాక్టులు, వినియోగదార్ల నుంచి బొగ్గుకు గిరాకీ కూడా బలంగా ఉందని వెల్లడించారు. భారతీయ రైల్వేల మద్దతుతో బలమైన మౌలిక సదుపాయాలు బొగ్గు తరలింపునకు సహాయపడతాయని తెలిపారు.

- ఎస్ఈసీఎల్‌లోనే 700 మెగావాట్ల సౌర ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని కంపెనీ యోచిస్తోందని సీఎండీ తెలిపారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఖనిజాల్లో కొన్ని ప్రాజెక్టులను చేయడానికి కూడా జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు వివరించారు.
- '2026-27లో గెవ్రా గని నుంచి ఉత్పత్తిని 63 మి.టన్నులకు పెంచాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది ప్రస్తుతం 62 మి.టన్నులు ఉత్పత్తి చేస్తున్న ప్రపంచంలోనే అతి పెద్దదైన అమెరికాలోని బ్లాక్ థండర్ గనిని అధిగమిస్తుంద'ని ఎస్ఈసీఎల్ ఏరియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ త్యాగి కూడా పేర్కొన్నారు.

ఒడిశాలో ఆర్‌బీఐ సురక్షిత డేటా కేంద్రం



కీలకమైన ఆర్థిక డేటాను కాపాడటానికి, ప్రధాన వ్యవస్థల కొనసాగింపును బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒడిశాలో అత్యంత సురక్షిత 'హై-సెక్యూరిటీ' డేటా కేంద్రాన్ని నిర్మించింది. దాదాపుగా సుదూరంగా, భూకంపాల ప్రభావం తక్కువగా, వరదలు లేని చోట దీనిని నిర్మించారు. ఇందుకోసం టైర్ 4 సర్టిఫికేషన్ కేంద్రాన్ని వినియోగించారని సమాచారం. దేశ పశ్చిమ, ఉత్తర సరిహద్దులకు దూరంగా ఉన్న ఈ ప్రాంతంపైకి మిస్సైల్, డ్రోన్ దాడులకు అవకాశం తక్కువ. ఈ డేటా కేంద్రం ఆర్‌బీఐకి రెండోది. ప్రాథమిక డేటా కేంద్రం నవీ ముంబయిలోని ఖార్ఘర్‌లో ఉంది. ఈ నేపథ్యంలో కొత్త కేంద్రం ఆర్‌బీఐ కరెన్సీ నిర్వహణ, చెల్లింపు-పరిష్కార కార్యకలాపాలు, నియంత్రణ డేటా విధులకు మద్దతు ఇచ్చే ప్రధాన కంప్యూటింగ్ వ్యవస్థలను ఉంచడానికి రూపొందించారని అధికారులు వెల్లడించారు.

- 2023లో ఒడిశా (భోర్ధా)లోని ఇన్ఫో వ్యాలీ-2లో ఆర్‌బీఐ తన 18.55 ఎకరాల క్యాంపస్‌లో డేటా కేంద్రం పని ప్రారంభించినప్పుడు, అక్కడ ఎందుకని సందేహాలు తలెత్తాయి. రవాణా, కార్యకలాపాలకు సంబంధించిన సమస్యల కంటే భూభౌతిక అంశాలను పరిగణనలోకి తీసుకునే తాజా నిర్ణయాన్ని చేపట్టినట్లు సమాచారం. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగినప్పుడు, ఒక వాణిజ్య బ్యాంక్ తమ డేటా కేంద్ర కార్యకలాపాలను హుటాహుటిన జయపుర నుంచి ముంబయికి తరలించింది. ఈ నేపథ్యంలోనే రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ కొత్త కేంద్రాన్ని నిర్మించారు. పైగా డేటా కేంద్రాలకు కావాల్సిన విద్యుత్తు, నీటికి ఈ ప్రాంతంలో కొదవ ఉండదు.

ఏటా 10,000 టన్నుల పెన్-జీ ఉత్పత్తి లక్ష్యం

12 నెలల్లో చేరొచ్చు: అరబిందో ఫార్మా



ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ సెజ్‌లో ఉన్న ప్లాంటులో పెన్సిలిన్-జీ వార్షిక ఉత్పత్తిని 10,000 మెట్రిక్ టన్నులకు పెంచాలని చూస్తున్నట్లు అరబిందో ఫార్మా ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) ఎస్.సుబ్రమణియన్ తెలిపారు. 'ఇందుకవసరమైన విస్తరణ పనులు అంచనాల ప్రకారం సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో లాభదాయకత పెంచడానికి ఇది సిద్ధమవుతోంది. రాబోయే 12 నెలల్లో వార్షిక ప్రాతిపదికన 10,000 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తిని ఇక్కడ ఆశిస్తున్నాం' అని అనలిస్ట్ కాల్‌లో సుబ్రమణియన్ వెల్లడించారు. ఈ ప్లాంట్ పూర్తిస్థాయి సామర్థ్యం 15,000 టన్నులు. పెన్-జీ, 6ఏపీఏ, అమోక్సిసిలిన్ కనీస దిగుమతి ధర విషయంలో ప్రభుత్వం ఏడాది మినహాయింపు ఇవ్వడం మంచి నిర్ణయమని అరబిందో ఫార్మా తెలిపింది.

కంపెనీకి లాభమే

'ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపు కంపెనీపై సానుకూల ప్రభావం చూపుతుంది. యాంటీబయాటిక్స్‌లో మన దేశం స్వయం సమృద్ధి సాధించడానికి, సరఫరాలో అంతరాయాల ముప్పు తగ్గించడానికి ప్రభుత్వ నిర్ణయం దోహదపడుతుంది. ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియెంట్), కేఎస్ఎం (ప్రాథమిక ముడిసరకు) దేశీయ తయారీని పెంచుతుంది' అని సుబ్రమణియన్ పేర్కొన్నారు. పెన్-జీ, 6ఏపీఏ, అమోక్సిసిలిన్‌పై కంపెనీ వ్యూహం, వ్యయాలను, విదేశీ ఆధారాన్ని తగ్గించడానికి, భవిష్యత్తులో మార్జిన్ల బలోపేతానికి దోహదం చేస్తుందన్నారు.

చైనా, అమెరికా ప్లాంట్‌లపై..

చైనాలోని తమ తయారీ ప్లాంట్, ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో ఎబిటా పరంగా బ్రేక్ ఈవెన్ (లాభనష్టాలు లేని స్థితి) సాధిస్తుందని, వచ్చే ఏడాదిలో నికర లాభాన్ని నమోదు చేయడానికి దోహదపడుతుందన్నారు. 'ఏడాదికి 2 బిలియన్ యూనిట్ల సామర్థ్యం దిశగా మా చైనా ప్లాంట్ స్థిరంగా పురోగతి సాధిస్తోంది. ప్రస్తుతం అక్కడ రూపొందిస్తున్న 10 ఉత్పత్తులకు ఈయూ ఆమోదం, 3 స్థానిక ఉత్పత్తులకు అనుమతి ఉంది. అమెరికాలో కంపెనీ కీలక వృద్ధి దశలోకి ప్రవేశిస్తోంది. డేటన్ ప్లాంట్ వాణిజ్య దశలోకి అడుగుపెట్టింది. తయారీ పనులు జరుగుతున్నాయి. 2026-27 నుంచి గణనీయ ఆదాయాన్ని అందించడం మొదలవుతుంది. ఇదే సమయంలో రాలీ ప్లాంట్ నియంత్రణ అనుమతుల కోసం చూస్తోంది. కార్యకలాపాలను పెంచడానికి సిద్ధంగా ఉన్నాం' అని సుబ్రమణియన్ వివరించారు. డెర్మల్, ట్రాన్స్‌డెర్మల్, నాసల్, రెస్పిరేటరీ, ఆంకాలజీ వంటి సంక్లిష్ట జనరిక్స్‌పై దృష్టిసారిస్తూ, విభిన్న ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో నిర్మిస్తున్నట్లు తెలిపారు. 2025-26లో ఎబిటా మార్జిన్ లక్ష్యం 20-21 శాతాన్ని సాధించగలమని ధీమా వ్యక్తం చేశారు.

ఇనుప ఖనిజం ఎగుమతుల పెంపుపై దృష్టి

గంగవరంలో ముడిఇనుము మిశ్రమ కేంద్రం



ముడిఇనుము ఎగుమతుల వృద్ధే లక్ష్యంగా ఎన్ఎండీసీ, అదానీ పోర్ట్స్, జపాన్ సంస్థ వేల్ చేతులు కలిపాయి. ఆంధ్రప్రదేశ్‌లోని గంగవరం పోర్టు వద్ద సమీకృత ఇనుప ఖనిజం మిశ్రమ కేంద్రం, ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)ని ఏర్పాటు చేయనున్నాయి. ఈ 3 కంపెనీలు కలిసి ముడిఇనుము మిశ్రమం, బ్లెండింగ్, విలువ జోడింపు, వాణిజ్యపరమైన సెజ్ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేసి నిర్వహిస్తాయి. ఖనిజాల ప్రాసెసింగ్, వాణిజ్యంలో సామర్థ్యాన్ని, స్థాయి, అంతర్జాతీయ పోటీతత్వాన్ని మెరుగుపరచడం ద్వారా దేశ తూర్పుతీరంలో ఇనుప ఖనిజం ఎగుమతుల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ భాగస్వామ్యం లక్ష్యం. ఇందులో గంగవరం పోర్టు సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు పెరిగే అవకాశం ఉంది.

- 'అంతర్జాతీయ సరఫరా వ్యవస్థల్లో మన దేశాన్ని బలోపేతం చేసే, భవిష్యత్తుకు వీలుగా ఉండే మౌలిక సదుపాయాలను నిర్మించడంలో మా నిబద్ధతను ఈ భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది' అని ఏపీసెజ్ డైరెక్టర్, సీఈఓ అశ్విని గుప్తా పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద వేల్ లార్జ్ ఓర్ క్యారియర్స్ (వీఎల్ఓసీలు)ను నిర్వహించగల సామర్థ్యం ఉన్న మొదటి దేశీయ పోర్టుగా గంగవరం పోర్ట్ అవతరించబోతోంది అని తెలిపారు.

హరిత రుణాలు 10 శాతానికి

2030కి ఎస్‌బీఐ ప్రణాళిక

దిల్లీ: దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), 2030 నాటికి తమ మొత్తం రుణాల్లో హరిత రుణాల వాటాను 7.5- 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 25% రుణాలను గ్రీన్ లైన్స్ ఆఫ్ క్రెడిట్ ద్వారా అందించాలని నిర్ణయించింది. 2025 మార్చి చివరకు బ్యాంక్ మొత్తం రుణాల్లో హరిత రుణాల వాటా 1.56 శాతమే. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్తు వాహనాలు, హరిత హైడ్రోజన్ వంటి రంగాలకు రుణాలు అందించేందుకు 'చక్ర' పేరుతో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్‌ను ప్రారంభించినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఇదే సమయంలో పర్యావరణ పరిరక్షణ, బాధ్యతాయుత బ్యాంకింగ్‌పై నిబద్ధతను చాటుతూ 'ఎస్‌బీఐ గ్రీన్ మారథాన్' ఎడిషన్‌ను ముంబయిలో నిర్వహించింది. ముంబయిలో జరిగిన ఈ మారథాన్‌లో 5 కి.మీ, 10 కి.మీ, 21 కి.మీ విభాగాల్లో 10,000 మందికి పైగా పాల్గొన్నారు. 'రన్ ఫర్ ఏ గ్రీనర్ ఇండియా' థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఎండీ రామమోహన్ రావు అమర మాట్లాడుతూ 'సుస్థిరత మా లక్ష్యంలో అంతర్భాగం. వ్యక్తిగత బాధ్యతతో పాటు సామూహిక నిబద్ధత మెరుగుపడుతుందని చెప్పడానికి ఈ గ్రీన్ మారథాన్ ఒక చిహ్నం. 2030 నాటికి కర్బన స్థిరత్వాన్ని సాధించడం, 2055 నాటికి సున్నా ఉద్గారాల దిశగా ముందుకెళ్లడం, దేశ హరిత లక్ష్యాలకు రుణాలు ఇవ్వడానికి ఎస్‌బీఐ కట్టుబడి ఉన్నట్లు' వివరించారు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం

ముంబయి: హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం వెల్లడించింది. బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. చండీగఢ్‌లోని ఒక శాఖలో కొంతమంది ఉద్యోగులు హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో ప్రాథమికంగా అనధికారిక, మోసపూరిత కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పేర్కొంది. ఇతర వ్యక్తులు/సంస్థలు/కౌంటర్‌పార్టీలు కూడా ఇందులో భాగమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం మోసం విలువను రూ.590 కోట్లుగా అంచనా వేసింది. తదుపరి సమాచారం, క్లెయిమ్‌ల ధ్రువీకరణ, రికవరీల ఆధారంగా తుది మొత్తాన్ని నిర్ణయిస్తామని వివరించింది. హరియాణా ప్రభుత్వ విభాగం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తోందని.. రుణదాతకు వెల్లడించని తేదీన క్లోజర్, బ్యాలెన్స్ బదిలీ కోసం మరొక బ్యాంకుకు అభ్యర్థన అందిందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఈ ప్రక్రియలో ఖాతాలోని బ్యాలెన్స్‌తో పోలిస్తే, పేర్కొన్న మొత్తంలో వ్యత్యాసం కనిపించింది. అలాగే ఈ నెల 18 నుంచి హరియాణా ప్రభుత్వ సంస్థల ఇతర ఖాతాల్లో కూడా ఇలాంటి సమస్యలు గమనించినట్లు వివరించింది.



23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	465	తూ/ప గోదావరి	465
వరంగల్	467	విశాఖపట్నం	480
విజయవాడ	500	చిత్తూరు	553

సెకనుకు 10 కోట్ల లావాదేవీలు!

ఎన్ఎస్ఈలో ఏప్రిల్ తరవాత ● ప్రస్తుతం 50-60 లక్షల ట్రాన్సాక్షన్స్



ఈనాడు వాణిజ్య విభాగం: షేర్ల ట్రేడింగ్ అంటేనే క్షణాల్లో తలరాతలు మారిపోతాయ్. యువత మొబైల్‌పై ట్రేడింగ్ చేయడం పెరిగాక, షేర్ల లావాదేవీల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఒక సెకనులోనే 10 కోట్ల లావాదేవీలు నిర్వహించేలా దేశంలోనే పెద్దదైన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ని తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం లావాదేవీ స్పందనకు పట్టే సమయాన్ని మైక్రోసెకన్ల (సెకనులో 10 లక్షలవ వంతు) నుంచి నానో సెకన్ల (సెకనులో 100 కోట్ల వంతు)కు మార్చనున్నారు. అంటే ప్రస్తుతం కంటే 1,000 రెట్లు వేగంగా కార్యకలాపాలు సాగేందుకు అనువుగా ఎన్ఎస్ఈ సాంకేతికతను తీర్చిదిద్దనున్నారని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి. ఏప్రిల్ 11 నుంచి ఈ మార్పు అమల్లోకి రానుంది. ఎన్ఎస్ఈలో ప్రస్తుతం 25 కోట్ల మందికి పైగా మదుపర్లు ఉన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 1,17,94,921 మంది, తెలంగాణ నుంచి 57,82,143 మంది ఉన్నారు.

ప్రస్తుతం సెకనుకు 50-60 లక్షల లావాదేవీలు

ప్రస్తుతం ఎన్ఎస్ఈలో సెకనుకు 50-60 లక్షల లావాదేవీలు సాగుతున్నాయి. ఒక మదుపరి ఇచ్చిన ఆర్డర్‌పై ఎన్ఎస్ఈ స్పందించే సమయం 100 మైక్రోసెకన్లుగా ఉంది. దీన్ని నానో సెకన్లకు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్ఎస్ఈ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆశిష్‌కుమార్ చౌహాన్ వెల్లడించారు. అసోసియేషన్ ఆఫ్ ఎన్ఎస్ఈ మెంబర్స్ ఆఫ్ ఇండియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. లావాదేవీకి స్పందించే సమయం గణనీయంగా తగ్గుతున్నందున, మరింత అధికంగా ట్రేడ్ పరిమాణం పెంచుకునేందుకు వీలు కానుంది. ముఖ్యంగా సంస్థాగత మదుపర్లకు ఇది సౌలభ్యం పెంచుతుంది.

సైబర్ భద్రత కీలకం

లావాదేవీలు ఎంతగా పెరిగితే, సైబర్ దాడులకు గురయ్యే అవకాశాలూ అధికమవుతాయి. అందువల్ల వెండర్లు అందరూ సైబర్ సెక్యూరిటీకి ప్రాధాన్యమివ్వాలని చౌహాన్ సూచించారు. వ్యయాలు తగ్గించుకునేందుకు కృత్రిమమేధ సాంకేతికత (ఏఐ)ను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ఎస్ఈ కో లొకేషన్ ర్యాక్స్ 2,000 ఉండగా, వీటిని 4,500కు పెంచనున్నారు. ఎక్స్ఛేంజ్ డేటా సెంటర్ లోపల ఉండే, ఈ ర్యాక్స్ ద్వారా మరింత వేగంగా మార్కెట్ డేటా పొందొచ్చు. అధికమొత్తం లావాదేవీలు నిర్వహించే సంస్థాగత మదుపర్లు వీటిని వినియోగిస్తుంటారు.

త్వరలో విద్యుత్తు, పసిడి ఫ్యూచర్స్ కూడా

సాంకేతికతను మెరుగుపరచడంతో పాటు విద్యుత్తు - బంగారంలో ఫ్యూచర్ కాంట్రాక్టులు ప్రారంభించేందుకూ ఎన్ఎస్ఈ సన్నద్ధమవుతోంది. 10 గ్రాముల బంగారం ఫ్యూచర్స్ ప్రారంభించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి పొందింది కూడా.

ముడిచమురు రాణిస్తుంది!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.1,52,604 కంటే దిగువన ట్రేడయితే... దిద్దుబాటుకు అవకాశం ఉంటుంది. అయితే రూ.1,48,333 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.1,45,195కు దిగిరావచ్చు. రూ.1,59,273 కంటే పైన కదలాడితే రూ.1,61,671, రూ.1,65,942 వరకు పెరగొచ్చు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ప్రకటించిన టారిఫ్‌లు, ఇరాన్‌లో ఉద్రిక్తతల వంటివి పసిడికి గిరాకీ పెంచొచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు రూ.2,41,866 కంటే కిందకు వస్తే.. రూ.2,27,792; రూ.2,12,443 వరకు దిగి వచ్చే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.2,71,289 కంటే ఎగువన చలిస్తే.. రూ.2,81,637; రూ.3,00,712 వరకు వెళ్లొచ్చు.

ప్రాథమిక లోహాలు



- రాగి మార్చి కాంట్రాక్టు రూ.1,166.85 కంటే కిందకు వస్తే రూ.1,136.45 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.1,229.95 కంటే పైన కదలాడితే రూ.1,262.65 వరకు పెరగొచ్చు.
- సీసం మార్చి కాంట్రాక్టు రూ.187.75 కంటే దిగువకు వస్తే రూ.186.75; రూ.185.50 వరకు చేరొచ్చు. ఒకవేళ రూ.190 కంటే ఎగువకు వెళ్తే రూ.191.25; రూ.192.25 వరకు రాణించొచ్చు.
- జింక్ మార్చి కాంట్రాక్టు రూ.317 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ స్థాయి వద్ద స్టాప్ లాస్ పెట్టుకుని, లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు.
- అల్యూమినియం మార్చి కాంట్రాక్టు రూ.314.85 కంటే పైన చలిస్తే రూ.318.35; రూ.322.15 వరకు వెళ్లొచ్చు. ఒకవేళ రూ.307.55 కంటే దిగువన ట్రేడయితే.. రూ.303.75; రూ.300.25 వరకు దిద్దుబాటు కావచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు మార్చి కాంట్రాక్టుకు రూ.6,244 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీన్ని అధిగమిస్తే రూ.6,432; రూ.6,747 వరకు పెరగొచ్చు.
- సహజవాయువు మార్చి కాంట్రాక్టు రూ.265.90 కంటే దిగువన కదలాడితే.. మరింతగా దిద్దుబాటు కావచ్చు. అయితే రూ.254.60 వద్ద కొంత మద్దతు లభించొచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు ఏప్రిల్ కాంట్రాక్టు సానుకూల ధోరణిలో కదలాడితే రూ.16,356 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.16,819; రూ.17,742 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.14,971 కంటే కిందకు వస్తే రూ.14,047; రూ.13,584 వరకు దిద్దుబాటు కావచ్చు.
- జీలకర్ర మార్చి కాంట్రాక్టుకు రూ.22,196 వద్ద మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.21,333; రూ.20,841 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.23,551 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. దీనిని అధిగమిస్తే రూ.24,043; రూ.24,906 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/క్షీణత
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఏప్రిల్)	1,54,999	1,56,876	1.21
వెండి (మార్చి)	2,46,135	2,60,941	6.02
రాగి (మార్చి)	1,229.95	1,197.20	-2.66
సీసం (మార్చి)	188.60	187.75	-0.08
జింక్ (మార్చి)	325.25	326.10	0.26
అల్యూమినియం (మార్చి)	312.50	311.30	-0.38
ముడి చమురు (మార్చి)	5,705	6,057	6.17
సహజ వాయువు (మార్చి)	270	277.20	2.67
పసుపు (ఏప్రిల్)	14,910	15,894	6.60
జీలకర్ర (మార్చి)	22,720	23,060	1.50

'ట్రంప్' టారిఫ్ పరిణామాలు కీలకం

స్టాక్ మార్కెట్ ఈ వారం

- ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావమూ ఉండొచ్చు
- దేశీయ సూచీలు స్థిరీకరణకు గురయ్యే అవకాశం ● విశ్లేషకుల అంచనాలు



దేశీయ అంశాల కంటే అంతర్జాతీయ పరిణామాలే ఈ వారం మార్కెట్ కదలికలకు కీలకంగా ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 15% పన్ను విధిస్తున్నట్లు ట్రంప్ శనివారం ప్రకటించారు. ఇంతకుముందే మనదేశ ఉత్పత్తులపై సుంకాన్ని 50% నుంచి 18 శాతానికి తగ్గించగా, ఇప్పుడు 15% కానుంది. ఆ ప్రభావం సోమవారం మార్కెట్లపై కనిపించొచ్చు. అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతో మదుపర్ల సెంటిమెంటు దెబ్బతింది. ఎఫ్అండ్ఓ కాంట్రాక్టులకు 24న ముగింపు కావడంతో, ఒడుదొడుకులుండొచ్చు. ఈనెల 27న జీడీపీ అంచనాలు వెలువడనున్నాయి. నిఫ్టీ-50 సూచీ 25,500-26,000 స్థాయిలో స్థిరీకరణకు గురికావొచ్చు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- నిఫ్టీ బ్యాంక్ 60,000-61,750 మధ్య చలించొచ్చు. ప్రభుత్వ రంగ బ్యాంకులు రాణించే అవకాశం ఉంది. ఒక వేళ 60,500 స్థాయిని అధిగమిస్తే 61,700-62,000 దిశగా పయనించొచ్చు. దిగువకు వస్తే 60,000 పాయింట్లకు, ఆ తర్వాత 59,800కు తగ్గొచ్చు.
- **టెలికాం** షేర్లు స్థిరంగానే కనిపిస్తున్నాయి. జియో లిస్టింగ్ కోసం మార్కెట్ ఎదురుచూస్తోంది. ఆ తర్వాతే టారిఫ్ పెంపులకు అవకాశం ఉంటుందన్న భావనలున్నాయి. వొడాఫోన్ ఐడియా షేరు రూ.12.22 స్థాయిని అధిగమిస్తే రూ.16 వరకు వెళ్లొచ్చని బ్రోకరేజీలు అంటున్నాయి.
- అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నడుమ **చమురు**-గ్యాస్ షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. చమురు ధరలు పెరిగితే ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా వంటి అప్‌స్ట్రీమ్ కంపెనీల షేర్లు రాణించొచ్చు. ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరితే మాత్రం బ్యారెల్ ధర 64-65 డాలర్లకు చేరొచ్చని అంచనా.
- 2 వారాల పాటు నిఫ్టీ ఆటో సూచీ లాభాలనందించిన నేపథ్యంలో, ఈ వారం **వాహన** కంపెనీల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. నిఫ్టీ ఆటో సూచీ 28,200 ఎగువకు వచ్చేంత వరకు అప్రమత్తంగా ఉండడం మంచిది.
- **ఔషధ** షేర్లు రాణించొచ్చు. పెప్టైడ్ ఔషధాల ఆవిష్కరణకు ముందు మదుపర్ల సెంటిమెంటు మెరుగుపరడడం ఇందుకు నేపథ్యం. ఇది దేశీయ తయారీదార్లకు గొప్ప అవకాశం. నిఫ్టీ ఫార్మా సూచీకి 21,500 వద్ద మద్దతు, 23,500 వద్ద నిరోధం కనిపిస్తోంది.
- వేసవిలో నిర్మాణ కార్యకలాపాలు జోరందుకుంటాయన్న అంచనాల మధ్య **సిమెంటు** కంపెనీల షేర్లు రాణించొచ్చు. జనవరిలో ధరలు పెంచిన కంపెనీలు.. రాబోయే నెలల్లోనూ పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.
- ఇటీవలి లాభాల నేపథ్యంలో **లోహ**, గనుల కంపెనీల షేర్లు పరిమితంగానే రాణించొచ్చు. ఉక్కు రంగంపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. లోహ షేర్లతో పోలిస్తే ఉక్కు కంపెనీల షేర్ల విలువలు సహేతుకంగా కనిపిస్తున్నాయి. ప్రాథమిక లోహాల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు.
- బలమైన ఆర్డర్ల నేపథ్యంలో **యంత్రపరికరాల** షేర్లు పెరగొచ్చు. రైల్వేలు, రోడ్ల ఆర్డర్లు ఉన్న కంపెనీలు మాత్రం నష్టపోవచ్చు. ప్రభుత్వ మూలధన వ్యయాల్లో మందగమనం, షేర్ల అధిక విలువల కారణంగా, లాభాలు పరిమితంగానే ఉండొచ్చు.
- **ఎఫ్ఎమ్‌సీజీ** సూచీ కొంత మేర లాభపడొచ్చు. కొన్ని త్రైమాసికాలుగా పట్టణ మార్కెట్లతో పోలిస్తే గ్రామీణ మార్కెట్లు రాణిస్తున్నాయి. ఈ రంగ షేర్లు ఆకర్షణీయ విలువల వద్ద ట్రేడవుతున్నాయి.
- **ఐటీ** షేర్లు స్థిరీకరణకు లోనుకావొచ్చు. ఏఐ టూల్స్ కారణంగా ప్రతికూల ధోరణి కొనసాగొచ్చు. ఫెడ్ రేట్ల కోతలపై ఆశలు తగ్గుతుండడంతో పాటు, దేశీయ ఐటీ షేర్ల నుంచి ఎఫ్ఐఐలు బయటకు వెళుతుండడం సెంటిమెంటును మరింత దెబ్బతీయొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	208.85	214.20	199.10
బజాజ్ ఆటో	9,807.00	9919.30	9614.30
ఐషర్ మోటార్స్	7,936.50	8025.80	7840.80
హీరో మోటోకార్ప్	5,465.00	5534.30	5340.30
ఎం అండ్ ఎం	3,412.80	3469.10	3374.30
మారుతీ	14,977.00	15196.30	14738.30
టాటా మోటార్స్	472.90	487.50	463.80
టీవీఎస్ మోటార్	3816.20	3901.50	3749.10

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	6098.50	6171.80	6029.80
కోల్గేట్ పామోలివ్	2197.90	2236.90	2147.70
డాబర్ ఇండియా	509.70	517.80	496.30
ఇమామీ	479.60	486.70	473.80
హిందుస్థాన్ యునిలీవర్	2314.50	2360.90	2255.10
ఐటీసీ	327.00	329.40	323.80
మారికో	788.20	804.10	767.20

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	257.30	264.80	246.90
సీజీ పవర్	712.15	732.80	681.30
ఎల్ అండ్ టీ	4380.60	4468.80	4223.00
సీమెన్స్	3206.20	3408.10	3004.10
థెర్మాక్స్	3151.80	3331.80	2885.00

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	911.85	922.20	903.30
ఐసీఐసీఐ బ్యాంక్	1394.50	1413.80	1374.40
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	83.51	84.70	81.70
ఇండస్‌ఇండ్ బ్యాంక్	926.05	957.50	907.00
కోటక్‌మహీంద్రా బ్యాంక్	421.35	428.30	411.50
పీఎన్‌బీ	129.59	133.50	123.40
ఎస్‌బీఐ	1216.10	1228.20	1195.80

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1158.80	1191.10	1132.90
బయోకాన్	383.95	391.90	377.70
సిప్లా	1341.10	1354.70	1317.50
డాక్టర్ రెడ్డీస్	1280.40	1300.00	1265.20
గ్లెన్‌మార్క్ ఫార్మా	2043.20	2081.30	1980.10
నాట్కో ఫార్మా	891.70	905.10	871.30

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	935.70	961.40	888.20
హిందుస్థాన్ కాపర్	569.05	581.00	554.60
ఎన్ఎమ్‌డీసీ	80.13	81.50	77.80
సెయిల్	158.75	162.80	153.30
టాటా స్టీల్	208.36	212.00	202.90
వేదాంతా	682.45	690.40	668.60

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1436.50	1464.80	1416.80
ఇన్ఫోసిస్	1353.20	1378.90	1325.30
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5092.00	5349.30	4941.30
టీసీఎస్	2686.20	2733.90	2623.70
టెక్ మహీంద్రా	1456.90	1486.60	1438.20
విప్రో	209.86	213.70	206.30

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1419.40	1438.90	1396.30
బీపీసీఎల్	366.30	371.10	359.90
హెచ్‌పీసీఎల్	430.90	439.80	422.30
ఐఓసీఎల్	173.79	175.70	171.40
ఓఎన్‌జీసీ	278.65	284.40	271.50
ఆయిల్ ఇండియా	475.55	492.10	463.70

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1612.60	1637.30	1589.70
అంబుజా సిమెంట్స్	512.00	522.00	503.70
ఇండియా సిమెంట్స్	423.20	433.80	407.30
శ్రీ సిమెంట్	26510.00	27126.70	25656.70
అల్ట్రాటెక్ సిమెంట్	12766.00	12987.30	12467.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,977.40	2003.40	1958.00
ఎమ్‌టీఎన్ఎల్	30.24	30.80	29.90
టాటా కమ్యూనికేషన్స్	1686.70	1735.90	1622.10
వొడాఫోన్ ఐడియా	11.16	11.50	10.90

(c) eenadu

దరఖాస్తు చేశారా?

☛ ఈసీఐఎల్ హైదరాబాద్‌లో 200 టెక్నికల్ ఆఫీసర్ ఖాళీలు
చివరి తేదీ: 24.02.2026

☛ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ఖాళీలు
చివరి తేదీ: 24.02.2026

కరెంట్ అఫైర్స్



◆ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) నూతన డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల ఎవరు బాధ్యతలు స్వీకరించారు? (ప్రవీణ్ కుమార్ స్థానంలో ఈ నియామకం జరిగింది. ఐటీబీపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన ఈయన 2026, అక్టోబరు 31 వరకు పదవిలో కొనసాగుతారు.)

మాదిరి ప్రశ్నలు

జ: శత్రుజీత్ సింగ్ కపూర్

◆ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ - నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) కొత్త డైరెక్టర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు?

జ: రాకేష్ అగర్వాల్ (హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఈ 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి 2028, ఆగస్టు 31 వరకు ఈ పదవిలో కొనసాగుతారు. ఉగ్రవాదం, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఐఎస్ఐఎస్ లాంటి నిషేధిత సంస్థల కార్యకలాపాలకు సంబంధించిన నేరాలను దర్యాప్తు చేయడంలో ఎన్ఐఏ కీలక పాత్ర పోషిస్తుంది.)

◆ భారత సైనికుల ధైర్యం, క్రమశిక్షణ, త్యాగాలను గౌరవించేందుకు ఏటా ఏ రోజున భారత సైనిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు?

జ: జనవరి 15 (1949, జనవరి 15న ఫ్రాన్సిస్ రాయ్ బుచర్ స్థానంలో కె.ఎం.కరియప్ప భారత సైన్యానికి మొదటి భారతీయ కమాండర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఘటనకు గుర్తుగా ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2026 ఆర్మీ డేను అధికారికంగా జైపుర్‌లో నిర్వహించారు.)

మరింత సమాచారం

TENTH English



Mijbil The Otter

Section A: Reading Comprehension: 5 x 2 = 10

Q.No. 1 - 5: Read the following Passage carefully.

Mijbil, as I called the otter, was, in fact, of a race previously unknown to science, and was at length christened by zoologists Lutrogale perspicillata maxwelli, or Maxwell's otter. For the first twenty-four hours Mijbil was neither hostile nor friendly; he was simply aloof and indifferent, choosing to sleep on the floor as far from my bed as possible. The second night Mijbil came on to my bed in the small hours and remained asleep in the crook of my knees until the servant brought tea in the morning, and during the day he began to lose his apathy and take a keen, much too keen, interest in his surroundings. I made a body-belt for him and took him on a lead to the bathroom, where for half an hour he went wild with joy in the water, plunging and rolling in it, shooting up and down the length of the bathtub underwater, and making enough slosh and splash for a hippo. This, I was to learn, is a characteristic of otters; every drop of water must be, so to speak, extended and spread about the place; a bowl must at once be overturned, or, if it will not be overturned, be sat in and splashed in until it overflows. Water must be kept on the move and made to do things; when static it is wasted and provoking. **(Mijbil the Otter)**

Now, answer the following questions.

1. What was the scientific name given to Mijbil's species?
2. How did Mijbil behave on the second night?
3. How did Mijbil behave during the first twenty - four hours?

   Final Exams-2026 IMPORTANT Q&A

   A) Aggressive and noisy
   B) Aloof and indifferent C) Playful and joyful
4. What did the narrator make for Mijbil?
   A) A bathtub B) A belt and lead C) A food bowl
5. What do otters love to do with water according to the narrator?
   A) Drink it quietly B) Keep it still in bowls
   C) Move it around and play with it

Answers: 1. Lutrogale perspicillata maxwelli
2. Came on to the narrator's bed in the small hours and remained asleep in the crook of the narrator's knees.
3. B, 4. B, 5. C.

More Imp Q & A



Writer: A. Madhu babu

ఫీజు భారం లేదు.. చదువు దూరం కాదు!





మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి సారించినప్పుడే రాష్ట్రమైనా, దేశమైనా ప్రగతిపథంలో వేగంగా పయనిస్తుంది. అందులోనూ నేటి విద్యార్థులు, వారి విద్యాభివృద్ధిపై చేసే ఖర్చు, పెట్టే పెట్టుబడి ఏదైనా దీర్ఘ కాలంలో సామాజిక సమానత్వానికి, స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తుంది. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు నాణ్యమైన విద్య, చక్కటి సదుపాయాలను కల్పిస్తూ డ్రాపౌట్ రేటును తగ్గించే లక్ష్యంతో పలు పథకాలను అమలు చేస్తోంది. అందరూ ఉన్నతంగా చదువుకునే విధంగా తగిన మద్దతు, ప్రోత్సాహం అందిస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు పోషకాహారం మొదలు ఆర్థికసాయం వరకు సమకూరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విద్యా పథకాల గురించి పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి.

ప్రభుత్వ విద్యా పథకాలు

మన బడి - మన భవిష్యత్తు:
ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కనీస వసతులను కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచాలనేది ఈ పథకం ఉద్దేశం. పోటీ ప్రపంచంలో రాణించేలా ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలను బోధిస్తారు.

ఈ పథకంలో కల్పించే 10 రకాల సౌకర్యాలు: 1) నీటి సరఫరాతో కూడిన శౌచాలయాలు. 2) తాగునీటి సరఫరా. 3) తరగతి గది సివిల్ మరమ్మతులు (గోడ, పైకప్పు లాంటివి). 4) విద్యుదీకరణ ద్వారా ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల ఏర్పాటు. 5) విద్యార్థులకు డ్యూయెల్ డెస్క్ బెంచీలు, సిబ్బందికి బల్లలు, కుర్చీల ఏర్పాటు. 6) ఆవరణ మొత్తానికి రంగులు వేయడం. 7) గ్రీన్ చాక్ బోర్డులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ). 8) పాఠశాలకు ప్రహరీ నిర్మాణం. 9) వంటగది నిర్మాణం. 10) ఇంగ్లిష్ ల్యాబ్‌ల ఏర్పాటు. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదటి దశలో 15,715 పాఠశాలలను రూ.3,669 కోట్లతో అభివృద్ధి చేయగా, రెండో దశలో 16,368 పాఠశాలలను రూ.8,000 కోట్లతో అభివృద్ధి చేసింది.

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర



ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరంలో ప్రారంభించింది. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 1-10వ తరగతి విద్యార్థులకు మూడు జతల యూనిఫాంలు, స్కూల్‌బ్యాగ్, ఒక బెల్టు, రెండు జతల సాక్సులు, జత బూట్లు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్‌బుక్స్‌ను కిట్‌గా అందిస్తారు. ఈ కిట్‌తో పాటు 6వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్-ఇంగ్లిష్-తెలుగు నిఘంటువును ఇస్తారు. ◆ దీనిద్వారా ఏపీ ప్రభుత్వం ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 35 లక్షలకు పైగా విద్యార్థులకు రూ.953 కోట్లతో నాణ్యమైన స్కూల్ కిట్లను ఉచితంగా అందిస్తుంది. యూనిఫాం కుట్టు ఛార్జీల కింద ప్రభుత్వం 1-8 తరగతులకు రూ.120, 9-10 తరగతులకు రూ.240 ఇస్తుంది.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం

ఈ పథకాన్ని 2025, జనవరి 4న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. దీని ద్వారా విద్యార్థులకు పోషకాహారం అందించడంతో పాటు, విద్యార్థుల డ్రాపౌట్స్‌ను తగ్గించి హాజరును మెరుగుపరుస్తారు.

జనరల్ స్టడీస్
ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

మధ్యాహ్న బడి భోజన పథకం మొదట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రమే ఉండేది. తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు విస్తరించారు. వెజిటబుల్ పులావ్, అన్నం, వారానికి అయిదు కోడిగుడ్లు, వారానికి మూడు బెల్లం-వేరుశనగ చిక్కీలు, చిక్కీలు లేని రోజు రాగిజావ, సాంబార్, వెజిటబుల్ కర్రీస్, స్వీట్ పొంగల్ లాంటి పోషకాహార మెనూ ప్రకారం భోజనం అందిస్తారు.
◆ 1 నుంచి 8వ తరగతి వరకు ఈ పథకానికి అయ్యే ఖర్చును 60% కేంద్రం, 40% రాష్ట్ర ప్రభుత్వం అందించాలి. 9 నుంచి ఇంటర్ విద్యార్థులకు అయ్యే ఖర్చును 100% రాష్ట్రం భరిస్తుంది. ఈ పథకంలో వంట చేసే సహాయకులకు గౌరవ వేతనంగా నెలకు రూ.3000 ఇస్తారు. భారత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని 'ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ స్కీం' (పీఎం పోషణ్)గా పేరు మార్చింది.



బాలికా రక్ష: ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలల్లో చదివే బాలికలకు ఉచిత శానిటరీ న్యాప్‌కిన్‌లు పంపిణీ చేస్తుంది. ఇది పాఠశాలల్లో బాలికల పరిశుభ్రత, ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమం.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు



విద్యాదీవెన– రీఎంబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు (ఆర్‌టీఎఫ్): పాలిటెక్నిక్, ఐటీఐ, మెడికల్, ఇంజినీరింగ్, డిగ్రీ తదితర ఉన్నత చదువులకు అర్హత ఉన్న విద్యార్థులను ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ ద్వారా ప్రోత్సహిస్తుంది. ఫీజును కాలేజీలకు ప్రభుత్వం నేరుగా చెల్లిస్తుంది.

వసతి దీవెన– మెయింటెనెన్స్ ఫీజు (ఎంటీఎఫ్): విద్యార్థులకు ఆహారం, ప్రయాణం, వసతి, పుస్తకాలు మొదలైన ఇతర ఖర్చులు భరించేందుకు ప్రభుత్వం సంవత్సరానికి ఐటీఐ విద్యార్థులకు రూ.10,000, పాలిటెక్నిక్ స్టూడెంట్స్‌కు రూ.15,000, డిగ్రీ, పై చదువులకు రూ.20,000 నగదును నేరుగా విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది.

ఎన్టీఆర్ విద్యోన్నతి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి ప్రవేశపరీక్ష నిర్వహించి, అర్హత సాధించిన వారికి 9 నెలలు ఉచితంగా ప్రముఖ శిక్షణ కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ శిక్షణను ప్రభుత్వం అందిస్తుంది. ఇందులో రూ.1,50,000 కోచింగ్ ఫీజును ప్రభుత్వం శిక్షణ సంస్థకు చెల్లిస్తుంది. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి నెలకు రూ.10,000 ఉపకారవేతనం, రవాణాఖర్చుల కోసం 9 నెలల కాలానికి రూ.2,000 ఇస్తారు.

అంబేడ్కర్ విదేశీ విద్యా నిధి: విదేశాల్లో ఉన్నత విద్య (పోస్ట్ గ్రాడ్యుయేషన్) అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించే పథకం. దీని కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షలు; బీసీ, మైనారిటీలకు రూ.20 లక్షలు, ఈడబ్ల్యూఎస్ వర్గాలవారికి రూ.15 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది.
◆ జీఆర్ఈ/జీమ్యాట్, ఐఈఎల్‌టీఎస్/టోఫెల్‌లో మంచి స్కోర్, డిగ్రీలో 60% మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఆంధ్రప్రదేశ్ స్థానికత ఉన్న 35 ఏళ్ల లోపువారు ఈ పథకానికి అర్హులు.

ముస్తాబు



విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం, చక్కటి వస్త్రధారణను ప్రోత్సహించడానికి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2025, డిసెంబరు 20న అనకాపల్లి జిల్లా, తాళ్లపాలెం పాఠశాల నుంచి ప్రారంభించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి ఇంటర్ చదివే 75 లక్షల మంది విద్యార్థులకు 'ముస్తాబు' కార్యక్రమాన్ని వర్తింపజేశారు. పాఠశాలల్లో తరగతి గదుల్లో అద్దాలు, సబ్బు, దువ్వెనలు, నెయిల్ కట్టర్లతో కూడిన 'ముస్తాబు కార్నర్'ను ఏర్పాటు చేయాలి.



రచయిత: పి.వి. సుబ్బారెడ్డి

అందుకే తిమింగలాలకు ఆహారం దొరకదు!

వ్యర్థాల నిర్వహణ

1. ఇ-వేస్ట్ ఉత్పాదనలో మొదటి స్థానంలో ఉన్న రాష్ట్రం?
   1) మహారాష్ట్ర
   2) కర్ణాటక
   3) ఆంధ్రప్రదేశ్
   4) తమిళనాడు




2. కింది వాటిలో సరైంది గుర్తించండి.
   ఎ) దేశంలో అత్యధిక ఇ-వేస్ట్‌ను విడుదల చేస్తున్న నగరం ముంబయి.
   బి) దేశంలో అత్యధిక ఇ-వేస్ట్ రీసైకిల్ అవుతున్న నగరం న్యూదిల్లీ.
   1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
3. సవరించిన ఘన వ్యర్థ పదార్థ నియమాలు ఎప్పుడు విడుదలయ్యాయి?
   1) 2014 2) 2015 3) 2018 4) 2020
4. ప్రపంచంలో అత్యధిక మోతాదులో ఎలక్ట్రానిక్ వ్యర్థాన్ని విడుదల చేస్తున్న దేశం?
   1) చైనా 2) అమెరికా 3) జపాన్ 4) జర్మనీ
5. దేని నిర్వహణను ఉద్దేశించి ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్స్‌బిలిటీ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది?
   1) గాలి కాలుష్యం 2) బయోమెడికల్ వ్యర్థం
   3) ఎలక్ట్రానిక్ వ్యర్థం 4) ఏదీకాదు
6. కింది వాటిలో ఎన్ని భారీ వ్యర్థాలు ఉన్నాయి?
   ఎ) వరదల ద్వారా పూడిక బి) భూకంప వ్యర్థం
   సి) తుపాను ద్వారా మౌలిక సదుపాయాల వ్యర్థం
   డి) యుద్ధాల వ్యర్థం



   1) ఎ 2) ఎ, బి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
7. గాలిలో తేలే ఘన, ద్రవ పదార్థాల మిశ్రమాన్ని ఏమంటారు?
   1) కొల్లాయిడ్ 2) ఏరోసాల్ 3) రెడ్‌టైడ్ 4) హేజ్
8. ఘన వ్యర్థాల నిర్వహణకు ఎన్ని పద్ధతులు సరైనవి?
   ఎ) రెడ్యూస్ బి) రీయూజ్
   సి) రీసైకిల్ డి) రెఫ్యూజ్
   1) ఎ 2) ఎ, బి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
9. భారత్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థం అత్యధికంగా ఉత్పత్తి అవుతున్న నగరం?
   1) ముంబయి 2) దిల్లీ 3) బెంగళూరు 4) కోల్‌కతా
10. ఏ మొక్క పరాగ రేణువులు ఆస్తమా లాంటి తీవ్ర శ్వాస ఇబ్బందిని ప్రేరేపిస్తాయి?
    1) పార్థీనియం 2) కెలోట్రోపిస్
    3) నీరియం 4) కన్నాబిస్
11. దేశంలో జలకాలుష్య సుంకం చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
    1) 1972 2) 1974 3) 1977 4) 1981
12. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ఉదాహరణను గుర్తించండి.
    1) కాటన్ బడ్స్ 2) ప్లాస్టిక్ ఫోర్క్
    3) ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ 4) పైవన్నీ
13. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దేశవ్యాప్తంగా ఏ రోజు నుంచి నిషేధించారు?
    1) జూన్ 1, 2022 2) జులై 1, 2022
    3) ఆగస్టు 1, 2022 4) జనవరి 1, 2022
14. దేశంలోని ఏ ప్రాంతంలో ఎక్కువగా ర్యాట్ హోల్ మైనింగ్ కనిపిస్తుంది?
    1) దక్షిణ ప్రాంతం 2) వాయవ్య ప్రాంతం
    3) ఉత్తర ప్రాంతం 4) ఈశాన్య ప్రాంతం
15. డీజిల్, పెట్రోల్‌కు ప్రత్యామ్నాయ అల్ప కాలుష్య, కాలుష్య రహిత ప్రత్యామ్నాయం ఏది?
    1) హైడ్రోజన్ 2) సీఎన్‌జీ
    3) ఎల్ఎన్‌జీ 4) పైవన్నీ
16. బయో మెడికల్ వ్యర్థ నిర్వహణలో వినియోగించే పద్ధతి?



    1) ఇన్సినరేషన్ 2) బయో మిథనేషన్
    3) బయోకెమికల్ కన్వర్షన్ 4) పైవన్నీ
17. దేశంలో అతిపెద్ద ఎలక్ట్రానిక్ వ్యర్థ రీసైక్లింగ్ ప్రాంతం సీలాపుర్. ఇది ఏ నగరంలో ఉంది?
    1) ముంబయి 2) కోల్‌కతా
    3) బెంగళూరు 4) న్యూదిల్లీ
18. ప్రపంచ ఎలక్ట్రానిక్ వ్యర్థ ఉత్పాదనలో భారత్ స్థానం?
    1) రెండో 2) మూడో 3) నాలుగో 4) ఐదో
19. స్మార్ట్‌ఫోన్ల వ్యర్థంలో అధికంగా లభించే లోహం?
    1) కోబాల్ట్ 2) ప్లాటినం
    3) నియోడైమియం 4) పెల్లాడియం
20. ఎలక్ట్రానిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, హ్యాండ్లింగ్ రూల్స్‌ను తొలుత ప్రభుత్వం ఎప్పుడు రూపొందించింది?
    1) 2012 2) 2011 3) 2010 4) 2009
21. కింది వాటిలో జీవవిచ్ఛిన్నం అయ్యేది ఏది?
    ఎ) సిరామిక్స్ బి) గ్లాస్ సి) పేపరు డి) తోలు
    1) ఎ, బి, సి, డి 2) బి, సి 3) ఎ, సి, డి 4) సి, డి
22. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
    ఎ) ల్యాండ్‌ఫిల్స్ నిర్వహణలో ఏ సమస్యలూ తలెత్తవు.



ఆధునిక ప్రపంచంలో ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్రధాన కారకాలు వ్యర్థాలు. పంటపొలాల్లో వాడుతున్న రసాయన ఎరువుల నుంచి సౌకర్యవంతమైన జీవనం కోసం వినియోగిస్తున్న స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలన్నీ చివరికి వ్యర్థాలుగా, ప్రకృతికి భారంగా మారుతున్నాయి. అందుకే గృహ, పారిశ్రామిక, బయోమెడికల్ వ్యర్థాలను సేకరించడం నుంచి శుద్ధి చేయడం, సురక్షితంగా పారవేయడం వరకు శాస్త్రీయ విధానాలను పాటిస్తూ కాలుష్యాన్ని తగ్గించుకోవాలి. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యర్థాల ఉత్పత్తి తీరుతెన్నులు, వాటితో కలుగుతున్న నష్టాలు, పునర్వినియోగ సాంకేతికతలకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం పోటీ పరీక్షార్థులకు ఉండాలి. వివిధ రకాల వ్యర్థాల్లోని ప్రమాదకర లోహాలు, వాటితో జరిగే బయో మాగ్నిఫికేషన్ ప్రభావం, భార లోహాలతో వస్తున్న వ్యాధులతోపాటు జీవ ఎరువులతో ఉన్న ప్రయోజనాలనూ తెలుసుకోవాలి.

    బి) పైరోలైసిస్ ప్రక్రియలో సింథసిస్ గ్యాస్ ఉత్పత్తి అవుతుంది.
    1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
23. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ ఎక్కడ ఉంది?
    1) చెన్నై 2) గోవా 3) విశాఖపట్నం 4) ముంబయి
24. కిందివాటిలో ఎన్ని ప్రమాదకర వ్యర్థాలు ఉన్నాయి?
    ఎ) రేడియోధార్మిక వ్యర్థం బి) ఇ-వేస్ట్
    సి) బయోమెడికల్ వేస్ట్ డి) రసాయన వ్యర్థం
    1) ఎ 2) ఎ, బి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
25. జలకాలుష్య శుద్ధిలో నైట్రోజన్ స్ట్రిప్పింగ్ ప్రక్రియ అంటే..?
    1) నైట్రోజన్ వాయువును తొలగించడం
    2) నత్రజని ఆక్సైడ్లను తొలగించడం
    3) అమ్మోనియాను తొలగించడం 4) పైవన్నీ

పర్యావరణ అంశాలు

26. కొవిడ్-19 కాలంలో దేశంలో అత్యధిక బయో మెడికల్ వ్యర్థాన్ని ఉత్పత్తి చేసిన రాష్ట్రం?
    1) కర్ణాటక 2) మహారాష్ట్ర
    3) ఆంధ్రప్రదేశ్ 4) హరియాణా
27. ఏ భారీ లోహ కాలుష్యం ద్వారా మనిషిలో ఇటాయి-ఇటాయి అనే వ్యాధి వస్తుంది?
    1) ఆర్సెనిక్ 2) పాదరసం
    3) కాడ్మియం 4) మాంగనీస్
28. దేశంలో జలకాలుష్యానికి ప్రధాన కారణం?
    1) మురుగు 2) పారిశ్రామిక వ్యర్థం
    3) ప్లాస్టిక్ వ్యర్థం 4) ఏదీకాదు
29. కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
    ఎ) ఘన వ్యర్థ నిర్వహణకు ల్యాండ్ ఫిల్లింగ్ పద్ధతిలో ఏ లోపాలు ఉండవు.
    బి) పైరోలైసిస్ పద్ధతి ద్వారా సింథసిస్ గ్యాస్ అనే ఇంధన వాయువు లభిస్తుంది.
    1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
30. కింది వాక్యాల్లో ఏది సరైంది?
    ఎ) కల్చరల్ యూట్రిఫికేషన్ ద్వారా జలాశయాలు శుద్ధి చెందుతాయి.
    బి) బీఓడీ కంటే సీఓడీని వేగంగా నిర్వహించొచ్చు.
    1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
31. కింది వాక్యాల్లో ఏది సరైంది?
    ఎ) సముద్రం తీరం వద్ద ఉన్న డైనోఫ్లాజెల్లేట్స్ ద్వారా రెడ్ టైడ్ సంభవిస్తుంది.
    బి) ఓషన్ అసిడిఫికేషన్ ద్వారా తిమింగలాలకు ఆహారం దొరకదు.
    1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు
32. కిందివాటిలో బయోమాగ్నిఫికేషన్‌కు కారణమయ్యేవి?
    1) పాదరసం 2) పాలీ క్లోరినేటెడ్ బైఫినైల్
    3) డీడీటీ 4) పైవన్నీ
33. నేలలో భాస్వరం శాతాన్ని పెంపొందించే జీవ ఎరువులు ఏవి?
    ఎ) రైజోబియం బి) ఆగ్రో బ్యాక్టీరియం
    సి) మైక్రో కోకస్
    1) ఎ, బి, సి 2) ఎ, బి
    3) ఎ 4) ఎ, సి
34. కింది వాటిలో బొటానికల్ బయోపెస్టిసైడ్స్‌గా వేటిని ఉపయోగిస్తారు?
    ఎ) వేప బి) క్రిసాంథిమం సి) టాజిటస్
    1) ఎ, బి, సి 2) ఎ, బి
    3) ఎ 4) ఎ, సి
35. భారత్‌లో జలకాలుష్యానికి ప్రధాన కారణం?



    1) పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు
    2) మురుగు
    3) వ్యవసాయ వ్యర్థ పదార్థాలు 4) పైవన్నీ
36. జీవితకాలం పూర్తయిన కాంపాక్ట్ ఫ్లోరోసెంట్ ల్యాంప్స్ ద్వారా ఏ భార లోహ కాలుష్యం సంభవిస్తుంది?
    1) ఆర్సెనిక్ 2) పాదరసం
    3) సీసం 4) నికెల్
37. ఎల్‌సీడీ మానిటర్ల వ్యర్థ రీసైక్లింగ్ ద్వారా అధిక మొత్తంతో లభించే లోహం?
    1) గాలియం 2) బంగారం
    3) ఇండియం 4) వెండి
38. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు మడ్‌బాల్ టెక్నిక్‌ను అభివృద్ధి చేసిన సంస్థ?
    1) ఇండియన్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
    2) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్
    3) ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
    4) ఇంటర్నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
39. నాక్-నీ సిండ్రోమ్ అని దేన్ని అంటారు?
    1) సిడరోసిస్ 2) ఫ్లోరోసిస్
    3) ఆస్టియోమలాసియా 4) ఆస్టియాపోరోసిస్
40. చమురు వ్యర్థ పదార్థాల శుద్ధి కోసం ఉపయోగపడే సూక్ష్మజీవుల మిశ్రమాలు ఆయిల్ జాపర్, ఆయిల్ వోరస్‌ను అభివృద్ధి చేసిన కేంద్రం?
    1) నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ ఆఫ్ పెట్రోలియం
    2) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం
    3) ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్
    4) టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్
41. మినమట వ్యాధికి కారణమయ్యే భారలోహం?
    1) క్రోమియం 2) కాడ్మియం
    3) సీసం 4) పాదరసం



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

సమాధానాలు

1-1; 2-3; 3-4; 4-1; 5-3; 6-4; 7-2; 8-4; 9-1; 10-1; 11-3; 12-4; 13-2; 14-4; 15-4; 16-1; 17-4; 18-2; 19-4; 20-2; 21-4; 22-2; 23-1; 24-4; 25-1; 26-2; 27-3; 28-1; 29-2; 30-2; 31-3; 32-2; 33-4; 34-3; 35-4; 36-2; 37-3; 38-4; 39-2; 40-3; 41-4.

(c) eenadu

ప్రస్తారాలు లేదా అమరికలు

ముఖ్యాంశాలు

- ఇచ్చిన n విభిన్న అంశాల్లో అన్నింటిని లేదా కొన్నింటిని తీసుకుని వాటి ద్వారా ఏర్పాటు చేయగల విభిన్న అమరికలను ప్రస్తారాలు (Permutations) అంటారు.
- ఇందులో వస్తువుల వరుస క్రమం చాలా ముఖ్యం.
- a, b, c అనే మూడు అక్షరాల్లో ఒకేసారి రెండు అక్షరాలు తీసుకుని వాటి ద్వారా ఏర్పాటు చేయగలిగే విభిన్న ప్రస్తారాలు
  ab, bc, ca, cb, ba, ac
- x, y, z అనే మూడు అక్షరాల నుంచి ఒకేసారి అన్ని అక్షరాలను తీసుకుంటేవాటి ద్వారా ఏర్పాటు చేయగలిగే విభిన్న ప్రస్తారాలు లేదా అమరికలు: xyz, yzx, zxy, zyx, yxz, xzy
- n వస్తువులన్నింటిలో r వస్తువులను ఒకేసారి తీసుకున్నప్పుడు ఏర్పడే అన్ని ప్రస్తారాలను n_{p_r} తో సూచిస్తారు.

$$n_{p_r} = \frac{n!}{(n-r)!} \quad (0 \le r \le n)$$

- n వస్తువుల నుంచి అన్నింటినీ ఒకేసారి తీసుకున్నప్పుడు ఏర్పడే అన్ని ప్రస్తారాలను n_{p_n} తో సూచిస్తారు.



అమరిక కుదిరితే.. సమాధానం చిక్కినట్టే!

మాదిరి ప్రశ్నలు

1. HONESTY పదంలోని అన్ని అక్షరాలను ఉపయోగించి ఎన్ని విభిన్న పదాలను అమర్చవచ్చు?

1) 720 2) 5040 3) 5000 4) 4820

సాధన: HONESTY పదంలోని అక్షరాల సంఖ్య = 7

$\therefore$ HONESTY పదంలోని అన్ని అక్షరాలను ఉపయోగించి అమర్చే విభిన్న పదాల సంఖ్య = 7! = 5040

సమాధానం: 2

2. AHMEDABAD అనే పదంలోని అక్షరాలన్నింటినీ ఉపయోగించి ఎన్ని విభిన్న పదాలను ఏర్పర్చవచ్చు?

1) 30240 2) 30420 3) 30204 4) 30402

సాధన: AHMEDABAD పదంలోని మొత్తం అక్షరాల సంఖ్య = 9

పునరావృతం అయ్యే అక్షరాలు, A = మూడుసార్లు, D = రెండుసార్లు

పునరావృతం కాని అక్షరాలు = H, M, E, B

లెక్కలో కోరిన అమరికల సంఖ్య $= \frac{9!}{3!\ 2!} = 30240$

సమాధానం: 1

3. MISSISSIPPI అనే పదంలోని అక్షరాలను ఉపయోగించి, అన్ని I లు కలిసి ఉండే విధంగా ఎన్ని విభిన్న పదాలను ఏర్పరచవచ్చు?

1) 800 2) 930 3) 720 4) 840

సాధన: MISSISSIPPI అనే పదంలో నాలుగు I లను కలిపి ఒక యూనిట్‌గా పరిగణించాలి.

మిగిలిన అక్షరాల సంఖ్య = 7

మొత్తం యూనిట్ల సంఖ్య = 1 + 7 = 8

ఇందులో పునరావృతమయ్యే అక్షరాలు = S = నాలుగుసార్లు, P = రెండుసార్లు;

పునరావృతం కాని అక్షరాలు = M

$\therefore$ లెక్కలో కోరిన అమరికల సంఖ్య $= \frac{8!}{4!\ 2!} \Rightarrow \frac{40320}{48} = 840$

సమాధానం: 4

4. COMPUTER అనే పదంలోని అక్షరాలన్నింటినీ ఉపయోగించి, C, M లు ఎప్పుడూ కలిసి ఉండే విధంగా ఎన్ని విభిన్న పదాలను ఏర్పరచవచ్చు?

1) 10880 2) 10800 3) 10080 4) 10008

సాధన: COMPUTER పదంలోని C, M లను ఒక యూనిట్‌గా భావించాలి.

మిగిలిన అక్షరాల సంఖ్య = 6

మొత్తం యూనిట్ల సంఖ్య = 6 + 1 = 7

C, M లతో అమరికల సంఖ్య = 21

$\therefore$ లెక్కలో కోరిన విభిన్న పదాల సంఖ్య $= 7! \times 2! \Rightarrow 5040 \times 2 = 10080$

సమాధానం: 3

5. EXAMPLE అనే పదంలోని అక్షరాల్లో P అనే అక్షరంతో ప్రారంభమయ్యే విభిన్న పదాల సంఖ్య ఎంత?

1) 360 2) 300 3) 720 4) 700

సాధన: EXAMPLE పదంలోని మొత్తం అక్షరాల సంఖ్య = 7

ఇందులో పునరావృతం అయ్యే అక్షరాలు E = 2

P తో ప్రారంభమయ్యే పదాలు కావాలంటే మొదటి అక్షరంగా Pని ఫిక్స్ చేయాలి.

మిగిలిన ఆరు అక్షరాలను ఉపయోగించి ఏర్పరచగల విభిన్న పదాల సంఖ్య $= \frac{6!}{2!} = \frac{720}{2} = 360$

సమాధానం: 1

6. QUESTION అనే పదంలోని అక్షరాల్లో అచ్చులు ఎప్పుడూ కలిసి ఉండేలా ఎన్ని విధాలుగా అమర్చవచ్చు?

1) 2800 2) 2880 3) 3000 4) 2680

సాధన: QUESTION పదంలోని మొత్తం అక్షరాల సంఖ్య = 8

అచ్చులు (U, E, I, O) = 4, హల్లులు (Q, S, T, N) = 4

అచ్చులన్నింటినీ ఒక యూనిట్‌గా భావిస్తే, మొత్తం యూనిట్ల సంఖ్య = 1 + 4 = 5

ఈ 5 యూనిట్లను అమర్చే విధాలు = 5! = 120 ......(1)

అచ్చుల యూనిట్‌లో అక్షరాలను అంతర్గతంగా అమర్చే విధాలు = 4! = 24 ......(2)

$\therefore$ లెక్కలో కోరిన మొత్తం విధాలు $= 120 \times 24 = 2880$

సమాధానం: 2

7. "PERMUTATION" అనే పదంలోని అక్షరాల్లో హల్లులన్నీ ఎప్పుడూ కలిసి ఉండాలనే నిబంధనతో ఎన్ని రకాలుగా అమర్చవచ్చు?

1) 12! 2) $\frac{1}{2}(7 \times 5!)$ 3) $\frac{1}{2}(5! \times 6!)$ 4) $\frac{1}{2}(6! \times 6!)$

సాధన: "PERMUTATION" పదంలో హల్లులు (P, R, M, T, T, N) = 6

అచ్చులు (E, U, A, I, O) = 5

హల్లులన్నింటినీ ఒక యూనిట్‌గా భావిస్తే, మొత్తం యూనిట్లు సంఖ్య = 1 + 5 = 6

6 యూనిట్లను అమర్చే విధాలు = 6!

హల్లుల యూనిట్‌లోని అక్షరాలను అంతర్గతంగా అమర్చే విధాలు $= \frac{6!}{2!} = \frac{6!}{2}$ ('T' రెండుసార్లు పునరావృతం అయ్యింది)

$\therefore$ లెక్కలో కోరిన అమరికల సంఖ్య $= \frac{1}{2}(6! \times 6!)$

సమాధానం: 4

8. 3, 4, 5, 6, 7, 8 అంకెలను ఉపయోగించి (పునరావృతాన్ని అనుమతిస్తే) ఎన్ని మూడు అంకెల బేసి సంఖ్యలను ఏర్పర్చవచ్చు?

1) 102 2) 108 3) 105 4) 61

సాధన: బేసి సంఖ్యలు ఏర్పర్చాలంటే ఒకట్ల స్థానంలో ఎంపికల సంఖ్య (3, 5, 7) = 3

పునరావృతాన్ని అనుమతిస్తే పదుల స్థానంలో (3, 4, 5, 6, 7, 8) ఎంపికల సంఖ్య = 6

వందల స్థానంలో (3, 4, 5, 6, 7, 8) ఎంపికల సంఖ్య = 6

లెక్కలో కోరిన బేసి సంఖ్యలు $= 3 \times 6 \times 6 = 108$

సమాధానం: 2



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

Word of the Day 930

Eloquent

Telugu meaning: అనర్గళంగా, వాగ్ధాటి

English meaning: The word eloquent (ఎలొక్వెంట్) is an adjective that describes someone who speaks or writes in a fluent, persuasive, and expressive manner.

Synonyms: Expressive, Fluent; ***Antonyms:*** Hesitant, Unclear


Usage: **1.** The leader delivered an eloquent speech that inspired the entire nation to work together for progress.

2. Her eloquent presentation during the seminar impressed the judges and earned her first prize.

కరెంట్ అఫైర్స్



పెరూ దేశ అధ్యక్షుడిగా మాజీ న్యాయమూర్తి జోస్ మారియా బల్కజార్ (83) 2026, ఫిబ్రవరి 19న ఎన్నికయ్యారు. 10 ఏళ్లలో ఈయన 8వ అధ్యక్షుడు. అవినీతి ఆరోపణల కారణంగా తాత్కాలిక అధ్యక్షుడు జోస్ జెరీని తొలగించిన మరుసటి రోజే ఈ ఎన్నిక జరిగింది. వామ పక్ష పెరూ లిబ్రె పార్టీ తరఫున పోటీ చేసిన బల్కజార్, 130 మంది సభ్యులున్న చట్టసభలో ముగ్గురు ఇతర అభ్యర్థులను ఓడించి విజేతగా నిలిచారు. పెరూలో 2026 ఏప్రిల్ 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.



రాబోయే అయిదేళ్ల కాలంలో వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 3,000 కోట్ల డాలర్ల స్థాయికి తీసుకువెళ్లాలని భారత్ - బ్రెజిల్ నిర్ణయించాయి. ఈ మేరకు ప్రధాని మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా మధ్య 21 ఫిబ్రవరి 2026న చర్చలు జరిగాయి. దీనిలో భాగంగా ఇరు దేశాలు కీలక ఖనిజాల రంగంలో సహకారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఏఐ సదస్సులో పాల్గొనడంతోపాటు మోదీతో చర్చల కోసం లులా ఫిబ్రవరి 18న భారత్ వచ్చారు.



దేశీయ ఫార్మా ఎగుమతులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9.4% వృద్ధితో రూ.2.7 లక్షల కోట్లకు చేరుకున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2026-27 నాటికి ఇందులో రెండంకెల వృద్ధిని పరిశ్రమ లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. ఉత్పత్తి పరంగా ప్రపంచవ్యాప్తంగా మూడో స్థానంలో ఉన్న భారత్ 200పైగా దేశాలకు మందులను ఎగుమతి చేస్తుంది.

సముద్ర భద్రత, సమాచార మార్పిడి, విపత్తుల్లో ఉపశమన చర్యలు, పరస్పర సహకారంపై ఉమ్మడి కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేయాలని హిందూ మహా సముద్ర నావల్ సింపోజియం (ఐఓఎన్ఎస్) సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో ఐఎఫ్ఆర్, మిలాన్, సింపోజియం పేరిట నిర్వహిస్తున్న ప్రపంచ స్థాయి కార్యక్రమాల్లో భాగంగా 2026, ఫిబ్రవరి 20న తొమ్మిదో ఐఓఎన్ఎస్ సమావేశం జరిగింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ సూచీల్లో భారతదేశం (2025 - 26)

స్టడీ జోన్

అంతర్జాతీయ సంస్థలు ప్రచురించే వివిధ సూచీలు ఒక దేశ అభివృద్ధిని ప్రతిబింబిస్తాయి. అంతేకాకుండా ఆవిష్కరణల సామర్థ్యం, మానవాభివృద్ధి, పాలనా ప్రమాణాలు, సామాజిక శ్రేయస్సు, స్వేచ్ఛా - సమానత్వం, పర్యావరణ పురోగతి, అసమానతలు లాంటి అంశాలను అంచనా వేయడానికి కీలకమైన ప్రమాణంగా పనిచేస్తాయి. ప్రస్తుతం భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న దేశాల జాబితాలో ఉంది. అధిక జనాభా, భిన్న సంస్కృతి - సంప్రదాయాలు, వివిధ భాషలు - కులాలు - మతాలు - జాతులూ కలిగిన మన దేశం ఆయా రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ ప్రపంచ సూచికల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తుండగా.. కొన్నింటిలో మాత్రం ఇంకా మెరుగుపడాల్సిన ఆవశ్యకత ఉంది. పోటీపరీక్షల కోణంలో 2025-26 కాలానికి ఆయా అంతర్జాతీయ సంస్థలు విడుదల చేసిన ముఖ్య సూచీల్లో భారత్ ర్యాంకలను పరిశీలిద్దాం..!

Climate Change Performance Index - CCPI - 2026

- వాతావరణ మార్పు పనితీరు సూచికను (CCPI) జర్మన్ వాచ్, న్యూ క్లైమేట్ ఇన్‌స్టిట్యూట్, క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ సంస్థలు ఏటా సంయుక్తంగా ప్రచురిస్తాయి.
- సీసీపీఐ 2026 సూచీని 2025, నవంబరు 18న విడుదల చేశారు. జాబితాలో మొత్తం 67 ర్యాంకులు ఉండగా.. మొదటి మూడు ర్యాంకులను ఏ దేశానికీ ప్రకటించలేదు. అన్ని విభాగాల్లోనూ అధిక రేటింగ్ సాధించేంతగా దేశాలు రాణించకపోవడమే ఇందుకు కారణం. డెన్మార్క్ (80.52 స్కోరు), యునైటెడ్ కింగ్‌డమ్ (70.80), మొరాకో (70.75) వరుసగా నాలుగు, అయిదు, ఆరు స్థానాల్లో ఉన్నాయి.



Global Peace Index - GPI - 2025

- ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనమిక్స్ అండ్ పీస్ దీన్ని వెలువరిస్తుంది. సామాజిక భద్రత, స్థానిక - అంతర్జాతీయ సంఘర్షణలు, సైనికీకరణ తదితర 26 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని దీన్ని రూపొందిస్తారు.

ముఖ్యమైన సూచీల్లో భారత్ స్థానం, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబులతో సహా పూర్తి సమాచారంతో రూపొందించిన ఉచిత ఈబుక్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం


బాల కార్మిక వ్యవస్థ

ఇంట్లో తల్లిదండ్రులకు సహాయపడితే కూడా బాలకార్మికులు అవుతారా? తల్లిదండ్రులతోపాటు సొంత పొలంలో పనిచేస్తే బాలకార్మికులవుతారా? అసలు బాలకార్మిక వ్యవస్థ అంటే ఏంటి? దీనివల్ల బాలలు, సమాజంపై పడుతున్న ప్రభావమేంటి? ఈ సమస్య తీవ్రత ఎంత? ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?

బాలలు, బాలకార్మికులు

జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటారు. యునిసెఫ్ ప్రకారం 18 ఏళ్ల లోపున్నవారు కొన్ని కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే వారిని బాలకార్మికులుగా పరిగణిస్తారు.

- ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల హక్కుల సంప్రదాయం (యునైటెడ్ నేషన్స్ చైల్డ్ రైట్స్ కన్వెన్షన్) ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారు ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లయితే బాలకార్మికులుగా పరిగణిస్తారు. ఓటు హక్కు ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారంతా బాలలు అవుతారు.



ప్రేరేపణ కారకాలు

- సామాజిక, ఆర్థిక కారణాలు
- రాజకీయ కారణాలు
- ఇతర కారణాలు

చిన్నాచితక పనుల్లో ఉన్న బాలకార్మికులు, ఎంతలోపు వయసు ఉన్నవారు పని చేయడానికి అనర్హులు, బాలకార్మికులు అధికంగా ఉన్న రంగాలు, బాలకార్మిక వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Assistant jobs

The Reserve Bank of India (RBI) is inviting applications from eligible candidates for the post of 'Assistant'. The total no. of posts is 650. The exam fee is Rs.450 + 18% GST. The last date for the online applications is 8 March 2026.

Faculty Posts

The University of Hyderabad (UOH) is inviting applications for vacant Professor/Associate Professor/Assistant Professor positions in various departments. The total no. of posts is 40. The application fee is Rs. 1000. Eligible candidates can apply online before 6 March 2026.

Consultant Jobs

The National AYUSH Mission (NAM), Central Program Management Unit (CPMU) is inviting applications for various positions on a temporary basis. The total number of posts is 20. Eligible candidates can apply offline before 27 February 2026.

Did You Apply..?

Today (February 23) is the last date for the following Jobs

- 80 jobs in CSIR-CCMB, Hyderabad. Eligibility: 10th, ITI.
- IAF Agniveervayu Non-Combatant Posts. ***Eligibility:*** Matriculation/10th Class.
- Marine Engineer posts in Cochin Port Authority. ***Eligibility:*** Degree.

For more information and other notifications - scan QR code

SSC Exams — English

Direct & Indirect Speech

Directions (Qs. 1 - 7): *Select the correct indirect form of the given sentence.*

1. Raj said, "I have finished my work."
A) Raj said that he finished his work.
B) Raj said that he had finished his work.
C) Raj said that he has finished his work.
D) Raj told that he had finished his work.

2. She said to me, "Are you preparing for the exam?"
A) She asked me whether was I preparing for the exam.
B) She asked me that I was preparing for the exam.
C) She told me if I was preparing for the exam.
D) She asked me if I was preparing for the exam.

3. The old man said, "I lived in this village many years ago."
A) The old man said that he had lived in that village many years before.
B) The old man said that he lived in that village many years before.
C) The old man said that he had lived in this village many years ago.
D) The old man told that he had lived in that village many years before.

4. He said to his friend, "Please help me with this project."
A) He requested his friend to help him with that project.
B) He told his friend to help me with that project.
C) He requested that his friend helps him with this project.
D) He said his friend to help him with that project.

5. She said, "I will call you tomorrow."
A) She said that she would call me tomorrow.
B) She said that she will call me the next day.
C) She said that she would call me the next day.
D) She told that she would call me the next day.

6. The boy said, "I am playing in the park."
A) The boy told that he was playing in the park.
B) The boy said that he is playing in the park.
C) The boy said that I was playing in the park.
D) The boy said that he was playing in the park.

7. She exclaimed, "What a wonderful surprise!"
A) She exclaimed that it was a wonderful surprise.
B) She said that it was a wonderful surprise.
C) She exclaimed with joy that it was a wonderful surprise.
D) She exclaimed that what a wonderful surprise it was.

Directions (Qs. 8 - 13): *Select the correct direct form of the given sentence.*

8. He said that he was feeling unwell.
A) He said, "I am feeling unwell."
B) He said, "I was feeling unwell."
C) He said, "I feel unwell."
D) He said, "I had been feeling unwell."

9. She said that she had completed the work.
A) She said, "I completed the work."
B) She said, "I have completed the work."
C) She said, "I had completed the work."
D) She said, "I complete the work."

10. The teacher asked me if I understood the lesson.
A) The teacher asked, "Do you understand the lesson?"
B) The teacher asked, "Have you understood the lesson?"
C) The teacher asked, "Did you understand the lesson?"
D) The teacher asked, "Can you understand the lesson?"

11. He said that he would return soon.
A) He said, "I returned soon."
B) He said, "I would return soon."
C) He said, "I am returning soon."
D) He said, "I will return soon."

12. She wished that I might succeed.
A) She said, "You may succeed."
B) She wished, "May you succeed!"
C) She said, "You might succeed."
D) She wished, "You should succeed."

13. He told me to open the window.
A) He said, "Open the window."
B) He said, "You should open the window."
C) He told, "Open the window."
D) He said, "Please open the window."

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

(c) eenadu

అప్రెంటిస్

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- వెస్టర్న్ రైల్వే, ముంబయి.. డివిజన్/ వర్క్‌షాపుల్లో 5,349 అప్రెంటిస్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అప్రెంటిస్ శిక్షణ పూర్తి చేసిన వారికి భవిష్యత్తులో రైల్వే లెవల్-1 ఉద్యోగాల్లో 20 శాతం పోస్టులు కేటాయిస్తారు.

- అప్రెంటిస్: 5,349 ఖాళీలు

ట్రేడ్‌ల వారీగా: ఫిట్టర్- 1614, ఎలక్ట్రీషియన్- 1217, వెల్డర్- 532, పీఏఎస్ఏఏ- 280, ఎలక్ట్రానిక్ మెకానిక్- 236, మెకానిక్ (డీజిల్)- 207, పెయింటర్- 190, కార్పెంటర్- 184, రిఫ్రిజిరేటర్ (మెకానిక్)- 184, పైప్ ఫిట్టర్- 176, ప్లంబర్- 136, వైర్‌మ్యాన్- 126, డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్)- 87, టర్నర్- 75, స్టెనోగ్రాఫర్- 40, మెషినిస్ట్ (గ్రైండర్)- 25, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్- 16, మెషినిస్ట్- 14, మెకానిక్ మోటార్ వెహికల్- 10,

అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉండాలి.

వయసు: 23-03-2026 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

శిక్షణ కాలం: ఒక సంవత్సరం.

ఎంపిక: పదో తరగతి, ఐటీఐ మార్కుల మెరిట్, ధ్రువపత్రాల పరిశీలనలతో.

దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు ఉండదు. మిగిలిన వారికి రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23-03-2026.

వెబ్‌సైట్: https://www.rrc-wr.com/

టెక్నికల్ ఆఫీసర్లు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) .. ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- టెక్నికల్ ఆఫీసర్: 200 పోస్టులు

విద్యార్హత: కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్. ఎస్సీ/ఎస్టీలైతే 50 శాతం సరిపోతాయి. ఏడాది పని అనుభవం కావాలి.

వయసు: 30 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సడలింపు వర్తిస్తుంది.

వేతనం: మొదటి ఏడాది నెలకు రూ.25,000 చెల్లిస్తారు. తర్వాతి సంవత్సరాల్లో ఇది 31,000 వరకు పెరుగుతుంది.

ఎంపిక: విద్యార్హత (20 మార్కులు), పని అనుభవం (30 మార్కులు), ఇంటర్వ్యూ (50 మార్కులు)లతో.

ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 24. ఉదయం 09:00 నుంచి 11:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుంది.

వేదిక: కార్పొరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, నలంద కాంప్లెక్స్, ఈసీఐఎల్, హైదరాబాద్ - 500062.

వెబ్‌సైట్: www.ecil.co.in/jobs.html

ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్‌లో

నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్, బెంగళూరు.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రాజెక్ట్ అసోసియేట్-I: 02
- ప్రాజెక్ట్ అసోసియేట్-II: 02
- సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీలతో పాటు సీఎస్ఐఆర్-యూజీసీ/ఐసీఏఆర్/ఐసీఎంఆర్ నెట్ లేదా గేట్ స్కోరు ఉండాలి.

జీతం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్-Iకు రూ.25,000; ప్రాజెక్ట్ అసోసియేట్-IIకు రూ.35,000; సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000.

వయసు: ప్రాజెక్ట్ అసోసియేట్-I, ప్రాజెక్ట్ అసోసియేట్-II లకు 35 ఏళ్లు; సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేదీలు: ఫిబ్రవరి 25, 26.

వేదిక: సీఎస్ఐఆర్-ఎన్ఏఎల్, ఆర్ఏబీ మీటింగ్ కాంప్లెక్స్, నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్, బెంగళూరు.

వెబ్‌సైట్: https://www.nal.res.in/



తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది చేరుతోన్న పీజీ కోర్సుల్లో ఎంబీఏ, ఎంసీఏ ముఖ్యమైనవి. రెండు రాష్ట్రాల్లోనూ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐసెట్)తో వీటిలో ప్రవేశం లభిస్తుంది. ఇటీవలే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఈ ప్రకటన వెలువడింది. పరీక్షలో ప్రతిభతో విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ సంస్థల్లో ఎంబీఏ, ఎంసీఏ చదువుకోవచ్చు.

ఒకే పరీక్షతో రెండు కోర్సుల్లోకి

ఏపీ, టీజీ ఐసెట్-2026

ఉన్నత విద్యా మండళ్ల తరపున ఏపీలో ఆంధ్ర, టీజీలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో ఐసెట్ 2026 పరీక్షలు జరుగుతాయి. ఏపీ, తెలంగాణ ఐసెట్ స్వరూపం దాదాపు ఒకటే. ఈ పరీక్షలో అర్హత మార్కులు పొందడం సులువే. అయితే మేటి సంస్థల్లో అవకాశం మాత్రం అధిక మార్కులు/ర్యాంకు సాధించినవారికే దక్కుతుంది. ఈ పరీక్షకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచీ సుమారు 1.10 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరిలో దాదాపు 75,000 మంది తెలంగాణ నుంచే పోటీ పడుతున్నారు.

పరీక్ష

ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున 200 మార్కులకు ఆన్‌లైన్‌లో రెండున్నర గంటల వ్యవధితో నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ నాలుగు ఐచ్ఛికాలు ఇస్తారు. వీటిలో సరైన జవాబును గుర్తించాలి. రుణాత్మక మార్కులు లేవు.

ఏపీ ఐసెట్

సెక్షన్ ఏ: అనలిటికల్ ఎబిలిటీలో డేటా సఫిషియన్సీ 20, ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 చొప్పున 75 ప్రశ్నలు వస్తాయి.

సెక్షన్ బీ: కమ్యూనికేషన్ ఎబిలిటీలో ఒకాబ్యులరీ 15, ఫంక్షనల్ గ్రామర్ 20, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ 15, రీడింగ్ కాంప్రహెన్షన్ 20 చొప్పున 70 ప్రశ్నలు ఉంటాయి.

సెక్షన్ సీ: మ్యాథమెటికల్ ఎబిలిటీలో అరిథ్‌మెటికల్ ఎబిలిటీ 35, ఆల్జీబ్రాయికల్ అండ్ జియోమెట్రికల్ ఎబిలిటీ 10, స్టాటిస్టికల్ ఎబిలిటీ 10 చొప్పున 55 ప్రశ్నలు వస్తాయి.

టీజీ ఐసెట్

సెక్షన్ ఏ: అనలిటికల్ ఎబిలిటీ విభాగానికి 75 మార్కులు. వీటిలో డేటా సఫిషియన్సీ 20, ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 ప్రశ్నలు వస్తాయి.

సెక్షన్ బీ: మ్యాథమెటికల్ ఎబిలిటీ 75 మార్కులకు ఉంటుంది. ఇందులో అరిథ్‌మెటికల్ ఎబిలిటీ 35, ఆల్జీబ్రికల్ అండ్ జియోమెట్రికల్ ఎబిలిటీ 30, స్టాటిస్టికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు వస్తాయి.

సెక్షన్ సీ: కమ్యూనికేషన్ ఎబిలిటీ 50 మార్కులకు ఉంటుంది. ఇందులో ఒకాబ్యులరీ 10, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ 10, ఫంక్షనల్ గ్రామర్ 15, రీడింగ్ కాంప్రహెన్షన్ 15 ప్రశ్నలు వస్తాయి.

సన్నద్ధత

- సెక్షన్లు, విభాగాల వారీ సిలబస్ వివరాలు గమనించాలి. వీటిని వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు.
- సిలబస్ ప్రకారం అంశాల వారీ సన్నద్ధత కొనసాగించాలి. ప్రతీ విభాగం, అంశంలోనూ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.
- గత పరీక్షల ప్రశ్నపత్రాలను నిశితంగా పరిశీలించాలి. విభాగాలు, అంశాల వారీ ఎన్నేసి ప్రశ్నలు, ఏ స్థాయిలో అడుగుతున్నారో గమనించాలి. దాని ప్రకారం సన్నద్ధతను మలచుకోవాలి. ఎక్కువ ప్రశ్నలు ఉన్నవాటిని అధిక ప్రాధాన్యంతో చదవాలి.
- పరీక్షకు కొద్ది రోజుల ముందు ఐసెట్ వెబ్‌సైట్లలో ఉన్న మాక్ టెస్టులు రాసి, తప్పులు సమీక్షించుకోవాలి.
- సన్నద్ధత పూర్తైన తర్వాత కనీసం 10 నమూనా ప్రశ్నపత్రాలు సాధన చేయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, సన్నద్ధత తీర్చిదిద్దుకోవాలి.
- ఇంటర్మీడియట్/డిగ్రీలో గణిత నేపథ్యం లేనివారు 8, 9, 10 తరగతుల్లోని గణిత పాఠ్యాంశాలపై శ్రద్ధ వహించి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే ఎక్కువ మార్కులే పొందవచ్చు.
- పరీక్షలో సమయ పాలనకు ప్రాధాన్యం ఉంది. ఎక్కువ సమయం తీసుకునే ప్రశ్నలను చివరలో ప్రయత్నించాలి..
- రుణాత్మక మార్కులు లేనందువల్ల బాగా ఆలోచించి, తెలియని ప్రశ్నలకూ జవాబు గుర్తించవచ్చు.
- పేపర్‌లోని అంశాలన్నీ ఉన్న ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్నే తీసుకుని, అందులోని విభాగాల వారీ ప్రశ్నలన్నీ సాధన చేస్తే సరిపోతుంది.

సులువుగానే

పరీక్షలో అర్హతకు 25 శాతం మార్కులు పొందాలి. పరీక్ష రాసిన వారిలో దాదాపు 90 శాతం మంది అర్హులవుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు అర్హత మార్కులు ఉండవు. ఐసెట్‌లో కనీసం సగం ప్రశ్నలు తేలికగానే ఉంటాయి. 30 శాతం ప్రశ్నలు మధ్యస్థంగా, మిగిలిన 20 శాతం కొంచెం కఠినంగా రావొచ్చు. సగటు విద్యార్థులూ 120 మార్కులు పొందగలరు. 150+ మార్కులతో పేరున్న సంస్థల్లో సీటు దక్కుతుంది. ఆంగ్లం, ఆప్టిట్యూడ్, మ్యాథ్స్‌లపై పట్టున్నవారు పరీక్షలో రాణించగలరు.

45 సెకన్లే

200 ప్రశ్నలకు 150 నిమిషాలు అంటే ప్రతి ప్రశ్నకూ 45 సెకన్ల వ్యవధి దక్కుతుంది. అనలిటికల్, మ్యాథమెటికల్ ఎబిలిటీ ప్రశ్నలకు ఈ వ్యవధి సరిపోకపోవచ్చు. ఈ విభాగాల్లో వీలైనన్ని ఎక్కువ మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే ఉన్న వ్యవధిలోనే జవాబు గుర్తించగలిగే నైపుణ్యం సొంతమవుతుంది. సూత్రాలు ఉపయోగించడం, షార్ట్‌కట్ పద్ధతి అనుసరించడంలో మెలకువలు తెలుసుకోవాలి. సులువైన ప్రశ్నలనే ముందు ప్రయత్నించాలి.

ముఖ్య వివరాలు

అర్హత: ఎంబీఏ కోసమైతే ఏదైనా డిగ్రీ చాలు. ఎంసీఏకి డిగ్రీతో పాటు ఇంటర్మీడియట్ లేదా యూజీలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. రెండు కోర్సులకూ యూజీలో 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం డిగ్రీ చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. గరిష్ఠ వయసు నిబంధన లేదు.

ఆంధ్రప్రదేశ్

ఫైన్ లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 2

ఫీజు: ఎస్సీ, ఎస్టీలకు రూ.650, బీసీలకు రూ.700, ఇతరులకు రూ.750.

పరీక్ష తేదీ: మే 2.

వెబ్‌సైట్: https://cets.apsche.ap.gov.in/ICET/ICET/ICET_HomePage

తెలంగాణ

ఫైన్ లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 16.

ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.550. ఇతరులకు రూ.750.

పరీక్ష తేదీలు: మే 13, 14.

వెబ్‌సైట్: https://icet.tgche.ac.in/

ప్రాజెక్ట్ అసోసియేట్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ.. ప్రాజెక్ట్ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- ప్రాజెక్ట్ అసోసియేట్-1: 04
- ప్రాజెక్ట్ అసిస్టెంట్-1: 01
- సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 02
- ప్రాజెక్ట్ అసోసియేట్-2: 02

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, ఎంవీఎస్సీ/ఎంసీఏ, పీహెచ్‌డీలతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.31,000. ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.20,000. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000. ప్రాజెక్ట్ అసోసియేట్-2కు రూ.35,000. **వయసు:** సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీ:** 27.02.2026. **వేదిక:** సీఎస్ఐఆర్-ఐఐసీబీ, జాదవ్‌పూర్ క్యాంపస్, కోల్‌కతా.

వెబ్‌సైట్: https://iicb.res.in/

ప్రాజెక్టు సైంటిస్టులు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ, దిల్లీ తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్టు సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రాజెక్ట్ సైంటిస్ట్-1, 2: 02 పోస్టులు

అర్హత: బయోఇన్ఫర్మేటిక్స్, కంప్యూటేషనల్ బయాలజీ, సిస్టమ్స్ బయాలజీ లేదా బయోఫిజిక్స్ లాంటి విభాగాల్లో పీహెచ్‌డీ లేదా ఇంజినీరింగ్/టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ ఉండాలి.

అనుభవం: ప్రొటీన్ స్ట్రక్చర్ మోడలింగ్, మెషీన్ లెర్నింగ్, హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, బయోఇన్ఫర్మేటిక్స్ టూల్స్‌పై అవగాహన ఉన్నవారికి ప్రాధాన్యం.

వేతనం: నెలకు ప్రాజెక్ట్ సైంటిస్ట్-1కు రూ.56,000 + హెచ్ఆర్ఏ, ప్రాజెక్ట్ సైంటిస్ట్-2కు రూ.67,000 + హెచ్ఆర్ఏ.

ఆన్‌లైన్ దరఖాస్తులకు దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 25.


ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 27, 2026.

వెబ్‌సైట్: https://www.nii.res.in/en/announcements

నేను ప్రస్తుతం బీఎస్సీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) చివరి సంవత్సరం చదువుతున్నాను. డిగ్రీ పూర్తయ్యాక ఎమ్మెస్సీ మెటీరియల్ సైన్స్ లేదా నానో టెక్నాలజీ చేయాలనుకుంటున్నాను. ఈ కోర్సు ఆంధ్రప్రదేశ్‌లో ఏ యూనివర్సిటీల్లో అందుబాటులో ఉంది? దీంతో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు ఎలా ఉంటాయి? - లోచన్



నానో టెక్నాలజీ ఏ సంస్థల్లో?



నానోటెక్నాలజీ/ మెటీరియల్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలన్న మీ నిర్ణయం అభినందనీయం. నానోటెక్నాలజీ/ మెటీరియల్ సైన్స్ నిపుణులకు క్వాంటం కంప్యూటింగ్, సెమీ కండక్టర్లు, మెటీరియల్స్ రంగాల్లో వివిధ రకాల ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో ఎమ్మెస్సీ నానోటెక్నాలజీ, యోగి వేమన విశ్వవిద్యాలయం కడపలో ఎమ్మెస్సీ మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ చదివే అవకాశం ఉంది. జాతీయ స్థాయిలో పలు సంస్థలు ఈ కోర్సు అందిస్తున్నాయి. కొన్ని సంస్థల్లో బీటెక్/ఎంటెక్ నానో టెక్నాలజీ కోర్సు అందుబాటులో ఉంది. ఎమ్మెస్సీ మెటీరియల్ సైన్స్/ నానో టెక్నాలజీ పూర్తి చేసిన తర్వాత మీ ముందు మూడు ప్రధాన మార్గాలు ఉన్నాయి. అవి..

పరిశోధనా సంస్థలు: భారతదేశంలో వివిధ డీఆర్‌డీఓ, సీఎస్ఐఆర్ పరిశోధనా ప్రయోగశాలలు ఉన్నాయి. డిఫెన్స్ రంగంలో కొత్త రకం లోహాలు, నానో కోటింగ్స్ తయారీకి ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. హైదరాబాద్‌లోని ఐఐసీటీ, ఎన్‌జీఆర్ఐ లాంటి పరిశోధనా సంస్థల్లో అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్‌పై రిసెర్చ్ ప్రాజెక్టులు కూడా ఉంటాయి. ఎమ్మెస్సీ తర్వాత ప్రాజెక్ట్ అసోసియేట్‌గా పరిశోధనా అనుభవాన్ని పొందవచ్చు. ఈ అనుభవం భవిష్యత్తులో పరిశోధనకు, ఉద్యోగాలకు ఉపయోగపడుతుంది.

అకడమిక్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్: భారతదేశంలో ఉన్న వివిధ ఐఐటీల్లో, ఐఐఎస్ఈఆర్‌లో ప్రాజెక్ట్ ఫెలో/రిసెర్చ్ ఫెలో లాంటి అవకాశాలు అందుబాటులో ఉంటాయి. పరిశోధనపై ఆసక్తి ఉంటే, ఎమ్మెస్సీ తర్వాత సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ నెట్ లేదా గేట్ స్కోరుతో పీహెచ్‌డీ చేసే ప్రయత్నం చేయవచ్చు. ప్రైమ్ మినిస్టర్ రిసెర్చ్ ఫెలోషిప్ ద్వారా నెలకు దాదాపు రూ.70,000 అందుకోవచ్చు.

ప్రభుత్వ పరిశోధనా సంస్థలు: ఇస్రో, బార్క్ లాంటి పరిశోధనా సంస్థల్లో మెటీరియల్ టెస్టింగ్, క్యారెక్టరైజేషన్ కోసం మెటీరియల్ సైన్స్ చదివినవారికి ఉద్యోగావకాశాలు ఉంటాయి.

నానో టెక్నాలజీ అనేది కేవలం క్లాస్‌రూమ్‌లో నేర్చుకునే చదువు మాత్రమే కాదు. ఇది ల్యాబ్ ఆధారిత సబ్జెక్ట్ కూడా. ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీల్లో ఎమ్మెస్సీలో ప్రవేశం పొందాలంటే, ఏపీపీజీసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి. ఈ ప్రకటన వెలువడింది. దరఖాస్తు చేయడానికి మార్చి 9 చివరి తేదీ.

మెటీరియల్ సైన్స్/ నానో టెక్నాలజీ రంగాన్ని ఎంచుకోవడం ద్వారా సెమీ కండక్టర్లు, క్వాంటం టెక్నాలజీస్, సోలార్ ఎనర్జీ లాంటి భవిష్యత్ టెక్నాలజీల్లో భాగస్వామి అయ్యే అవకాశం ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ విభాగాల్లో అత్యున్నత ఉద్యోగాలకు అవకాశం వచ్చింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఇటీవలే ఎకనామిక్ సర్వీస్, స్టాటిస్టికల్ సర్వీస్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది. ఈ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.



కేంద్ర కొలువుల్లోకి యూపీఎస్సీ పిలుపు!

దాదాపు సివిల్ సర్వెంట్లకు ఉన్నంత ప్రాధాన్యం ఇండియన్ ఎకనామిక్ సర్వీస్(ఐఈఎస్), ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్ఎస్)కు ఎంపికైనవారికి లభిస్తుంది. వీరికి లెవెల్-10 రూ.56,100 మూల వేతనం అందుతుంది. అలాగే డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర ప్రోత్సాహకాలతో మొదటి నెల నుంచే రూ.లక్షకు పైగా జీతం పొందవచ్చు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు.

ఐఈఎస్

ఈ పోస్టుల్లో చేరినవారు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, అనుబంధ విభాగాల్లో జూనియర్ టైమ్ స్కేల్ ఆఫీసర్ హోదాతో విధులు నిర్వర్తిస్తారు. వీరు గ్రూప్ ఏ విభాగంలో క్లాస్-1 అధికారిగా కొనసాగుతారు. అనుభవం, పనితీరుతో సీనియర్ ఆఫీసర్, చీఫ్ ఆఫీసర్, ఆపై హోదాలకు చేరుకోవచ్చు.

ఎంపిక: పరీక్షలో 2 భాగాలు ఉంటాయి. పార్ట్-1లో 6 పేపర్లు రాయాలి. వీటికి వెయ్యి మార్కులు. జనరల్ ఇంగ్లిష్, జనరల్ స్టడీస్ ఒక్కో పేపర్‌కూ వంద మార్కులు. జనరల్ ఎకనామిక్స్ 1, 2, 3 పేపర్లతో పాటు ఇండియన్ ఎకనామిక్స్ ఒక్కో పేపర్‌కు 200 మార్కులు. ప్రతి పేపర్ వ్యవధీ 3 గంటలు. ప్రశ్నాపత్రాలు ఆంగ్లంలోనే ఉంటాయి. వీటికి సమాధానాలూ అదే భాషలో రాయాలి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు రుణాత్మక మార్కులు ఉన్నాయి. పార్ట్-1లో అర్హత సాధించినవారు పార్ట్-2 ఇంటర్వ్యూకు హాజరవుతారు. ఈ విభాగానికి 200 మార్కులు. మొత్తం 1200 మార్కుల్లో అభ్యర్థి ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన తుది నియామకాలు చేపడతారు.

ప్రశ్నలు: జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్ పేపర్లలోని ప్రశ్నలు సాధారణ గ్రాడ్యుయేట్లు ఎవరైనా ఎదుర్కొనేలా ఉంటాయి. జనరల్ ఇంగ్లిష్‌లో ఆంగ్లంలో వ్యాసం రాయాలి. మిగిలిన ప్రశ్నల నుంచి ఆంగ్లాన్ని ఎలా అర్థం చేసుకుంటున్నారో తెలుసుకుంటారు. పదాలు ఉపయోగించడం (ఒకాబ్యులరీ), ప్యాసేజ్‌లు, ప్రెసీ అంశాల్లో వీటిని అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ విభాగంలో దైనందిన జీవితంతో ముడిపడి ఉన్న అంశాల నుంచే ప్రశ్నలు వస్తాయి. వర్తమాన వ్యవహారాలకు ప్రాధాన్యం. భారత రాజకీయ వ్యవస్థ, రాజ్యాంగం, చరిత్ర, భూగోళం అంశాల నుంచీ ప్రశ్నలుంటాయి. హైస్కూల్ సోషల్ పుస్తకాలు బాగా చదువుకుంటూ, తాజా అంశాలను అనుసరిస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

ఎకనామిక్స్: ఈ ప్రశ్నపత్రాలు ఆ సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఉంటాయి. భావనలు ఉపయోగించి సమస్యను విశ్లేషించగలగాలి. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటోన్న సమస్యలనే ప్రశ్నలుగా మలుస్తారు. అందువల్ల సబ్జెక్టుపై విస్తృత పరిజ్ఞానం తప్పనిసరి. పరీక్షలో విజయానికి ముందుగా మూడేళ్ల యూజీ ఎకనామిక్స్ పాఠ్యపుస్తకాల్లోని ప్రాథమికాంశాలను లోతుగా అధ్యయనం చేయాలి. అనంతరం పీజీ పుస్తకాలు బాగా చదవాలి. సివిల్ సర్వీసెస్ ఎకనామిక్స్ ఆప్షనల్ సబ్జెక్టు పాత ప్రశ్నాపత్రాలు సాధన చేస్తే మంచిది. సబ్జెక్టు ప్రశ్నలు వ్యాసరూపంలో ఉంటాయి కాబట్టి రాత నైపుణ్యాల్లో ప్రావీణ్యం పొందాలి. గతంలో నిర్వహించిన ఐఈఎస్ ప్రశ్నాపత్రాలు పరిశీలించి, సన్నద్ధతను అందుకు అనుగుణంగా మలుచుకోవాలి.

ఖాళీలు: 16

అర్హత: ఎకనామిక్స్/ అప్లయిడ్ ఎకనామిక్స్/ బిజినెస్ ఎకనామిక్స్/ ఎకనోమెట్రిక్స్ వీటిలో ఎందులోనైనా పీజీ పూర్తిచేసినవారు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులో ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఐఎస్ఎస్

ఈ ఉద్యోగానికి ఎంపికైనవారి కెరియర్ జూనియర్ టైమ్ స్కేల్ ఆఫీసర్ హోదాతో ప్రారంభమవుతుంది. నేషనల్ స్టాటిస్టికల్, సెంట్రల్ స్టాటిస్టికల్, నేషనల్ శాంపిల్ కార్యాలయాల్లో వీరికి విధులుంటాయి. గ్రూప్-ఏ విభాగంలో క్లాస్-1 అధికారిగా కొనసాగుతారు. భవిష్యత్తులో సీనియర్, చీఫ్ ఆఫీసర్ హోదాలను పొందగలరు.

ఎంపిక: పరీక్షలో 2 భాగాలు ఉన్నాయి. పార్ట్-1లో వెయ్యి మార్కులకు 6 పేపర్లు రాయాలి. వీటిలో జనరల్ ఇంగ్లిష్, జనరల్ స్టడీస్ ఒక్కో పేపరు వంద మార్కులకు ఉంటాయి. ఒక్కో పేపర్ వ్యవధి 3 గంటలు. స్టాటిస్టిక్స్ 1, 2 పేపర్లు ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. ఒక్కో పేపర్ వ్యవధి 2 గంటలు. స్టాటిస్టిక్స్ 3, 4 పేపర్లు డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటాయి. ఒక్కో పేపర్ వ్యవధి 3 గంటలు. ఒక్కో స్టాటిస్టిక్స్ పేపరు (1, 2, 3, 4)కు 200 మార్కులు. స్టాటిస్టిక్స్ 1, 2 పేపర్లలో 80 చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. అంటే ప్రతి ప్రశ్నకు రెండున్నర మార్కులు. డిస్క్రిప్టివ్ తరహాలో ఉన్న 3, 4 పేపర్లలో సగం ప్రశ్నలు షార్ట్ ఆన్సర్, చిన్న సమస్యల రూపంలో ఉంటాయి. మిగతా సగంలో లాంగ్ ఆన్సర్, కాంప్రహెన్షన్ ప్రాబ్లమ్ ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నాపత్రాలు ఆంగ్లంలోనే ఉంటాయి. సమాధానాలూ ఆ భాషలోనే రాయాలి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు రుణాత్మక మార్కులు ఉన్నాయి. పార్ట్-1లో అర్హత సాధిస్తేనే పార్ట్-2 ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ విభాగానికి 200 మార్కులు. పరీక్ష, ఇంటర్వ్యూల్లో సాధించిన తుది మార్కులతో నియామకాలుంటాయి.

ప్రశ్నలు: జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్ పేపర్లు ఐఈఎస్, ఐఎస్ఎస్‌కు ఉమ్మడిగానే ఉంటాయి.

స్టాటిస్టిక్స్: ఈ ప్రశ్నాపత్రాలు పోస్టు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఉంటాయి. ముందుగా యూజీ స్టాటిస్టిక్స్ పాఠ్యపుస్తకాల్లోని ప్రాథమికాంశాలను లోతుగా అధ్యయనం చేయాలి. అనంతరం పీజీ పుస్తకాలతోపాటు ఐఎస్ఎస్ పాత ప్రశ్నపత్రాలు పరిశీలించడం ద్వారా పరీక్షపై పూర్తి అవగాహన లభిస్తుంది. అలాగే స్టాటిస్టిక్స్‌లో నెట్, ఇండియన్ స్టాటిస్టిక్స్ ఇన్‌స్టిట్యూట్ పాత ప్రశ్నాపత్రాలు సాధనచేస్తే ఉపయోగం ఉంటుంది.

ఖాళీలు: 28.

అర్హత: స్టాటిస్టిక్స్/ మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/ అప్లయిడ్ స్టాటిస్టిక్స్ వీటిలో ఎందులోనైనా యూజీ/ పీజీ పూర్తిచేసినవారు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

రెండు పోస్టులకూ

ఆన్‌లైన్ దరఖాస్తులు: మార్చి 3 సాయంత్రం 6 వరకు స్వీకరిస్తారు.

పరీక్ష ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు ఉండదు. మిగిలినవారికి రూ.200.

వయసు: ఆగస్టు 1, 2026 నాటికి 21 - 30 ఏళ్ల లోపు ఉండాలి. ఆగస్టు 2, 1996 - ఆగస్టు 1, 2005 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలైతే ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

పరీక్షలు: జూన్ 19 నుంచి మొదలవుతాయి.

వెబ్‌సైట్: https://upsc.gov.in

(c) eenadu



అస్సాం భాజపా అధ్యక్షుడు దిలీప్ సైకియా సమక్షంలో పార్టీలో చేరిన భూపేన్ బోరా

భాజపాలో చేరిన భూపేన్ బోరా

- అస్సాంలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

గువాహటి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అస్సాంలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ రాష్ట్ర విభాగం మాజీ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా అధికార భాజపాలో చేరారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ సైకియా ఆధ్వర్యంలో ఆదివారం ఆయన కాషాయ కండువా కప్పుకొన్నారు. భూపేన్‌తో పాటు కాంగ్రెస్ మాజీ నేతలు సంజూ బోరా, రాజేశ్ కుమార్ జోషి, కుంగ్ కట్ దాస్ సహా మరికొందరు నేతలు కూడా భాజపాలో చేరారు. భూపేన్ చేరికను స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఈ నెల 16న మొదట తెలిపిన భూపేన్.. కానీ తర్వాత దానిని పునఃపరిశీలించుకుంటానని ప్రకటించిన విషయం తెలిసిందే.

మళ్లీ ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్

పుణె: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ స్వల్ప డీహైడ్రేషన్ కారణంగా మళ్లీ ఆసుపత్రిలో చేరారు. వారం క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన ఆయనను ఆదివారం పుణెలోని రూబీ హాల్ ఆసుపత్రికి తరలించారు. 85 ఏళ్ల ఈ రాజ్యసభ సభ్యుడి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. 'స్వల్ప డీహైడ్రేషన్ కారణంగా ఆయన ఆసుపత్రిలో చేరారు. ప్లూయిడ్స్ ఎక్కిస్తున్నాం. ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. రెండు రోజులపాటు ఆసుపత్రిలో ఉండాలి. ఆ తర్వాత డిశ్చార్జి చేస్తాం' అని ఆసుపత్రి ఛైర్మన్, చీఫ్ కార్డియాలజిస్ట్ పర్వేజ్ గ్రాంట్ తెలిపారు. ఆయనతోపాటు ఫిజీషియన్ అభిజిత్ లోధా.. పవార్ చికిత్సను పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన ఛాతీ ఇన్ఫెక్షన్‌తో శరద్ పవార్ ఇదే ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం 14వ తేదీన డిశ్చార్జి అయ్యారు.

మేఘాలయలో 17 వేల టన్నుల బొగ్గు స్వాధీనం

షిల్లాంగ్: మేఘాలయలోని ఈస్ట్ జైంతియా హిల్స్ జిల్లాలో అక్రమంగా తవ్విన 17వేల టన్నుల బొగ్గును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతోపాటు అక్రమంగా రవాణా చేస్తున్న 25.5 కేజీల పేలుడు పదార్థాలనూ పట్టుకున్నారు. ఈ నెల 5న థాంగ్‌స్కూ ప్రాంతంలోని బొగ్గు గనుల్లో అక్రమంగా జరిపిన పేలుడు కారణంగా 34 మంది మరణించిన తర్వాత పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో చేపట్టిన తనిఖీల్లో వీటిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ తెలిపారు. అయితే ఈ ఆపరేషన్‌లో ఎవరినీ అరెస్టు చేయలేదు. ఇలాంటి తనిఖీలు ఇంకా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

ఇరాన్‌లో కొనసాగిన ప్రదర్శనలు

దుబాయ్: ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రారంభమైన రెండో దశ ప్రదర్శనలు రాజధాని టెహ్రాన్‌లో ఆదివారమూ కొనసాగాయి. ఇందులో యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇటీవల అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారి స్మారకాల దగ్గర ఈ ఆందోళనలు జరిగాయి. ఐదు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ఈ నిరసనల్లో పాల్గొన్నారని ఇరాన్ జాతీయ వార్తా సంస్థ పేర్కొంది. ఇరాన్‌పై అమెరికా దాడి చేయనుందన్న వార్తల నేపథ్యంలో ఈ ప్రదర్శనలు జరుగుతుండటం గమనార్హం. ఇరాన్ తొలి దశ అల్లర్లలో 7,105 మంది ప్రాణాలు కోల్పోయారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం తెలిపింది.



తెలంగాణ క్రికెట్ జట్టుతో ఆ రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్

టీ-20 టోర్నమెంట్‌లో తెలంగాణ పోలీస్ జట్టు విజయం

- మరో మ్యాచ్‌లో పుదుచ్చేరి జట్టు గెలుపు

ఈనాడు, అమరావతి: అఖిల భారత పోలీస్ సౌత్ జోన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మూలపాడు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మైదానంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఎన్ఎస్‌జీ జట్టుపై తెలంగాణ పోలీస్ జట్టు 124 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. తెలంగాణ పోలీస్ జట్టులోని లోకనాథ్ నాయక్ 58 బంతుల్లో 119 పరుగులు చేసి అద్భుత శతకం సాధించారు. అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ కనబరిచిన ఆయనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదానం చేశారు. ఈ మ్యాచ్‌లో తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ 40 పరుగులు సాధించి ప్రత్యర్థి జట్టు ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో తనవంతు పాత్ర పోషించారు.

✦ అనంతరం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ జట్టుపై పుదుచ్చేరి పోలీస్ జట్టు ఘనవిజయం సాధించింది. ఏపీ తరఫున రాంబాబ్ 62 బంతుల్లో 141 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించారు. కానీ పుదుచ్చేరి పోలీస్ జట్టు నిర్దేశిత లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో 221/6 పరుగులతో చేదించి 4 వికెట్ల తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. పుదుచ్చేరి జట్టులోని ప్రభు 56 బంతుల్లో 121 పరుగులు చేసి వారి విజయంలో కీలకపాత్ర పోషించారు. రెండు మ్యాచ్‌లలోనూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన వారికి సీవీ ఆనంద్, డీజీ బాగ్చీ జ్ఞాపికలు అందజేశారు.

అంతం లేని యుద్ధం!

శాంతి చర్చల్లో కనిపించని పురోగతి ● రష్యా- ఉక్రెయిన్ పోరుకు రేపటితో నాలుగేళ్లు

ఇంటర్నెట్ డెస్క్: రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనబడటం లేదు. అమెరికా మధ్యవర్తిత్వంలో కొంతకాలంగా చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. ఇరుపక్షాలు తమ డిమాండ్లపై పట్టు వీడటం లేదు. డాన్‌బాస్ ప్రాంతాన్ని తమకే వదిలేయాలని మాస్కో ఒత్తిడి తెస్తోంది. ఈ షరతును అంగీకరించబోమని కీవ్ స్పష్టం చేస్తోంది. యుద్ధం మొదలై ఈ నెల 24కు నాలుగేళ్లు పూర్తవుతున్న వేళ కొన్ని కీలక అంశాలను గమనిస్తే..



ఉక్రెయిన్‌లోని కీవ్‌లో ఆదివారం రష్యా దాడికి ధ్వంసమైన భవనాలు

ఆ రికార్డును దాటేసింది

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ జర్మనీని ఓడించేందుకు నాటి సోవియట్ యూనియన్ 'గ్రేట్ పేట్రియాటిక్ వార్'లో భాగంగా 1,418 రోజులు పోరాడింది. 2022 ఫిబ్రవరి 24న మొదలైన రష్యా సైనిక చర్య ఈ ఏడాది జనవరితో 1,418 రోజులను దాటింది. మొదట్లో కీవ్‌ను స్వాధీనం చేసుకుని అనుకూల సర్కారును నియమించేందుకు మాస్కో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ ఫలితం ఎటూ తేలడం లేదు.

4.5 లక్షల మందికి పైగా సైనికుల మృతి

ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరువైపులా మృతి చెందిన, గాయపడిన, కనిపించకుండా పోయిన సైనికుల సంఖ్య సుమారు 20 లక్షలుగా ఉంటుందని అంచనా. అమెరికాకు చెందిన 'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' మాత్రం ఈ సంఖ్య 18 లక్షలుగా ఉందని పేర్కొంది. రష్యా సైనికులు 3.25 లక్షల మంది, ఉక్రెయిన్ సైనికులు 1.40 లక్షల మంది మృతి చెందినట్లు తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అత్యంత వినాశకరమైన యుద్ధం ఇదే.

నత్త నడకలా..

2014లో ఆక్రమించిన క్రిమియా సహా 20 శాతం ఉక్రెయిన్ భూభాగం ప్రస్తుతం రష్యా నియంత్రణలో ఉంది. అయితే ప్రత్యర్థి భూభాగాలను చొచ్చుకెళ్లే విషయంలో మాత్రం మాస్కోకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. గత రెండేళ్లలో డొనెట్స్క్ ప్రాంతంలోని దాదాపు 50 కి.మీ మాత్రమే ముందుకు వెళ్లగలిగింది. పక్రోస్క్ నగరాన్ని స్వాధీనం చేసుకునేందుకు గత రెండేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. రష్యా పురోగతి నత్తనడకలా ఉందని నాటో చీఫ్ మార్క్ రూటే ఇటీవల వ్యాఖ్యానించారు.

శాంతి ప్రయత్నాలు ఫలించేనా

నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా మధ్యవర్తిత్వంలో రష్యా-ఉక్రెయిన్ ప్రతినిధులు ఇప్పటికే పలుమార్లు సమావేశమయ్యారు. జూలైలోగా యుద్ధం ముగింపుపై ఓ ఒప్పందానికి రావాలంటూ అగ్రరాజ్యం తుదిగడువు విధించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇటీవల వెల్లడించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇరు పక్షాలూ తమ డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గడం లేదు. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నా, ఉక్రెయిన్‌కు ఐరోపా అండగా నిలుస్తోంది. దీంతో ట్రంప్ చేస్తున్న ఒత్తిడి కూడా పెద్దగా ఫలించడం లేదు. రష్యా కూడా తనపై విధిస్తున్న ఆంక్షలను లెక్కచేయడం లేదు. యుద్ధాన్ని కొనసాగించడానికే మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న శాంతి చర్చలు ఏ మేరకు ఫలిస్తాయన్నది అనుమానాస్పదమే!

డ్రోన్లదే కీలక పాత్ర..!

ఈ యుద్ధంలో డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఉక్రెయిన్ విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా రష్యా రోజూ వందల సంఖ్యలో డ్రోన్లను ప్రయోగిస్తోంది. ఎలక్ట్రానిక్ జామింగ్ నుంచి తప్పించుకునేందుకు ఫైబర్ ఆప్టిక్ డ్రోన్లను వదులుతోంది. ఉక్రెయిన్ సైతం వీటినే నమ్ముకుంది. గతంలో 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్' పేరిట ప్రత్యర్థి వైమానిక స్థావరాలపై విరుచుకుపడింది. సీ-డ్రోన్లతో అనేక రష్యన్ యుద్ధనౌకలను ముంచేసింది.



మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రీయ ఏకాత్మత విశ్వ మహాసమ్మేళన్‌లో సంత్ నామ్‌దేవ్ మహారాజ్ అవార్డును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను సత్కరించారు

అమెరికా రాయబారికి ఫ్రాన్స్ సమన్లు!

పారిస్: తమ దేశంలో మితవాద కార్యకర్త ఒకరు మరణించడంపై ట్రంప్ యంత్రాంగం వ్యాఖ్యలు చేసినందుకుగానూ అమెరికా రాయబారి ఛార్లెస్ కుష్నర్‌కు సమన్లు జారీ చేయాలని ఫ్రాన్స్ నిర్ణయించింది. అదివారం ఆ దేశ విదేశాంగ మంత్రి జీన్ నోయెల్ బారెట్ ఈ విషయం వెల్లడించారు. ఫ్రాన్స్‌లోని లియాన్ నగరంలో గత వారం విద్యార్థులను ఉద్దేశించి లెఫ్ట్ వింగ్ చట్టసభ సభ్యురాలు రీమా హసన్ ప్రసంగిస్తున్న సమయంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన దాడిలో మెదడుకు గాయాలైన డెరాంక్ మరణించారు. ఈ ఘటనపై అమెరికా ఉగ్రవాద నిరోధక బ్యూరో ఎక్స్‌లో స్పందించింది. 'నివేదికల ప్రకారం, ఫ్రాన్స్ హోం మంత్రి రూపొందించిన వివరాల ప్రకారం.. లెఫ్ట్ వింగ్ మిలిటెంట్ల దాడిలో డెరాంక్ మరణించారు. ఇది అందరినీ కలవరపరుస్తోంది' అని వ్యాఖ్యానించింది. దీనిపై బరెట్ స్పందించారు. 'ఫ్రెంచ్ కుటుంబంలో తలెత్తిన ఈ విషాదాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడాన్ని తిరస్కరిస్తున్నాం. ఈ విషయంలో అంతర్జాతీయ స్పందన మాకు అవసరం లేదు' అని స్పష్టం చేశారు.

కాలిఫోర్నియా మంచుతుపాను ఘటనలో 9 మృతదేహాలు లభ్యం

ట్రకీ: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఐదురోజుల క్రితం సంభవించిన మంచు తుపానులో గల్లంతైన 9 మంది మృతదేహాలు లభ్యమయ్యాయని శనివారం అధికారులు తెలిపారు. మంగళవారం లేక్ తాహో సమీపంలోని కాజిల్ పీక్ ప్రాంతంలో ఈ మంచు తుపాను సంభవించింది. సియెర్రా నెవాడలో భారీగా మంచు కురుస్తున్న కారణంగా గాలింపు చర్యలకు అంతరాయం కలిగింది. హెలికాప్టర్లు, ప్రత్యేక సాధనాల సహాయంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. మరణించిన తొమ్మిది మందిలో ఆరుగురు మహిళా స్కీయర్లు, ముగ్గురు గైడ్‌లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రశ్నించడం మా హక్కు: కాంగ్రెస్

దిల్లీ: ప్రశ్నలు సంధించడం తమ హక్కు అని, ప్రధాని మోదీ తనను తాను రక్షించుకునేందుకు తమ గొంతు నొక్కేయలేరని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఏఐ సదస్సులో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు చేపట్టడంపై ప్రధాని చేసిన విమర్శల పైనా కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఏ అంశాలపైనైనా ప్రశ్నించాల్సిన బాధ్యత దేశ యువతపై ఉంటుంది. ప్రధాని మోదీ రాజీపడ్డారని, ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పేరున్న వ్యక్తి ఐరాసలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గు కాదని వ్యాఖ్యానించారు. భారత దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అమెరికా ఒప్పందంపై ఎందుకు మొగ్గు చూపాల్సి వచ్చిందో దేశానికి సమాధానమివ్వాలని డిమాండ్ చేసింది. టీ-షర్టులు తీసేయడమే నగ్న ప్రదర్శన అయితే మరి దీనిని ఏమంటారు అంటూ గతంలో హరియాణా మంత్రి ఒకరు చేసిన ఇలాంటి నిరసన ప్రదర్శన ఫొటోను జతచేసి ప్రశ్నించింది.



దిల్లీలోని హుమాయూన్ సమాధిని ఆదివారం సందర్శించిన ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తదితరులు

మాస్కో విమానాశ్రయాల మూసివేత

మాస్కో: ఉక్రెయిన్ డ్రోన్ దాడుల నేపథ్యంలో రష్యా రాజధాని మాస్కోలోని నాలుగు విమానాశ్రయాలను తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ మూసి ఉంచుతున్నట్లు అధికారులు ఆదివారం ప్రకటించారు. గంట వ్యవధిలో 11 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశామని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. డొమొడెడోవో, నుకోవో, జుకోవ్‌స్కీ, షెరెమెట్యెవో విమానాశ్రయాల్లో విమాన కార్యకలాపాలపై నియంత్రణలు విధించామని రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాత్సియా తెలిపింది.✦ మరోవైపు ఉక్రెయిన్‌లోని కీవ్ ప్రాంతంపై రష్యా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఒకరు మరణించగా 8 మంది గాయపడ్డారు. రష్యా దాడులతో 5 జిల్లాల్లో మంటలు చెలరేగాయి.

మైనర్‌కు కారు ఇచ్చిన తండ్రికి మూడేళ్ల జైలు



మైనర్ అయిన కుమారుడికి కారు నడిపే అవకాశాన్ని ఇచ్చినందుకు ఓ తండ్రికి జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో మూడేళ్ల జైలుశిక్ష పడింది. ఎస్.ఎం. హెచ్.రజ్వీ అనే వ్యక్తి కుమారుడి చేతికి తన వాహనం ఇవ్వగా.. అతడు డ్రైవింగ్ చేస్తూ ట్రాఫిక్ పోలీసులకు దొరికిపోయాడు. బాలుడి తండ్రి రజ్వీకి పోలీసులు చలాను జారీ చేశారు. చివరకు ఈ వ్యవహారం శ్రీనగర్ ట్రాఫిక్ కోర్టుకు చేరింది. ఈ కోర్టు న్యాయమూర్తి, స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్ షాబీర్ అహ్మద్ మాలిక్ సంచలన తీర్పు వెలువరించారు. వాహనాన్ని నడిపే వ్యక్తి మైనర్ అయినప్పుడు, దానికి బాధ్యత వహించాల్సింది తండ్రి లేదా సంరక్షకుడే అని స్పష్టం చేశారు. ఇలాంటి వ్యవహారాలను మోటారు వాహన చట్టం-1988లోని సెక్షన్ 199-ఎ పరిష్కరిస్తుందని తేల్చి చెప్పారు. దీంతో రజ్వీకి మూడేళ్ల సాధారణ జైలుశిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి వెల్లడించారు. రూ.25 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించారు. బాలుడు నడిపిన వాహనం రిజిస్ట్రేషన్‌ను ఏడాదిపాటు రద్దు చేయాలని మోటారు వాహన శాఖకు జడ్జి నిర్దేశించారు. వాహనం నడిపిన బాలుడికి 25 ఏళ్ల వయసు వచ్చేవరకు లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సును ఇవ్వొద్దన్నారు.

రూ.2 లక్షల బాండ్‌తో ఊరట

నేరాన్ని అంగీకరించిన బాలుడి తండ్రిపై గతంలో ఎలాంటి నేరారోపణలు లేనందున ఆయనకు న్యాయమూర్తి ఓ వెసులుబాటు కల్పించారు. ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ యాక్ట్ ద్వారా బాలుడి తండ్రికి లబ్ధి పొందొచ్చని తెలిపారు. ఇందుకుగానూ రెండేళ్లపాటు చెల్లుబాటు అయ్యే రూ.2 లక్షల బాండ్‌ను కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. ఈ రెండేళ్లపాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా, మంచి ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. ఒకవేళ ఆ వ్యవధిలో ఏవైనా చట్ట వ్యతిరేక పనులను చేస్తే బాండ్‌లోని రూ.2 లక్షలను ప్రభుత్వానికి జమ చేసి, ఆయనను జైలుకు పంపుతామని న్యాయమూర్తి హెచ్చరించారు.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ న్యాయ సహాయం

- పార్టీలో యువత భాగస్వామ్యం పెంచేలా ప్రణాళికలు

దిల్లీ: పార్టీలో యువత భాగస్వామ్యాన్ని పెంచేలా రాష్ట్ర, జిల్లా స్థాయిలో తక్షణ న్యాయసేవల ప్రతిస్పందన బృందాలను ఏర్పాటుచేయనున్నట్లు కాంగ్రెస్ ఆదివారం ప్రకటించింది. సమాచార హక్కు, చట్టాన్ని (అర్టీఐ) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గళం విప్పేందుకు సిద్ధమైనట్లు తెలిపింది. పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్, సీనియర్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ.. "ఇలాంటి కార్యక్రమాల వల్ల క్షేత్రస్థాయిలో న్యాయసహాయం అందించడంలో యువత ముందుంటుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పార్టీ స్వరాన్ని బలోపేతం చేస్తుంది. పార్టీ పార్లమెంటు సభ్యులు రోజువారీ పనుల్లో సహాయం చేసేందుకు 10 మంది యువ న్యాయవాదులను ఎంపిక చేస్తాం. పార్లమెంటులో ప్రతిపక్ష పాత్రను అర్థం చేసుకునే అవకాశాన్ని వారికి కల్పించడమే ఈ ఆలోచన ముఖ్య ఉద్దేశం. 'న్యాయ నేత జెర్ నాగరిక్' పేరుతో పాడ్‌కాస్ట్ ను ప్రారంభించబోతున్నాం. ప్రతి జిల్లాలో పార్టీ నేతలకు అవసరమైనప్పుడు న్యాయ సంప్రదింపులు అందించేలా ఐదుగురు న్యాయవాదులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం" అని వారు వెల్లడించారు.

ఓర్పుతో ఎదగండి

- సహకారం, వృత్తిపరమైన నిబద్ధతా సోపానాలే..
- న్యాయ విద్యార్థులకు సీజేఐ పిలుపు

రాయ్‌పుర్: సహకారం, ఓర్పు, వృత్తిపరమైన నిబద్ధతతో కెరీర్‌ను నిర్మించుకోవాలని న్యాయ విద్యార్థులకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ప్రస్తుత మీ క్లాస్‌మేట్లే.. తర్వాత మీ సహ న్యాయవాదులుగా, జ్యుడీషియల్ సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో ఉన్న హిదాయతుల్లా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ 9వ స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. సహకారంతో పని చేసే సామర్థ్యం, వృత్తిపరమైన ఎదుగుదలకు దీర్ఘకాలం ఓపికగా ఎదురు చూడటం ద్వారానే అర్థవంతమైన కెరీర్ ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు, ర్యాంకులు, నియామకాల ద్వారా ఎదుర్కొనే పోటీని న్యాయ విద్య తరచూ నొక్కి చెబుతుంది. అయితే పరస్పర సహకారం ద్వారా న్యాయ వృత్తిలో నిలదొక్కుకోవచ్చు. అనేక ఉపనదులు కలిసి నది ఏర్పడినట్లే.. న్యాయ వ్యవస్థ అనేది జూనియర్లు, సీనియర్లు, సహచరులు, ప్రత్యర్థులుగా వాదించే న్యాయవాదుల సంగమం' అని సీజేఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర న్యాయ అకాడమీ ఇ-సావనీర్‌ను ఆయన ఆవిష్కరించారు.



హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావానికి

రైతుసంఘాల పరిష్కారం!

- బీబీఎం లఖ్‌నవూ అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవడంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐఐఎం లఖ్‌నవూ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. ఈ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలు రైతుల ఆదాయం పెరిగేందుకే కాకుండా పంట దిగుబడులు, వ్యవసాయ వ్యవస్థ నిలకడకు దోహదపడుతున్నాయని పేర్కొంది. అధ్యయనానికి నాయకత్వం వహించిన ఐఐఎం లఖ్‌నవూ అసోసియేట్ ప్రొఫెసర్ కుషాంకుర్ డే మాట్లాడుతూ.. హిమాలయ ప్రాంతంలో వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న పరిస్థితులను విశ్లేషించేందుకు మిశ్రమ పరిశోధన విధానాన్ని అనుసరించినట్లు తెలిపారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు అవలంబిస్తున్న వినూత్న సాగు పద్ధతులు, సాంకేతికత వారి జీవన ప్రమాణాలను ఎలా మెరుగుపరిచాయో పరిశీలించామన్నారు. ఈ అధ్యయన ఫలితాలు ప్రముఖ 'జర్నల్ ఆఫ్ రూరల్ స్టడీస్'లో ప్రచురితమయ్యాయి.

అమెరికాలో వివాదాస్పదమైన గవర్నర్ల విందు!



గవర్నర్ల విందుకు సతీమణి మెలానియాతో కలిసి వస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ఏటా శ్వేతసౌధంలో ఇచ్చే గవర్నర్ల విందు ఈ సారి వివాదాస్పదమైంది. గవర్నర్లందరూ పాల్గొనే ఈ విందు ద్వారా వారి మధ్య సంబంధాలు విస్తరిస్తాయని భావిస్తారు. కానీ ట్రంప్ అన్ని కార్యక్రమాలకు భిన్నంగా శనివారం జరిగిన ఈ విందు వివాదానికి కేంద్ర బిందువైంది. జాతీయ గవర్నర్ల అసోసియేషన్ ఛైర్మన్ కెవిన్ స్టిట్ (ఓక్లహోమా), డెమొక్రటిక్ గవర్నర్ వెస్ మూర్‌లను (మేరీలాండ్) ట్రంప్ ఎగతాళి చేశారు. అంతేకాకుండా శుక్రవారం జరగాల్సిన గవర్నర్ల సమావేశానికి మూర్‌తోపాటు మరో గవర్నర్ జేర్డ్ పోలిస్‌ను (కొలరాడో) ఆహ్వానించేందుకు తొలుత నిరాకరించారు. తమ పార్టీని శుక్రవారం నాటి సమావేశానికి రానీయకుండా శనివారం నాటి విందును బహిష్కరిస్తామని డెమొక్రాట్లు హెచ్చరించారు. దీంతో ఆయన వెనక్కి తగ్గారు. మూర్ శుక్రవారం నాటి సమావేశానికి హాజరైనప్పటికీ.. శనివారం నాటి విందులో డెమొక్రటిక్ గవర్నర్లెవరూ చివరి వరకూ ఉండలేదు. కేవలం రిపబ్లికన్ గవర్నర్లు, అధికారులే కనిపించారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నూతన కార్మిక చట్టాలు

- లా కమిషన్ సభ్య కార్యదర్శి అంజూ రాణీ రాణా



దిల్లీ: దేశంలో లేబర్ మార్కెట్లను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా, మరింత సమ్మిళితంగా తీర్చిదిద్దడంలో కొత్త కార్మిక చట్టాలు దోహదపడతాయని లా కమిషన్ సభ్య కార్యదర్శి అంజూ రాణీ రాణా పేర్కొన్నారు. గత కొన్ని దశాబ్దాల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత ప్రభావవంతమైన సంస్కరణల్లో ఇవి కూడా భాగమని 'పీటీఐ' వార్తాసంస్థతో ఆదివారం మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. దేశ కార్మిక చట్టాల ఫ్రేమ్‌వర్క్‌లో నిర్మాణాత్మక మార్పులను ఇవి తీసుకొస్తాయన్నారు. నూతన చట్టాలు కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయంటూ ప్రతిపక్ష పార్టీలు, 10 కేంద్ర కార్మిక సంఘాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో అంజూ రాణీ రాణా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

మన నైపుణ్యాలతో విదేశాలకు సేవ

- కాంగ్రెస్ నేత శాంపిట్రోడా విమర్శలు

ఇంటర్నెట్ డెస్క్: కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ ఛైర్మన్ శాంపిట్రోడా చేసిన తాజా వ్యాఖ్యలు మరోసారి వివాదాస్పదమవుతున్నాయి. ఇతర దేశాలకు సేవ చేసేందుకే భారత నైపుణ్యాలు దోహదపడుతున్నాయని ఆయన విమర్శలు చేయడం ఇందుకు కారణమైంది. సుమారు 150 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు సొంతంగా ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఓ ఇంటర్వ్యూలో పిట్రోడా చేసిన ఈ వ్యాఖ్యలపై భాజపా తీవ్రస్థాయిలో మండిపడింది. "భారత యువతలో ఎంతో ప్రతిభ ఉంది. వారి నైపుణ్యాలను వినియోగించుకోవడంలో భారత్ విఫలమైంది. మన యువతను ఇతర దేశాలు వినియోగించుకుంటున్నాయి. ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, న్యాయశాస్త్రం, పరిశ్రమలు.. ఇలా ఏ రంగాల అభివృద్ధిలోనైనా మన యువతే ప్రధానపాత్ర పోషిస్తోంది. సుమారు 150 కోట్ల జనాభా ఉన్న భారత్‌లో మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీ లేదు. మన ప్రభుత్వానికి సొంతంగా సంబంధించిన ఆపరేటింగ్ సిస్టమ్ తయారు చేయలేకపోయాం" అని పిట్రోడా పేర్కొన్నారు.



పిట్రోడా అబద్ధాలతో భారత్‌ను ఎగతాళి చేస్తున్నారని భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు.



రాజస్థాన్‌లోని జైపుర్‌లో భారత వాయుసేన ఆదివారం ఎయిర్‌షో నిర్వహించింది. ఇందులో భాగంగా సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ ప్రదర్శించిన విన్యాసాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి